ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

హైదరాబాద్ 30-9-2024 సోమవారం సిటీ సంపుటి 51. సంచిక 51

రూ. 6-50 పేజీలు 14 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఇజ్రాయెల్ ముప్పేట దాడి

హెజ్‌బొల్లా మరో సీనియర్ నేత హతం

- లెబనాన్‌పై ఆగని దాడులు..సైదాలో 24 మంది మృతి
- యెమెన్‌లోని హూతీలపైనా బాంబుల వర్షం
- సిరియాలో దూకుడు పెంచిన అమెరికా
- 37 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టామని ప్రకటన

జెరూసలెం: అధినేత హసన్ నస్రల్లా హత్య నుంచి తేరుకోకముందే.. లెబనాన్ తీవ్రవాద గ్రూపు హెజ్‌బొల్లాకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆదివారం బీరుట్‌పై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో ఆ గ్రూపునకు చెందిన కీలక నేత నబిల్ కౌక్ హతమయ్యాడు. నబిల్.. హెజ్‌బొల్లా సెంట్రల్ కౌన్సిల్‌లో డిప్యూటీ హెడ్‌గా ఉన్నాడు. మరోవైపు నస్రల్లా, నబిల్ కౌక్ సహా వివిధ హోదాల్లో ఉన్న 20 మందికిపైగా హెజ్‌బొల్లా నేతలను ఇప్పటివరకు చంపినట్లు ఇజ్రాయెల్ సైన్యం ఐడీఎఫ్ ప్రకటించింది.

...మిగతా 2లో



హతమైన నబిల్ కౌక్

ఇజ్రాయెల్ ఆదివారం వైమానిక దాడులు చేయడంతో దక్షిణ లెబనాన్‌లోని ఓ గ్రామం నుంచి భారీగా వెలువడుతున్న పొగ

గత ప్రభుత్వ తప్పులను సరిదిద్దేలా త్వరలో కొత్త రెవెన్యూ చట్టం

ఈ శాఖ సమర్థ పనితీరుతోనే ప్రభుత్వానికి మంచిపేరు

- తహసీల్దార్ల సదస్సులో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఈనాడు- హైదరాబాద్, న్యూస్‌టుడే- కొమ్మర్‌పేట : 'ప్రభుత్వానికి, ప్రజలకు రెవెన్యూ శాఖ వారధి.. ఈ విభాగం సమర్థంగా పనిచేసినప్పుడే నిర్దేశించిన లక్ష్యాలు, ప్రజల ఆకాంక్షలు నెరవేరి.. ఆశించిన ఫలితాలు లభిస్తాయి. ప్రభుత్వానికి మంచి పేరొస్తుంది. ప్రజలు కోరుకున్న రీతిలో రెవెన్యూ వ్యవస్థ పనిచేస్తోందా.. లేదా.. ఆత్మపరిశీలన చేసుకుంటూ ముందుకెళ్లాలి' అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉద్యోగులకు సూచించారు.

...మిగతా 2లో

అవకాశవాదులు ప్రజలను రెచ్చగొడుతున్నారు

- అక్రమ నిర్మాణాలకు భారాస నేతలు మద్దతిస్తున్నారా..?
- మంత్రి శ్రీధర్‌బాబు

12లో

ఆరు కారిడార్లు..
116.2 కి.మీ.

- రూ.32,237 కోట్ల అంచనాతో మెట్రో రెండోదశ ప్రాజెక్టు

2లో

ఆర్టీసీలో 3 వేల పోస్టులు భర్తీ చేస్తాం

- మంత్రి పొన్నం ప్రభాకర్

12లో

ఈ ఏడాది రూ.1.25 లక్షల కోట్ల ఐపీఓలు

- ఇప్పటివరకు ఇదే అత్యధిక మొత్తం

ఈనాడు బిజినెస్ లో

స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాల నాటికి... సుసంపన్న భారత్

- 2047కల్లా 55 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మనదేశం
- ఉత్పత్తి రంగం పెరిగితే ఉపాధికి మార్గం పడుతుంది
- విదేశాలకన్నా మనదగ్గరే ప్రగతికి ఎక్కువ అవకాశాలు
- 'ఈనాడు-ఈటీవీ' ముఖాముఖిలో ఐఎంఎఫ్ ఇండియా ఈడీ కృష్ణమూర్తి సుబ్రమణియన్

ఈనాడు - హైదరాబాద్

"మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 2047కి వందేళ్లు అవుతుంది. అప్పటికి మనమంతా అభివృద్ధి చెందిన దేశంలో ఉంటాం. నాటికి మన ఆర్థికవ్యవస్థ 55 ట్రిలియన్ డాలర్లకు చేరుతుంది. యువతను నిపుణులుగా తీర్చిదిద్ది, వారికి ఉపాధి అవకాశాలు కల్పించి, సంస్కరణలకు పెద్దపీట వేస్తే ఇది సాధ్యమే. దేశాన్ని ఈ స్థితికి చేర్చేందుకు చోదకశక్తిలా పనిచేసే రాష్ట్రాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు సమున్నత భాగస్వామ్యం పొందుతాయి. అందుకు అపార అవకాశాలు ఉన్నాయి" అని అంతర్జాతీయ ద్రవ్యనిధి(ఐఎంఎఫ్) భారతదేశ కార్యనిర్వాహక సంచాలకుడు(ఈడీ) కృష్ణమూర్తి సుబ్రమణియన్ స్పష్టంచేశారు. గతంలో ఆయన భారత ప్రభుత్వ ఆర్థిక సలహాదారుగా పనిచేశారు. దేశ ఆర్థిక అభివృద్ధిపై 'ఇండియా ఎట్ 100' అనే పుస్తకం రాశారు. ఆయన హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగా 'ఈనాడు-ఈటీవీ'తో మాట్లాడారు. గత 30 ఏళ్లతో పోలిస్తే ప్రస్తుతం ద్రవ్యోల్బణం తగ్గుతోందని, ఈ కారణంగానే మనదేశం ఆర్థికంగా వృద్ధి చెందుతోందని తాను భావిస్తున్నట్లు చెప్పారు.

- వివరాలు 2లో..

హైదర్‌కోటలో ప్రజలతో కలిసి కాలనీల్లో పర్యటిస్తున్న హరీశ్‌రావు, గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, సబితారెడ్డి తదితరులు

పేదల రక్తం, కన్నీళ్లతో మూసీని సుందరీకరిస్తారా?

- ముందు ఎఫ్‌టీఎల్‌లో ఉన్న సీఎం, ఆయన సోదరుడి ఇళ్లను కూల్చాలి: హరీశ్‌రావు
- భారాస నేతలతో కలిసి మూసీ నిర్వాసితులకు పరామర్శ

12లో

Herbalife

ప్రకృతి నుండి ప్రేరేపించబడింది#. మీ కోసం రూపొందించబడింది.

పరిచయం చేస్తున్నాం వ్రిటిలైఫ్ ఆయుర్వేదిక్ చర్మ సంరక్షణ శ్రేణి. ప్రామాణీకరించబడిన మొక్కల పదార్థాలతో రూపొందించబడింది, ప్రకృతి#-ప్రేరేపిత చర్మ సంరక్షణ దినచర్యను రూపొందించడంలో మీకు సహాయపడటానికి దీర్ఘకాల విజ్ఞానం నుండి ఎంపిక చేయబడింది.

క్లీన్సర్ | టోనర్ | సీరమ్ | మాయిశ్చరైజర్

సహజమైన మెరుపును ఇస్తుంది
వేప మరియు పసుపుతో సమృద్ధి చేయబడింది

చర్మాన్ని మృదువుగా చేస్తుంది
అలోవీరా మరియు కుకుంబర్‌తో సమృద్ధి చేయబడింది

చర్మానికి తేమను కలిగిస్తుంది
కనక ఆయిల్‌తో సమృద్ధి చేయబడింది

ముడతలను తగ్గిస్తుంది
కుంకుమాది ఆయిల్ మరియు ఆల్మండ్ ఆయిల్‌తో సమృద్ధి చేయబడింది

vritilife®
Ayurvedic Nutrition
THE TOUCH of AYURVEDA#

చర్మానికి సురక్షితమైనది^ | క్లినికల్‌గా నిరూపించబడింది^^ | చేర్చబడిన పారాబెన్స్ మరియు సల్ఫేట్స్ లేవు | చేర్చబడిన ఫాస్ఫేట్స్ మరియు ఫథలేట్స్ లేవు | చేర్చబడిన సింథటిక్ డైలు లేదా కలరెంట్స్ లేవు.

#ప్రకృతి నుండి పచ్చిన ప్రాథమిక పదార్థాలను ఉపయోగించిన శాస్త్రీయమైన ఆయుర్వేద గ్రంథాల నుండి ప్రేరేపించబడింది.
^^టోనర్ కోసం వర్తించదు ^సాధారణమైన, పొడి, జిడ్డు మరియు కాంబినేషన్ చర్మం రకాలు. చల్లని, పొడి ప్రదేశంలో భద్రపరచాలి మరియు ఎండకు దూరంగా ఉంచాలి. ఈ ఉత్పత్తిలో వనమూలికలు ఉన్నాయి మరియు కాలక్రమేణా మారిన రంగు ప్రయోజనాలపై ప్రభావం చూపించదు. బాటిల్‌ను తెరిచి ఉంచకూడదు. బయట ఉపయోగించడానికి మాత్రమే. హెచ్చరిక: కళ్లకు నేరుగా తగలకూడదు. మీ ఉత్పత్తిని వినియోగించిన అనుభవం గురించి మీకు ఏవైనా సందేహాలు ఉంటే, దయచేసి మాకు writetous@herbalife.com పై రాయండి. పిల్లలకు దూరంగా ఉంచాలి. "చిత్రాలు కేవలం ఉదాహరణ లక్ష్యాల కోసం మాత్రమే."

మరిన్ని విషయాలు తెలుసుకోవడానికి మరియు ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి మీ హెర్బల్‌లైఫ్ స్వతంత్ర అసోసియేట్‌ను సంప్రదించండి.

(c) eenadu

ప్రజల ఆస్తులు కాపాడడం ప్రభుత్వ బాధ్యత

శాన్‌ఫ్రాన్సిస్కోలోని తెలుగు వారితో ఉప ముఖ్యమంత్రి భట్టి

శాన్‌ఫ్రాన్సిస్కోలో జరిగిన మీట్ అండ్ గ్రీట్ సమావేశంలో మాట్లాడుతున్న భట్టి

ఈనాడు, హైదరాబాద్: ప్రజల ఆస్తులు కాపాడడం తమ బాధ్యతని, అందులో భాగంగానే తెలంగాణలో చెరువులను రక్షించేందుకు చర్యలు చేపట్టామని ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క తెలిపారు. అభివృద్ధి, స్వేచ్ఛకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన ఆదివారం శాన్‌ఫ్రాన్సిస్కోలో నివసిస్తున్న తెలుగువారు మీట్ అండ్ గ్రీట్ అనే పేరుతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. సదరన్ కాలిఫోర్నియా తెలుగు కమ్యూనిటీ, స్థానిక కాన్సులేట్ జనరల్ సంయుక్తంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశాయి. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. 'గతంలో ఫ్యూడల్ మనస్తత్వం గల నేతల చేతుల్లో బందీ అయిన తెలంగాణను పూర్తి స్వేచ్ఛాయుత రాష్ట్రంగా మార్చాం. ఎవరు ఏ భావజాలాన్నైనా వ్యక్తపరిచే వాతావరణం కల్పించాం. అమెరికాలో స్థిరపడిన మన వారి మేధస్సు తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి ఉపయోగపడాలి. పెట్టుబడులతో ముందుకు రావాలి. హైదరాబాద్ అంటేనే కొండలు, చెరువులు, పార్కులు అనే పేరుండేది. అక్రమ నిర్మాణాలతో అవన్నీ కనుమరుగయ్యాయి. ఇటీవల విజయవాడ నగరం వరదలో చిక్కుకుపోయిన పరిస్థితులు హైదరాబాద్‌లోనూ ఏర్పడతాయి. నదీగర్భంలో నిర్మాణాలు చేపడుతున్నారు. వీటిని ఇప్పటికైనా ఆపకపోతే భవిష్యత్తు తరాలకు పెద్ద ప్రమాదం వాటిల్లుతుంది. పేదలను అడ్డంపెట్టి బిల్డర్లు వ్యాపారం చేస్తున్నారు. వందల చెరువులు కనపడకుండా పోయాయి. వాటిని రక్షించేందుకు చర్యలు చేపట్టాం. మూసీ నదిలో మంచినీటిని పారిస్తాం. మూసీ నిర్వాసితులకు పునరావాస చర్యలు చేపడుతున్నాం. వారంతా మంచి వాతావరణంలో జీవించేలా చూడడమే మా ప్రభుత్వ ఉద్దేశం. పరీవాహక ప్రాంతంలోని కుటుంబాలు ఆరోగ్యంగా జీవించేలా మూసీ నదిని శుద్ధి చేస్తాం. రాష్ట్ర సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం' అని వివరించారు.

ఇజ్రాయెల్ ముప్పేట దాడి

(మొదటి పేజీ తరువాయి)

లెబనాన్‌లోని సైదా నగరంపై ఐడీఎఫ్ జరిపిన దాడుల్లో 24 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 29 మందికి గాయాలయ్యాయి. ఓవైపు లెబనాన్‌పై బాంబుల వర్షం కురిపిస్తూనే ఇజ్రాయెల్ ఆదివారం యెమెన్‌లోని హూతీ తిరుగుబాటుదారులపై భారీస్థాయిలో వైమానిక దాడులు నిర్వహించింది. ఓడరేవు పట్టణం హొదైదాలోని విద్యుత్కేంద్రాలపై బాంబుల వర్షం కురిపించింది. రస్ ఇసా నగరాన్ని లక్ష్యంగా చేసుకుంది. ఈ దాడుల్లో నలుగురు మరణించగా, 33 మంది గాయపడ్డారు. సిరియాలోని అమెరికా బలగాలూ రెండు వేర్వేరు వైమానిక దాడుల్లో 37 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టాయి. వీరంతా ఇస్లామిక్ స్టేట్ గ్రూప్, అల్‌ఖైదా అనుబంధ సంస్థల మిలిటెంట్లే. వాయవ్య సిరియాపై మంగళవారం జరిపిన దాడిలో అల్‌ఖైదా అనుబంధ 'హురాస్ అల్-దీన్ గ్రూప్'నకు చెందిన ఓ సీనియర్ ఉగ్రవాదితోపాటు మరో ఎనిమిది మంది మరణించారని యూఎస్ సెంట్రల్ కమాండ్ తెలిపింది. ఈ నెల 16న ఓ ఐసిస్ శిక్షణ స్థావరంపై పెద్దఎత్తున వైమానిక దాడి నిర్వహించి.. 28 మంది ఉగ్రవాదులను అంతమొందించినట్లు పేర్కొంది. తాజా దాడులతో ఐసిస్ శక్తిసామర్థ్యాలు దెబ్బతిన్నట్లు అమెరికా సైన్యం ప్రకటించింది.

నస్రల్లా మృతదేహం గుర్తింపు..

హెజ్‌బొల్లా అధిపతి హసన్ నస్రల్లా మృతదేహం ఆచూకీ లభ్యమైంది. ఇజ్రాయెల్ దాడి చేసిన బీరుట్‌లోని దక్షిణ శివారు ప్రాంతం నుంచి తమ నాయకుడి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు హెజ్‌బొల్లా వర్గాలు తెలిపాయి. నస్రల్లా ఎలా చనిపోయారు.. ఆయన అంత్యక్రియలు ఎప్పుడు జరుగుతాయన్న విషయాలపై హెజ్‌బొల్లా ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు. నస్రల్లా మృతదేహంపై ఎలాంటి గాయాలు కనిపించలేదని సమాచారం. దీంతో బాంబు దాడి జరిగిన సమయంలో షాక్‌కి గురై ఆయన మరణించి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

జీవితాంతం బావిలో కప్పలా ఉండిపోతారా?

జీవితంలో వైఫల్యాలకు భయపడుతున్నారా? అయితే ఓ పని చేయండి. అసలు ప్రయత్నాలే చేయకండి. అప్పుడు ఎందులోనూ వైఫల్యమన్నదే ఉండదు. దానివల్ల మీరు ఎప్పటికీ ఏమీ నేర్చుకోలేరు. మీ జీవితం ఏ మాత్రమూ మెరుగుపడదు. అలా ఉండటం మీకు ఇష్టమైతే ఈ క్షణమే మీ ప్రయత్నాలను ఆపేయండి. జీవితాంతం బావిలో కప్పలా ఉండిపొండి.

– విలియం సాలిం, సోషల్ మీడియా మార్కెటింగ్ నిపుణులు

గ్రహం అనుగ్రహం

30-9-2024 సోమవారం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; దక్షిణాయణం; వర్ష ఋతువు, భాద్రపదమాసం, బహుళపక్షం

త్రయోదశి: రా. 7-00 తదుపరి చతుర్దశి; **ముఖ:** ఉ. 7-43 తదుపరి పుబ్బ; **వర్జ్యం:** సా. 4-27 నుంచి 6-12 వరకు; **అమృత ఘడియలు:** ఉ. 6-51 వరకు; తిరిగి రా. 2-57 నుంచి 4-42 వరకు; **దుర్ముహూర్తం:** మ. 12-14 నుంచి 1-02 వరకు; తిరిగి 2-38 నుంచి 3-25 వరకు; **రాహుకాలం:** ఉ. 7-30 నుంచి 9-00 వరకు

సూర్యోదయం: ఉ. 5.53; సూర్యాస్తమయం: సా. 5.49; మాసశివరాత్రి

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
కర్నూలు	36.1	26.9
తిరుపతి	35.8	25.2
ఖమ్మం	35.4	26.4
రామగుండం	35.0	26.2
ఆదిలాబాద్	34.3	25.0
నరసాపురం	34.2	27.0
విశాఖపట్నం	34.2	26.2
నిజామాబాద్	34.0	25.3
కరీంనగర్	34.0	23.0
విజయవాడ	33.6	27.0
సూర్యాపేట	33.5	28.0
హనుమకొండ	33.5	24.5
హైదరాబాద్	32.9	24.2
మెదక్	32.8	21.3
నల్గొండ	32.0	24.4
మహబూబ్‌నగర్	30.0	24.5

सम्मक्का सरक्का केंद्रीय जनजातीय विश्वविद्यालय
SAMMAKKA SARAKKA CENTRAL TRIBAL UNIVERSITY
(A Central University established by an Act of Parliament - Act 36 of 2023)
Jakaram Village, Mulugu District, Telangana State. Website URL: ssctu.ac.in

SPOT ADMISSION ANNOUNCEMENT 2024-25
B.A. (Hons.) English & B.A. (Hons.) Economics

Sammakka Sarakka Central Tribal University (SSCTU), Mulugu proposes to fill the seats in the B.A.(Hons.) English & B.A. (Hons.) Economics programmes by conducting **spot admission** counseling on **3rd October, 2024** at SSCTU Transit campus (Erswhile YTC Building) at Jakaram Village, Mulugu by the candidates passed in 12th Class/Intermediate on **3rd October 2024.**

For detailed notification please visit : acad.uohyd.ac.in / www.ssctu.ac.in

Sd/- Thukaram Porika
Controller of Examinations

ఆరు కారిడార్లు.. 116.2 కి.మీ.

- రూ.32,237 కోట్ల అంచనాతో మెట్రో రెండోదశ ప్రాజెక్టు
- నాగోల్ నుంచి శంషాబాద్ విమానాశ్రయ మార్గానికి సీఎం ఆమోదం
- రావిర్యాల మీదుగా ఫోర్త్‌సిటీకి ప్రతిపాదన
- హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: రాజధాని మెట్రోరైలు రెండో దశలోని ప్రతిపాదిత కారిడార్ల ఎలైన్‌మెంట్లు కొలిక్కి వచ్చాయి. ఆరింటిలో ఐదు కారిడార్లలో సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)లకు తుది మెరుగులు దిద్దుతున్నారు. అన్ని కారిడార్లలో కలిపి 116.2 కి.మీ. మెట్రో మార్గాల నిర్మాణానికి రూ.32,237 కోట్ల వ్యయమవుతుందని అంచనా వేశారు. విమానాశ్రయానికి వేర్వేరు మార్గాలను పరిశీలించినా.. నాగోల్ నుంచి చాంద్రాయణగుట్ట, ఆరాంఘర్ మీదుగా శంషాబాద్ విమానాశ్రయం మార్గానికి సీఎం ఆమోదం తెలిపారు. వివిధ ప్రత్యామ్నాయాలను పరిశీలించిన అనంతరం విమానాశ్రయం నుంచి అవుటర్, రావిర్యాల మీదుగా ఫోర్త్‌సిటీకి మెట్రో ప్రతిపాదనను రెండో దశలోనే చేర్చారు. ఈ మేరకు హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి ఆదివారం వివరాలు వెల్లడించారు. ట్రాఫిక్ అంచనాల విషయంలో హెచ్‌ఎండీఏ పరిధిలో కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్(సీఎంపీ) అధ్యయన నివేదిక కోసం ఎదురుచూస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ అనుమతుల కోసం డీపీఆర్‌లను సమర్పించడానికి సీఎంపీ తప్పనిసరి అని చెప్పారు. ఈ ఐదు కారిడార్లకు రూ.24,237 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేసినట్లు వివరించారు.

తొలుత కేంద్రానికి ఐదు కారిడార్ల డీపీఆర్‌లు..

వివిధ ప్రత్యామ్నాయాలపై లోతైన చర్చల తర్వాత రెండోదశ మార్గాలను ముఖ్యమంత్రి ఆమోదించారని ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. ఫోర్త్‌సిటీకి రావిర్యాల మీదుగా మెట్రో అనుసంధానానికి ఆకర్షణీయమైన సౌకర్యాలతో వినూత్న రీతిలో డీపీఆర్ సిద్ధం చేస్తున్నామని, సుమారు రూ.8వేల కోట్లు వ్యయమవుతుందని పేర్కొన్నారు. ఈ కారిడార్ మినహా మిగిలిన ఐదు కారిడార్ల డీపీఆర్‌లను త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో కేంద్రానికి సమర్పిస్తామని తెలిపారు. ఇతర మెట్రోరైలు ప్రాజెక్టుల మాదిరిగానే తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం సంయుక్త ప్రాజెక్టుగా చేపట్టేందుకు ప్రతిపాదించామన్నారు. కొన్ని నెలల్లోనే ఫోర్త్‌సిటీ వరకు 40 కి.మీ. మేర మెట్రో విస్తరణకు సంబంధించిన డీపీఆర్‌ను సైతం కేంద్రం అనుమతులకు సమర్పిస్తామని చెప్పారు. ఇప్పటికే మూడు కారిడార్లలో 69 కి.మీ. మేర మెట్రో సేవలందిస్తోంది.

మెట్రో రెండోదశ కారిడార్ల గురించి వివరిస్తున్న హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి

కారిడార్-4 (విమానాశ్రయ మెట్రో కారిడార్)
- నాగోల్ - చాంద్రాయణగుట్ట, ఆరాంఘర్ మీదుగా శంషాబాద్ విమానాశ్రయం వరకు
- 36.6 కి.మీ.. 24 స్టేషన్లు
- 35 కి.మీ. ఆకాశ మార్గం, 1.6 కి.మీ. భూగర్భంలో
- విమానాశ్రయంలో భూగర్భ మెట్రోస్టేషన్ వస్తుంది.

కారిడార్-5
- రాయదుర్గం నుంచి విప్రో సర్కిల్ మీదుగా కోకాపేట నియోపొలిస్ వరకు
- 11.6 కి.మీ.. 10 స్టేషన్లు.

కారిడార్-6
- ఎంజీబీఎస్ నుంచి శాలిబండ మీదుగా చాంద్రాయణగుట్ట వరకు
- 7.5 కి.మీ.. 6 స్టేషన్లు

కారిడార్-7
- మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు
- 13.4 కి.మీ.. 10 స్టేషన్లు

కారిడార్-8
- ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు
- 7.1 కి.మీ.. 6 స్టేషన్లు

కారిడార్-9
- శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫోర్త్ సిటీ(స్కిల్ యూనివర్సిటీ) వరకు.
- 40 కి.మీ.

పెరట్లో కాసిన గ్యాక్ పండ్లను చూపుతున్న వెంకట్

పోషకాల 'స్వర్గఫలం'

నారింజ రంగు.. ఆగాకరలాంటి ఆకారం.. కోసి చూస్తే.. పసుపు పచ్చటి గుజ్జు మధ్య ఎర్రటి రసంలో ఒదిగిన గింజలు.. ఏటా అని ఆలోచిస్తున్నారా! ఇదే గ్యాక్ ((గ్రేట్ అమెరికన్ కంట్రీ)పండు. ఏపీలోని ఏలూరు జిల్లా పోలవరం మండలం మామిడిగొంది గ్రామానికి చెందిన బొరగం వెంకట్ ఇంటి ఆవరణలో ఈ మొక్కను సాగు చేశారు. కొత్త పంటలపై ఆసక్తితో వెంకట్ గతేడాది నవంబరులో మొక్కలను కేరళ నుంచి తెప్పించి, నాటారు. మే నుంచి దిగుబడి మొదలైంది. పండును రసం చేసుకొని తీసుకుంటారని తెలిపారు. అధిక పోషకాలున్న ఈ పండుకు 'స్వర్గఫలం' అనే మరో పేరుంది.

– ఈనాడు, పోలవరం

స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాల నాటికి... సుసంపన్న భారత్

'ఈనాడు-ఈటీవీ' ముఖాముఖిలో ఐఎంఎఫ్ ఇండియా ఈడీ కృష్ణమూర్తి సుబ్రమణియన్

? మనదేశ ఆర్థికవ్యవస్థ ప్రస్తుతం 3.9 ట్రిలియన్ డాలర్లు. 2030 నాటికి 7 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని ప్రపంచబ్యాంకు అంచనా. అయితే, 2047కల్లా 55 ట్రిలియన్ల డాలర్ల వ్యవస్థగా ఎదుగుతుందని మీరు చెబుతున్నారు. ఎలా సాధ్యమో వివరిస్తారా

దేశ ఆర్థికాభివృద్ధి రేటు తెలుసుకోవడానికి డాలర్‌తో రూపాయి మారకం విలువను పోల్చుతాం. గత పాతికేళ్లలో ఏంజరిగిందనేది పరిశీలిస్తే అర్థమవుతుంది. ఉదాహరణకు 1990 నుంచి పరిశీలిస్తే డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏటా 3% నుంచి 3.5% వరకు తగ్గింది. ఇప్పుడు మనదేశ జీడీపీ వృద్ధిరేటు 8%, ద్రవ్యోల్బణం 5% వద్ద ఉన్నాయి. ప్రతి ఆరు సంవత్సరాలకు మనదేశ జీడీపీ రెట్టింపైతే 2047 నాటికి 55 ట్రిలియన్ డాలర్ల వ్యవస్థగా రూపాంతరం చెందుతుంది. ఆ లక్ష్యానికి చేరాలంటే జీడీపీ వార్షిక వృద్ధి రేటు 8% ఉండేలా చూడటం చాలా ముఖ్యం. దీనికి అనేక సవాళ్లు కూడా ఎదురవుతుంటాయి. (* ఒక ట్రిలియన్ డాలర్లు రూ.83.71 లక్షల కోట్లకు సమానం)

? అలాంటి స్థిర ప్రగతిని రెండు దశాబ్దాలకు పైగా కొనసాగించాలంటే ఎన్నో సవాళ్లను అధిగమించాల్సి ఉంటుంది కదా...!

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంచి పాలసీలు అమలు చేయాలి. కేంద్రం బాగా చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వాలు ఇంకా ఎక్కువగా సంస్కరణలు తేవాలి. యవతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తే అభివృద్ధి పెరుగుతుంది.

? భిన్న వాతావరణం, భౌగోళిక పరిస్థితులున్న రాష్ట్రాల్లో వేగవంతమైన అభివృద్ధి సాధ్యమా

ఒక నాణేనికి రెండు ముఖాలుంటాయి. రాష్ట్ర పాలకులకు అధికారంతోపాటు బాధ్యత కూడా ఉంటుంది. ప్రస్తుతం అవి బాధ్యతపై అధిక దృష్టిని కేంద్రీకరించాలి. భారత్ 55 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలంటే ఒక్కో రాష్ట్రం ఒకటి నుంచి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థలుగా ఎదగాలి. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్ వంటి రాష్ట్రాలకు దీన్ని సాధించే అనేక అవకాశాలున్నాయి.

? ఆర్థికాభివృద్ధి అనేక రంగాలతో ముడిపడి ఉంటుంది కదా

మీకో ఉదాహరణ ఇస్తా. సచిన్ 1993లో ఒక సెంచరీ కొట్టారు. అది చూసి గవాస్కర్... సచిన్ కెరీర్‌లో 40 సెంచరీలు, 15 వేల పరుగులు చేయకపోతే తాను నిరాశ చెందుతానన్నారు. సచిన్ క్రికెట్‌లో వంద సెంచరీలు చేశారు. దానికి ఆయన ఎంతో కష్టపడ్డారు. ఓపెనింగ్ నుంచి 4వ స్థానంలో కూడా బ్యాటింగ్‌కు వెళ్లారు. చివరికి గవాస్కర్ చెప్పినదానికన్నా ఎక్కువ సెంచరీలు చేశారు. అలాగే మనదేశ ఆర్థికరంగం వృద్ధిరేటు గత 30 ఏళ్లలో ఎలా పెరిగిందనేది చూసి 2047కి ఎలా మారనుందో నేను చెబుతున్నా.

? రాష్ట్రాలు ఏంచేస్తే అంత వృద్ధి సాకారమవుతుంది?

అభివృద్ధికి అవకాశాలు ఎక్కువగా ఉన్న రంగాలకు నైపుణ్యాలున్న కార్మికులను అందుబాటులో ఉంచాలి. విద్యుత్, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలను కల్పించాలి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ చాలా ముఖ్యం. పెట్టుబడులకు అవసరమైన అనుమతులన్నీ సత్వరం ఇవ్వాలి. కేంద్ర బడ్జెట్ వస్తుంటే దేనిపై దృష్టిపెట్టారని అంతా చూస్తారు. అలాగే రాష్ట్రాల బడ్జెట్లలో ప్రజలకు ఉచితాలు ఇచ్చారా... సంస్కరణలు తెచ్చారా... అనేది చూడాలి. ఉదాహరణకు నేను 2009లో అమెరికా నుంచి వచ్చినప్పుడు హైదరాబాద్‌లో ఐఎస్‌బీ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లాలంటే గంట, గంటన్నర పట్టేది. ఇప్పుడు రెండు గంటలు పడుతోంది. ఇలా ట్రాఫిక్‌లో సమయం వృథా కావడానికి ఎవరిది బాధ్యత? రాష్ట్రాల బడ్జెట్‌లు వచ్చినప్పుడు ఇలాంటి మౌలిక సదుపాయాల గురించి అడగాలి. ప్రజలకు టీవీ, గ్రైండర్ వంటివి ఉచితంగా ఇవ్వడం కాదు. యువతకు ఉద్యోగాల కల్పన గురించి ఏం పాలసీ తెచ్చారనేది అడగాలి.

? ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు వంటి ప్రతికూల పరిస్థితుల్లో ఆర్థికవ్యవస్థ స్థిరంగా వృద్ధి చెందుతుందా

1970 నుంచి 1995 మధ్య జపాన్ ఆర్థికవ్యవస్థ 26 రెట్లు అభివృద్ధి చెందింది. 1970 తర్వాత వియత్నాం యుద్ధం, ప్రపంచంలో చాలా సంక్షోభం, అమెరికాలో రెండంకెల ద్రవ్యోల్బణమున్నా జపాన్ ఆ ప్రగతి సాధించింది. మనకూ అది సాధ్యమేనన్న సానుకూల దృక్పథం ఉండాలి. గత మూడు దశాబ్దాల భారత ఆర్థికాభివృద్ధిపై ఎంతో పరిశోధన చేసి నేను చెబుతున్నా.

? పేదలపై ద్రవ్యోల్బణం ప్రభావం ఎలా ఉంటుంది

ద్రవ్యోల్బణం పేదలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. వారి కొనుగోలు శక్తి తగ్గుతుంది. అందుకే ధరల తగ్గుదల చాలా అవసరం. 1990 నుంచి మనదేశంలో ద్రవ్యోల్బణం 7% ఉండేది. పాలసీల్లో తెచ్చిన మార్పులతో 2016 నుంచి అదిప్పుడు 5 శాతానికి అటూఇటుగా ఉంటోంది.

? చదువుకున్న, నైపుణ్యమున్న యువత ఎక్కువగా విదేశాలకు వెళుతోంది కదా? మన ఆర్థిక రంగానికి ఇదెలా ఉపయోగపడుతుంది?

1994లో ఐఐటీ నుంచి నేను డిగ్రీ తీసుకున్న సమయంలో నాతోపాటు చదివిన వారిలో 80% అమెరికా వెళ్లాం. 2014లో ఐఐటీల్లో చదివిన వారిలో 30% మాత్రమే విదేశాలకు వెళ్లారు. రానున్న 25 సంవత్సరాల్లో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతుంది. జీడీపీ 8% వార్షిక వృద్ధిరేటుతో కొనసాగితే ఉద్యోగికి ఆరేళ్లలో జీతం రెట్టింపవుతుంది. అంటే 40 ఏళ్ల కెరీర్‌లో 128 రెట్ల పెరుగుదల కనిపిస్తుంది. అమెరికాలో జీతాలు ఇప్పుడు ఎక్కువగానే ఉన్నా గరిష్ఠంగా 40 ఏళ్లలో పదిరెట్లు మాత్రమే పెరుగుతాయి. అమెరికా వెళ్లి, తిరిగివచ్చిన అనుభవంతో చెపుతున్నా. ఇక్కడే ఎక్కువ అవకాశాలున్నాయి.

చోదకశక్తులుగా తెలుగు రాష్ట్రాలు

తెలుగు రాష్ట్రాల్లో అభివృద్ధికి ఎక్కువ అవకాశాలున్నాయి. తలసరి ఆదాయం బాగుంది. యువశక్తి అందుబాటులో ఉంది. ఈ రాష్ట్రాలు లీడ్ తీసుకుని ముందుకెళితే దేశానికి ఉపయోగం. మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి నిలపాలి. ఐటీ, పారిశ్రామిక రంగాలను ఆలంబనగా చేసుకోవాలి. పేదరికాన్ని గణనీయంగా తగ్గించాలి. ముఖ్యంగా యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇప్పించాలి. అప్పుడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు ఒకటి నుంచి రెండు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థలుగా ఎదిగేందుకు అవకాశముంది.

గత ప్రభుత్వ తప్పులను సరిదిద్దేలా త్వరలో కొత్త రెవెన్యూ చట్టం

(మొదటి పేజీ తరువాయి)

కొందరు రెవెన్యూ అధికారుల తీరు వల్ల శాఖకు, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని.. అలాంటివారు పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. హైదరాబాద్ శివార్లలోని శామీర్‌పేటలో ఉన్న సల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో ఆదివారం తహసీల్దార్లతో నిర్వహించిన సదస్సులో మంత్రి ముఖాముఖి మాట్లాడారు. రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన 972 మంది తహసీల్దార్లు హాజరవగా.. రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం పొట్రు పాల్గొన్నారు. గత ప్రభుత్వంలో ఎదుర్కొన్న పలు సమస్యలను కొందరు తహసీల్దార్లు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. 'రాష్ట్రంలో గత ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను దుర్వినియోగపరిచిన విధానాన్ని, చేసిన తప్పులను సరిదిద్దుతాం. వ్యవస్థను ప్రక్షాళన చేసే దిశగా పటిష్ఠమైన కార్యాచరణ చేపడుతున్నాం. త్వరలో కొత్త రెవెన్యూ చట్టాన్ని తీసుకువస్తున్నాం. గత ప్రభుత్వం హడావుడిగా ఏర్పాటు చేసిన కొత్త మండలాలకు భవనాలు, సిబ్బంది, మౌలిక వసతులు కల్పిస్తాం. పదోన్నతులు, కోర్టు ఖర్చులు, అద్దె భవనాలు, వాహనాల బకాయిలతోపాటు అన్ని సమస్యలను పరిష్కరిస్తాం. ఎన్నికల సమయంలో బదిలీ చేసిన తహసీల్దార్ల తిరుగు బదిలీలపై ఉద్యోగ సంఘాలతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. ప్రభుత్వ ఆస్తులు, స్థలాలు కాపాడే విషయంలో, పేదలకు సహాయం అందించడంలో రెవెన్యూ యంత్రాంగం పని తీరు మరింత మెరుగుపడాలి. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ.. ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలి. తహసీల్దార్లపై కేసుల నమోదు విషయంలో జిల్లా కలెక్టర్ల నుంచి అనుమతి తీసుకునేలా డీజీపీతో చర్చించి త్వరలో ఉత్తర్వులు జారీచేస్తాం. రెవెన్యూ సిబ్బంది శిక్షణకు హైదరాబాద్‌లో కేంద్రాన్ని ఏర్పాటు చేస్తాం' అని మంత్రి వివరించారు. ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న 300 మంది ఉద్యోగుల వైద్య ఖర్చుల బిల్లుల చెల్లింపు దస్త్రాలను మంత్రి పరిష్కరించారని నవీన్ మిత్తల్ వెల్లడించారు. సమావేశంలో ట్రైసా రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.గౌతంకుమార్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటికి ఆహ్వానం పలుకుతున్న ట్రైసా రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.గౌతంకుమార్, తహసీల్దార్లు

నాడు సర్కారు భూమికి పట్టా ఇవ్వాలని బెదిరించారు!

- మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లిన తహసీల్దార్
- ముఖాముఖిలో పలు అంశాలను తెలిపిన అధికారులు

ఈనాడు, హైదరాబాద్: గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రస్థాయి అధికారి ఒకరు తనను హైదరాబాద్‌కు పిలిచి 300 ఎకరాల ప్రభుత్వ భూమికి పట్టా జారీ చేయాలని ఆదేశించారని.. వీలు కాదన్నందుకు తన సర్వీసు రికార్డులన్నింటినీ తనిఖీ చేయించి కఠిన చర్యలకు సిఫార్సు చేస్తామంటూ బెదిరించారని వరంగల్ జిల్లాకు చెందిన ఓ తహసీల్దార్ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు రాష్ట్రంలోని తహసీల్దార్లతో మంత్రి ఆదివారం నిర్వహించిన ముఖాముఖి సదస్సు సందర్భంగా పలువురు అధికారులు కీలక అంశాలను ఆయన దృష్టికి తీసుకొచ్చినట్లు సమాచారం. ఈ మేరకు పలు జిల్లాలకు చెందిన తహసీల్దార్లు వివిధ అంశాలను ప్రస్తావించగా మంత్రి సానుకూలత వ్యక్తం చేసినట్లు తెలిసింది. ముఖ్యాంశాలివి..

- ప్రభుత్వ భూముల్లో కబ్జాలు తొలగించి రక్షణ చర్యలు చేపడుతున్నాం. అధికారులు బదిలీ కాగానే ఆ భూములు తిరిగి కబ్జాల్లోకి వెళ్తున్నాయి. వాటికి అక్షాంశాలు, రేఖాంశాలతో హద్దులు గుర్తించి ఫెన్సింగ్ వేస్తే పటిష్ఠ రక్షణ ఏర్పడుతుంది.
- ధరణి రిజిస్ట్రేషన్ల పట్టాతో సబ్ డివిజన్ స్కెచ్ (పటం) కూడా అందజేస్తే.. హద్దుల ఆక్రమణ, రెండోసారి రిజిస్ట్రేషన్ సమస్యలు తొలగిపోతాయి.
- ఐదు దశాబ్దాల క్రితం జనాభాను అనుసరించి నిర్ధరించిన సిబ్బంది సంఖ్యతోనే ఇప్పటికీ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సిబ్బంది సంఖ్యను పెంచాలి. సర్వేయర్ల కొరత తీవ్రంగా ఉంది. కొత్తవారిని నియమించాలి. గ్రామీణ రెవెన్యూ వ్యవస్థను వీలైనంత త్వరగా ఏర్పాటుచేయాలి.
- భూముల రక్షణ బాధ్యతలు సీసీఎల్ఏ పరిధిలో కొనసాగిస్తున్నారు. తహసీల్దార్‌ను రక్షణ అధికారిగా నియమించి, ఆర్డీవో, కలెక్టర్, సీసీఎల్ఏలను అప్పీలు అధికారులుగా నియమించాలి.
- ఏజెన్సీ జిల్లాల్లో గిరిజన, గిరిజనేతర భూముల సమస్యపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలి.

అలెన్ కెరీర్ ఆధ్వర్యంలో టాలెంటెక్స్ 2025

ఈనాడు, హైదరాబాద్: ఐదు నుంచి పదో తరగతి విద్యార్థుల కోసం 'టాలెంటెక్స్ 2025' నిర్వహిస్తున్నట్లు అలెన్ కెరీర్ ఇన్‌స్టిట్యూట్ ప్రైవేటు లిమిటెడ్ ఓ ప్రకటనలో తెలిపింది. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 15 వేల మందికి పైగా విద్యార్థులు రూ.2.5 కోట్ల నగదు పురస్కారాలు, రూ.250 కోట్ల విలువైన ఉపకార వేతనాలు గెలుచుకోవచ్చని పేర్కొంది. అలాగే 90% అలెన్ క్లాస్‌రూమ్ స్కాలర్‌షిప్, డిజిటల్ కోర్సులు పొందొచ్చని వివరించింది. అక్టోబరు 5 నుంచి 20 వరకు దశలవారీగా ఆన్‌లైన్‌లో, అక్టోబరు 13 నుంచి 20 వరకు ఆఫ్‌లైన్‌లో పరీక్షలుంటాయని వివరించారు. అక్టోబరు 2 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు www.

తినే తిండికి తనిఖీలేవి?

- రాష్ట్రంలో ఆహార నాణ్యత గాలిలో దీపమే
- సిబ్బంది కొరత, ప్రయోగశాలల ఏర్పాటులో వెనకబాటు
- తెలంగాణకు 23వ స్థానం.. కేరళకు అగ్రస్థానం

ప్రజారోగ్యంతో ముడిపడిన కీలకమైన ఆహారనాణ్యత ప్రమాణాల పర్యవేక్షణలో తెలంగాణ వెనకబడి ఉంది. 2023-24వ సంవత్సరానికి సంబంధించి నిర్దేశించిన మార్గదర్శకాల్లో పలు అంశాల్లో రాష్ట్రం వెనకబడి ఉన్నట్లు ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖకు చెందిన భారతదేశ ఆహారభద్రత, ప్రమాణాల సంస్థ(ఎఫ్ఎస్ఎస్ఏఐ) వెల్లడించింది. వివిధ అంశాలను పరిశీలించి, మార్కుల ప్రాతిపదికగా నాణ్యత తనిఖీలపై ర్యాంకులను ప్రకటించింది. 100 మార్కులకు తెలంగాణ 35.75 మార్కులతో 23వ స్థానంలో ఉంది. అత్యధిక మార్కులతో కేరళ అగ్రస్థానంలో ఉండగా తమిళనాడు రెండో స్థానంలో ఉంది.

సహాయ కేంద్రాల ఏర్పాటులోనూ...

మానవ వనరుల అంశాల్లో నిర్దేశించిన ప్రమాణాల్లో రాష్ట్రం వెనకబడిందని నివేదిక పేర్కొంది. జనాభాకు తగిన మేర ఆహార నాణ్యత తనిఖీ ఉద్యోగులు, సిబ్బంది లేకపోవడం, రాష్ట్రస్థాయి సలహా కమిటీ ఏర్పాటు, సమావేశాల నిర్వహణకు సంబంధించిన ప్రమాణాల్లో సగంకంటే తక్కువ ఉన్నట్లు పేర్కొంది. లైసెన్స్‌లజారీకి స్పెషల్ డ్రైవ్‌లు, క్యాంపుల నిర్వహణ, కొత్త రిజిస్ట్రేషన్‌లు, నమూనాలను ప్రయోగశాలలో పరీక్షించడం, వినియోగదారుల ఫిర్యాదులు తీసుకోవడం, సహాయ కేంద్రాల ఏర్పాటు వంటి అంశాల్లో రాష్ట్రం బాగా వెనకబడి ఉంది. రాష్ట్ర ఆహార నాణ్యత తనిఖీ ప్రయోగశాలలు, ఎన్ఏబీఎల్ గుర్తింపు ఉన్న రాష్ట్ర ల్యాబొరేటరీలు, వాటిలో పరికరాలు, సాంకేతిక సిబ్బంది, ల్యాబ్‌ల మ్యాపింగ్ సహా వివిధ అంశాల్లో వెనకబడి ఉందని విశ్లేషించింది. ఈట్ రైట్ ఛాలెంజ్ కార్యక్రమాల నిర్వహణ, పరిశుభ్రత రేటింగ్‌ల నిర్వహణ పరిమితంగానే ఉన్నట్లు పేర్కొంది.

కేరళ ఎలా సాధించిందంటే..

కేరళలో ప్రత్యేక డ్రైవ్‌లు సమర్థంగా నిర్వహించడంతో కొత్తగా ఆహారవిక్రయ కేంద్రాల లైసెన్స్‌లు భారీగా పెరిగాయి. 2023-24 సంవత్సరానికి నిర్దేశించుకున్న లక్ష్యాల్లో వందశాతం తనిఖీలు చేశారు. తనిఖీలకు అవసరమైన మౌలిక సదుపాయాలను పెంచారు. ప్రయోగశాలలను పెంచడంతో పలు ల్యాబ్‌లకు ఎన్ఏబీఎల్ గుర్తింపు లభించింది. నాణ్యత ప్రమాణాలను వెల్లడించే అత్యాధునిక యంత్రపరికరాలతో కూడిన వాహనాలను ప్రతి జిల్లాలో అందుబాటులోకి తెచ్చారు. ఉద్యోగులకు అవసరమైన శిక్షణ ఇవ్వడంతో పాటు వినియోగదారుల సాధికారతకు పెద్దపీట వేశారు. గతంకంటే ర్యాంకును మెరుగుపరచుకోవడంతోపాటు 'నాణ్యమైన ఆహారం' అనే అంశంపై వివిధ కార్యక్రమాలు నిర్వహించారు.



- ఈనాడు, హైదరాబాద్

శ్రీవారి మెట్టు మార్గం వద్ద చిరుత సంచారం

తిరుమల, న్యూస్‌టుడే: చంద్రగిరి మండలం శ్రీనివాస మంగాపురం సమీపంలోని శ్రీవారి మెట్టు మార్గం ప్రవేశం వద్ద చిరుతపులి సంచారం ఆలస్యంగా వెలుగుచూసింది. శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో ఓ కుక్కను చిరుత వెంబడిస్తూ వచ్చింది. అది దొరక్కపోవడంతో వెనుతిరిగింది. ఈ దృశ్యాలను అక్కడి సీసీటీవీ రికార్డు చేసింది. తితిదే అటవీశాఖ డీఎఫ్‌వో శ్రీనివాస్ ఆదివారం మాట్లాడుతూ.. చిరుత సంచారంపై భక్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. రాత్రి సమయాల్లో మెట్ల మార్గం మూసివేస్తున్నామని ఉదయం నుంచే కాలినడక భక్తులను అనుమతిస్తున్నామన్నారు.

అతిగా స్పందిస్తున్నారంటే ఏదో సమస్య ఉన్నట్లే

మీరు వ్యక్తిగత జీవితంలో ఎంత ఎక్కువ ఆనందంగా ఉంటే, చిన్న చిన్న విషయాలపై మీకు అంత తక్కువగా కోపం వస్తుంది. ప్రతి విషయంపైనా అతిగా స్పందిస్తూ ఆవేశపడుతున్నారంటే మీరు పరిష్కరించుకోవాల్సిన సమస్య ఏదో ఉన్నట్లు అర్థం. ఆర్థికంగానో, కుటుంబపరంగానో, ఉద్యోగంలోనే లేదా అలవాట్లకు సంబంధించో ఇబ్బందికర పరిస్థితి ఉందేమో ఆత్మావలోకనం చేసుకొని దాన్ని పరిష్కరించుకోండి. లేకపోతే ఆ అసంతృప్తి మరింత పెరిగి మనశ్శాంతి దూరమవుతుంది.

– కెవిన్ జాబో, బ్రాండ్ బిల్డర్

మహిళల ఆరోగ్యానికి పెద్దపీట

- పింక్ పవర్ రన్ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్ – రాయదుర్గం, న్యూస్‌టుడే: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబాలు, సమాజం సంతోషంగా ఉంటాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వారి ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, రాష్ట్రంలో మరిన్ని ఆసుపత్రులు నిర్మించి వైద్య రంగాన్ని బలోపేతం చేస్తామని చెప్పారు. ఆదివారం గచ్చిబౌలి స్టేడియంలో సుధారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'పింక్ పవర్ రన్ 2024' కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు ఏర్పాటుచేసిన 'పింక్ పవర్ రన్' చాలా గొప్ప కార్యక్రమమని కొనియాడారు. అనారోగ్య సవాళ్లను ఎదుర్కొంటున్న మహిళలకు ఇలాంటి కార్యక్రమాల ద్వారా సంఘీభావం తెలపడం అభినందనీయమన్నారు. అనంతరం పింక్‌పవర్ 5కే, 10కే రన్ విభాగాల్లో గెలుపొందినవారికి ముఖ్యమంత్రి నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఛైర్మన్ శివసేనారెడ్డి, ఎంఈఐఎల్ ఎండీ పీవీ కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు సుధారెడ్డి, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తూ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, కృష్ణారెడ్డి, సుధారెడ్డి సంయుక్తంగా 3కే, 5కే, 10కే పరుగును జెండా ఊపి ప్రారంభించగా అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

5కే రన్‌లో విజేత శంకర్‌లాల్‌కు జ్ఞాపిక అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో కృష్ణారెడ్డి, క్రిస్టినా చోంగ్తూ, శిఖా గోయల్, శివసేనారెడ్డి, సుధారెడ్డి

పత్తి డబ్బుల చెల్లింపులకు 'కాటన్-యాలీ'

- యాప్ తయారు చేయనున్న మార్కెటింగ్‌శాఖ, సీసీఐ

ఈటీవీ-ఆదిలాబాద్: పత్తి పంట డబ్బుల చెల్లింపుల్లో పారదర్శకత కోసం మార్కెటింగ్ శాఖ ప్రత్యేక కసరత్తు చేస్తోంది. ప్రధానంగా ప్రభుత్వ సంస్థ అయిన భారత పత్తి సంస్థ(సీసీఐ) పత్తి డబ్బులను రైతులకు చెల్లించే క్రమంలో అక్రమాలకు తావీయకుండా "కాటన్ యాలీ" పేరిట ప్రత్యేక యాప్ తీసుకొస్తోంది. రాష్ట్రంలో ఈ ఏడాది 43 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగవుతోంది. సీసీఐ కొనుగోలు చేసిన పంట డబ్బులు రైతులకు నేరుగా కాకుండా బ్యాంకులు, పోస్టాఫీసుల ద్వారా చెల్లింపులు చేస్తోంది. గతంలో ఆదిలాబాద్ జిల్లాలో పోస్టాఫీసు ద్వారా రైతులకు చెల్లించాల్సిన రూ.1.15 కోట్ల వరకు పత్తి డబ్బులు పోస్టాఫీసు ఉద్యోగి ఒకరు సొంతానికి వాడుకోవడం రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. ఈ ఏడాది అలాంటి వాటికి ఆస్కారమివ్వకుండా మార్కెటింగ్ శాఖ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటోంది. సీసీఐకి విక్రయించిన తర్వాత రైతులకు చెల్లించే డబ్బులు పోస్టాఫీసులో ఉన్నాయా? బ్యాంకులో ఉన్నాయా? వాటిని ఎప్పుడు డ్రా చేసుకోవచ్చు? తదితర విషయాలను 'కాటన్ యాలీ' యాప్ ద్వారా రైతుల స్మార్ట్‌ఫోన్‌కు సమాచారం వస్తుంది. దాని ఆధారంగా డబ్బులు డ్రా చేసుకునేందుకు వెసులుబాటు లభిస్తుందని మార్కెటింగ్ శాఖ వరంగల్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. కౌలు రైతులు పత్తిని ప్రభుత్వ రంగ సంస్థలకు విక్రయించాలంటే తప్పనిసరిగా భూమి పత్రాలు చూపించాల్సి ఉంటుందని తెలిపారు.

తమిళనాడు ఉప ముఖ్యమంత్రిగా ఉదయనిధి స్టాలిన్ ప్రమాణం

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాడు ఉప ముఖ్యమంత్రిగా.. సీఎం స్టాలిన్ తనయుడు, యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్ ఆదివారం ప్రమాణం చేశారు. మంత్రివర్గ పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా ముగ్గురిని తప్పించి, కొత్తగా నలుగురిని క్యాబినెట్‌లోకి తీసుకున్నారు. చెన్నైలోని రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎం స్టాలిన్ సమక్షంలో వారితో గవర్నర్ ఆర్.ఎన్.రవి ప్రమాణం చేయించారు. మనీలాండరింగ్ కేసులో అరెస్టై మంత్రి పదవి కోల్పోయిన సెంథిల్ బాలాజీ ప్రస్తుతం బెయిల్‌పై విడుదలైన నేపథ్యంలో ఆయనకూ మంత్రివర్గంలో మళ్లీ చోటు దక్కింది. ఆయనకు గతంలో నిర్వహించిన విద్యుత్తు, ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖలను కేటాయించారు.

దసరా అనంతరం 'కాళేశ్వరం'పై మలిదశ విచారణ

ఈనాడు, హైదరాబాద్: కాళేశ్వరం జలాశయానికి సంబంధించి న్యాయ విచారణ కమిషన్ ప్రస్తుత విచారణ ప్రక్రియ ముగిసింది. జస్టిస్ పీసీ ఘోష్ ఆదివారం తన స్వస్థలం కోల్‌కతాకు వెళ్లారు. ఈ నెల 18న హైదరాబాద్‌కు వచ్చిన ఆయన బహిరంగ విచారణలో భాగంగా 19వ తేదీ నుంచి క్రాస్ ఎగ్జామినేషన్స్ నిర్వహించారు. ఇందులో భాగంగా సెంట్రల్ డిజైన్స్ సంస్థ (సీడీవో), తెలంగాణ రాష్ట్ర ఇంజినీరింగ్ పరిశోధనశాల(టీఎస్ఈఆర్ఎల్), కన్‌స్ట్రక్షన్స్ విభాగాలకు చెందిన తాజా, మాజీ ఇంజినీర్లను కమిషన్ విచారించింది. గజ్వేల్ ఈఎన్సీ హరీరాం, కరీంనగర్ మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లును కూడా విచారించి పలు వివరాలు రాబట్టింది. నల్లా వెంకటేశ్వర్లును మరోమారు పిలుస్తామని కమిషన్ పేర్కొంది. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పునరాకృతి, తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు మార్పు, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల డిజైన్లు, నిర్మాణాలు, వ్యాప్కోస్ సర్వే, డ్యామేజీలు తదితర అంశాలపై జస్టిస్ ఘోష్.. విచారణకు హాజరైన వారిపై వందల ప్రశ్నలు సంధించారు. తదుపరి విచారణ దసరా అనంతరం ఉండొచ్చని కమిషన్ వర్గాలు పేర్కొంటున్నాయి.

నేడు పలు జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సోమవారం ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, జనగామ, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో కొన్ని చోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు తెలిపింది. మరోవైపు ఆదివారం రాష్ట్రంలోనే అత్యధికంగా సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేటలో 6.9 సెం.మీ. వర్షం కురిసింది. హైదరాబాద్, రంగారెడ్డి, నాగర్‌కర్నూల్, ఆదిలాబాద్, మేడ్చల్, మెదక్, కామారెడ్డి జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి.

ఈడీ అదుపులో సాహితీ ఇన్‌ఫ్రా నిర్వాహకుడు!

ఈనాడు, హైదరాబాద్: సాహితీ ఇన్‌ఫ్రా నిర్వాహకుడు బూదాటి లక్ష్మీనారాయణను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రీలాంచింగ్ ఆఫర్ల పేరుతో వేల మంది నుంచి సుమారు రూ.2,500 కోట్లు వసూలు చేసిన సాహితీ సంస్థ వారికి ఫ్లాట్లను అప్పగించకుండా మోసగించినట్టు ఆరోపణలున్నాయి. ఇదే విషయమై తెలంగాణ పోలీసులు 2022లో కేసులు నమోదు చేశారు. హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు గతంలో లక్ష్మీనారాయణను అరెస్టు చేసి జైలుకు తరలించారు. ఈ వ్యవహారంలో మనీలాండరింగ్ జరిగిందనే కోణంలో ఈడీ సైతం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. ఈ క్రమంలోనే ఆదివారం ఆయన్ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. అరెస్టుపై ఈడీ అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.

॥ దసరా ప్రీ-బుకింగ్ ఆఫర్‌లు ॥

హీరోని ఇంటికి తీసుకురండి

బుకింగ్ ప్రారంభం @ ₹1100*

అదనపు క్యాష్ డిస్కౌంట్ ₹1000*

తక్కువ వడ్డీ రేటు @ 4.99%^

క్యాష్‌బ్యాక్ ₹5000~ వరకు

డెలివరీ చేసేటప్పుడు ఆకర్షణీయమైన క్యాష్ డిస్కౌంట్ మరియు ఎక్స్‌ఛేంజ్ బోనస్#

Hero GIFT

Grand Indian Festival of Trust

ఇప్పుడే బుక్ చేసుకోండి మరియు దసరా పండుగ సమయంలో ఖచ్చితంగా డెలివరీని పొందండి

శుభ ముహూర్త ఆఫర్‌లను అన్‌లాక్ చేయడానికి స్కాన్ చేయండి

Toll Free Number: 1800 266 0018

INDIA'S FIRST 5 YEAR WARRANTY* *Conditions apply

$అదనపు క్యాష్ డిస్కౌంట్ Flipkart

Hero MotoCorp Ltd. Regd. Office: The Grand Plaza, Plot No.2, Nelson Mandela Road, Vasant Kunj Phase - II, New Delhi - 110070, India. | CIN: L35911DL1984PLC017354 | For further information, contact your nearest Hero MotoCorp authorised outlet or CALL TOLL-FREE 1800 266 0018 or visit us on www.heromotocorp.com. Amount may vary for model/variant and states and it is applicable on select models only. Accessories and features shown may not be a part of standard fitment. Always wear a helmet while riding a two-wheeler. #Offers will be communicated at the time of invoicing and may vary for model/variant and states, valid on invoicing between 3rd Oct'24 to 12th Oct'24 or till stock last, For more details, please visit your nearest authorised Hero outlet. ~The 5% cashback upto ₹5000/- is applicable on minimum transaction of ₹40,000, subject to the credit card company's, T&Cs. ^Finance offer is at the sole discretion of the Financier, subject to its respective T&Cs. Available at select dealerships. *Offer is valid only on paid bookings with a minimum amount of ₹1100 before 2nd Oct' 24,T&C apply. $Flipkart offer is subject to the sole discretion & T&Cs of Flipkart.

AUTHORISED DEALERS – Hyderabad: Geetha Hero, Suchitra: Ph: 9289923134. Taduband Ph : 9515408055. Sri Lakshmi Hero, Malakpet: Ph: 9289922155. Saroornagar: Ph: 9246223479, Vanasthalipuram: 9246223423. Bhanu Hero, Erragadda: Ph: 9289922148. Kukatpally: Ph: 9392525886. Miyapur: 9392525885. Phoenix Hero, Habsiguda: Ph: 9289922515.Ramanthapur: Ph: 9246394475. Nagole: Ph: 9246394476. Kushaiguda: Ph: 9246824193. Dealwel Hero, Nampally: Ph: 9289922827. Asifnagar: Ph: 7013367531. Narsingi: Ph: 8712314565, Bibinagar: 7993119099, Attapur: 7995852452 . Sri Venkanna Hero, Patancheru: Ph: 9289922150. Serilingampally: Ph :9640515185. Sowjanya Hero, Bahadurpura: Ph: 9289923133. Phoenix Hero, Hi-tech City: Ph: 9289922759. Hafeezpet: Ph: 7799017976, ToliChowki: Ph: 7799960345. Chandanagar: Ph: 9100189997. Krishna Sai Hero, Malkajgiri: Ph: 9289922972. Lakshmi Hero, Somajiguda: Ph: 9289922147. Venkateshwara Hero, Narayanguda: Ph: 9289922145, 7799884320, Pragnapur: 8886642271. Prudhvi Hero, Sangareddy Ph: 9821697396 Associate Dealer: MEDAK: PH:93468 48532. CHINTAL: PH: 9246562269. HAYATNAGAR : PH:92465 55683, IBBRAHIMPATNAM: PH:9703394833. KPHB: PH:9246566605. MEDCHAL: PH:9949881116. SEETHAFALMANDI: PH:9848868671. SHAMSHABAD: PH:7893812758. TURKAYAMZAL: PH:9014250111. ZAHEERABAD: PH:9440953602. BALAPUR: PH: 7396284446 KOTHUR: PH:9989660055. SHADNAGAR:PH:9849408227. MANIKONDA: 9453912345 MALLAPUR: 9849362062 Also Available at: CHEGUNTA: PH:8019134280. DUBBAK: PH:9866663089. JOGIPET: PH:9849417030. NARAYANKHED: PH:8019134280. NARSAPUR: PH:9701685551. RAMAYAMPET: PH:9912475028. SADASIVPET: PH:9395383939. VANTIMAMIDI: PH:7659084449. ALWAL: PH:8019011555. BACHUPALLY: PH:9505268989. CHEVELLA: PH:9550024062. GACHIBOWLI: PH:7799238866. GHATKESAR: PH:9866825296. JAGDEVPUR: PH:9346072111. KANDUKUR X ROAD: PH:9290874477. KATTEDAN: PH:8790467659. KUKNURPALLE: PH:9912433300. KULKACHERLA: PH:9866594434. MAJIDPUR: PH:9440249174. MALL: PH:7729991772. MEDIPALLY: PH: 9951128704. MOINABAD: PH:9966492929. NAGARAM: PH: 9391043316. PARIGI: PH:9603773334. SHANKERPALLY: Vaishno Motors- PH:9849095545. TANDUR: PH:9701942955. THUKKUGUDA: PH:9014250111. THUMKUNTA: PH:9440028414. VIKARABAD: PH:9966213333.

FCB.INTERFACE/6878/SEP2024/TEL

ఈనాడు

పశ్చిమాసియా తెప్పరిల్లేదెన్నడు?

తనపై ఆకస్మికంగా విరుచుకుపడిన హమాస్ అంతమే లక్ష్యంగా గాజాపై దండెత్తిన ఇజ్రాయెల్- కొద్దినెలలుగా అక్కడ ఊహింపనలవికాని వినాశనం సృష్టిస్తోంది. ఆ జాతిహననానికి ప్రతిగా ఇరాన్ దన్ను కలిగిన హెజ్‌బొల్లా ఉగ్ర సంస్థ దక్షిణ లెబనాన్ నుంచి ఉత్తర ఇజ్రాయెల్‌పై దాడి చేస్తోంది. ఇప్పటిదాకా అది ఎనిమిదివేల రాకెట్లను ప్రయోగించింది. వాటిని తిప్పికొట్టడమే కాదు, ప్రతి దాడులతో ఇజ్రాయెల్ చెలరేగిపోతుండటంతో సరిహద్దు ప్రాంతాల్లో లక్షల మంది నిర్వాసితులయ్యారు. మొన్న జులైలో హెజ్‌బొల్లా రాకెట్ దాడిలో చిన్నారులు, యువత మరణించడం టెల్‌అవీవ్‌కు తీవ్ర ఆగ్రహం కలిగించింది. అదే నెలలో ఆ సంస్థ సైనిక కమాండర్ ఫాద్ షుక్రను బీరుట్‌లో మట్టుపెట్టిన ఇజ్రాయెల్- ఆ తరవాతి నుంచి వైరివర్గానికి చెందిన కమాండర్లను పదుల సంఖ్యలో హతమార్చింది. హెజ్‌బొల్లా స్థావరాలపై బాంబులు గుమ్మరిస్తోంది. పేజర్లు, వాకీటాకీల పేలుళ్లతో కొద్దిరోజుల క్రితం లెబనాన్‌లో కనీవినీ ఎరగని విధ్వంసానికి పాల్పడింది. తాజాగా హెజ్‌బొల్లా అధినేత షేక్ హసన్ నస్రల్లాను ఇజ్రాయెల్ చంపేయడంతో పశ్చిమాసియా సంక్షోభం తీవ్రతరమై ప్రాంతీయ యుద్ధంగా పరిణమించనుందన్న భయాందోళనలు రేగుతున్నాయి!

హెజ్‌బొల్లా పుట్టుకలోనే ఇజ్రాయెల్‌పై కసి ఉంది. పాలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్ (పీఎల్‌వో) నిర్మూలనే లక్ష్యంగా లెబనాన్‌లో ఇజ్రాయెలీ బలగాలు కాలూనిన పర్యవసానంగా నాలుగు దశాబ్దాల కిందట ఆ సంస్థ ఆవిర్భవించింది. రెండు ప్రధాన యుద్ధాల్లో టెల్‌అవీవ్ తోకముడవడంలో హెజ్‌బొల్లా క్రియాశీలకంగా వ్యవహరించింది. అప్పటి నుంచి ఇజ్రాయెల్‌కు అది బద్ధశత్రువయ్యింది. తాను ప్రాంతీయ శక్తిగా ఎదగడం వెనక కీలక పాత్ర పోషించిన హెజ్‌బొల్లాకు ఆది నుంచి ఇరాన్ అన్ని రకాలుగా మద్దతునిస్తోంది. దాంతో లెబనాన్‌లో అది ప్రబల శక్తిగా అవతరించింది. హెజ్‌బొల్లా దగ్గర రెండు లక్షల దాకా రాకెట్లు పోగుపడ్డాయి. తమ అధినేత హత్యకు ప్రతీకారం తప్పదని హెజ్‌బొల్లా మూకలు ఇప్పటికే ప్రతినపూనాయి. హమాస్ రాజకీయ నేత ఇస్మాయిల్ హనియెను టెహరాన్‌లో చంపేయడంపై ఇరాన్ గుర్రుగా ఉంది. అందుకు తగిన శాస్తి తప్పదని టెల్‌అవీవ్‌ను అది హెచ్చరిస్తోంది. యెమెన్, సిరియాల్లోనూ నస్రల్లాకు అనుకూల వర్గాలు ఉన్నాయి. అవన్నీ కలిసి ఇజ్రాయెల్‌పై కదనానికి కాలుదువ్వితే అమెరికా సైతం రంగంలోకి దిగాల్సి వస్తుంది. ఫలితంగా పశ్చిమాసియా పరిస్థితి పెనం పైనుంచి పొయ్యిలో పడినట్లవుతుంది!

గాజాలో ఇజ్రాయెల్ దమనకాండ మూలంగా ఇప్పటిదాకా నలభై వేలమందికి పైగా పాలస్తీనీయులు ప్రాణాలు కోల్పోయారు. లెబనాన్‌పై దాడుల్లోనూ వందల మంది మృత్యువాత పడ్డారు. గాజాలో మారణహోమాన్ని వ్యతిరేకిస్తూ యెమెన్ నుంచి హూతీలు ఎర్ర సముద్రంలో వాణిజ్య నౌకలపై దాడులకు దిగుతున్నారు. వాటిని తప్పించుకోవడానికి నౌకలు చుట్టూ తిరిగి రావడంతో రవాణా ఖర్చులు పెరిగి పలుచోట్ల ద్రవ్యోల్బణం విజృంభించింది. జీడీపీలో 20 శాతాన్ని యుద్ధాలకే వెచ్చిస్తున్న ఇజ్రాయెల్‌ను ఇప్పటికే ఆర్థిక ఇక్కట్లు చుట్టుముట్టాయి. పర్యటకం దెబ్బతిని, చిన్న వ్యాపారాలు మూతపడి జన జీవితాలు కడగండ్ల పాలయ్యాయి. కాల్పుల విరమణకు మోకాలడ్డటం, హమాస్ చెరలోని బందీలను విడిపించకపోవడంపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు మీద సొంత దేశంలోనే నిరసనలు పెల్లుబుకుతున్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లార్చిన ఆవశ్యకతపై ప్రపంచ దేశాలు చెవినిల్లు కట్టుకుని పోరుతున్నా ఇజ్రాయెల్ లెక్కచేయడం లేదు. ఆ తెంపరితనమే పశ్చిమాసియాలో మానవతా సంక్షోభాన్ని సృష్టిస్తూ, విశ్వశాంతికి పెను ప్రమాదకరమవుతోంది!

మరమ్మతు... మన హక్కు!

'మరమ్మతు హక్కు' (రైట్ టూ రిపేర్) పేరిట వినియోగదారుల చేతికి సరికొత్త అస్త్రం అందుబాటులోకి రానుంది! స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను సులువుగా మరమ్మతు చేయడం సాధ్యమా, కాదా తెలిపే రిపేరబులిటీ ఇండెక్స్‌తోపాటు సంబంధిత వివరాలను తయారీ సంస్థలు వెల్లడించడాన్ని తప్పనిసరి చేసే దిశగా ఇండియా అడుగులు వేస్తోంది. ఈ విధానం అమల్లోకి వస్తే కొనుగోలుదారులపై ఆర్థిక భారం తగ్గుతుంది. కొంతవరకు ఈ-వ్యర్థాల నియంత్రణ సైతం సాధ్యపడుతుంది.

మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాల వాడకం ఇప్పుడు అందరికీ తప్పనిసరి అవసరమవుతోంది. అయితే, పెద్దమొత్తం వెచ్చించి కొనుగోలు చేసిన ఉపకరణాలు త్వరగా పాడై, రిపేర్ చేయించాల్సి వస్తే- అదో అదనపు భారంగా మారుతోంది. మరమ్మతులకు ఎక్కువ ఖర్చు వద్దనుకున్నా, విడిభాగాలు లభించకపోయినా కొత్తవి కొనాల్సి వస్తోంది. దీనివల్ల వ్యయభారం పెరగడంతోపాటు, పర్యావరణానికీ హాని కలుగుతోంది. పెరిగిపోతున్న ఈ-వ్యర్థాలు కాలుష్య తీవ్రతను ఇంకా తీవ్రతరం చేస్తున్నాయి. ఎలక్ట్రానిక్ వ్యర్థాల ఉత్పత్తి భారీస్థాయిలో పెరిగిపోతే తీవ్ర దుష్పరిణామాలు తప్పవు. ఇలాంటి సమస్యలకు 'రైట్ టు రిపేర్' పరిష్కారం చూపుతోంది.

కేంద్రం కసరత్తు

ఎలక్ట్రానిక్ పరికరాలను సొంతంగా బాగు చేసుకోగల అవకాశం, శక్తి వినియోగదారులకు ఉండి తీరాలన్న వాదన నుంచి పుట్టుకొచ్చిందే 'మరమ్మతు హక్కు' ఉద్యమం. ఇప్పటికే కొన్ని దేశాల్లో కార్యరూపం దాల్చిన ఈ విధానం ప్రకారం- ఉపకరణాల తయారీ సంస్థలు కచ్చితంగా ప్రతి పరికరానికి రిపేరబులిటీ ఇండెక్స్‌ను వెల్లడించాలి. అంటే, ఆ వస్తువు పాడైతే బాగు చేయడం సులువేనా? విడిభాగాలు దొరుకుతాయా? మరమ్మతులకు ఎంత ఖర్చవుతుంది? వంటి సందేహాలను తీర్చాల్సి ఉంటుంది. దీనివల్ల స్మార్ట్‌ఫోన్ లేదా డివైజ్‌ను కొనాలా, వద్దా అని నిర్ణయించుకునే అవకాశం వినియోగదారులకు లభిస్తుంది. ఏసీలు, రిఫ్రిజిరేటర్ల విద్యుత్ ఆదా సామర్థ్యాన్ని తెలిపే స్టార్ రేటింగ్ తరహాలోనే మరమ్మతు సాధ్యతా సూచీ పనిచేస్తుంది. ఈ సూచీని అందుబాటులోకి తెచ్చేందుకు భారత్ ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ 'రైట్ టు రిపేర్ ఇండియా' పేరిట ఇప్పటికే ఓ పోర్టల్‌ను ప్రారంభించింది. నిత్యజీవితంలో భాగమైన వస్తువుల మరమ్మతులకు అవసరమయ్యే సమగ్ర సమాచారాన్ని ఒకేచోట అందించాలన్నదే ఈ పోర్టల్ లక్ష్యం. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ డిస్‌ప్లేలు, డేటా స్టోరేజ్ పరికరాలు, ఏసీలు, ఫ్రిజ్‌ల వంటి వినియోగ వస్తువులతోపాటు వ్యవసాయ పరికరాలు, వాహన రంగాలకు సంబంధించిన 66 సంస్థలు ఇందులో నమోదయ్యాయి. తొలి దశలో స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలపై దృష్టిసారించారు. తయారీ సంస్థల ప్రతినిధులు, భాగస్వామ్య పక్షాలను ఏకతాటిపైకి తెచ్చేందుకు ఇటీవల జాతీయ స్థాయిలో ఓ వర్క్‌షాప్ నిర్వహించారు. మరమ్మతు సాధ్యతా సూచీని లెక్కించేందుకు ఏ అంశాలను ప్రామాణికంగా తీసుకోవాలన్న దానిపై కసరత్తు మొదలైంది. ఇందుకోసం కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి భరత్ ఖేడా నేతృత్వంలో నిపుణుల కమిటీని ఏర్పాటు చేశారు. రిపేరుకు అవసరమయ్యే టెక్నికల్ గైడ్, పనిముట్లు, విడిభాగాల ఖరీదు, లభ్యత వివరాలతోపాటు ఎంతమేర డబ్బులు, శ్రమ వెచ్చించాల్సి వస్తుందనే విషయాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం ఈ కమిటీ బాధ్యత.

సవాళ్లు సైతం...

ఈ విధానంతో సామాన్యులకు, పర్యావరణానికి మేలు కలుగుతున్నా కొన్ని ప్రతికూలతలూ లేకపోలేదు. మరమ్మతుల కోసం థర్డ్-పార్టీకి అవకాశం కల్పిస్తే- భద్రత, మేధోసంపత్తి హక్కులు, నాణ్యత విషయంలో సమస్యలు వస్తాయని యాపిల్, మైక్రోసాఫ్ట్, టెస్లా వంటి సంస్థలు వాదిస్తున్నాయి. మరో సమస్య- డిజైన్. ప్రస్తుతం టెక్ ఉపకరణాలన్నీ సాధ్యమైనంత చిన్నగా, నాజూగ్గా ఉండేలా తయారీ సంస్థలు ప్రయత్నిస్తున్నాయి. అయితే, ఎవరైనా రిపేర్ చేసుకునే వీలు కల్పించాలంటే డిజైన్, సామర్థ్యం విషయంలో రాజీ పడాల్సి వస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సృజనకు విఘాతం కలుగనుండటం మరో ముఖ్య సవాలు. టెక్ సంస్థలన్నీ అమ్మకాలు పెంచుకునేందుకు ఎప్పటికప్పుడు అధునాతన ఫీచర్లతో సరికొత్త ఉపకరణాలను తీసుకొస్తున్నాయి. ఇందుకోసం పరిశోధనలపై భారీగా

అనేక దేశాల్లో...

మోటారు వాహనాలను సొంతంగా మరమ్మతు చేసుకునేందుకు యజమానులకు అవసరమైన సమాచారాన్ని ఉత్పత్తిదారులు అందుబాటులో ఉంచడాన్ని తప్పనిసరి చేస్తూ 2012లో అమెరికా చట్టం చేసింది. రైట్ టు రిపేర్ ఉద్యమానికి అదే నాంది పలికింది. అనేక దేశాల్లో ఏళ్ల తరబడి విస్తృత చర్చ జరిగింది. డిజిటల్ పరికరాలకు రైట్ టు రిపేర్‌ను వర్తింప చేస్తూ 2019లో ఐరోపా సమాఖ్య నిబంధనావళిని తీసుకొచ్చింది. తరవాత ఫ్రాన్స్ కీలక అడుగు వేసింది. స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, టీవీలు, వాషింగ్ మెషీన్లు, లాన్ మోవర్లు- వంటి అయిదు రకాల పరికరాలకు 2021 జనవరి 1న రిపేరబులిటీ ఇండెక్స్‌ను అమల్లోకి తెచ్చింది. నిర్దేశిత ప్రమాణాల ప్రకారం ఒక్కో డివైజ్ స్కోరును తయారీ సంస్థలు లెక్కించి, అమ్మకాల సమయంలోనే వెల్లడించాలని ఆ దేశం నిర్దేశించింది. అదే ఏడాదిలో యూకే కూడా నిబంధనలు రూపొందించింది. వినియోగదారులు తమ సొంత పరికరాలను రిపేర్ చేసుకునేందుకు అడ్డంకిగా ఉన్న సాఫ్ట్‌వేర్ ఆంక్షలను తొలగించాలని, అవసరమైన పనిముట్లను సమకూర్చాలని తయారీదారులను ఆదేశ్ముూ అమెరికా 2022లో చట్టం చేసింది.

వెచ్చిస్తున్నాయి. వినియోగదారులు సొంతంగా మరమ్మతులు చేసుకుని, పాత డివైజ్‌లనే వాడుతూ ఉంటే- అమ్మకాలు పడిపోయి, కొత్త సాంకేతికతల ఆవిష్కరణ నెమ్మదించే ప్రమాదముందన్న చర్చ సాగుతోంది. పరిశోధనకు ప్రాధాన్యమిచ్చే సంస్థలకు పన్ను రాయితీలు, ఇతర ప్రోత్సాహకాలు ఇవ్వడం ఓ మార్గం. ఇలాంటి కొన్ని సంక్లిష్టతలతో కూడుకున్న 'మరమ్మతు హక్కు'ను ప్రజల చేతికి అందించేందుకు ప్రభుత్వం ఎలాంటి వ్యూహం అనుసరిస్తుందో వేచిచూడాలి.

– జీఎస్ఎన్ చౌదరి

మనిషిని కాపాడుకుందాం!

రోడ్డు దాటుతున్న బుజ్జి కుక్కపిల్లను ఢీకొట్టి వేగంగా వెళ్లిపోయిందో బండి. కాలికి తీవ్రగాయం కావడంతో అది విలవిల్లాడుతోంది. అప్పుడే స్కూల్ నుంచి వస్తున్న పిల్లాడు దాని ఆక్రందన చూసి పరుగున వెళ్లి చేతుల్లోకి తీసుకున్నాడు. తనకే దెబ్బ తగిలినంతగా బాధపడ్డాడు. దాని గాయానికి మందుపూసి కట్టుకడదామని ఇంటికి తీసుకొచ్చాడు. గేటు దగ్గరే పిల్లాడి చేతిలో కుక్కపిల్లను చూసిన తల్లి 'ఛీ... ఆ మురికిదాన్ని ఎత్తుకుని డ్రెస్ అంతా పాడుచేసుకున్నావ్. దాన్ని బయట పడేసి రా...' అని కోప్పడటంతో బిక్కమొహం వేశాడు. చేసిన తప్పేంటో తెలియని ఆ పసి హృదయం గాయపడింది. అప్పటి నుంచి కుక్కే కాదు... మనుషులు గాయపడినా చూస్తూ వెళ్లిపోతున్నాడే తప్ప స్పందించడం మానేశాడు. వయసుతో పాటు ఆ జడత్వమూ పెరిగింది. మంచి ఉద్యోగస్తుడయ్యాడు కానీ... మనిషిగా మానవత్వానికి దూరమయ్యాడు.

మనిషి సంఘజీవి. మట్టూ జరిగే పరిణామాలను నిశితంగా గమనించడం, అవసరమైన వాటికి స్పందించడం సామాజిక ధర్మం. లేదంటే మానవత్వం మరుగున పడుతుంది. నేనూ, నా అన్న స్వార్థం పెరుగుతుంది. గిరిగీసుకుని బతుకుతారు. మాటల మార్పిడి తగ్గుతుంది. బంధాలు తెగి అనుబంధాలు దూరమవుతాయి. సంఘం మాయమై వ్యక్తులే మిగులుతారు. అది పలు విపరిణామాలకు, సామాజిక అంతరాలకు దారితీస్తుంది. ఆ పరిస్థితి రాకూడదంటే 'పరస్పర సహకార' భావన పెంపొందాలి. ఈ విషయంలో ప్రకృతే మనకు స్ఫూర్తి. చిరుగాలి తాకిడికి మేఘం వర్షిస్తే... ఆ చినుకు స్పర్శకు ప్రాణం లేని విత్తు జీవం పోసుకుంటుంది. మొక్కగా పెరిగి పూలూ పండ్లూ అందిస్తుంది. చెట్టుగా ఎదిగి గాలీ నీడా ఇస్తుంది. మనలోనూ అంతే 'సామాజిక బాధ్యత' అన్న విత్తనాన్ని మొలకెత్తించగలిగితే... 'పరోపకారం' అన్న భావన వృద్ధి చెందుతుంది. కష్టంలో ఉన్నవారికి అండగా నిలిచేలా చేస్తుంది.

మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం బొజ్జన్నపేట గ్రామంలో ఒక కుటుంబం. ప్రసవించిన పద్దెనిమిది రోజులకే తల్లి బ్రెయిన్ ట్యూమర్‌తో కన్నుమూసింది. అప్పటికే రెండున్నరేళ్ల కుమార్తె ఉంది. పిల్లలకు కడుపునిండా తిండి పెట్టలేని దుస్థితి ఆ తండ్రిది. గట్టిగా గాలొస్తే కూలిపోయేలా ఉన్న పూరిపాకలో బతుకీడుస్తున్న నాన్నమ్మ, తాతయ్యలపై చిన్నారుల పోషణ భారం పడింది. ఆ విషయాన్ని ఓ యువకుడు గమనించాడు. వారి దయనీయ పరిస్థితిని వివరిస్తూ సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టాడు. అది చదివి మరెన్నో మంచి మనసులు స్పందించాయి. తలో చేయీ వేశాయి. మొత్తం రూ.21 లక్షలు పోగయ్యాయి. ఆ పిల్లల భవిష్యత్తుకు భరోసా లభించింది. తోటివారి కన్నీళ్లను తుడిచే అలాంటి చేతులే ఇప్పుడు కావాలి!

– విక్రమ పార్థసారథి

జీవితం చాలా చిన్నది... ప్రేమించడానికి, స్నేహితులను సంపాదించుకోవడానికి సమయం తక్కువ ఉంది. ఊరికే ఎవరితో గొడవ పడకండి. ఎవరి ఇష్టాయిష్టాలు, ఆలోచనలు వారికుంటాయి. ఫీఫరెన్స్ ఆఫ్ ఒపీనియన్‌ను గౌరవించాలి.

– హృషీకేష్ ముఖర్జీ,
దాదాసాహెబ్ ఫాల్కే పురస్కార గ్రహీత

మనశ్శాంతి కోసం... జపం

అంతర్యామిని తెలుసుకునే మార్గాల్లో జపం సులభమైంది. స్థూలంగా చెప్పాలంటే జపం అంటే నిరంతర స్మరణే. జపం చేయడం వల్ల నిలకడలేమితనం తగ్గి మనశ్శాంతి లభిస్తుంది.

కాల్చడం.. అగ్ని సహజ స్వభావం. అలాగే, సాధకుడి లోపాలను పూర్తిగా నశింపచేసి పరమానంద స్థితిని ప్రసాదించే లక్షణం జపానికి ఉంది. 'కష్టం చేసేవాడికి కరవు లేదు. జపం చేసేవారికి పాపం అంటదు. మౌనధారికి కలహాలు ఉండవు. జాగ్రత్తగా ఉండేవారికి భయం ఉండదు' అని చెప్పారు పెద్దలు.

వాచికం, ఉపాంశు, మానసికం అని జపం మూడు రకాలు. బయటకు వినిపించేలా భగవంతుణ్ని స్మరిస్తే దాన్ని 'వాచికం' అంటారు. శబ్దాలేవీ బయటకు రాకుండా కేవలం పెదవులు కదుపుతూ చేసే జపాన్ని 'ఉపాంశు'గా పిలుస్తారు. మౌనంగా మనసు లోపలే చేసే జపం 'మానసికం'. ఏదైనా భగవన్నామాన్ని, మంత్రాన్ని పదేపదే స్మరించడమే 'జపం'. మనసుకు ఏకాగ్రత కలిగించడానికి నిర్దేశించిన అభ్యాసంగా దీన్ని యోగశాస్త్రం చెబుతోంది. నిరంతరాయమైన ఏకాగ్రత ధ్యానానికి దారిచూపుతుంది.



నిత్య కర్మలు చేసుకునే సమయంలో, నడుస్తున్నప్పుడు, ప్రయాణంలో ఉన్నప్పుడు, విశ్రాంతిగా కూర్చున్నప్పుడు... ఇలా సమయం చిక్కినప్పుడల్లా పంచాక్షరీ, అష్టాక్షరీ మంత్రాలను పలకడం నిత్య జీవితంలో ఒక భాగం చేసుకోవాలి. అంత పెద్ద మంత్రం పలికే అవకాశం లేకపోతే... 'శివా, శంకర, నారాయణ, మాధవ, ఓం' లాంటి సూక్ష్మ పదాలనైనా పలకవచ్చు. మనసులో ఎప్పుడే చెడు ఆలోచనలు వచ్చినా- ఆ సమయంలో భగవంతుడి నామాలను జపించడం వల్ల దృష్టి మంచివైపు మరలుతుంది. ఈ వైఖరి వల్ల తప్పు పని జరగకుండా అడ్డుకట్ట పడుతుంది. ఫలితంగా క్రమేపీ ఇహలోక ఆకర్షణలకు, రాగద్వేషాలకు దూరంగా జరుగుతూంటారు.

'ఉపాంశు' సూక్ష్మమైంది, శక్తిమంతమైంది. ఒక మంత్రం లేదా దేవత పేరును నిశ్శబ్దంగా మననం చేసే అభ్యాసమిది. ఉపాంశు అనేది సంస్కృత పదం. దీనికి తెలుగు అర్థం గొణగడం అని. అంటే తక్కువ స్వరంతో మంత్రాన్ని చాలా మృదువుగా ఉచ్చరించడం. సాధకుడి చెవులు మాత్రమే ఆ శబ్దాన్ని వినగలవు. దీనివల్ల సదాచారం, సద్బుద్ధి, పరోపకార గుణం... మొదలైన ప్రయోజనాలు కలిగి అంతర్ముఖులవుతారు.

వాచకం, ఉపాంశులకన్నా చాలా ఉత్తమమైంది మానస జపం. ఇందులో ఇష్టదేవతా నామాన్ని లేక మంత్రాన్ని మనసులోనే జపిస్తూంటే ఏకాగ్రత పెరుగుతుంది. తన్మయత్వం కలుగుతుంది. ఇది ఆ దేవత అనుగ్రహానికి కారణమవుతుంది. ఫలితంగా నిష్కామ బుద్ధి పెరుగుతుంది. ఇహలోక బంధాలపట్ల వ్యామోహం పోతుంది. తద్వారా జ్ఞాననిష్ఠ లభిస్తుంది.

జపం చేయడానికి ప్రత్యేక నియమాలు లేవు. కుదిరితే ధ్యాన భంగిమలో కూర్చోవచ్చు. వీలుకాని పరిస్థితుల్లో ఇతర కార్యకలాపాలు చేస్తున్నప్పుడు, సామూహికంగా పూజలు చేసేటప్పుడు, ఇంకా మనసుకు నచ్చిన సమయంలో ఎప్పుడైనా జపం చేయవచ్చు.

– కె.వి.ఎస్.ఎస్.శారద

ప్రాంతీయ పార్టీలపై ప్రభావమెంత?

ఆగని ప్రమాదాలు

దేశీయంగా ఇటీవల తరచూ రైలు ప్రమాదాలు చోటుచేసుకుంటుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. 2004-05 నుంచి 2013-14 మధ్యలో ఇండియాలో 171 రైలు ప్రమాదాలు సంభవించాయి. వాటిలో 904 మంది ప్రాణాలు కోల్పోయారు. 3,155 మంది గాయపడ్డారు. 2015-16 నుంచి 2023-24 మధ్యలో 678 రైలు ప్రమాదాల్లో 748 మంది మరణించారు. 2087 మంది గాయపడ్డారు. గడచిన ఆరు సంవత్సరాల్లో చోటుచేసుకున్న రైలు ప్రమాదాలు...

సంవత్సరం	రైలు ప్రమాదాలు
2018–19	59
2019–20	55
2020–21	22
2021–22	35
2022–23	48
2023–24	40

(ఆధారం: కేంద్ర ప్రభుత్వ గణాంకాలు)

ఒకే దేశం-ఒకేసారి ఎన్నికల విధానాన్ని తీసుకొస్తామని భాజపా తన ఎన్నికల ప్రణాళికలో వాగ్దానం చేసింది. దాన్ని నెరవేర్చడానికి పూర్వ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్యక్షతన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటుచేసింది ప్రపంచ వ్యాప్తంగా ఉత్తమ ఎన్నికల రీతులను ఆ కమిటీ అధ్యయనం చేసింది. ఎన్నికల సంఘంతోపాటు పలు రాజకీయ పార్టీలు, ఆర్థికవేత్తలు ఇతర నిపుణులను సంప్రదించింది. ఏకకాలంలో పార్లమెంటు, అసెంబ్లీ, స్థానిక సంస్థలకు జమిలి ఎన్నికలు నిర్వహించవచ్చంటూ నివేదిక సమర్పించింది. కోవింద్ కమిటీ నివేదికను కేంద్ర మంత్రివర్గం ఇటీవల ఆమోదించింది.

ఒకే దేశం- ఒకే ఎన్నికల విధానంపై దేశవ్యాప్తంగా మరోసారి చర్చ మొదలైంది. అధికార, విపక్షాలు, ఇతరులు ఎవరి వాదన వారు వినిపిస్తున్నారు. జమిలి ఎన్నికలకు సంబంధించి తాజా పరిణామాలతో అందులోని సాధకబాధకాలను తరచిచూడాల్సి ఉంది.

జాతీయ సమస్యలకే ప్రాధాన్యం

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకలలో బలమైన ప్రాంతీయ పార్టీలు ఉన్న నేపథ్యంలో దక్షిణభారతంలో జమిలి ఎన్నికల ప్రభావం ఎలా ఉంటుందనే తర్జనభర్జన మొదలైంది. స్థానిక సమస్యల పరిష్కారానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే ప్రాంతీయ పార్టీల వల్ల దక్షిణ భారత రాజకీయాలు ఉత్తర భారతంకన్నా భిన్నంగా, విలక్షణంగా ఉంటాయి. జమిలి ఎన్నికలనగానే ప్రాంతీయ సమస్యలకన్నా జాతీయ సమస్యలే అధికంగా చర్చలోకి సంతరించుకుంటాయి. ప్రాంతీయ అస్తిత్వం, భాష, స్థానిక అభివృద్ధికి సంబంధించిన అంశాలు జాతీయ స్థాయి వాదోపవాదాల్లో మరుగునపడవచ్చు. తమిళ భాషా సంస్కృతులకు, ప్రాంతీయ స్వయం నిర్ణయాధికారానికి పట్టంకట్టే ద్రావిడ పార్టీలకు తమ అజెండాలనూ, ప్రత్యేకతలనూ కాపాడుకోవడం సవాలుగా పరిణమించవచ్చు. రాష్ట్రస్థాయి సమస్యలు వెనకబడవచ్చు. ఇది జాతీయ పార్టీలకు ప్రయోజనకరంగా పరిణమించి ప్రాంతీయ పార్టీలను దెబ్బతీసే అవకాశం లేకపోలేదు. దీంతో కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీలు దక్షిణాదిన ప్రాబల్యం విస్తరించుకోవడానికి అనుకూల వాతావరణం ఏర్పడవచ్చు. జమిలి ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలు అటు రాష్ట్ర సమస్యలపైన, ఇటు జాతీయ అంశాలపైన తమ విధానాలను సమన్వయ పరచుకోవాల్సి ఉంటుంది. జోడు గుర్రాల మీద సవారీలా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించాల్సి వస్తుంది. అదంతా జటిలమైన వ్యవహారమే!

నిర్వహణ వ్యయం

జమిలి ఎన్నికల వల్ల ప్రయోజనాలు అనేకం ఉన్నాయని వాటిని సమర్థించే వర్గాలు వాదిస్తున్నాయి. పార్టీలకు ప్రచార ఖర్చులు, ఎన్నికల సంఘానికి నిర్వహణ వ్యయం తగ్గుతాయని చెబుతున్నారు. పరిపాలనా సామర్థ్యం పెరిగి, దేశమంతటికీ వర్తించే స్థిరమైన విధానాలు ముందుకొస్తాయన్నది జమిలి సమర్థకుల అభిప్రాయం. ఒకే దేశం- ఒకే ఎన్నికల విధానం సాధ్యాసాధ్యాల విషయంలో కోవింద్ కమిటీ కొన్ని సిఫార్సులు చేసింది. శాసనసభల పదవీ కాలాన్ని పొడిగించి కానీ, కుదించికానీ అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు పార్లమెంటుతోపాటే ఎన్నికలు జరిపించాలని సూచించింది. దీనికోసం 83, 85, 172, 174 రాజ్యాంగ అధికరణలను సవరించాలని పేర్కొంది.

దక్షిణ భారత రాష్ట్రాలు మొదటి నుంచీ రాష్ట్రాలకు మరింత స్వయంనిర్ణయాధికారం ఉండాలని పట్టుబడుతున్నాయి. సమాఖ్య స్ఫూర్తిని మరింతగా ఇనుమడింపజేయాలని డిమాండ్ చేస్తున్నాయి. పరిపాలనలో ప్రాంతీయ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నది వాటి విధానం. కొన్ని దక్షిణాది రాష్ట్రాలు తమకే ప్రత్యేకమైన సంక్షేమ విధానాలను అనుసరిస్తున్నాయి. స్థానిక ప్రజల అవసరాలను తీర్చేవిధంగా ప్రణాళికలను రూపొందించి, అమలు చేస్తున్నాయి. జమిలి ఎన్నికల్లో ఈ విధానాల కన్నా జాతీయ సమస్యలకే ఎక్కువ ప్రచారం లభించే అవకాశం ఉంది. సమాఖ్య వ్యవస్థ బలహీనపడి జాతీయ పార్టీలపై ఆధారపడే కేంద్రీకృత పాలనా వ్యవస్థ బలపడవచ్చనే ఆందోళనలు లేకపోలేదు. జమిలి ఎన్నికలు ఆయా రాష్ట్రాలకు సంబంధించిన ప్రత్యేక అంశాలను పలుచన చేయవచ్చు. ప్రాంతీయ వ్యక్తిత్వం, ఆశయాలూ ఆకాంక్షలు నీరుగారవచ్చుననే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల దైనందిన సమస్యల పరిష్కారానికి ప్రాంతీయ పార్టీలు రాష్ట్రస్థాయి అజెండాలను ముందుకుతెస్తాయి. ఎన్నికల ప్రచారంలో స్థానిక సమస్యలనే ఎక్కువగా ప్రస్తావిస్తాయి. కాబట్టి ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్‌లో పాల్గొంటారు. జమిలి ఎన్నికల వల్ల ఓటర్లలో అదేస్థాయి ఉత్సాహం ఉంటుందా అంటే అనుమానమే.

ఆమోదం కష్టతరమే

ప్రస్తుతం లోక్‌సభలో పాలక పార్టీకి స్పష్టమైన మెజారిటీ లేదు. ప్రాంతీయ పార్టీలు ఈ ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నాయి. కాబట్టి జమిలి ప్రతిపాదనకు లోక్‌సభలో మూడింట రెండొంతులమంది సభ్యుల ఆమోదం పొందడం కష్టతరమే. ఒకేసారి లోక్‌సభ, అన్ని శాసనసభలకు ఎన్నికలు జరిపించడమనేది ఎన్నికల సంఘానికి ఎంతో వ్యయప్రయాసలతో కూడుకున్న వ్యవహారమవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో జమిలి ఎన్నికలకు కోవింద్ కమిటీ రోడ్ మ్యాప్ తయారు చేసినా, అది ఇప్పట్లో ఆచరణలోకి రావడం కష్టమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

– పూల దేవేంద్ర
పరిశోధకులు, 'సెన్'

రంగురంగుల కోతి

పురుషులందు పుణ్యపురుషులు వేరయా అన్నట్లు.. కోతులందు ఈ రెడ్ షాంక్డ్ డౌక్‌లు వేరు! రంగురంగులతో చూడ్డానికి భలే తమాషాగా ఉన్న ఈ కోతులు లావోస్, వియత్నాం, కంబోడియాలో కనిపిస్తాయి. వీటిలో మళ్లీ మూడు ఉప జాతులున్నాయి. ఇవి ఆకులు, పండ్లు, మొగ్గలు, పువ్వులు, విత్తనాలు, వెదురు రెమ్మలను ఆహారంగా తీసుకుంటాయి. కోతులు అనగానే మనకు అవి చేసే అల్లరి చేష్టలు గుర్తుకు వస్తాయి కదా! కానీ.. వీటికి కాస్త క్రమశిక్షణ ఎక్కువే.

తిండి విషయంలో మిగతా కోతుల్లా ఇవి గొడవ పడవు. వాటికి దొరికిన ఆహారాన్ని ఎంచక్కా బుద్ధిగా పంచుకుంటాయి. పండ్లను ముక్కులుగా విరిచి మరీ ఒకదానికి మరోటి ఇచ్చి పుచ్చుకుంటాయి. ఈ జాతిలో మగ

బీహెచ్‌ఈఎల్ నుంచి ఓఆర్ఆర్ మీదుగా విజయవాడకు గరుడ బస్సులు

బేగంబజార్, రామచంద్రాపురం, న్యూస్‌టుడే: పటాన్‌చెరు, బీహెచ్‌ఈఎల్, రామచంద్రాపురం ఓఆర్ఆర్ మీదుగా విజయవాడకు రెండు కొత్త గరుడ బస్సులను ఏర్పాటు చేసినట్లు టీఎస్ఆర్టీసీ రంగారెడ్డి రీజినల్ మేనేజర్ శ్రీలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఎండీ వీసీ సజ్జనార్ చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రెండు బస్సు సర్వీసులు రాంచంద్రాపురం, బీహెచ్‌ఈఎల్, బీరంగూడ, చందానగర్, మియాపూర్, నిజాంపేట క్రాస్ రోడ్డు, హౌసింగ్‌బోర్డు మీదుగా జేఎన్‌టీయూ, రైతుబజార్, మలేషియన్ టౌన్‌షిప్, మై హోమ్ భుజా, సైబరాబాద్ కమిషనరేట్, టెలికాంనగర్ తదితర ప్రాంతాల మీదుగా ఓఆర్ఆర్ నుంచి విజయవాడ బయల్దేరతాయన్నారు. ట్రాఫిక్‌కు అవరోధం కలగకుండా రోజూ రాత్రి 9.30, 10.30 గంటల నుంచి రామచంద్రాపురం నుంచి బయల్దేరతాయన్నారు. విజయవాడ వెళ్లే ప్రయాణికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఎం సూచించారు.

నృత్య కళా మహోత్సవం

బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో భారతీయ కళా మహోత్సవ్ కనులపండువగా సాగుతోంది. ఆదివారం ఈశాన్య రాష్ట్రాల సంస్కృతిని చాటేలా ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

బల్దియాకు పన్ను దన్ను

ఈనాడు, హైదరాబాద్: ఆస్తి పన్ను సవరణపై జీహెచ్ఎంసీ దృష్టి పెట్టింది. పాత ధరలతో పన్ను చెల్లిస్తున్న నిర్మాణాలు, మరో నాలుగు కేటగిరీల్లోని కట్టడాలను తొలుత లక్ష్యంగా చేసుకుంది. చదరపు అడుగుకు 60 పైసలు, 80 పైసల చొప్పున పన్ను చెల్లించే కట్టడాలకు బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు సుమోటోగా నోటీసుల జారీని ప్రారంభించారు. నాలుగు కేటగిరీల్లోని రెండు లక్షల నిర్మాణాలను సర్వే చేస్తే.. మొత్తంగా రూ.50 కోట్ల మేర ఆదాయం పెరగొచ్చని బల్దియా అంచనా.

పాత ధరలను సవరిస్తున్న జీహెచ్ఎంసీ

రూ.50 కోట్ల అదనపు ఆదాయానికి అవకాశం

తగ్గిన వసూళ్లు..

గత ఆర్థిక సంవత్సరం సెప్టెంబరుతో పోలిస్తే.. ఈ నెలలో పన్ను వసూళ్లు తగ్గుముఖం పట్టాయి. దాంతో నెల జీతాలకు అవసరమైన నిధులపై జీహెచ్ఎంసీ ఆందోళనలో పడింది. ఇటీవల మొదలైన ఓటరు సర్వేలో, ఇతరత్రా కార్యక్రమాల్లో బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు నిమగ్నమయ్యారు. సమీక్షలు జరగడం లేదని, పన్ను రాబడిని నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలున్నాయి.

- సున్నా విస్తీర్ణం
- సున్నా ఆస్తిపన్ను
- ఏడాదికి రూ.10ల పన్ను చెల్లిస్తున్న వ్యాపార కేంద్రాలు
- వాణిజ్య కేటగిరీ విద్యుత్తు కనెక్షన్లున్న భవనాలు, ఇళ్లు

వీరిపైనే దృష్టి..

వివరాల సేకరణతో ముందుకు..

పాత ధరలతో పోలిస్తే వార్షిక పన్ను 20-40శాతం మేర పెరగనుంది. ఈ ఆర్థిక సంవత్సరం పన్ను ఇప్పటికే చెల్లించిన చాలామందికి, ఇటీవల సవరణతో ఇంటి పన్ను పెరిగిన విషయం తెలియదు. అల్వాల్ సర్కిల్ పరిధిలోని జనప్రియ, ఇతరత్రా పాత అపార్ట్‌మెంట్లలోని ఇళ్లకు ఒక్కసారిగా నోటీసులివ్వడంతో స్థానికులు ఆందోళన వ్యక్తంచేశారు. విషయం కేంద్ర కార్యాలయానికి చేరడంతో, తక్కువ పన్ను చెల్లించే కేటగిరీలోని ఇళ్లకు నోటీసులు వద్దని కమిషనర్ ఆమ్రపాలి స్పష్టంచేశారు. తప్పుడు వివరాలతో, తక్కువ పన్ను చెల్లిస్తున్న నాలుగు రకాల నిర్మాణాలపై మాత్రం వెనక్కి తగ్గొద్దని, జీహెచ్ఎంసీ చట్టంలోని సెక్షన్ 213 ప్రకారం నోటీసులిచ్చి, పన్ను విలువ సవరించాలని బల్దియా నిర్ణయించింది. అందులో భాగంగా విద్యుత్తుశాఖ వద్ద ఉన్న సమాచారాన్ని తీసుకుంది. నివాస కేటగిరీలో పన్ను చెల్లిస్తున్న 50 వేల నిర్మాణాలకు వాణిజ్య కోటా విద్యుత్తు సరఫరా అవుతున్నట్లు తేలింది.

మూసాపేటలోని కాముని చెరువులో రసాయన వ్యర్థాలు పారబోస్తున్న వ్యక్తులు

పట్టిస్తే.. రూ.10 వేలు పారితోషికం

ఈనాడు, హైదరాబాద్: కాలుష్య ఉద్గారాలను, పరిశ్రమల వ్యర్థాలను జలాశయాల్లో, జనావాసాల సమీపంలో ఎవరైనా పారేస్తుంటే..వెంటనే కాలుష్య నియంత్రణ మండలి నైట్ పెట్రోలింగ్ సిబ్బందికి సమాచారం ఇవ్వండి. ఉల్లంఘనులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టిస్తే పీసీబీ రూ.10వేల పారితోషికం ఇస్తుంది. పదేళ్లుగా ఈ కార్యక్రమం అమలవుతున్నా...పౌరుల్లో కనీస అవగాహన లేదు. అధికారులూ ప్రచారం కల్పించలేదు. కాలుష్య నియంత్రణకు, ప్రధానంగా పరిశ్రమల వ్యర్థాలను జలాశయాల్లో డంపింగ్ చేయడాన్ని అడ్డుకునేందుకు పీసీబీ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కాలక్రమంలో ఇది మరుగునపడింది.

పరిశ్రమల వ్యర్థాలు డంపింగ్ చేస్తుంటే వెంటనే సమాచారమివ్వండి

నైట్ పెట్రోలింగ్ పని తీరు ఇదీ.. పీసీబీ కేంద్ర కార్యాలయం, హైదరాబాద్, ఆర్సీపురం జోన్ కార్యాలయాల పరిధిలో మూడు నైట్ పెట్రోలింగ్ వాహనాలు తిరుగుతుంటాయి. ఒక్కో వాహనంలో ఒక అనలిస్ట్, ఏఈ, ఈఈ స్థాయి అధికారులు, సెక్యూరిటీ గార్డులు ఉంటారు. ఘాటు వాసనలు వచ్చినా, డంపింగ్ చేస్తున్నట్లు సమాచారం అందిన వెంటనే వీరంతా అక్కడికి చేరుకుంటారు. జీడిమెట్ల, బాలానగర్, కాటేదాన్, మల్లాపూర్, బొల్లారం పారిశ్రామిక ప్రాంతాలను నైట్ పెట్రోలింగ్ బృందం గమనిస్తూ ఉంటుంది. అధికారులు ఇచ్చే నివేదికపై 'పీసీబీ మెంబర్ సెక్రటరీ (ఎంఎస్)' స్థాయిలో నిత్యం సమీక్ష జరుగుతుంది.

ఈ నంబర్లను సంప్రదించాలి..

కాలుష్య నియంత్రణ మండలి నైట్ పెట్రోలింగ్‌ను 98667 76755, 98667 76718 నెంబర్ల ద్వారా సంప్రదించొచ్చు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతారు. ఘాటు వాసనలు వెలువడినా, వ్యర్థాలను డంపింగ్ చేస్తున్నట్లు గమనించినా, ఫొటోలు తీసి ఆధారాలను ఇస్తే సమస్య పరిష్కారంతో పాటు పారితోషికం లభిస్తుంది.

రెండు కి.మీ.లకు ఒక మెట్రో స్టేషన్

నాగోల్- శంషాబాద్ విమానాశ్రయం (36.6 కి.మీ.– 24 స్టేషన్లు)

స్టేషన్లు: నాగోల్ (ఎయిర్‌పోర్ట్), నాగోల్ ఎక్స్‌రోడ్, అల్కాపురి కూడలి, కామినేని ఆసుపత్రి, ఎల్బీనగర్ (ఎయిర్‌పోర్ట్), బైరామల్‌గూడ, మైత్రీనగర్, కర్మన్‌ఘాట్, చంపాపేట రోడ్, ఒవైసీ ఆసుపత్రి, డీఆర్‌డీవో, బాలాపూర్ రోడ్, చాంద్రాయణగుట్ట(జంక్షన్), బండ్లగూడ రోడ్, మైలార్‌దేవ్‌పల్లి, కాటేదాన్, ఆరాంఘర్, న్యూహైకోర్ట్, గగన్‌పహాడ్, సాతంరాయి, సిద్ధాంతి, శంషాబాద్, కార్గో, విమానాశ్రయం

రాయదుర్గం - కోకాపేట నియోపాలిస్ (11.6 కి.మీ– 10 స్టేషన్లు)

స్టేషన్లు: బయోడైవర్సిటీ కూడలి, ఖాజాగూడ, నానక్‌రాంగూడ, గోల్డ్‌కోర్స్, విప్రో కూడలి, పుప్పాలగూడ (భవిష్యత్తులో), ఓఆర్ఆర్ జంక్షన్, ఖానాపూర్, మూవీటవర్స్, కోకాపేట నియోపాలిస్

రెండోదశ డీపీఆర్‌లో ప్రతిపాదించిన హెచ్ఏఎంఎల్

ఈనాడు, హైదరాబాద్: మెట్రోరైలు రెండోదశలో ఆరు కారిడార్లలో ఖరారు చేసిన మార్గాలను హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైలు సంస్థ (హెచ్ఏఎంఎల్) వెల్లడించడంతో.. స్టేషన్లు ఎక్కడ వస్తాయనే ఆసక్తి నెలకొంది. ఫోర్త్ సిటీ మినహా తొలుత ప్రతిపాదించిన ఐదు కారిడార్ల డీపీఆర్ సిద్ధం కావడంతో స్టేషన్లపై స్పష్టత వచ్చింది. సగటున రెండు కి.మీ.లకు ఒక స్టేషన్‌ను అధికారులు ప్రతిపాదించారు.

ఎంజీబీఎస్ - చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ.- 6 స్టేషన్లు)

స్టేషన్లు: సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్, శాలిబండ, అలియాబాద్, ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట(జంక్షన్)

మియాపూర్ - పటాన్‌చెరు (13.4 కి.మీ.- 10 స్టేషన్లు)

స్టేషన్లు: మియాపూర్ ఎక్స్‌రోడ్, అల్విన్ చౌరస్తా, మదీనాగూడ, చందానగర్, బీహెచ్ఈఎల్, జ్యోతినగర్, బీరంగూడ, ఆర్‌సీపురం, ఇక్రిశాట్, పటాన్‌చెరు

ఎల్బీనగర్ - హయత్‌నగర్ (7.1 కి.మీ.- 6 స్టేషన్లు)

స్టేషన్లు: చింతల్‌కుంట, వనస్థలిపురం, ఆటోనగర్, లెక్చరర్స్ కాలనీ, ఆర్టీసీ కాలనీ, హయత్‌నగర్

మూసీ కూల్చివేతలపై నిరసన

మూసీ పరీవాహకంలో కూల్చివేతలకు వ్యతిరేకంగా భారాస ప్రజాప్రతినిధుల బృందం చేపట్టిన పర్యటన సందర్భంగా ఆదివారం బండ్లగూడ జాగీర్ పరిధి హైదర్‌షాకోట్‌లో మహిళలు నిరసన తెలిపారు. ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని, సబితారెడ్డి, గంగుల కమలాకర్ తదితరులు మద్దతు తెలిపారు. – న్యూస్‌టుడే, రాజేంద్రనగర్

ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకోండి

ఈనాడు, హైదరాబాద్: బహుళ అంతస్తుల భవనాల్లో 20 కిలోవాట్ల లోడ్ దాటితే ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్ (డీటీఆర్) ఏర్పాటు చేసుకోవాల్సిందేనని వినియోగదారులపై విద్యుత్తు అధికారులు ఒత్తిడి పెంచారు. ఈ తరహాలో సిటీలో ప్రతి సర్కిల్‌లో 700వరకు కనెక్షన్లు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. వీటన్నింటికి పబ్లిక్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచే కనెక్షన్లు తీసుకున్నారు. ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకోవాల్సిందిగా ఇప్పటికే అపార్ట్‌మెంట్లకు నోటీసులు జారీ చేశారు. దీనిపై సీఎండీ సమీక్ష చేస్తుండటంతో ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకోవాలని సిబ్బంది వెంటపడుతున్నారు.

- అపార్ట్‌మెంట్లపై ఒత్తిడి పెంచిన డిస్కం
- ఏడాది గడువు ఇవ్వాలంటున్న యజమానులు

రూ.3లక్షల వరకు వ్యయం.. చిన్న నియంత్రిక ఏర్పాటు చేసుకోవాలన్నా రూ.2.5-3 లక్షల వ్యయమవుతుందని ఇంజినీర్లు అంటున్నారు. ఇందులో అప్పటికే వినియోగదారులు చెల్లించిన డిపాజిట్ మొత్తాన్ని మినహాయిస్తామని చెబుతున్నారు. ఇప్పటివరకు 150 అపార్ట్‌మెంట్ల యజమానులు ముందుకొచ్చారని చెప్పారు. కాగా ఉన్నపళంగా రూ.లక్షల్లో వెచ్చించి డీటీఆర్ మార్చుకోవడం తమకు భారమని, కనీసం ఏడాది గడువు ఇవ్వాలని చాలామంది యజమానులు కోరుతున్నారు.

డా.ఉషాలక్ష్మిని సన్మానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే గాంధీ, డా.రఘురాం, సుధారెడ్డి, క్రిస్టినాచోంగ్తు

పింక్ షహర్

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు సుధారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గచ్చిబౌలి స్టేడియంలో ఆదివారం ఏర్పాటు చేసిన 'పింక్ పవర్ రన్' ఉత్సాహంగా సాగింది. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఉషాలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ఉషాలక్ష్మిని ఘనంగా సన్మానించారు. – న్యూస్‌టుడే, రాయదుర్గం

రెప్పదాటని కన్నీళ్లు

- పని చేసేచోట లైంగిక వేధింపులతో మానసిక కుంగుబాటు
- మహానగరంలో నామమాత్రంగా అంతర్గత కమిటీలు

ఈనాడు, హైదరాబాద్

- మాదాపూర్‌లోని కార్పొరేట్ సంస్థలో ఆమె 15 ఏళ్లుగా పని చేస్తూ గుర్తింపు తెచ్చుకుంది. అదేచోట ఉన్నత హోదాలో ఉన్న వ్యక్తి నుంచి లైంగిక వేధింపులు మొదలయ్యాయి. ఎవరికీ చెప్పుకోలేక కుంగుబాటుకు గురయ్యారు. తనవల్ల కాదని రాజీనామా చేశారు.

ఇలా ఎంతోమంది ఇంటా బయటా లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నారు. పనిచేసే ప్రదేశాల్లో మహిళలు ఎదుర్కొనే వేధింపులపై ఫిర్యాదు చేసేందుకు ఏర్పాటు చేసిన అంతర్గత కమిటీలు నామమాత్రంగా మారాయి. కొన్ని సంస్థలు కమిటీలనే ఏర్పాటు చేయక పోవడం గమనార్హం.

- దిల్లీకి చెందిన ఒక సంస్థ దేశవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో 59 శాతం కంపెనీలు లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేసేందుకు అంతర్గత కమిటీలు ఏర్పాటు చేయలేదని గుర్తించారు.

నగర షీటీమ్స్‌లో నమోదైన కేసులు

ఫిర్యాదులు	సంవత్సరం	నిందితులు
1032	2020	713
1389	2021	1144
1153	2022	1268
982	2023	751
1400	2024 (సెప్టెంబరు)	1100

ఫిర్యాదు చేయండిలా

వాట్సాప్ నంబర్లు
94906 16555, 87126 56858
డయల్ 100, హైల్డ్‌లైన్ 1098
వెబ్‌సైట్: womensafetywing.telangana.gov.in

భయంతోనే బాధితుల వెనకడుగు

– డాక్టర్ మమత రఘువీర్, తరుణీ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్

దేశవ్యాప్తంగా 0.4 శాతం మంది మహిళలు మాత్రమే పని చేసే చోట ఎదురవుతున్న లైంగిక వేధింపులపై ఫిర్యాదుకు ముందుకొస్తున్నారు. అంతర్గత కమిటీలు నామమాత్రంగా మారాయి. యాజమాన్యం నిర్లక్ష్యంతో మహిళా ఉద్యోగులు కొలువులు వదిలేస్తున్నారు.

అటు ఆక్రమణలపై ఫిర్యాదులు

ఇటు నిర్వాసితుల నిరసనలు

ఈనాడు, హైదరాబాద్: మూసీలో అక్రమ నిర్మాణాల సర్వేపై నిర్వాసితులు ఒకవైపు పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేస్తూ అడ్డుకుంటుంటే.. మరోవైపు అదే స్థాయిలో అక్రమ నిర్మాణాలపై హైడ్రాకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. సామాజిక మాధ్యమాల వేదికగా హైడ్రాకు అక్రమణల వివరాలతో ట్యాగ్ చేస్తున్నారు. మూసీ నదీ గర్భంలో ఇళ్లు, ఆటస్థలాలు, షెడ్లు ఉన్నట్లు ఫొటోలతో సహా హైడ్రాకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. నాగోల్ ప్రాంతంలో ప్రజాప్రతినిధుల అండతో ఓ వ్యక్తి మూసీ నదీగర్భంలోనే రెండు బాక్స్ క్రికెట్ గ్రౌండ్ల నిర్మాణం చేపట్టారని ఫిర్యాదులో ఆరోపించారు. హైడ్రా ప్రస్తుతం చెరువుల్లోని ఆక్రమణలపైనే దృష్టి పెట్టిందని.. ఇంకా మూసీ వరకు రాలేదని సంబంధిత అధికారులు అంటున్నారు.

కూల్చివేతలన్నీ హైడ్రాకు ముడిపెట్టవద్దు..

హైడ్రాకు సంబంధం లేని ఘటనలను ఆపాదిస్తూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తూ అప్రతిష్ఠపాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్ హెచ్చరించారు. కూల్చివేతలన్నీ హైడ్రాకు ముడిపెట్టవద్దని అన్నారు. సంగారెడ్డి మల్కాపూర్ చెరువులో కూల్చివేతలు హైడ్రా చేపట్టలేదని తెలిపారు. సంగారెడ్డి కూల్చివేత ఘటనల్లో హోంగార్డ్ గాయమై చనిపోతే హైడ్రా బలితీసుకుందని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం దురదృష్టకరం అన్నారు. ఇలాంటి తప్పుడు వార్తల్ని హైడ్రా ఖండిస్తోందని అన్నారు. బుచ్చమ్మ ఆత్మహత్య చేసుకోవడాన్ని హైడ్రాకు ఆపాదిస్తున్నారని.. అక్కడ హైడ్రా ఎవరికి నోటీసులు కూడా ఇవ్వలేదని తెలిపారు.

మళ్లీ పలకరించిన వరుణుడు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం మోస్తారు వర్షం కురిసింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్‌కు స్వల్ప అంతరాయం ఏర్పడింది. ఆర్సీపురంలో 56.3 మి.మీ, షేక్‌పేట 35 మి.మీ, గచ్చిబౌలి 33.8, చందానగర్ పీజేఆర్ స్టేడియం 33 మియాపూర్, గోల్కొండ 27.3, రాయదుర్గం వార్డ్ ఆఫీసు పరిధిలో 18.8 మి.మీ, లింగంపల్లిలో 17.3 మి.మీ వర్షపాతం నమోదైంది.

కేంద్ర మాజీ మంత్రి బూచి చూపించి టోకరా

ఉపాధ్యాయుడి నుంచి రూ.70 వేలు కాజేత

ఈనాడు– హైదరాబాద్: ఓ కేంద్ర మాజీ మంత్రి ఆరోపణలు ఎదుర్కొంటున్న నగదు అక్రమ చలామణి కేసులో నగరానికి చెందిన ఉపాధ్యాయుడి ప్రమేయం ఉందంటూ సైబర్ నేరగాళ్లు భయపెట్టి రూ.70వేలు వసూలు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్‌కు చెందిన ఉపాధ్యాయుడికి ఇటీవల ఓ నేరగాడు ఫోన్ చేసి తాము ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) నుంచి మాట్లాడుతున్నానని.. గతంలో ఓ కేంద్ర మాజీ మంత్రిపై నమోదైన మనీలాండరింగ్ కేసు విచారణలో భాగంగా ఫోన్ చేసినట్లు వివరించాడు. కేసు దర్యాప్తులో ఓ ఆధార్ కార్డు లింకు గుర్తించామని, అందులోని మీ పేరు, వివరాల ఆధారంగా కాల్ చేశామని, విచారణకు సహకరించాలన్నారు. బ్యాంకు ఖాతా వివరాలు చెబితే లావాదేవీలను తనిఖీ చేసి ప్రమేయం ఉందో లేదో గుర్తిస్తామని చెప్పారు. ఉపాధ్యాయుడు నిజమేనని భావించి వివరాలు పంపాడు. మనీలాండరింగ్‌లో మీకు ప్రమేయమున్నట్లు తేలిందని, కేసు నుంచి తప్పించుకోవాలంటే డబ్బు చెల్లించాలంటూ రూ.70 వేలు బదిలీ చేయించుకున్నారు. అనంతరం ఇదంతా మోసమని గ్రహించిన ఉపాధ్యాయుడు సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్నిరకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు 99635 22257
అమీర్‌పేట్ డివిజన్ 80085 97633
ఎల్.బి.నగర్ డివిజన్ 90000 15736
కూకట్‌పల్లి డివిజన్ 80085 15142
క్లాసిఫైడ్స్ యాడ్స్ కొరకు : 9908016959
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 8008012478, 8008611167

అశ్రునివాళి
పనిపట్ల మీకున్న నిబద్ధత, ఉన్నతమైన మీ ఆలోచనలు, విలువలు ఎందరికో స్ఫూర్తిదాయకం. మీరు ఎప్పటికీ మా హృదయాలలో చిరస్థాయిగా నిలిచి ఉంటారు.

శ్రీ RSRKV రంగరాజు గారు
1958 - 2024
నాగార్జున ప్లాస్టిక్స్ | ఆదిత్య ఎలక్ట్రానిక్స్ | గ్రీన్ స్పేస్
స్నేహా ఏజెన్సీస్ | నాగార్జున ఫామ్స్ | గోదావరి అగ్రి ఫామ్స్
బాధాతప్త హృదయాలతో...
స్నేహితులు మరియు పార్టనర్స్

(c) eenadu

ఖైరతాబాద్

• ఖైరతాబాద్ • జూబ్లీహిల్స్

వేంకటేశ్వర ఆలయంలో సహస్ర దీపాలంకరణ

పంజాగుట్ట, న్యూస్‌టుడే: పంజాగుట్ట దుర్గానగర్‌లోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సహస్ర దీపాలంకరణ చేశారు. ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. అంతకుముందు స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ పలమర్తి వెంకటేశ్వర్లు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లో బాల నర్తకి నమోదు

ధ్రువపత్రం అందుకుంటున్న వేక్షాహ్నిక

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: యూసుఫ్‌గూడ ప్రగతి నగర్‌కు చెందిన బాల నర్తకి వేక్షాహ్నిక స్థానిక కళాంజలి కూచిపూడి డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో పేరు నమోదు చేసుకుంది. గంటనేపు నిరంతరాయంగా కూచిపూడి నృత్య ప్రదర్శనతో రికార్డు సొంతం చేసుకుందని నిర్వాహకుడు సుధాకర్ రెడ్డి తెలిపారు. నృత్య ప్రదర్శనను సంస్థ సౌత్ ఇండియా చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ జ్యోతి రంగా పర్యవేక్షణలో నిర్వహించారని చెప్పారు.

రెండుపడక గదుల ఇళ్లను అర్హులకు కేటాయించాలి

బోరబండ, న్యూస్‌టుడే: రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం కోసం తమ స్థలాలను అప్పగించిన అర్హులకు ఇళ్లను కేటాయించాలని రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్సీఆర్ హిల్స్ కమలానగర్ వ్యవస్థాపక అధ్యక్షుడు హైదర్ ప్రభుత్వాన్ని కోరారు. ఇళ్లస్థలాలు అప్పగించిన వారితో కలిసి ఎస్సీఆర్ హిల్స్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో కె.విజయరామారావు మంత్రిగా ఉన్నప్పుడు కమలానగర్‌లో నిర్మించిన 210 రెండుపడక గదుల ఇళ్లలో 102 మందికి కేటాయించారని, తమవారికి ఇంకా 56 ఇళ్లు రావాల్సి ఉందని చెప్పారు. అర్హులైన వారందరికీ కమలానగర్‌లో రెండుపడక గదుల ఇళ్లను కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రాలు సమర్పించినట్లు చెప్పారు. రావాల్సిన ఇళ్లను కేటాయించిన తర్వాతే మూసీ నిర్వాసితులకు వాటిని అప్పగించాలని విజ్ఞప్తి చేశారు.

*కమలానగర్‌లో రెండు పడక గదుల ఇళ్లను అర్హులకు కేటాయించేలా చూస్తానని రహ్మత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ సి.ఎన్. రెడ్డి తెలిపారు. ఎస్సీఆర్ హిల్స్ కమలానగర్‌లో ఆందోళన చేస్తున్న లబ్ధిదారులకు ఆదివారం ఆయన సంఘీభావం తెలిపారు. కలెక్టర్, ఆర్‌డీఓతో మాట్లాడి ఇళ్ల త్వరగా మంజూరయ్యేలా చూస్తామని చెప్పారు.

హస్తకళ..భళా..!

పీపుల్స్ ప్లాజాలో కొలువుదీరిన స్వయం సహాయక సంఘాల 'సరస్ ఫెయిర్'

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: నెక్లెస్‌రోడ్ పీపుల్స్‌ప్లాజాలో కొలువుదీరిన స్వయం సహాయక సంఘాల 'సరస్ ఫెయిర్ 2024' హస్తకళా ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంటోంది. మహిళలు తయారు చేసిన చెక్కబొమ్మలు, వెదురు ఉత్పత్తులు, గోండు, కోయ చిత్రపటాలు, లెదర్‌బ్యాగ్స్, వాల్ పోస్టర్లు, వాటి మీద చేతితో వేసిన చిత్రాలు, కొబ్బరిపీచుతో తయారు చేసిన పక్షి గూళ్లు వంటి వందల రకాలు ఇక్కడ అందుబాటులో ఉంచారు. పదిరోజులపాటు జరిగే ఈ ప్రదర్శన శుక్రవారం ప్రారంభమైంది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చినవారు స్టాల్స్ ఏర్పాటు చేశారు. పలువురు తమ అభిప్రాయాలు 'ఈనాడు'తో పంచుకున్నారు.

ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నా: ప్రేమ్‌లీలా

నికింద్రాబాద్‌కు చెందిన ట్రాన్స్‌జెండర్ ప్రేమ్‌లీల తననకుంటూ ప్రత్యేక గుర్తింపు రావాలని ప్రేమ్‌లీలా క్రియేషన్స్ పేరుతో ఎకోఫ్రెండ్లీ జ్యూట్ బ్యాగ్స్, హ్యాండీక్రాఫ్ట్‌లు తయారు చేస్తోంది. కూకట్‌పల్లి దుర్గాబాయి శిశువికాస కేంద్రంలో జూట్‌బ్యాగ్స్ తయారు చేయడం నేర్చుకుని అయిదుగురు మహిళలు, మరో ముగ్గురు ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి కల్పిస్తుంది. ఇప్పటి వరకు 80 ప్రదర్శనల్లో పాల్గొన్నారు. నాలుగు యంత్రాలతో పలువురికి శిక్షణ ఇస్తున్నారు. 'అనారోగ్యంతో ఉన్న నా తల్లిని కాపాడుకొనేందుకు బిక్షాటన చేశా. అనేక అవమానాలు ఎదుర్కొన్నా. నాకంటూ మంచి పేరు తెచ్చుకోవాలని భావించి బ్యాగుల తయారీ ప్రారంభించా. పర్యావరణ అనుకూలమైన వస్తువులను అందించడమే మా ఉద్దేశం' అని పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లోనూ విక్రయిస్తున్నాం: ప్రియాంక

పెద్దపల్లికి చెందిన ప్రియాంక వెదురుతో చేసిన బొమ్మలతో స్టాల్ ఏర్పాటు చేశారు. తాజ్‌మహాల్, ఈఫిల్‌టవర్, గడియారాలు, ఇండియా పటాలు వంటివి ఉన్నాయి. వీటిపై వేసిన చిత్రాలు నీటిలో తడిసినా పాడవకుండా ఉంటాయని పేర్కొన్నారు. ఆయా ఉత్పత్తులను ఆన్‌లైల్‌లోనూ విక్రయిస్తున్నామని, ఖరీదు రూ.500 నుంచి రూ.2వేలకు పైగా ఉంటాయని చెప్పారు.

నాటి ఆటలు గుర్తుచేయాలని: పి.లలితకుమారి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్‌టీఆర్ జిల్లాకు చెందిన పి.లలిత కుమారి కొండపల్లి బొమ్మలను ప్రదర్శనకు ఉంచారు. 'ఇప్పుడు ఉన్న పిల్లలకి పాతకాలం నాటి ఆటలు, వస్తువులు తెలియవు. వారికి వాటిని పరిచయం చేసేందుకు బొమ్మలు తయారు చేస్తున్నాం. తెల్లపునికి చెక్కతో వీటిని చేస్తామన్నారు. ఎద్దుల బండ్లు, తాడిచెట్లు, తొక్కుడు బిళ్ల వంటి సందర్శకులు ఆసక్తిగా చూస్తున్నారు.' అని పేర్కొన్నారు.

సోలార్ పాడులు సిద్ధం

నాగర్‌కర్నూలుకు చెందిన మహిళలు గ్రామీణ సోలార్ పుడ్స్ పేరుతో వివిధ ఆహార పదార్థాలను సౌర శక్తి ద్వారా పొడి రూపంలో చేసి విక్రయానికి ఉంచారు. 15 మంది మహిళలు కలిసి టమాటా, మామిడి, కరివేపాకు, ఆకు కూరలు వంటి వాటిని సౌరశక్తి (సోలార్) సాయంతో ఆరబెట్టి పొడి రూపంలో తయారు చేస్తున్నట్లు వెల్లడించారు.

మేమున్నాం.. ఉ. 10 నుంచి మ.1 గంట మధ్య

మీకు తోడుగా..

ఖైరతాబాద్	80085 73345
జూబ్లీహిల్స్	80085 73352
బంజారాహిల్స్	80085 73348

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే

సమస్య: శ్రీకృష్ణానగర్ బీ-బ్లాకు సాయిబాబా ఆలయం వీధికి ముందు భాగంలోని వీధిలో దీపాలు రెండు నెలలుగా వెలగడంలేదు. ఫిర్యాదు చేసినా సిబ్బంది పట్టించుకోవడం లేదు.
– టి.వి.రమణ, శ్రీకృష్ణానగర్

సమాధానం: వెలగని వీధి దీపాలకు వెంటనే మరమ్మతు చేసేలా చర్యలు తీసుకుంటాం. **– రాజేష్, జీహెచ్‌ఎంసీ వీధిదీపాల పర్యవేక్షణాధికారి**

గ్లామన్ మిసెస్ ఇండియాగా హేమలతారెడ్డి

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: టీవీ జర్నలిస్టు, వ్యాఖ్యాత, 'నిన్ను చూస్తే' చిత్ర నటి హేమలతారెడ్డికి గ్లామన్ మిసెస్ ఇండియా-2024 అవార్డు దక్కింది. మలేషియాలో జరిగిన మిసెస్ ఇండియా 2024 కార్యక్రమంలో ఆమె ఈ అవార్డును అందుకోవటంతోపాటు ఉత్తమ టాలెంట్, ఫొటోజెనిక్ విభాగాల్లోనూ విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా ఆదివారం ఆమె జూబ్లీహిల్స్‌లో మీడియాతో మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం జరిగిన వేడుకల్లో ఈ అవార్డును అందుకున్నట్లు చెప్పారు. అందాల పోటీల రంగంలో తెలుగువారు చాలా తక్కువగా ఉంటారని, అలాంటిది తనకు ఈ అవార్డులు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

'తిరుపతి వాసిగా, హిందువుగా అభిప్రాయం చెప్పా'

కార్యక్రమంలో శివబాలాజీ, మంచు విష్ణు, డాక్టర్ శాస్త్రి మాదాల రవి

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ మహా ప్రసాదం విషయంలో మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు మంచు విష్ణు స్పందించారు. ప్రపంచ హార్ట్ డేను పురస్కరించుకుని ఆదివారం జూబ్లీహిల్స్‌లోని జీవీకే హెల్త్ హబ్‌లో మా సభ్యులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మంజు విష్ణు మీడియాతో మాట్లాడారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో ఇటీవల మంచు విష్ణు, సినీనటుడు ప్రకాశ్‌రాజ్‌ల మధ్య 'ఎక్స్' వేదికగా సంభాషణ జరిగిన విషయం విదితమే. దీనిపై మాట్లాడుతూ ప్రకాశ్‌రాజ్ ట్వీట్ పూర్తిగా ఆయన వ్యక్తిగత అభిప్రాయమని, అదే విధంగా తన అభిప్రాయాన్ని తెలియజేశానన్నారు. ఒక హిందువుగా, తిరుపతి వాసిగా ఆ వివాదానికి మతం రంగు లేదని చెప్పగలనని అన్నారు. మా అసోసియేషన్ బిల్డింగ్ విషయంలో త్వరలోనే ఒక ప్రకటన చేస్తామన్నారు. లైంగిక వేధింపుల కేసులో జానీ మాస్టర్ వ్యవహారంపై మీడియా ప్రశ్నించగా.. కోర్టులో ఉన్న విషయంపై మాట్లాడనని స్పష్టం చేశారు. మా సభ్యులు శివబాలాజీ, మాదాల రవి, కరాటే కల్యాణి, జీవీకే హెల్త్ హబ్ ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ ఎన్‌జీ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

సందడిగా హృదయ దినోత్సవం పరుగు

పాల్గొన్న ఔత్సాహికులు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నెక్లెస్ రోడ్డులో కార్డియాక్ రెహబ్ రన్ ఉత్సాహంగా సాగింది. ఆదివారం ఉదయం సంజీవయ్య పార్కు వద్ద ప్రారంభమైన 21కే, 16కే, 10కే, 5కే, 3కే పరుగులను బ్రిటిష్ హై కమిషన్ తెలంగాణ జీడీ రేయిహ్ జెండా ఊపి ప్రారంభించారు. సంజీవయ్య పార్కు నుంచి పరుగు ట్యాంక్ బండ్ చుట్టూ కొనసాగింది. చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటూ వ్యాయామం చేస్తే గుండె వ్యాధులను దూరం చేయవచ్చని కార్డియాక్ రెహబ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్, సీఈఓ డాక్టర్ మురళీధర్ బాబీ సూచించారు. మానవ జీవక్రియ ప్రారంభం కావాలంటే గుండె ప్రధాన పాత్ర పోషిస్తోందని, పౌష్టికాహారం తీసుకోవడం తప్పనిసరని, వ్యాయామం ద్వారా గుండెను జాగ్రత్తగా కాపాడుకోవచ్చని, రోజూ 30 నిమిషాల పాటు వారంలో కనీసం అయిదు రోజులు వ్యాయామం చేయాలని సూచించారు.

పారిశుద్ధ్య సమస్య పరిష్కారం

వీడియోగల్లీలో నివాసాల నడుమ వ్యర్థాల కుప్పల తొలగింపు పనులు

వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే: వెంగళరావునగర్ డివిజన్ వీడియోగల్లీ ప్రాంతంలో నివాసాల మధ్య వ్యర్థాలు పేరుకుపోవడంతో పరిసరాలన్నీ అపరిశుభ్రంగా మారాయి. మూడు నెలలు అవుతున్నా సమస్య అలాగే ఉండటంతో 'వ్యర్థాల కుప్పలు.. పరిసరాలు అపరిశుభ్రం' శీర్షికన ఇటీవల 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. ఆదివారం వీడియోగల్లీ నివాసాల మధ్య వ్యర్థాల కుప్పలు తొలగించి సమస్య పరిష్కరించారు.

కాలనీ పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: కమలాపురకాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. కాలనీలో సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. కాలనీ సంక్షేమసంఘం అధ్యక్షుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత డా. గోపాలకృష్ణ గోఖలే మాట్లాడుతూ.. మనం ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, నిత్యం కొంత సమయాన్ని వ్యాయామం, యోగా, ధ్యానం కోసం కేటాయించాలన్నారు. సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు విజయభాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రావు, ఫేజ్-1 కార్యదర్శి మీర్జా అబ్బాస్ అలీఖాన్, కాలనీవాసులు పాల్గొన్నారు.

మదర్సా నిర్మాణ ప్రకటనపై అభ్యంతరం

బోరబండ, న్యూస్‌టుడే: రహ్మత్‌నగర్ డివిజన్ శ్రీరామ్‌నగర్ హజరత్ సయ్యదినా ఉమర్ ఫారూఖ్ మసీదు ప్రాంగణంలో మదర్సా నిర్మాణం ప్రకటన పట్ల మసీదు నిర్వహణ కమిటీ ప్రతినిధులు అభ్యంతరం వ్యక్తంచేశారు. మసీదులో జొహర్ నమాజ్ అనంతరం కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటే అంగీకరించేది లేదని స్పష్టం చేస్తూ.. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. గత శుక్రవారం మసీదులో ప్రత్యేక ప్రార్థన చేయించిన మతపెద్ద మౌలానా అహ్మద్ నక్షబంది ప్రసంగిస్తూ మదర్సా నిర్మిస్తామని ప్రకటించడం సమంజసం కాదన్నారు. ఈ విషయంలో బస్తీవాసుల అభిప్రాయాలను స్వీకరించిన తర్వాత కమిటీ ప్రకటన చేస్తుందని స్పష్టంచేశారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాజీవ్‌నగర్‌శాఖ, పంజాగుట్ట శాఖల సర్వసభ్య సమావేశం రాజీవ్‌నగర్ సామాజిక భవనంలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి రాజీవ్‌నగర్‌శాఖ అధ్యక్షుడు కృష్ణశర్మ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు టి.ఇందర్‌సింగ్ మాట్లాడుతూ.. పెన్షనర్లు ఎదుర్కొంటున్న డీఏ, పీఆర్‌ఈసీ సమస్యలు పరిష్కరించేందుకు నగర సంఘం నిరంతరం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో 2.98 లక్షల మంది టీఎస్ జాయంట్ యాక్షన్ కమిటీ (జాక్)లో భాగస్వాములుగా ఉన్నారన్నారు. పంజాగుట్ట శాఖ అధ్యక్షుడిగా వి.సుదానందంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎం.బద్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కుల గణన చేసి.. మాట నిలుపుకోవాలి

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కుల గణన చేసి బీసీలకు స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ వెంటనే మాట నిలబెట్టుకోవాలని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు సీహెచ్ ఉపేంద్ర అన్నారు. ఆదివారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో బీసీ సమాజ్ ఆధ్వర్యంలో జరిగిన బీసీ కుల బాంధవుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తమిళనాడులో బీసీ ఉద్యోగుల ఉద్యమం స్ఫూర్తితో తెలంగాణలోనూ బీసీ ఉద్యమానికి అందరూ కదలాలన్నారు. బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు మాట్లాడుతూ చిన్న చిన్న సమావేశాలు పెడుతూ బీసీలను చైతన్య పరుస్తూ ముందుకు వెళ్దామన్నారు. సభాధ్యక్షుడు బంగారు నరసింహ సాగర్ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లోనూ పోటీలో ఉండేలా సిద్ధం కావాలన్నారు. బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ సాగర్, బీసీ నాయకులు ఓర్సు కృష్ణయ్య, సత్యనారాయణరాజు, ఎత్తరి అంతయ్య, దేవేందర్, బీసీ సమాజ్ ఎంప్లాయిస్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేష్, శివాని తదితరులు పాల్గొన్నారు..

కొనసాగుతున్న కార్మిక వ్యతిరేక విధానాలు

మాట్లాడుతున్న సీహెచ్ మురహరి

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: కార్మికులకు కులం, మతం, దేశం లాంటివేవీ ప్రతిబంధకాలు కాదని ఎస్‌యూసీఐ పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ మురహరి అన్నారు. ఆదివారం తెలంగాణ యునైటెడ్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, జీహెచ్‌ఎంసీ విభాగం మొదటి ఏడాది సభలు ఖైరతాబాద్‌లోని శ్రీనివాసనగర్ సామాజిక భవనంలో జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తెలంగాణలో పదేళ్లు పాలించిన భారాస ప్రభుత్వాన్ని ఓడించి కాంగ్రెస్‌కు పట్టం కడితే.. వారూ కార్మిక వ్యతిరేక విధానాలు కొనసాగిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ స్త్రీ సేవాసమితి రాష్ట్ర అధ్యక్షురాలు శోభా పెరిందేవి, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యుడు సిరాజుద్దీన్ మాట్లాడారు. ఏఐయూటీయూసీ రాష్ట్ర ఇన్‌చార్జి కె.భరత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. కార్మిక సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి బోరబండ పోలీసుల చేయూత

సాయికుమార్ కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న ఇన్‌స్పెక్టర్ వీరశేఖర్

బోరబండ, న్యూస్‌టుడే: బోరబండ ఠాణాలో గన్‌మెన్ కానిస్టేబుల్‌గా పనిచేసిన ఎం.సాయికుమార్ కుటుంబానికి ఠాణా తరపున రూ.లక్షా వెయ్యి ఆర్థిక సహకారం అందించారు. రహ్మత్‌నగర్ డివిజన్ కార్మికనగర్‌లో నివసించిన 2010 బ్యాచ్‌కు చెందిన ఎం.సాయికుమార్ గుండెపోటుతో సెప్టెంబరు 20న మృతిచెందటం తెలిసిందే. ఇద్దరు ఆడపిల్లలు ఉండగా.. భార్య ఎనిమిది నెలల గర్భిణి. కార్మికనగర్‌లోని సాయికుమార్ నివాసానికి ఆదివారం వెళ్లిన బోరబండ ఇన్‌స్పెక్టర్ ఎస్.వీరశేఖర్ ఠాణా తరపున అతడి కుటుంబసభ్యులకు చెక్కును అందజేశారు. ఎస్‌ఐలు ఎండీ సర్దార్ జమాల్, బి.మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

జలమయమైన శ్రీకృష్ణానగర్

శ్రీకృష్ణానగర్ బీ-బ్లాకులో వరదనీరు

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: ఆదివారం రాత్రి సమయంలో కురిసిన వర్షానికి శ్రీకృష్ణానగర్‌లోని లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. శ్రీకృష్ణానగర్ ఏ, బీ, సీ బ్లాకుల్లో మోకాలి లోతు నీరు ప్రవహించింది. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దుకాణాల సముదాయాల్లోకి వరదనీరు వచ్చి చేరింది.

గంజాయి విక్రేతల ముఠా అరెస్టు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: గంజాయి సరఫరా చేస్తున్న, విక్రయిస్తున్న ఎనిమిది మందిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో ఎక్కువ శాతం బిహారీలే ఉన్నారు. బంజారాహిల్స్ రోడ్ నంబరు 12లోని కమాన్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ఒక యువకుడు పోలీసులను చూసి తలుపులు వేసుకున్నాడు. దీంతో పోలీసులు తలుపులు తీసి చూడగా.. గదిలో ఎనిమిది మంది కనిపించారు. వీరి వద్ద తనిఖీ చేయగా 305 గ్రాముల గంజాయి లభ్యమైంది. పట్టుబడిన వారిలో దమ్మాయిగూడలో నివసించే బిహారీ కార్మికుడు నీతీష్‌కుమార్(24)తోపాటు ఎన్బీటీనగర్‌లో నివసించే బిహారీలు ప్రైవేటు ఉద్యోగి కన్హయ్య కుమార్ (21), అనీల్‌కుమార్ (19), పంకజ్‌కుమార్ (19), రాకేష్‌కుమార్ (19), లలిత్‌పాశ్వాన్ (30), దీపక్‌కుమార్ (20), ఎన్బీటీనగర్‌కు చెందిన కరణ్‌కుమార్ (23) ఉన్నారు. కన్హయ్య కుమార్ సూచన మేరకు నితీష్‌కుమార్ బీహార్‌కు వెళ్లి లక్నాపూర్ ప్రాంతంలో రాజు షా వద్ద గంజాయిని కొనుగోలు చేసి తీసుకొచ్చి ఇక్కడ అవసరమైన వారికి ప్యాకెట్లుగా మార్చి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. రాజు షా పరారీలో ఉన్నాడని, మిగిలిన వారిపై ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బంజారాహిల్స్ పోలీసులు తెలిపారు.

కళాశాల వద్ద గొడవ సృష్టించిన వారిపై కేసు

ఫిలింనగర్: కళాశాల గేటు వద్ద గొడవ సృష్టించిన వారిపై ఫిల్మ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. షేక్‌పేటలోని జి.నారాయణమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ (ఫర్ ఉమెన్) కళాశాల గేటు వద్ద ఈ నెల 26న విజేంద్ర, ప్రశాంత్ అనే వ్యక్తులు మరికొందరితో కలిసి గొడవ సృష్టించారు. ప్రిన్సిపల్‌ను కలవాలంటూ గేటులోకి ఆక్రమంగా ప్రవేశించడంతో సిబ్బంది వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో వారు కేకలు వేస్తూ కళాశాల సిబ్బందిని దుర్భాషలాడారు. ఇక్కడి సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి గొడవకు దిగిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ కె.రమేష్‌రెడ్డి, క్యాంపస్ మేనేజర్‌లు ఫిల్మ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాల సాహిత్యంతోనే విజ్ఞాన బీజాలు

మాట్లాడుతున్న డా.రియాజ్, చిత్రంలో వేదకుమార్ తదితరులు

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: బాల సాహిత్యంతో బాలల హృదయాల్లో విజ్ఞానంతో పాటు భాషా పరిజ్ఞానం పెరుగుతుందని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ డా.రియాజ్ అన్నారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ, బాలచెలిమి గ్రంథాలయాల నిర్వహణపై కార్యశాల జరిగింది. అకాడమీ అధ్యక్షుడు మణికొండ వేదకుమార్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా హాజరైన డా.రియాజ్ మాట్లాడారు. వేదకుమార్ మాట్లాడుతూ.. సుమారు వంద బాలచెలిమి గ్రంథాలయాలను ఏర్పాటు చేయడం తమ లక్ష్యమన్నారు. సిద్ధిపేట డిగ్రీ కళాశాల లైబ్రేరియన్ డా.బి.వెంకటేశ్వర్లు, ప్రభుత్వ సిటీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.చెకోని రవికుమార్, రచయిత్రి డా.అమరావతి నీరజ మహా అకాడమీ డైరెక్టర్ మల్లికార్జునరావు, బాలచెలిమి గ్రంథాలయాల రాష్ట్ర కన్వీనర్ గరిపల్లి అశోక్‌కుమార్, సమన్వయకర్త ఖైజర్ బాషాతో పాటు బాలల రచయితలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'వర్గీకరణపై ఆర్డినెన్స్ యోచన తగదు'

ఆందోళన చేస్తున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ ప్రతినిధులు

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉపసంహరించుకోవాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేశారు. నినాదాలతో హోరెత్తించారు. కమిటీ కన్వీనర్ మన్నె శ్రీధర్ మాట్లాడుతూ.. ఎస్సీ కులగణన చేపట్టకుండా వర్గీకరణపై ఎలా తీర్పు ఇస్తారని ప్రశ్నించారు. మాలల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వర్గీకరణపై చేస్తున్న ఆర్డినెన్స్ ఆలోచన విరమించుకోవాలన్నారు. దీనిపై సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తితో జ్యుడీషియల్ కమిషన్ వేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ బల్వంత్‌రావు, నాయకులు రాజేష్, కల్యాణ్, ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో సేవలు మరింత విస్తృతం చేస్తాం

మారియో సీజర్ నుంచి అవార్డు అందుకుంటున్న టీఎంఎన్ చౌదరి

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: తెలుగు రాష్ట్రాల్లో రోటరీ క్లబ్ సేవలను మరింత విస్తృతం చేస్తామని రోటరీ క్లబ్ కాబోయే అధ్యక్షుడు మారియో సీజర్ అన్నారు. జూబ్లీహిల్స్‌లోని దసపల్లా హోటల్లో జరుగుతున్న సౌత్‌జోన్ రోటరీ సమావేశాల ముగింపు సందర్భంగా ఆదివారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. నాలుగు దేశాలతోపాటు అయిదు రాష్ట్రాల నుంచి రోటరీ క్లబ్ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మారియో సీజర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని అనేక పాఠశాలలను దత్తత తీసుకుని, వాటిలో సదుపాయాలు కల్పించామన్నారు. పేదలకు వైద్యాన్ని అందించేందుకు ప్రయత్నించామన్నారు. ఉత్తమ సేవలు అందించిన రోటేరియన్లకు ప్రోత్సాహక బహుమతులను అందించారు. హైదరాబాద్ ఈస్ట్ క్లబ్ అధ్యక్షుడు తల శిల మల్లికార్జున నరసయ్య చౌదరి (టీఎంఎన్ చౌదరి)తోపాటు పలువురు అవార్డులు అందుకున్నారు. సదస్సు కార్యనిర్వాహక ఛైర్మన్ డాక్టర్ చిలుకూరు శరత్ బా

నిఘా లేదు.. నిద్ర చోటెరగదు!

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో నిఘా, పోలీసుల పర్యవేక్షణ లోపాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై దారికి అడ్డంగా ఓ వ్యక్తి నిద్రపోతున్నా ఎవరూ పట్టించుకోని పరిస్థితి ఇది. దీంతో ప్లాట్‌ఫారం పైకి రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు.

బాధితుల మౌనమే నేరాలకు దన్ను!

ఈనాడు, హైదరాబాద్

పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెనకడుగు

దొంగతనాలు, అత్యాచారాలు, మోసాలకు పాల్పడుతున్న కేటుగాళ్లు పోలీసులకు కొత్త సవాల్ విసురుతున్నారు. ఎన్నో దారుణాలకు తెగబడుతూ దర్జాగా తిరుగుతున్నారు. దీనికి కారణం ఎవరో తెలిసినా.. పక్కా ఆధారాలున్నా.. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదు. గుట్టు బయటపడుతుందనే గుబులు. పరువు పోతుందనే భయంతో మౌనం వహిస్తున్నారు.

సొమ్ములు పోయినా.. గప్‌చుప్

- రాచకొండ పరిధిలో ఓ పాలవ్యాపారి ఇంట్లో ఇటీవల రూ.2 కోట్లు మాయమయ్యాయి. పోలీసులకు ఫిర్యాదు చేస్తే డబ్బు వివరాలు బయటపడతాయన్న కారణంతో రూ.15లక్షలు పోయినట్లు ఫిర్యాదు చేశారు. నిందితులనుంచి పోలీసులు రూ.85లక్షలు స్వాధీనం చేసుకున్నారు. కరడుగట్టిన దొంగను అరెస్టుచేశారు.
- సికింద్రాబాద్‌లోని ఓ బంగారు దుకాణంలో రూ.1.5కోట్ల విలువైన నగలు చోరీకి గురయ్యాయి. ఫిర్యాదుచేస్తే స్మగ్లింగ్ బండారం బయటపడుతుందని యజమాని భావించారు.
- నగర శివారులోని ఓ ప్రముఖుని నివాసంలో బంగారు, వజ్రాభరణాలు మాయమయ్యాయి. ఆయన మౌఖిక ఆదేశాలతో సొమ్ము రికవరీ చేయించుకున్నారు. దొంగలు దొరికినా కేసు నమోదు చేయక పోవడంతో పోలీసులు హెచ్చరించి వదిలేసినట్లు తెలిసింది.
- అందమైన అమ్మాయిల పలకరింపు, వీడియోకాల్స్‌కు ఆకర్షితులై వలపువలలో చిక్కి రూ.లక్షలు నష్టపోతున్న బాధితుల్లో కేవలం 5 శాతం మాత్రమే ఫిర్యాదు చేస్తున్నట్లు సైబర్‌క్రైం పోలీసులు తెలిపారు.
- గొలుసుకట్టు, సైబర్ మోసాల్లో రూ.10 వేల లోపు నష్టపోయిన బాధితులు ఫిర్యాదు చేయడం లేదు. పోలీస్ స్టేషన్ల మట్టూ తిరగాల్సి వస్తోందన్న అభిప్రాయంతో మౌనం వహిస్తున్నారు.

చెప్పలేక సతమతం

ఇటీవల అరెస్టయిన కరడుగట్టిన దొంగ వద్ద లభించిన సెల్‌ఫోన్‌లో పలువురు మహిళల నగ్నఫొటోలు, వీడియోలుచూసి పోలీసులు ఉలికిపాటుకు గురయ్యారు. చోరీలకు వెళ్లేముందు కల్లు దుకాణాల్లో, చిరు వ్యాపారాలు చేసే మహిళలను పరిచయం చేసుకుంటాడు. డబ్బులిస్తానని ఆశచూపి హోటల్ గదులకు తీసుకెళ్లి నగ్న వీడియోలు చిత్రీకరిస్తాడు. శారీరక అవసరం తీరాక ఆ వీడియోలు చూపి వారి నగలు కొట్టేసి మాయమవుతాడు. నగర శివారు నిర్మానుష్య ప్రాంతంలో ఏకాంతంగా గడిపేందుకు ప్రేమజంటలు చేరతాయి. వీరి ఫొటోలు, వీడియాలుతీస్తూ బెదిరించి కొన్ని ముఠాలు సొమ్ముచేసుకుంటున్నాయి. నిఘా ఉంచిన పోలీసులు కొందరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. డబ్బు, నగలు కాజేయడంతో పాటు కొందరు యువతులపై అత్యాచారాలకు పాల్పడినట్లు దర్యాప్తులో గుర్తించారు. ఫిర్యాదుకు బాధితులు ముందుకు రాకపోవడంతో దోపిడీ కేసు నమోదుచేసినట్లు తెలుస్తోంది.

ముజ్రా పార్టీ.. 12 మంది అరెస్టు

అరెస్టయిన నిర్వాహకులు, ట్రాన్స్‌జెండర్లు

కేశవగిరి, న్యూస్‌టుడే: లేక్‌వ్యూ హిల్స్‌లో ముజ్రాపార్టీపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. నగర టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు వివరాల ప్రకారం.. బండ్లగూడ ప్రాంతానికి చెందిన హమీద్ గౌస్‌నగర్ ఉందాసాగర్ లేక్‌వ్యూహిల్స్‌లోని ఓ కంపౌండ్‌లో పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. పరిసర బస్తీలకు చెందిన 8మంది యువకులు, నలుగురు ట్రాన్స్‌జెండర్లు(డ్యాన్సర్లు) పాల్గొన్నారు. రాత్రి 2.30 గంటల సమయంలో హారెత్తుతున్న డీజే, అసభ్యకర నృత్యాలతో ఆ ప్రాంతం దద్దరిల్లిపోయింది. సమాచారం అందుకున్న దక్షిణమండలం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేంద్ర, ఎస్సైలు ఎన్.నవీన్, ఎన్.నర్సింహులు, బండ్లగూడ ఠాణా పోలీసులు సంయుక్తంగా దాడి నిర్వహించారు. మహ్మద్ జాబ్రీ(25), రియాజ్(23), షేక్ సొహైల్(19), షానవాజ్‌ఖాన్(23), ఇమ్రాన్(20), ఫేరోజ్(19), సయ్యద్ షాఫారూఖ్(20), షేక్‌మహ్మద్(25)లతోపాటు ట్రాన్స్‌జెండర్లు, డాన్సర్లు ఆర్జూ(28), సైఫ్ అలియాస్ లవ్లీ(27), జల్‌పల్లికి చెందిన కరీమాబక్ష(27), వట్టేపల్లికి అబ్దుల్ ఆమెర్(28)లను అరెస్టు చేశారు. వీరి నుంచి ఒక యాంప్లిఫయర్, డీజే బాక్సులు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిర్వాహకుడు హమీద్ పరారీలో ఉన్నాడు. వీరిని తదుపరి దర్యాప్తు నిమిత్తం బండ్లగూడ పోలీసులకు అప్పగించారు. ముజ్రాపార్టీ నిర్వాహకులను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు బండ్లగూడ సీఐ కె.సత్యనారాయణ తెలిపారు.

ఖరీదైన మద్యం ముసుగులో నకిలీ సరకు

పట్టుబడిన మద్యం, నిందితుడి (కూర్చున్న వ్యక్తి)తో ఆబ్కారీ అధికారులు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: ఖరీదైన మద్యం ముసుగులో కల్తీ మద్యం విక్రయాలకు పాల్పడుతున్న ఒక వ్యక్తిని ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. ఒడిశాకు చెందిన సత్యభరత్ శైల బంజారాహిల్స్ రోడ్ నం.2 ఇందిరానగర్‌లో నివసిస్తూ ఈవెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఖరీదైన మద్యం ఖాళీ సీసాల్లో తక్కువ ధర కలిగిన మద్యం నింపి బయటి మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు మరొకరి సాయంతో విక్రయిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఎస్‌టీఎఫ్ పోలీసులు అతడి ఇంటిపై దాడి చేసి రెండు మద్యం సీసాలు, 42 ఖాళీ మద్యం సీసాలు, 128 మద్యం సీసా మూతలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ నంద్యాల అంజిరెడ్డి తెలిపారు. ఈ నకిలీ మద్యాన్ని తయారు చేస్తున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన మలీనా దాసును అరెస్ట్ చేశామన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు సత్యభరత్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. మద్యం సీసాలను పట్టుకున్న వారిలో ఎస్‌టీఎఫ్ సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్, సిబ్బంది భాస్కర్‌రెడ్డి, అజీమ్, శ్రీధర్, రాకేష్, ప్రకాశ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు. వీరిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టర్ వీబీ కమలాసన్ రెడ్డి అభినందించారు.

రాష్ట్ర సమగ్ర శిక్షణ ఐకాస కమిటీ ఎన్నిక

ఎన్నికైన సమగ్రశిక్ష ఉద్యోగులు

ఈనాడు డిజిటల్,హైదరాబాద్: రాష్ట్ర సమగ్ర శిక్షణ కాంట్రాక్ట ఉద్యోగుల ఐకాసా నూతన కమిటీ ఎన్నికైందని అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడిగా తిరందాస్ సంతోశ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీలతరెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌గౌడ్, కోశాధికారిగా యాదగిరి, ముఖ్య సలహాదారులుగా కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులుగా అశోక్‌రెడ్డి, రాఘవేంద్రనాయుడు, స్వప్న, సంయుక్తకార్యదర్శిగా స్వరూప, పలువురు సభ్యులు ఎన్నికయ్యారు.

జీవో 317 బాధితుల చలో గాంధీ భవన్ 2న

గోడపత్రికల్ని ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో జీవో 317 సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆ జీవో బాధిత ఉపాధ్యాయులు చలో గాంధీ భవన్‌కు పిలుపునిచ్చారు. ఏడాది కిందట గాంధీ జయంతిరోజు నాటి పీసీసీ అధ్యక్షుడిగా నేటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరుతూ ఈ అక్టోబరు 2న తామంతా పెద్ద సంఖ్యలో గాంధీభవన్‌కు వెళ్తున్నట్లు 317జీవో బాధిత ఉపాధ్యాయుల జేఏసీ ప్రకటించింది. ఆదివారం మధ్యాహ్నం చలో గాంధీభవన్ గోడపత్రికను నెక్లెస్ రోడ్డులోని 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు నాగేశ్వర్‌రావు, విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 48 గంటల్లో జీవో 317 బాధితుల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, ఈ అంశాన్ని కాంగ్రెస్ మేనిఫెస్టోలోనూ చేర్చారని గుర్తుచేశారు.బాధితులు అందరికీ ఈ ప్రజాప్రభుత్వంలో న్యాయం జరిగేలా సబ్ కమిటీ ఛైర్మన్ మంత్రి దామోదర రాజనర్సింహ, సభ్యులైన మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ చొరవ చూపాలని కోరారు. నాయకులు మధుసూదన్‌రెడ్డి, సందీప్, వినోద, హరి, ప్రవీణ్, హారతి, లత, శ్రీలత, కవిత తదితరులు పాల్గొన్నారు.

మట్టి పెళ్లల కింద కార్మికుడి సమాధి

మూసాపేట, న్యూస్‌టుడే: మట్టి పెళ్లల కింద ఓ వలస కార్మికుడి బతుకు సమాధి అయ్యింది. కూకట్‌పల్లి ఎస్సై ఇంద్రసేనారెడ్డి తెలిపిన ప్రకారం..బిహార్ రాష్ట్రానికి చెందిన తండ్రీ కుమారులైన కిషోర్‌రాం, రవికుమార్(21) ఐదేళ్ల క్రితం నగరానికి వలసొచ్చారు. కూకట్‌పల్లి పరిధిలోని హానర్ భవన నిర్మాణ సంస్థలో పనిచేస్తూ అక్కడే ఉంటున్నారు. సదరు నిర్మాణ సంస్థలో తీగలు పరచడానికి 5 అడుగుల లోతుతో తవ్వకాలు చేపట్టారు. అందులోని మట్టిని పక్కనే పోసి ఉంచారు. రవికుమార్ ఆ గోతుల్లోకి దిగి తీగలకు మరమ్మతులు చేస్తున్నాడు. పక్కనే పోసిన మట్టి పెళ్లలు కూలి అతనిపై పడడంతో అందులోనే కూరుకుపోయాడు. సహచర కార్మికులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు.

వచ్చే ఏడాది పర్యాటకశాఖ ఆధ్వర్యంలో గోల్ఫ్ టోర్నీ

హైదరాబాద్ గోల్ఫ్‌క్లబ్‌లో విజేతకు ట్రోఫీ అందిస్తున్న పర్యాటకశాఖ మంత్రి కృష్ణారావు

గోల్కొండ, న్యూస్‌టుడే: వచ్చే సంవత్సరం జనవరి, ఫిబ్రవరిలో పర్యాటకశాఖ ఆధ్వర్యంలో గోల్ఫ్‌టోర్నీ నిర్వహించనున్నట్లు రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. టూంబ్స్ వద్ద గల హైదరాబాద్ గోల్ఫ్‌క్లబ్‌లో నిర్వహించిన తెలంగాణ మాస్టర్స్ గోల్ఫ్ ఛాంపియన్‌షిప్ ముగింపు కార్యక్రమంలో పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరంలో మరో గోల్ఫ్‌క్లబ్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. వివిధ రాష్ట్రాలు, దేశాల నుంచి వచ్చిన గోల్ఫ్ క్రీడాకారులు తెలంగాణలోని పర్యాటక కేంద్రాలను సందర్శించాలని మంత్రి సూచించారు. ఈ సందర్భంగా గెలుపొందిన క్రీడాకారులకు రూ.కోటి ప్రైజ్‌మనీని అందజేశారు. కోల్‌కతాకు చెందిన శంకర్‌దాస్ తెలంగాణ మాస్టర్స్ గోల్ఫ్ ఛాంపియన్‌షిప్‌లో మొదటి స్థానంలో నిలిచి రూ.15లక్షల ప్రైజ్‌మనీ గెలుచుకున్నారు. అదేవిధంగా రెండో స్థానంలో నిలిచిన అంగద్‌చీమా రూ.10లక్షలు గెలుపొందారు.

ముందుగా ప్రజలకు కౌన్సెలింగ్ ఇచ్చి ఉండాల్సింది

- హైడ్రా కూల్చివేతలు, మూసీ రెడ్ మార్కులు సీఎం దృష్టికి తీసుకెళ్తా
- ఎమ్మెల్యే దానం నాగేందర్

ఫిలింనగర్, న్యూస్‌టుడే: చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో నిర్మించిన అక్రమ కట్టడాలను హైడ్రా కూల్చివేసే ముందు అక్కడున్న వారికి ముందుగా కౌన్సెలింగ్ ఇచ్చి ఉంటే బాగుండేదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఇదే తరహాలో మూసీ నిర్వాసితులను తరలించేటప్పుడు అధికారులు ప్రజలకు నచ్చజెప్పి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. హైడ్రా కూల్చివేతలపై నిజనిర్ధారణ కమిటీ వేయాలన్నారు. హైడ్రా కూల్చివేతలు, మూసీ రెడ్ మార్కులు తదితర విషయాలన్నింటినీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో దానం ఆదివారం మీడియాతో మాట్లాడారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పదిమంది భారాస ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. భారాస హయాంలో రాజ్‌భవన్ ప్రాంతంలోని పార్క్ హోటల్‌కు శిఖం భూమిలో అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. దాని పక్కనే కేటీఆర్ స్నేహితుడు, ఆయన బినామి ప్రదీప్‌రెడ్డికి చెందిన ప్రదీప్ కన్‌స్ట్రక్షన్ పేరుతో శిఖం భూమిలో పది అంతస్తులకు అనుమతి ఎలా దక్కిందో చెప్పాలన్నారు. కేటీఆర్ ఉంటున్న ఫామ్‌హౌస్ కూడా ప్రదీప్‌రెడ్డిదేనన్నారు. ఐమ్యాక్స్ థియేటర్ కూడా చెరువులోనే ఉందన్నారు. అదే ప్రాంతంలో శోభ కన్‌స్ట్రక్షన్‌కు పదిహేను అంతస్తులకు శిఖం ల్యాండ్‌లో ఎలా అనుమతులిచ్చారని నిలదీశారు. భారాస నాయకులు హరీశ్‌రావు, కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డిలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ.. తప్పుదోవ పట్టించడం సరికాదన్నారు. మూసీనది పరివాహక ప్రాంతంలో ఇళ్లు కోల్పోయిన వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. నందగిరిహిల్స్‌లో హైడ్రా గుడిసెలను కూల్చడానికి వచ్చిన సమయంలోనే తాను వ్యతిరేకించి గుడిసెల జోలికి వెళ్లవద్దని సూచించిన విషయాన్ని గుర్తు చేశారు.

వింటేజ్ టూర్స్ సంస్థకు జరిమానా

ఈనాడు, హైదరాబాద్: ప్రయాణ, ఆతిథ్య సేవల్లో లోపం కలిగించడం, అదనంగా డబ్బులు వసూలుచేసిన వింటేజ్‌టూర్స్ క్రియేటర్ ప్రైవేటు లిమిటెడ్‌కు హైదరాబాద్ కమిషన్-3 జరిమానా విధించింది. పురానాపూల్‌కు చెందిన ఎ.నరేందర్‌శర్మ ఫిర్యాదును విచారించిన కమిషన్ అతని నుంచి అదనంగా వసూలుచేసిన రూ.24వేలు చెల్లించాలని ప్రతివాదసంస్థను ఆదేశించింది. బ్యాంకాక్‌లోని ఫుకెట్‌లో నాలుగురోజుల ప్రయాణ, ఆతిథ్యసేవల కోసం నరేందర్‌శర్మ ప్రతివాదసంస్థను సంప్రదించి రూ.52వేలు చెల్లించారు. షెడ్యూల్ ప్రకారం ఆయా ప్రాంతాలకు తీసుకెళ్లడంలో ప్రతివాద సంస్థ విఫలమవ్వడంతో పాటు సేవలు సరిగా అందించలేదు. దీంతో కుటుంబమంతా అసంతృప్తిగా వెనుదిరగాల్సి వచ్చిందని ఫిర్యాదీ కమిషన్‌కు విన్నవించారు. పరిహారం ఇప్పించాలని కోరారు. ఇరువర్గాల వాదనలు, సాక్ష్యాధారాలు పరిశీలించిన కమిషన్.. ఈ మేరకు తీర్పు వెలువరించింది.

కుల గణనతోనే దేశ పురోగతి

మాట్లాడుతున్న అనిల్ జైహింద్, చిత్రంలో ప్రొ.సింహాద్రి, జస్టిస్ చంద్రకుమార్, దేవళ్ల సమ్మయ్య, వకుళాభరణం కృష్ణమోహన్, ప్రొ.మురళి మనోహర్ తదితరులు

సోమాజిగూడ: దేశంలోని అన్ని సామాజిక వర్గాల లెక్కలను శాస్త్రీయంగా చేపట్టి సరైన చర్యలు చేపట్టినప్పుడే అంతరాలు లేని సమాజ నిర్మాణం జరుగుతుందని సంవిధాన్ సమ్మన్ సమ్మేళన్ జాతీయ కన్వీనర్ డాక్టర్ అనిల్ జైహింద్ అన్నారు. ఆదివారం బేగంపేటలోని టూరిజం ప్లాజాలో తెలంగాణ బీసీ ఉద్యోగుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన కులగణన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గౌరవ అధ్యక్షుడు దేవళ్ల సమ్మయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడుతూ, పాలకుల నిర్లక్ష్యం, ఉదాసీన వైఖరి కారణంగా దేశంలో వివక్ష, అణిచివేత, పేదరికం పెరుగుతున్నాయన్నారు. తెలంగాణ బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ, కుల గణనకు దశాబ్దాలుగా డిమాండ్ వస్తున్నా కేంద్రం నిర్లక్ష్యంగా ఉందన్నారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఒక్క బీసీకి అన్యాయం జరిగినా అండగా నిలబడతానన్నారు. ప్రొ.కె.మురళీ మనోహర్, ప్రొ. ఐ.తిరుమలి, ప్రొ. పీఎల్ విశ్వేశ్వరరావు, ప్రొ. ఎస్.సింహాద్రి, డాక్టర్ పృథ్వీరాజ్ యాదవ్, దుర్గం రవీందర్, సోగరా బేగం, డాక్టర్ వేణు యాదవ్, వరంగల్ శ్రీనివాస్ మాట్లాడారు.

వేగంగా విస్తరిస్తున్న జీర్ణాశయ సమస్యలు

కార్యశాలలో ఆసుపత్రి గ్రూపు డైరెక్టర్ డా.పవన్ గోరంటి, తదితరులు

రాయదుర్గం, న్యూస్‌టుడే: మారుతున్న ఆహార అలవాట్లు, జీవన శైలి నేపథ్యంలో దక్షిణ భారత్‌లో జీర్ణాశయ రుగ్మతలు వేగంగా పెరుగుతున్నాయని యశోద గ్రూప్ హాస్పిటల్స్ డైరెక్టర్ డా.పవన్ గోరుకంటి పేర్కొన్నారు. మాదాపూర్‌లోని యశోద ఆసుపత్రిలో ఆదివారం బ్రిడ్జ్ ది యాప్ 2.0 గ్యాస్ట్రో ఇంటెస్టినల్ డిజార్డర్స్ అంశంపై కార్యశాల నిర్వహించారు. జీర్ణాశయ వైద్యంలో అందుబాటులోకి వస్తున్న ఆధునిక సాంకేతికత వైద్య విధానాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఐదుగురు పెద్దలలో ఒకరు జీర్ణాశయ రుగ్మతలు, కాలేయ వ్యాధులబారిన పడుతున్నారన్నారు. తగిన జాగ్రత్తలతో ఆ రుగ్మతలకు దూరంగా ఉండొచ్చన్నారు. వైద్యుల బృందం డా.నవీన్ పోలవరపు, డా.సంతోష్ ఎనగంటి, కె.ఎస్.సోమశేఖర్‌రావు, డా.గోపి శ్రీకాంత్, డా.శరత్‌చంద్ర గోరంట్ల తదితరులు పాల్గొన్నారు. 500మందికిపైగా గ్యాస్ట్రో ఎంటరాలజిస్టులు హాజరయ్యారు.

సేవే మా పథం..

గాంధీ ఆసుపత్రికి వెళ్లేందుకు రోడ్డు దాటలేక ఇబ్బందులు పడుతున్న కొందరు అంధులను చూసిన గాంధీ వైద్య కళాశాల విద్యార్థినులు ఇలా చెయ్యి పట్టుకుని తీసుకువెళ్లారు. తమ మంచి మనసు చాటుకున్నారు.

బిడ్డకు పాలు అందించడంపై సిజేరియన్ల ప్రభావం

సదస్సును ప్రారంభిస్తున్న ఆర్.వి.కర్ణన్, ఇతర ప్రతినిధులు

అమీర్‌పేట, న్యూస్‌టుడే: శిశువులకు తల్లి పాలు ఇవ్వడంపై తీవ్ర ప్రభావం చూపుతున్న సమస్యల్లో సిజేరియన్లు ప్రధానమైనదని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్, నేషనల్ హెల్త్ మిషన్ ఎండీ ఆర్.వి.కర్ణన్ ఆందోళన వ్యక్తంచేశారు. 4వ సౌత్ ఏషియా లాంబ్‌కాన్ ఆధ్వర్యంలో అమీర్‌పేటలోని మ్యారీగోల్డ్ హోటల్‌లో తల్లిపాల బ్యాంకింగ్ వ్యవస్థపై ఆదివారం అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఆర్.వి.కర్ణన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణల యూనిసెఫ్ ఫీల్డ్ అధికారి డా.జెలలేం బిర్హాను, సుహేనా హెల్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా.సంతోష్‌కుమార్ మాట్లాడారు. తొలుత డా.సుదర్శన్‌రెడ్డి పటోళ్ల స్మారకోపన్యాసాన్ని డా.కె.పి.కుశ్వాహ ఇచ్చారు. డా.సుష్మా మల్లిక్‌కు ధాత్రి జీవనసాఫల్య పురస్కారం అందజేశారు. వివిధ దేశాలనుంచి 500 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

'అమీన్‌పూర్‌లో కక్షపూరితంగానే కూల్చివేతలు'

మాట్లాడుతున్న డా.మహమ్మద్ రఫి, చిత్రంలో మధుసూదన్, కళ్యాణ్, ఎన్.వెంకట్‌రెడ్డి

ఖైరతాబాద్: అమీర్‌పూర్‌లోని కిష్టారెడ్డిపేటలో గత ఆదివారం మూడు భవనాలను రెవెన్యూ అధికారులు కక్షపూరితంగానే నేలమట్టం చేశారని వాటి యజమానులు ఆరోపించారు. పట్టా స్థలాన్ని ప్లాట్లుగా చేసి విక్రయిస్తే అన్ని అనుమానాలు నివృత్తి చేసుకుని కొనుగోలు చేశామని, అధికారుల నుంచి నిర్మాణానికి పూర్తి అనుమతులు పొందామని ఆదివారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో బాధితులు డా.మహమ్మద్ రఫి, కల్యాణ్, మధుసూదన్ ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల ఆసుపత్రిని జూన్‌లోనే ప్రారంభించామని, ఆసుపత్రి ఉన్న భవనాన్ని కూల్చారని ఆరోపించారు. మీడియాను, ప్రజలను, కోర్టును తప్పుదోవ పట్టించేలా హైడ్రా అధికారులు మీడియా సమావేశం ఏర్పాటుచేసి వక్రీకరించారన్నారు. తాము భవనం నిర్మించే దాకా ఏ అధికారి నుంచి అభ్యంతరం రాలేదన్నారు. రెవెన్యూ అధికారులు తమ నుంచి పెద్ద మొత్తంలో ఆశించారని, అందుకు సిద్ధంగా లేకపోవడంతో అప్పటి నుంచి ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు.

ఆదర్శ వివాహాలను ప్రోత్సహించాలి

మాట్లాడుతున్న జస్టిస్ రాధారాణి. చిత్రంలో జ్యోతి, సైలాబ్‌బాబు, వాహీద్, దశరథ్

ముషీరాబాద్: ఆదర్శ వివాహాలను ప్రోత్సహించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి అన్నారు. ఆదివారం సుందరయ్య కళానిలయంలో.. కులాంతర వివాహితుల సంక్షేమ సంఘం(కేవీఎస్ఎస్) రాష్ట్ర సదస్సు జరిగింది. ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. చట్టబద్ధంగా జరిగే కుల, మతాంతర వివాహాలను ప్రతిఒక్కరూ అంగీకరించాలన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్టు కార్యదర్శి వినయ్‌కుమార్ మాట్లాడుతూ..ఇలాంటి పెళ్లిళ్లు చేసుకున్నవారికి రూ.10 లక్షలతోపాటు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. సైలాబ్‌బాబు, ఎండీ వాహీద్, కృష్ణచంద్, జ్యోతి, ఎం.దశరథ్ పాల్గొన్నారు.

'హైడ్రాకు మూసీ ప్రక్షాళనకు సంబంధం లేదు'

మాట్లాడుతున్న మంత్రి పొన్నం

సిద్దిపేట టౌన్ : హైడ్రాకు మూసీ పరీవాహక ప్రక్షాళనకు సంబంధం లేదని, భారాస నాయకులు సామాజిక మాధ్యమాల ద్వారా తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మూసీ పరీవాహక ప్రాంతంలో బలవంతంగా ఎవరినీ తరలించడంలేదన్నారు. నిర్వాసితులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, రెండు పడక గదుల ఇళ్లు, వారి పిల్లలకు విద్యా, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. జిల్లా కేంద్రం సిద్దిపేటలో ఆదివారం నిర్వహించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడి పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్‌లో ఆక్రమణకు గురైన, అనుమతి లేని నిర్మాణాలను మాత్రమే హైడ్రా కూల్చివేస్తోందన్నారు.

గిట్టుబాటు ధరలతోనే రైతుల ఆత్మహత్యల నివారణ

మాట్లాడుతున్న డైరెక్టర్ సురేష్

మియాపూర్, న్యూస్‌టుడే: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించినప్పుడే రైతుల ఆత్మహత్యల నివారణ సాధ్యమవుతుందని పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్ ప్రాంగణంలోని నీలం రాజశేఖర్‌రెడ్డి అధ్యయన కేంద్రంలో ఆదివారం 'దేశంలో సమకాలీన వ్యవసాయ పరిస్థితి-సమస్యలు, పరిష్కారాలు -వ్యవసాయ ఆర్థిక విశ్లేషణ' అంశంపై సెమినార్ నిర్వహించారు. అధ్యయన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ సురేష్ అధ్యక్షతన జరిగిన సదస్సులో వ్యవసాయ శాస్త్ర నిపుణులు ప్రొఫెసర్ నరసింహారెడ్డి, డాక్టర్ శరత్‌బాబు, డాక్టర్ సోమ మర్ల, రైతు నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, ఆర్థికవేత్త ప్రొఫెసర్ సురేష్‌శర్మ తదితరులు హాజరయ్యారు. చిన్న రైతులకు అనుకూలంగా ఉండే రుణ, మార్కెటింగ్, రీసెర్చ్ విధానాలను ప్రభుత్వాలు రూపొందించాలని పక్తలు.కోరారు. రైతులకు బడ్జెట్‌లలో ప్రాధాన్యం కల్పించాలని అభిప్రాయపడ్డారు. రైతు కూలీ సంఘం నాయకులు రూన్సీ, విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ప్రసాదరావు, సహకార వ్యవసాయ సంఘాల ఉద్యమనేత నైనాని గోవర్ధన్, కిసాన్ సభ నాయకులు రామకృష్ణారెడ్డి, ప్రభు లింగం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంటి ఫొటోలు తీసిన ఇద్దరి అరెస్టు

పోలీసుల అదుపులో నిందితులు

ధూల్‌పేట:ఎమ్మె

త్వరలో కులగణన ప్రారంభం: బీసీ కమిషన్ ఛైర్మన్

ప్రసంగిస్తున్న జి.నిరంజన్

చాంద్రాయణగుట్ట న్యూస్‌టుడే: రాష్ట్రంలో త్వరలో కులగణన ప్రారంభమవుతుందని రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్ పేర్కొన్నారు. గౌలిపుర ఆరె కటిక పొదుపు, పరపతి సహకార సంఘం సమావేశం గౌలిపురలోని ఎ.కె.భవన్‌లో జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కులగణనతో రాష్ట్రంలోని అన్ని కులాలకు న్యాయం జరుగుతుందన్నారు. మాజీ కార్పొరేటర్లు ఆలె జితేంద్ర, చేకోల్‌కార్ శ్రీనివాస్, సంఘం అధ్యక్షుడు యశ్వంత్‌రావు, ప్రధాన కార్యదర్శి ప్రకాశ్‌రాజ్, అంబదాస్, ఎం.రమేశ్ పాల్గొన్నారు.

నిర్యాణం

పెద్దకర్మ
మంచితనానికి మారుపేరుగా నిలిచి అందరి హృదయాలలో సుస్థిరస్థానం సంపాదించుకున్న మీ మరణం మా అందరికీ తీరని లోటు. మీ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నాము.
శోకతప్త హృదయాలతో...
తల్లి: అనంతుల విజయ
భార్య: అనంతుల సరిత వేణు
అన్నలు - వదినలు | అక్కలు - బావలు
తమ్ముళ్ళు - మరదళ్ళు | చెల్లెళ్ళు - మరదళ్ళు
కుమారులు - కూతుళ్ళు | కోడళ్ళు - అల్లుళ్ళు
మరియు కుటుంబ సభ్యులు
కీ.శే. అనంతుల వేణుగోపాల్ గౌడ్ గారు
జననం: 10-08-1972 మరణం: 18-09-2024
కార్యస్థలం: తేది.30-09-2024, సోమవారం నాడు
గౌడ సంక్షేమ సంఘం, నాగోల్ నందు నిర్వహించబడును.

దశదినకర్మ
మంచికి, మమతామురాగాలకు మారుపేరు మీరు, భౌతికంగా మా అందరి నుండి దూరమైన మీ మధుర జ్ఞాపకాలు మా అందరి హృదయాల్లో పదిలం.. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తూ..
శోకతప్త హృదయాలతో..
కుమారులు - కోడళ్ళు: జి. రాఘవేంద్ర రెడ్డి (Ex IAF) - అమరావతి
జి. శ్రీనివాస్ రెడ్డి (Class -1 Contractor) - సరిత,
జి. మధుసూదన్ రెడ్డి (Class -1 Contractor) - మంజుల
కూతుళ్ళు - అల్లుళ్ళు: జి. సుజాత - కీ.శే. జి. రామిరెడ్డి,
ఆర్. ఇంద్రమ్మ - కీ.శే. ఆర్. బాలరెడ్డి, కీ.శే. ఎ. వినోద్ - మోహన్‌రెడ్డి
మనుమలు, మనుమరాళ్ళు, మరియు బంధువర్గ కుటుంబ సభ్యులు
కీ.శే. బరెంకబావి తారమ్మ గారు
మరణం: 21-09-2024
భర్త: కీ.శే. బరెంకబావి నారాయణ రెడ్డి గారు
కార్యస్థలం: తేది: 30-09-2024, సోమవారం నాడు మ॥ 12.00 గం॥లకు
SBR గార్డెన్, ఉప్పర్‌పల్లి, పిల్లర్ నెం.175 నందు దశదినకర్మ జరుపబడును.

ప్రథమ వర్ధంతి
భాద్రపద బహుళ త్రయోదశి 30-09-2024
అమృత హృదయంతో మా అందరినీ ఆదరించి, అనుక్షణం కుటుంబ శ్రేయస్సుకు ఎంతో శ్రమించి మమ్మల్ని ఉన్నతంగా తీర్చిదిద్దిన మీరు మా నుండి దూరమై నేటికి 1 సం॥ గడిచిననూ నీ మధుర స్మృతులు మరువలేకున్నాం. మీ పవిత్ర ఆత్మ శాంతిని భగవంతుని ప్రార్థిస్తూ..
బాధాతప్త హృదయాలతో...
భార్య: లింగ అన్నపూర్ణ
కుమారుడు - కోడలు: లింగ నిత్యనాథ్ - స్మిత
కూతుళ్లు - అల్లుండ్లు: లింగ మాధురి - మధుసూదన్
మంచికొండ గాయత్రి - రవికుమార్
మనుమళ్లు: బిన్నాల్, నిఖిల్ ఆర్య, ముకుంద్ కృష్ణ, సిద్ధార్థ్
మనుమరాండ్లు: వసంధర, అభిల
కుటుంబ సభ్యులు మరియు బంధుమిత్రులు
కీ॥శే॥ లింగ అంజయ్య గుప్త గారు
మరణం: 12-10-2023
కార్యస్థలం: మా స్వగృహము శ్రీనివాసము, గోఖలేనగర్, రామంతాపూర్ తేది: 30-9-2024

అంత్యక్రియలు, వర్ధంతి, జయంతి
పై సమాచారం సంబంధీకులందరికి చేరాలి ఎలా?
మీ ప్రయత్నానికి ఒక సులభ మార్గం
ఈనాడు లో ప్రకటన ఇవ్వడం ద్వారా
మీ సమస్యకు పరిష్కారం లభించును.
GST 5% అదనం
ఈనాడు హైదరాబాద్ సిటీలో కలర్ ప్రకటన రేటు చాలా తక్కువ
99635 22257
L.B.Nagar & Uppal: 90000 15736
Ameerpet, Oldcity & Sec-bad : 80085 97633
Kukatpally : 8008515142

రూ.9.90లకే జీబీ డేటా ఇస్తున్నాం

- వచ్చే ఆరేళ్లలో 6జీ సేవలు అందించనున్నాం
- టెలికాం శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అతుల్ సిన్హా

ఈనాడు, హైదరాబాద్: 'ప్రైవేటు టెలికాం సంస్థలతో పోల్చుకుంటే బీఎస్ఎన్ఎల్ సేవలు ఎంతో చవకైనవి. రూ.9.90 పైసలకే ఒక జీబీ డేటా ఇస్తున్నాం. ఇంత తక్కువ ధరలో ఏ టెలికాం ఆపరేటర్ ఇవ్వడం లేదు. ఇంటర్నెట్ వేగాన్ని పెంచేందుకు అత్యాధునిక సమాచార సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరిశోధనలు చేస్తున్నాం. వచ్చే ఆరేళ్లలో ఆరో జనరేషన్(6-జీ) సేవల్లో పది శాతం బీఎస్ఎన్ఎల్ వాటా ఉండాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకూ సమాచార నెట్‌వర్క్ లేని 26 వేల గ్రామాల్లో వీలైనంత వేగంగా సెల్‌ఫోన్ టవర్లు ఏర్పాటు చేయనున్నాం. విద్యార్థులు, యువత మా నెట్‌వర్క్‌కు ఆకర్షితులయ్యేలా ప్రణాళికలు అమలు చేస్తున్నా''మని కేంద్ర టెలికాం శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్(ఐసీటీ) అతుల్ సిన్హా అన్నారు. ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లో ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన 'ఈనాడు'తో మాట్లాడారు. ప్రైవేటు టెలికాం ఆపరేటర్లు రీఛార్జీ ధరలు పెంచినా.. తాము మాత్రం పెంచడం లేదని తెలిపారు.

కొత్త సంవత్సరంలో 5జీ సేవలు

ఇంటర్నెట్, మొబైల్ సేవల్లో ప్రైవేటు, సంస్థలతో పోలిస్తే.. వేగంగా ముందుకు వెళ్తున్నాం. కొత్త సంవత్సరంలో బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు 5జీ సేవలు అందించనున్నాం. 5జీ టెక్నాలజీని పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించాం. చరవాణులు, బ్రాడ్‌బాండ్ సహా ఇతర ప్రొడక్ట్స్‌లకు ఇది ఉపయోగపడనుంది. విదేశీ సంస్థలకు దీటుగా సాంకేతిక పరిజ్ఞానం ఉండడంతో మెట్రో నగరాల్లో విద్యార్థులు, యువకులు బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌ను ఇష్టపడుతున్నారు.

గ్రామీణ ప్రాంతాలకు ప్రాధాన్యం.. ప్రైవేటు, కార్పొరేటు, విదేశీ టెలికాం ఆపరేటర్లు పట్టణాలు.. నగరాలకే ప్రాధాన్యమిస్తుండగా.. వివిధ రాష్ట్రాల్లోని మారుమూల గ్రామీణ ప్రాంతాలకే మేం ప్రాధాన్యమిస్తున్నాం. బ్యాంకులు, ఆసుపత్రులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు డిజిటల్ సేవలు అందుబాటులోకి తీసుకురావడంతో ఇంటర్నెట్ కనెక్టివిటీకి ప్రాధాన్యం పెరిగింది. నగదుకు బదులుగా డిజిటల్ చెల్లింపులు పెరిగాక గ్రామాల్లో మహిళలు, పిల్లలు జీపే, ఫోన్‌పే, పేటీఎం, భీమ్‌లను ఎంచుకుంటున్నారు. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకునే 26వేల గ్రామాల్లో సెల్‌ఫోన్ టవర్లు అందుబాటులోకి తీసుకువస్తున్నాం.

'గజ్వేల్ ఘటన'పై నిజనిర్ధారణ కమిటీ నివేదిక

మహేశ్‌కుమార్‌గౌడ్‌కు నివేదిక అందిస్తున్న అచ్యుత రమేష్‌బాబు, జల్పల్ నరేంద్ర

అంబర్‌పేట, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గం ములుగు మండలంలోని దాసరపల్లి గ్రామంలో దళిత కుటుంబాలు ఏర్పాటు చేసుకున్న వినాయక మండపం దహనం ఘటనపై కాంగ్రెస్ రాష్ట్ర ఎస్సీ సెల్ వేసిన నిజనిర్ధారణ కమిటీ నివేదికను ఆదివారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు అందజేశారు. ఈ ఘటనపై నిజనిర్ధారణకు కాంగ్రెస్ దళిత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ నగరిగారి ప్రీతం... ఉపాధ్యక్షుడు అచ్యుత రమేష్‌బాబు నేతృత్వంలో జల్పల్ నరేంద్ర, డా.పెరుమాండ్ల రామకృష్ణ సభ్యులుగా త్రిసభ్య కమిటీని వేశారు. ఘటనపై విచారణను పూర్తిచేశాక.. నివేదికను టీపీసీసీ అధ్యక్షుడికి అందజేసినట్లు అచ్యుత రమేష్‌బాబు వెల్లడించారు.

దేవాలయాల భూములు పరిరక్షించాలి

గోల్నాక, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అన్యాక్రాంతమవుతున్న దేవాలయాల భూములను పరిరక్షించాలని భాజపా ధార్మిక సెల్ రాష్ట్ర కన్వీనర్ అన్నా వజ్జుల సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ... నగరంలోని బేగంబజార్ పరిశురామ ఆలయానికి చెందిన 1100 చదరపు గజాల స్థలాన్ని కొందరు కబ్జా చేశారని ఆరోపించారు. దీంతో భాజపా ధార్మిక సెల్, సర్వ బ్రాహ్మణ పరిషత్, పరశురామ ఆలయ కమిటీ సభ్యులు సంయుక్తంగా పోరాటం చేసి ఈ స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా కాపాడినట్లు పేర్కొన్నారు. ఆలయాల భూముల పరిరక్షణకు భాజపా ధార్మిక సెల్ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తుందని కూడా ఆయన చెప్పారు.

సుందరీకరణ.. గోడలపై బొమ్మలే ఆకర్షణ

నగర సుందరీకరణలో భాగంగా ప్రధాన రహదారుల పక్కన ప్రహరీలపై వివిధ రకాల చిత్రాలను వేస్తున్నారు. రాజ్‌భవన్ రోడ్డులో రైల్వే మార్గం పక్కన గోడలపై వేసిన బొమ్మలు ఆకట్టుకుంటున్నాయి.

విండ్సర్ కారుతో సినీనటి సీరత్‌కపూర్, ఎండీ బషీర్ బాబుఖాన్, డైరెక్టర్ సిరాజ్ బాబుఖాన్

ఎండీ విండ్సర్ సీయూవీ కారు ఆవిష్కరణ

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: వినియోగదారులకు అందుబాటు ధరలో, అత్యాధునిక ఫీచర్లతో ఎండీ విండ్సర్ సీయూవీ కారును తీసుకొచ్చారని, ఇలాంటి కార్లు తమకెంతో ఇష్టమని సినీనటి సీరత్‌కపూర్, బుల్లితెర నటుడు మానస్ నాగులపల్లి తెలిపారు. ఆదివారం సాయంత్రం సికింద్రాబాద్‌లోని మహాత్మాగాంధీ రోడ్డులోని ఎంజీ మోటర్స్ షోరూంలో ఎండీ బషీర్ బాబు ఖాన్, డైరెక్టర్ సీరజ్ బాబుఖాన్‌తో కలిసి విండ్సర్ కారును ఆవిష్కరించారు. వినియోగదారుల భద్రత, సౌకర్యం, అత్యాధునిక ఫీచర్ల మేళవింపుతో విండ్సర్ కారును తీసుకొచ్చామని డైరెక్టర్ సీరజ్ బాబుఖాన్ తెలిపారు.

మణికొండలో మాంగళ్య షోరూం ప్రారంభం

నార్సింగి న్యూస్‌టుడే: మణికొండలో కొత్తగా ఏర్పాటు చేసిన మాంగళ్య షోరూంను సినీ నటి శ్రీలీల ఆదివారం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. షోరూంలో అన్ని రకాల వస్త్రాలు ఆకట్టుకుంటున్నాయన్నారు. మాల్ డైరెక్టర్లు పి.ఎన్.మూర్తి, కాసం నమఃశివాయ, కాసం మల్లికార్జున్, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పుల్లూరు అరుణ్ కుమార్ మాట్లాడారు. తెలుగు రాష్ట్రాలలో 12 ఏళ్లుగా ప్రజల ఆదరణ చూరగొంటున్నామని తెలిపారు. మున్సిపల్ వైస్‌ఛైర్మన్ నరేందర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, యాలాల నరేష్, సిద్దప్ప, బషీర్, కాసం ఫణి, కాసం సాయికృష్ణ, కాసం ధీరజ్, డా. కాసం ప్రీతం పాల్గొన్నారు.

బహుముఖ సవాళ్లకు సామాజిక శాస్త్రాలతోనే పరిష్కారం

జ్యోతి వెలిగిస్తున్న జిష్ణుదేవ్ వర్మ, చిత్రంలో ప్రా.ఆసిమ్ ప్రకాష్, డీపీ సింగ్, మనోజ్ కుమార్ తివారి, నరేంద్ర మిశ్రా

ఫిలింనగర్, న్యూస్‌టుడే: జీవిత కాల అభ్యాసానికి అవసరమైన ఆలోచనలను టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టీఐఎస్ఎస్) అకాడమీలో విద్య పెంపొందిస్తుందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో టీఐఎస్ఎస్ హైదరాబాద్ విభాగం పదో వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రస్తుత రోజుల్లో సామాజిక శాస్త్రాల విద్యకు పెరుగుతున్న ప్రాధాన్యాన్ని వివరించారు. వైస్ ఛాన్సలర్ ప్రొ.మనోజ్‌కుమార్ తివారీ, ప్రొ. డి.పి.సింగ్, టీఐఎస్ఎస్ హైదరాబాద్ క్యాంపస్ డైరెక్టర్ ప్రొ.ఆసిమ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వంతో వైద్యుడికి మరింత విలువ

బ్రహ్మానందానికి చిత్రపటాన్ని అందిస్తున్న రాజశేఖర్, మన్నం గోపీచంద్, డాక్టర్ రమేష్ గుడపాటి

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: మనిషిని భయం, ఒత్తిడి ఎంతో కుంగదీస్తాయనీ.. ముందుగానే గుర్తించి వాటి నుంచి బయటపడితే మంచి ఆరోగ్యంతో ఉంటామని సినీ హాస్యనటుడు డాక్టర్ బ్రహ్మానందం అన్నారు. వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకుని జూబ్లీహిల్స్‌లోని దసపల్లా హోటల్‌లో ఆదివారం స్టార్ ఆసుపత్రి ఏర్పాటు చేసి 16 ఏళ్లవుతున్న సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. పువ్వుకు వాసన ఎంత విలువనిస్తుందో.. వైద్యుడికి మానవత్వం అంత విలువనిస్తుందని అన్నారు. స్టార్ ఆసుపత్రుల గ్రూపు ఎండీ డాక్టర్ గోపీచంద్ మాట్లాడుతూ గుండె వ్యాధులను నియంత్రించడానికి ఆరోగ్యకరమైన జీవనశైలి ఎంతో ముఖ్యమన్నారు. జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ గుడపాటి మాట్లాడుతూ ఆసుపత్రిలో మంచి వాతావరణంతో రోగి ఎంతో త్వరగా సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా తిరిగి వెళ్తారన్నారు. ఆసుపత్రి ప్రారంభించిన మొదటి రోజుల్లో గుండె శస్త్రచికిత్సలు చేయించుకుని ఆరోగ్యంగా జీవిస్తున్న పదిహేను మందికి 'స్టార్ ఇన్‌స్పైరింగ్ హార్ట్ అవార్డు-2024'ను అందించారు. ఆసుపత్రి డైరెక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆభరణాల పరిశ్రమల సేవలకు పురస్కారం

అవార్డు అందుకుంటున్న కీర్తిలాల్స్ డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ఆభరణాల పరిశ్రమకు అందించిన విశేషమైన సేవలకు గుర్తింపుగా కీర్తిలాల్స్ డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్‌ను ఐకాన్ ఆఫ్ ది జ్యువెలరీ ఇండస్ట్రీ 2024 అవార్డుతో ముంబయిలోని జియో కన్వెన్షన్ ట్రెడ్ సెంటర్‌లో సత్కరించారు. స్టోర్ ఆఫ్ ది ఇయర్, రింగ్ ఆఫ్ ది ఇయర్, ధీమ్ బేస్డ్ జ్యువెలరీ, బ్రైడల్ జ్యువెలరీ ఆఫ్ ది ఇయర్ అవార్డులు అందుకున్నట్లు ఆల్ ఇండియా జెమ్ అండ్ జ్యువెలరీ డొమెస్టిక్ కౌన్సిల్ పేర్కొంది.

ఎఫ్ఎన్‌సీసీ అధ్యక్షుడిగా కె.ఎస్.రామారావు విజయం

మాట్లాడుతున్న కె.ఎస్.రామారావు, చిత్రంలో తుమ్మల రంగారావు, కాజ సూర్యనారాయణ తదితరులు

ఫిలింనగర్, న్యూస్‌టుడే: ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్ (ఎఫ్ఎన్‌సీసీ) ఎన్నికల్లో ఎఫ్ఎన్‌సీసీ అధ్యక్షుడిగా సినీ నిర్మాత కె.ఎస్.రామారావు విజయం సాధించారు. ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్‌లో ఆదివారం ఎఫ్ఎన్‌సీసీ ఎన్నికలు హోరాహోరీగా జరిగాయి. అధ్యక్ష పదవికి డా. జ్యోతిప్రసాద్ కోసరాజు, కె.ఎస్.రామారావులు పోటీ పడ్డారు. ఉపాధ్యక్షుడుగా ఎస్.ఎన్.రెడ్డి, కోశాధికారిగా జాజుల శైలజ, పర్మనెంట్ కమిటీ మెంబర్స్‌గా కొగంటి భవాని వీవీజీ కృష్ణంరాజు, సీహెచ్ వరప్రసాద్‌రావు, ఏడిద సతీష్, మోహన్ వడ్లపట్లలు విజయం సాధించారు.

EENADU eClassifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER
Data Editing Software Projects are Available for Outsourcing to Companies with Min. 5 Computers. Ph: 9652438681

SAREES
మావద్ద కంచి, ఆరణి, ధర్మవరం, ఉప్పాడ, వెంకటగిరి, గద్వాల్, పోచంపల్లి, నారాయణపేట, అన్ని రకముల పట్టు చీరలు & బెనారస్, కలకత్తా, సూరత్ ఫ్యాన్సీ చీరలు హోలసేల్‌గా లభించును. Hyd, మియాపూర్ ఆల్విన్ కాలనీ. ✆ 7396099834.

TENDER
స్క్రాప్ కాంట్రాక్ట్: 100 మె.ట. అల్యూమినియం డ్రాస్, చిప్స్, పౌడర్, MS, కార్టన్, కంటైనర్లు, తుక్కు. తనిఖీ ప్లాంట్- I, బొల్లారం & ప్లాంట్- II, సదాశివపేట వద్ద. రాజే (మద్రాస్) లి, IDA బొల్లారం, మెదక్ జిల్లా- 502325 వద్ద 1-10-2024 మ 2 గం.లకు టెండరు నిర్వహించబడును. వెల్కమ్ ఆక్షనీర్స్, చెన్నై-14. సెల్: 09840731925, www.welcomeauctioneers.com.

FINANCIAL SERVICES

CHITS
కపిల్, మార్గదర్శి & CVR చిట్స్‌లో లక్ష నుండి కోటి రూపాయల చిట్స్, న్యూ మరియు వేకెంట్ చిట్స్ కలవు. ✆ 9573130999.

REAL ESTATE

FLAT FOR SALE

ECIL
Kapra, Srinivas Nagar, Jyothi Pearl Apartments, 3 BHK, Flat No.501, 1872 Sft, E/Face. Contact: 9866755549. No Brokers.

KUKATPALLY
Individual Floor 3-BHK Apartment (1900, 2200 & 2275 Sft E/W/N Facing) Flats for Sale in KPHB. Raja- 9966744544.

SAGAR ROAD
BNరెడ్డి నగర్, సాగర్ హైవే రోడ్డు నందు 2BHK, 3BHK Flats- Ready to Move అమ్మకమునకు కలవు. 4,500/-P.Sft only. Ph:8523044468

JUBILEEHILLS
3BHK E/F Flat (2000sft) for sale at Filmnagar, Jubileehills Opp: Apollo Medical college & Hospital. Ph: 9849010325

KOMPALLY
Flat for Sale Approx 1500x15 Sq.Ft North Facing at Dulapally ✆ 9949986656, 9533633010.

PLOT FOR SALE

ADIBATLA
పాక్స్‌కాన్, రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ దగ్గరలో 25 ఎ॥ల్లో HMDA ప్లాట్లు @ ఎలిమినేడు, స్పాట్ రిజి. Nr ORR, TSIIC, ఫ్రీ సైట్ ట్రిప్.లోన్స్. Ph: 8978470361

ECIL
Kapra: Sri Enclave(NRI colony) 170sqy East Face Gated community, 24/7 security. Godavari water. call: 8247310332

HAYATHNAGAR
500 yds plot for sale at Autonagar Vanasthalipuram, 80 ft road facing, Contact: 9246522275

MEDCHAL
Villa Plots Available at Saket Sizes: 200 to 600 sq.yds Near Ayodhya Circle, Gowdavelli. Cont: 97015 49945

SECUNDERABAD
266 Sq.Yards W/F AP Text Book Colony Gunrock 200 Sq.Yards N/W/F Kiran Enclave Diamond Point ✆ 9949986656, 9533633010.

SHADNAGAR
Shadnagar Town Villa Plots Rs.16,500/- P.sq.yd Nego. DTCP/ RERA. Bank Loans. 2KM From Bus Stand, Gated Comm. Ph: 9666856378

SRISAILAM HIGHWAY
8 Lakhs discount on Land Lord share Villa Plots @ Kadthal- Srisailam H/W nr Future City & Pharma City. Raja- 9966744544.

SHANKARPALLI
JB's Infra వారి అతితక్కువ ధరలో @ మొమిన్‌పేట. DTCP Appvd. ప్రీమియం లేఅవుట్ VKB Dt. Spl ఆఫర్- 7500/- P. Sq.Yd. 9010277299, 9032645065.

GENERAL
800 Sq.yds for sale at peddagolconda facing service road of ring road. Contact: 9848274893/ 9246522275

Plots for Sale HMDA Approved Bhongir 300 Sq.Yds N/E Facing and near Ramoji Film City Malkapur 266 Sq.Yds E/F Direct Buyers. ✆ 9949178495.

సువర్ణభూమి హైదరాబాద్, వైజాగ్‌లో. డిటిసిపి హెచ్ఎండిఏ హుడా అప్రూవల్ కలిగిన ప్లాట్లు గలవు. ఎటువంటి ఏజెంట్ బ్రోకర్ లేకుండా డైరెక్ట్ కంపెనీ ద్వారా కొనుక్కోవచ్చు. చాలా తక్కువ ధరకే 70% లోన్ ఫెసిలిటీ కలదు. 9966777773.

FARM HOUSES
Srisailam Highway-13Km to Kadthal. Best Location. 900 Sq.Yds. Gated Farm Land with Gate, Plantation, Fencing, Security. 36L Only. Clear Title. Just 2Km to RRR. Best Investment. Site Pics Call: 89288 85353

TO LET
Office space 2BHK rent @ SR Nagar, 1100 sft, East facing, Newly constructed, Lift available, 300 meters from Metro. Ph: 9676665324

JOBS
Prakash Hyundai Nizamabad Requires Below Staff: Spares Parts Manager: 5-6 Yrs Exp., Spares Parts Assistant: 2 Yrs Exp., Contact: 9133311667 (Whatsapp), Email: hrprakashyundai@gmail.com

Wanted Experienced ''Sales Managers'' for a Reputed Construction Company at Kompally. Contact: 9000216443, 9000216448.

Req home appliance field services ENG's 10no female TL 2no field sales exe's 5no sal+ fuel+ ince. Ph: 9059223423

Wanted Sales Boy/ Girl for Exclusive Night Wear Garments Shop @ Bachupally Main Road near Volvo Center. Time 10 AM-9 PM. ✆ 9390152875.

Kotak Group Need Rtd Govt./ Pvt, HW, Doctors Tax Con. P/F Jobs 30K pm. V N Chary: 9866311741

Wanted for Showroom in koti office boys & helpers. contact: 9440091832

Wanted Godown Incharge for FMCG Products Preferable Areas: Alwal & Secunderabad. Good Salary. ✆ 7893003525.

క్యాషియర్ కావలెను. అనుభవం ఉన్న/ లేకున్న Comp. నాలెడ్జ్. వ: 35 లోపు. జీతం: 10-15,000/- వరకు. రూపల్కి PVT మార్కెట్, కొత్తపేట. 9948074388, 9246287462.

హౌస్‌కీపింగ్ బాయ్స్/ సూపర్‌వైజర్లు/ సెక్యూరిటీ/ మార్కెటింగ్ మేనేజర్లు, ఫీల్డ్ ఆఫీసర్లు కావలెను. సెక్టార్ సర్వీసెస్ LLP. ✆ 9963088813, 9963261110.

త్రివేణి హాంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను/ పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం 18k. ✆ 91609 00024, 96404 00073.

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీ/పు॥ ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ॥ 15-40 వేలు. ఫ్రీ రూమ్ + భో॥ Hyd. 9182260297.

వాచ్‌మెన్ కావలెను. ప్రముఖ విద్యా సంస్థలో పనిచేయుటకు వాచ్‌మెన్ కుటుంబం కావలెను. భోజనం + వసతి ఇవ్వబడును. ✆ 9493979566/ 7780266711

హోటల్ కొరకు సప్లయర్స్, కటింగ్ బాయ్స్, క్లీనింగ్ మరియు మోరీ బాయ్స్ కావలెను. 15-24 వేలు మరియు భోజనం, వసతి కలదు. Ph:9394894138, 6300978030.

FACULTY/ TEACHERS
Wanted Educated Woman to Teach Primary School with Good Communication Skill. Call: Gandhian School. ✆ 9989399427, 9392501989.

MARKETING/ SALES
JR Jewel Palace, Miyapur New Showroom is hiring for Sales Staff. Salary: 20K- 50K PM. Interested can share your resume on WhatsApp: 9515278203.

రియల్ ఎస్టేట్ చరిత్రలో ఫస్ట్ టైమా సంస్థ యొక్క DTCP గేటెడ్ కమ్యూనిటీ వెంచర్స్. మార్కెటింగ్ చేయుటకు టీం లీడర్స్ శాలరీ 45K, టెలికాలర్స్ శాలరీ 25K+ గిఫ్ట్స్+ ఇన్సెంటివ్స్+ బొనాంజా. ✆ 8341965559.

DRIVERS
Wanted Driver For Ashok Leyland Dost & Mahindra, JEETO staying near Balanagar cell: 9100921049

ACCOUNTING
Required Tally Operator Ladies/ Gents to work in Office at Suraram, Opp: Mallareddy Hospital, Good Salary. ✆ 9866222229, 8074645445.

SECURITY GUARDS
సెక్యూరిటీ గార్డ్స్, లేడీ గార్డ్స్ సూరారం నందు హాస్పిటల్ మరియు హాస్టల్‌లో పనిచేయుటకు కావలెను. మంచి జీతం. Ph: 7799766169, 8688010536

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

BOOK YOUR CLASSIFIED
Ad ₹1450/- (5 Lines B/w)
3 Ads Package ₹3695/-
7 Ads Package ₹8580/-
★ GST 5% Extra
Ph: 040- 23440304, 23318181, Extn: 6422
Through Online
www.eenaduclassifieds.com

వృద్ధుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం: మంత్రి

బెలూన్లు ఎగురవేసి ర్యాలీ ప్రారంభిస్తున్న సీతక్క

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: వృద్ధుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డి.అనసూయ సీతక్క అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రస్థాయి అవగాహన ర్యాలీని ఆదివారం ఉదయం నెక్లెస్ రోడ్డులో నిర్వహించారు. మంత్రి బెలూన్లు ఎగురవేసి, జెండా ఊపి ప్రారంభించారు. వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్ల సాధికారిత శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వికలాంగులు, వృద్ధుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి జిల్లాలో వృద్ధాశ్రమాల నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. ర్యాలీ జలవిహార్ నుంచి పీపుల్ ప్లాజా వరకు కొనసాగింది. తెలంగాణ దివ్యాంగుల కార్పొరేషన్ ఛైర్మన్ ముత్తినేని వీరయ్య, దివ్యాంగుల, వయోవృద్ధుల, మహిళ సంక్షేమ శాఖ సంచాలకులు బి.శైలజ, సహ సంచాలకులు రాజేందర్, ఎన్జీఓ సంఘాలు పాల్గొన్నారు.

ప్రైవేటు ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించండి

జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్సీ వాణీదేవి, శ్రీనివాస్‌గుప్తా తదితరులు

నాగోలు, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం దిల్‌సుఖ్‌నగర్‌లో ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మ

వసుంధర

vasundhara@eenadu.in

'స్త్రీగా ఎవరూ పుట్టరు. వారు అలా తయారవుతారు..' ఇది ఫ్రెంచ్ తత్వవేత్త సిమోన్ డి బ్యూవోయిర్ ప్రఖ్యాత వ్యాఖ్య. స్త్రీత్వం అనేది సామాజిక నిర్మాణమే తప్ప జీవశాస్త్రం, మనస్తత్వశాస్త్రం లేదా మేధస్సు పరమైన ఫలితం కానేకాదంటారు బ్యూవోయిర్. ఆమె వాదన ప్రకారం స్త్రీలు వారి పెంపకంద్వారా బలహీనంగా తయారవుతారు తప్ప పుట్టుకతో కాదు. సమాజం మహిళల్ని ఎలా భిన్నంగా చూస్తుంది, అది వారిపైన ఎలాంటి ప్రభావం చూపుతుందనే అర్థంతో ఆమె ఇలా వ్యాఖ్యానించారు.

ప్రోత్సహిస్తే దూసుకుపోతారు!

ప్రపంచంలో మూడో అతిపెద్ద అంకుర సంస్థల వ్యవస్థ భారత్. ఎన్నో విజయగాథలూ వింటున్నాం. వీటి వ్యవస్థాపకుల్లో మహిళలు మాత్రం తక్కువే. వారిని ఇటువైపు ప్రోత్సహించే దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయని చెబుతారు నిపుణులు ప్రియా గజ్దర్, బాబీ అజ్మీరా. తాజాగా హైదరాబాద్‌లో జరిగిన 'ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫెస్టివల్' వేదికగా ఈ అంశంపైన వీళ్లు పంచుకున్న అభిప్రాయాలివి...

ఆ ఆకాంక్ష మహిళల్లో రావాలి!

ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్(ఫ్లో)లో దేశవ్యాప్తంగా 12వేల మంది, హైదరాబాద్ చాప్టర్‌లో 1200 సభ్యులున్నారు. మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగేలా సాయపడేందుకు ఏర్పాటైన వేదిక మాది. 'ఫ్లో' సభ్యులకు అన్ని రకాలుగా సంస్థ నుంచి సాయం అందుతుంది. వెంచర్ క్యాపిటలిస్టుల్ని పరిచయం చేయడం, తమ ఉత్పత్తి గురించి పిచింగ్ ఇవ్వడంపైన శిక్షణ, టీ-హబ్, వీ హబ్, ట్రిపుల్ఐటీ హైదరాబాద్, ఐఐటీ హైదరాబాద్ సాయంతో వారికి కావాల్సిన సాంకేతికత అందేలా చూడటం, అంకుర సంస్థల పోటీలకు వెళ్లేలా, ఫండింగ్ అందేలా, మార్కెట్, ధరల నిర్ణయంపైన అవగాహన పెరిగేలా.. ఇలా అన్ని విధాలా సాయపడతాం. గామెట్ క్రాఫ్ట్ ఫుడ్స్, యూనివర్స్ స్కూల్ ప్రోగ్రామ్, ప్యానెల్ ఎక్స్ లాంటి అంకుర సంస్థలు మా సభ్యులు ప్రారంభించినవే. దీంతోపాటు సామాజిక బాధ్యతగా.. మేడ్చల్ జిల్లా, రావిపాడుకు చెందిన 100 మంది మహిళా రైతులకు ఆధునిక వ్యవసాయంలో శిక్షణ ఇచ్చాం. డిజిటల్, ఫైనాన్షియల్ లిటరసీ నేర్పిస్తున్నాం. గ్రామీణ మహిళలు తమ ఆరోగ్యంపైన దృష్టి పెట్టేలా కొన్ని కార్యక్రమాలు చేస్తున్నాం. గొల్లభామ చీరలకు జియో ట్యాగ్ ఉండటంతో మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. సిద్దిపేట ప్రాంతంలో ఇప్పటివరకూ ఈ చీరల్ని పురుషులే నేస్తున్నారు. దీంతో ఫ్లో ఆధ్వర్యంలో మహిళలకు గొల్లభామ చీరల్ని నేసే నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని చేపడుతున్నాం. గతంలోనూ పోచంపల్లి చేనేతలతో, చేర్యాల పెయింటింగ్స్ కళాకారులతో కలిసి పనిచేశాం. 'ఫ్లో' ఎగ్జిబిషన్లలో వీరికి ఉచితంగా స్టాల్స్ పెట్టుకునే అవకాశం ఇస్తున్నాం. ఈ కళాకారుల ఉత్పత్తుల్ని కార్పొరేట్ గిఫ్టింగ్ కోసం ఉపయోగించేలా సాయపడుతుంటాం. మహిళలు వ్యాపారులుగా మారాలంటే వారిలో 'నేనూ ఏదైనా సాధించాలి' అనే ఆకాంక్ష రావాలి. అలాంటివారికి సాధించగలరనే ఆత్మవిశ్వాసం తీసుకురావాలి. ప్రభుత్వ, పరిశ్రమ వర్గాలు ఈ దిశగా వారికి అవగాహన, ప్రోత్సాహం అందించాలి.

– ప్రియా గజ్దర్, సీఈఓ ఆర్‌బీసీ పరల్డ్‌వైడ్, ఛైర్‌పర్సన్ ఫిక్కీ ఫ్లో హైదరాబాద్

చేయూతనిస్తేనే...

ఈ టెక్నాలజీ ప్రపంచంలో ఏదైనా సాధ్యమే. కానీ, అందుకు సపోర్టు సిస్టమ్, ఎకోసిస్టమ్ ఉండాలి. దానికోసం నాకు సాధ్యమైనంత సాయం చేస్తున్నా. స్వయం సహాయక బృందాలు, యువత, స్టార్టప్‌లను ప్రభుత్వంతో అనుసంధానిస్తున్నా. ప్రస్తుతం త్రిపుర ప్రభుత్వంలో 'సీఎం ట్రైబల్ మినిస్ట్రీ'లో సలహాదారుగా ఉంటూ.. విద్య, ఉపాధి, సాధికారత, ఆంత్రప్రెన్యూర్‌షిప్ వంటివాటి మీద పనిచేస్తున్నా. మహిళలు స్వతహాగానే వ్యాపార పటిమ ఉన్నవాళ్లు. అయితే, పట్టణ ప్రాంతాల్లో కొంత అవగాహన ఉన్నా, గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఇప్పుడిప్పుడే బయటకు వచ్చి వ్యాపారం దిశగా అడుగులు వేస్తున్నారు. నైపుణ్యం, తెలివితేటలు ఉన్నప్పటికీ ఆర్థిక పరిస్థితులు, సరైన మార్గదర్శకం లేకపోవడం, కుటుంబ బాధ్యతల కారణంగా చాలా మంది మహిళలు ముందుకు అడుగేయలేకపోతున్నారు. అయితే, కొన్ని ప్రాంతాల్లోని మహిళలు వారంతట వారుగా, స్వయం సహాయక సంఘాలుగానూ ఏర్పడి వ్యవసాయ ఉత్పత్తులతోపాటు మరికొన్ని రకాల ఉత్పత్తులు తయారు చేయగలుగుతున్నారు. అలాంటి వారిని ప్రభుత్వంతో అనుసంధానం చేసి సబ్సిడీలు, శిక్షణ వంటివి ఇప్పిస్తున్నాం. ఇలా స్టార్టప్‌లను ప్రోత్సహించే ఒక వ్యవస్థను తయారుచేస్తున్నాం. ప్రస్తుతం మనం కొంతమంది మహిళలు రోడ్డు మీద జొన్నరొట్టెలు అమ్మడం చూస్తున్నాం కదా! అదే పదిమంది కలిసి జొన్నరొట్టెలు చేసేలా, వాళ్లకు విమానాశ్రయాలు, రిటైల్ దుకాణ సముదాయాలు, సచివాలయం.. లాంటి చోట్ల స్టాల్స్ ఇస్తే, మహిళలు ధైర్యంగా వ్యాపారం వైపు అడుగులేస్తారు. ఇలా ప్రతి జిల్లాలో ఒక్కొక్క ఉత్పత్తి గుర్తించి అక్కడ ఉన్న మహిళలకు శిక్షణ ఇస్తే మరింత మంది వ్యాపారవేత్తలుగానూ రాణిస్తారు.

– బాబీ అజ్మీరా, తెలంగాణ మొదటి ట్రైబల్ కమర్షియల్ పైలట్, త్రిపుర రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు

ఒక్కరే సంతానమా?

తల్లిదండ్రులకు ఒక్కరే సంతానమైతే గారాబం ఎక్కువై అది అనేక ఇతర సమస్యలకు దారితీస్తుందనే అభిప్రాయం సమాజంలో ఉంది. కానీ తాజా అధ్యయనాలు అందుకు భిన్నమైన అభిప్రాయాన్ని చెబుతున్నాయి. సంతానం ఒక్కరైన పిల్లలే ఆరోగ్యంగా, సంతోషంగా ఉంటారంటున్నాయి. ఒక్కరే ఉన్న పిల్లలు, తోబుట్టువులున్న పిల్లల మానసిక ఆరోగ్యాలను పోల్చుతూ చైనాలో ఒక అధ్యయనం చేశారు. కుటుంబంలో ఎక్కువ మంది పిల్లలుంటే వారికి మానసిక ఆరోగ్య సమస్యలు వచ్చే ముప్పు అధికమని ఈ అధ్యయనంలో తేలింది. 2.4లక్షల మందితో చేసిన 113 అధ్యయనాల డేటాను తీసుకుని చైనాలోని మకావూ విశ్వవిద్యాలయంలో ఈ పరిశోధన చేశారు. మానసిక సమస్యలైన ఒత్తిడి, ఆందోళన, ఓసీడీ వంటివి తోబుట్టువులు ఉన్నవారికంటే ఒక్కరే ఉన్న పిల్లల్లోనే తక్కువని ఈ అధ్యయనంలో తేలింది. తోబుట్టువులు లేని పిల్లలు ఐక్యూ టెస్టుల్లో, స్కూల్ సబ్జెక్టుల్లో మెరుగ్గా ఉంటున్నారనీ చెబుతున్నారు. తల్లిదండ్రులు వీరికి ఎక్కువ సమయం, ఇతర వనరులు కేటాయించడమే అందుకు కారణమని పరిశోధకులు అభిప్రాయపడ్డారు. చదువుల పరంగా దీర్ఘకాలంలో ఈ విషయంలో తేడా రావొచ్చేమోకానీ, ఒక్కరే సంతానమైతే చిన్నప్పుడు తల్లిదండ్రులు చూపించే సంరక్షణ వారికి లాభం చేకూర్చేలా ఉందంటున్నారు. అమెరికాలో 29 ఏళ్ల వయసున్న 3221 మందిపైన చేసిన మరో అధ్యయనంలోనూ ఇదే తేలింది. ఒక్కరే ఉన్న పిల్లలు... తోబుట్టువులున్న పిల్లలతో సమానంగా లేదా అంతకంటే ఎక్కువ సంతోషంగా ఉన్నారని ఈ అధ్యయనం చెబుతోంది.

దుమ్మా కొట్టండి..!

వ్యాయామం ఎందుకు చేస్తారు? ఇదేం ప్రశ్న! ఆరోగ్యం కోసమేగా అంటారా? సరే అయితే... 'ఈరోజు అస్సలు లేవాలనిపించట్లేదు. అమ్మో అయినా జిమ్‌కి వెళ్లాలి', 'ఇక చేయనని శరీరం మొరాయిస్తోంది. కానీ ఇంకా అరగంట చేయాలి'... ఇలా ఎప్పుడైనా అనిపించిందా? 'అవును' మీ సమాధానమైనా... ఎక్సర్‌సైజ్ తరవాత బాగా అలసిపోతున్నా... మీరు 'వర్కవుట్ బర్నవుట్' బారిన పడ్డట్టే! అయితే ఇది రోజూ వ్యాయామమంటే బద్ధకించే వారికి మాత్రం కాదు. మామూలుగానే అమ్మాయిలు సన్నం, లావు వంటి మాటల్ని బాగా పట్టించుకుంటారు. అందుకే కాస్త బరువెక్కినా తిండికి కోత విధించుకుంటారు. ఇది తెలిసిన విషయమే! ఇక 'నీకు ఏ డ్రెస్ అయినా భలే సూట్ అవుతుంది, అసలు నువ్వు లావే అవ్వవా? నీకు పొట్టే లేదు'... సోషల్‌మీడియాలో ఈ కామెంట్ల కోసం మితిమీరి వర్కవుట్లు చేసి, ఇలా బర్నవుట్ బారిన పడుతున్నారు.

వ్యాయామం చేశాక శరీరం ఉత్తేజితం కావాలి, చురుగ్గా పనిచేయాలి. అలాకాకుండా విపరీతంగా అలసిపోవడం, ఎక్సర్‌సైజ్‌పై అనాసక్తి కలగడం, నెలసరి సమయం కాకపోయినా చిరాకు, భావోద్వేగాల్లో మార్పులు... ఇవన్నీ దీని లక్షణాలే. నెలరోజుల్లో ఇన్ని కేజీలు తగ్గాలి. అమాంతం సన్నబడాలి అంటూ భారీలక్ష్యాలు విధించుకుని శరీరాన్ని కష్టపెట్టడం వల్లే ఇదంతా. రోజూ ఒకే తరహా వ్యాయామాలూ కారణమవుతుంటాయి. కాబట్టి, ఆరోజు ఎక్కువసేపు చేయాలనిపించిందా... సరే చేయండి. ఒళ్లు నొప్పులున్నా... మనసు మొరాయిస్తున్నా చేస్తే మంచి జరగకపోగా హానే ఎక్కువ. పైగా శరీరానికే రిపేర్ చేసుకోవడానికి విరామం కావాలి. కాబట్టి, ఎప్పుడైనా ఈరోజుకి వద్దు అనిపించిందా మానేయండి. రెండు రోజులకోసారి విరామం, తరచూ వ్యాయామాల్లో మార్పులు, చేరుకోదగ్గ లక్ష్యాలు పెట్టుకోండి. ఆనందంగా కొనసాగిస్తారు. అన్నట్టూ... ధ్యానం, పోషకాహారం, సరైన నిద్రకీ చోటివ్వాలి. రోజూ వ్యాయామం చేయాలన్న నియమం మంచిదే! కానీ ఉత్సాహంగా సాగితేనే కదా ప్రయోజనం... కాబట్టి, మనసు మాట విని అప్పుడప్పుడు డుమ్మా కొట్టేయండి.

ప్రవర్తన మారితే ఎలా?

మాది పెద్దలు కుదిర్చిన వివాహం. గృహిణిగా ఉండి, ఇల్లు, పిల్లల బాధ్యతలు చూసుకోవాలన్నది ఆయన కోరిక. నేనూ అందుకు అంగీకరించా. రెండేళ్ల నుంచీ ఆయన ప్రవర్తన మారిపోయింది. వ్యసనాలకు అలవాటు పడ్డారు. ఇప్పుడు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఉద్యోగం చేయాలనే ఆసక్తి నాలో తగ్గిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో నేనేం చేయాలి? **- ఓ సోదరి**

కుటుంబ బాధ్యతలు ఇద్దరి మీదా ఉంటాయి. అయితే, మీ భర్త ఇష్టానికి అనుగుణంగా ఇంటి బాధ్యతలు తీసుకునేందుకు మీరు అంగీకరించారు. మీ బాధ్యత మీరు నెరవేర్చారు. కానీ, అతను తన బాధ్యత మర్చిపోయి వ్యసనాలకు అలవాటుపడిపోయారు. తద్వారా వచ్చినవే ఈ ఆర్థిక సమస్యలు కూడా. సరే... ఏది ఏమైనప్పటికీ మీ భర్తతో కలిసి కూర్చొని మరోసారి మాట్లాడండి. కుటుంబంలోని పరిస్థితులకు అతని వ్యసనాలు ఎలా కారణమో సున్నితంగానే తెలియజేయండి. అవసరమైతే పెద్దల సహకారం కూడా తీసుకోండి. ఇంకో ముఖ్యమైన విషయం ఏంటంటే... అమ్మాయిలు తమ కాళ్ల మీద తాము నిలబడడం అవసరం. ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు భరోసా ఉంటుంది. మీకు ఆసక్తి లేదనికాకుండా, మీరూ ఏదైనా వ్యాపారమో, ఉద్యోగమో చేయడానికి ప్రయత్నించండి. ఆ ఆదాయం భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడేట్లు చూసుకోండి. ఏం చేసినా ఈ అంశాన్ని సున్నితంగా పరిష్కరించుకోవడానికి ప్రయత్నం చేయండి.

డియర్... వసుంధర
డా. మండాది గౌరీదేవి
మానసిక నిపుణురాలు

బతుకుపోరాటం... విదేశీ భాషలు నేర్పింది!

వాళ్లేమీ బిజినెస్‌లో డిగ్రీలు చేయలేదు, వ్యాపార సూత్రాలు నేర్వలేదు. కొందరైతే అక్షరం ముక్క కూడా రాని నిరక్షరాస్యులు. అయితేనేం? దేశ, విదేశీ భాషలెన్నో అలవోకగా మాట్లాడేస్తారు. ఎవరు వీళ్లంతా అంటారా? అయితే, చదివేయండి.

'ముదితల్ నేర్వగ రాని విద్యగలదే ముద్దారగ నేర్పించినన్' అన్న ఓ కవి మాటలు పుట్టపర్తిలో సత్యసాయిబాబా మందిరం ముందున్న మహిళా వ్యాపారులకు కచ్చితంగా సరిపోతుంది. ప్రపంచ ఆధ్యాత్మిక, పర్యటక కేంద్రమైన పుట్టపర్తికి విదేశీభక్తుల తాకిడి ఎక్కువే. పైగా వీరిక్కడ నెలల తరబడి ఉంటుంటారు. దీంతో స్థానికంగా ఉండే చిరు వ్యాపారులు తమ వస్తువుల్ని వీరికి అమ్మడానికి చాలా కష్టపడాల్సి వచ్చేది. అలా కొందరు మహిళలు... బతుకుపోరాటం చేయాలంటే పలు భాషలు నేర్చుకోవాల్సిన అవసరాన్ని గుర్తించారు. నెమ్మదిగా ఇంగ్లిష్, స్పానిష్, ఫ్రెంచ్, రష్యన్... వంటి పలు ప్రపంచ భాషల్ని ఒంటపట్టించుకున్నారు. వాస్తవానికి మొదట్లో కేవలం తమ వ్యాపారం సాగడానికే వారితో మాట కలిపేవారు. తరవాత ఆ విదేశీయులకు స్థానికంగా ఎదురయ్యే సమస్యలు తీర్చే కమ్యూనికేటర్స్ అయ్యారు. అద్దె ఇల్లు వెతికిపెట్టడం, పనులు చేసేందుకు సహాయకుల్ని నియమించడం, సరకులు కొనుగోళ్లలో సాయం చేయడం వంటివి చేస్తూ వాళ్లతో స్నేహబంధాన్ని కొనసాగిస్తున్నారు. ఈ అలవాటే తమ దగ్గరకి వచ్చిన వ్యక్తి ఏ దేశస్థులో గుర్తించి వారి భాషను మాట్లాడుతూ వాళ్లని మెప్పిస్తున్నారు.

ఆ కిటుకే జీవనాధారమైంది...

– సాయిసుధ

పేదరికం వల్ల చదువుకోలేకపోయా. బాబా గుడి ముందు పాతికేళ్లుగా పూల వ్యాపారం చేస్తున్నా. విదేశీయులతో వ్యాపారం చేయాలంటే ఇంగ్లిష్‌తో పాటు ఆయా దేశాల భాషల్ని నేర్చుకోవడమొక్కటే మార్గమని గ్రహించి నేర్చుకున్నా. ఆ ప్రయత్నమే నాకు నాలుగు రూపాయలు సంపాదించుకునేలా చేసింది. ఇంగ్లిష్, ఇటాలియన్, రష్యన్, ఫ్రెంచ్ మాట్లాడగలను.

నా దగ్గరే పండ్లు కొంటారు

– గంగమ్మ

నాకు 80 ఏళ్లు. సత్యసాయి గుడి ముందు గత 35 ఏళ్లుగా పండ్లను అమ్ముతుంటా. ఎక్కడెక్కడి నుంచో భక్తులు వస్తుంటారు. వారితో వ్యాపారం సాగించాలంటే... హిందీ, ఇంగ్లిష్ తప్పనిసరి. నేను మాట్లాడితే ముచ్చటపడుతుంటారు. మళ్లీ మళ్లీ నా దగ్గరకే వచ్చి కొనుగోలు చేస్తుంటారు. బతకాలన్న ఆరాటమే అన్నీ నేర్పిస్తుంది. అందుకు నేనే ఉదాహరణ.

– వల్లం రమేష్ బాబు, పుట్టపర్తి

వారికి సమాధానాలు చెబుతూ నేర్చుకున్నా – ఓబులమ్మ

గత 30ఏళ్లుగా ఇక్కడే పూలు అమ్ముతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. నేను చదువుకోలేదు. మొదట్లో పూలు కొనడానికి వచ్చిన వాళ్లు ఏం అడుగుతున్నారో అర్థమయ్యేది కాదు. ఇది ఒక్కరోజు సమస్య కాదని అర్థం చేసుకున్నా. నెమ్మదిగా ఇక్కడికి వచ్చే దేశ, విదేశీ భక్తుల భాషల్ని కొంచెం కొంచెంగా తెలుసుకుని నేనూ సమాధానాలు చెప్పడం ఆరంభించా. దాంతో వాళ్లూ పుట్టపర్తికి ఎప్పుడు వచ్చినా నా దగ్గరే పూలు కొంటుంటారు. ఇంగ్లిష్, ఫ్రెంచ్, రష్యన్, ఇటాలియన్, స్పానిష్ లతోపాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీలపైనా పట్టు సాధించిన నన్ను చూసి ఆశ్చర్యపోతుంటారు. ఇదంతా సత్యసాయి దయవల్లే.

గోడంత గడియారం!

సాధారణంగా గోడ గడియారమంటే ఓ గాజు బాక్సులో అంకెలతో ఉండేవే మనకు గుర్తొస్తుంటాయి. కానీ, మారుతోన్న కాలంతోపాటు గడియారాల ఆకారం, పరిమాణాల్లోనూ చాలా మార్పులే వచ్చాయి. ఇంటీరియర్‌లోని ప్రతి వస్తువులోనూ ఏదో ఒక కొత్తదనం ఉండాలని కోరుకుంటున్నారు ఇప్పుడు. అలాంటి వారికోసమే ప్రత్యేకించి రకరకాల థీమ్‌లతో ఉండే త్రీడీ డీఐవై గోడ గడియారాలు మార్కెట్లోకి వచ్చాయి. చూడ్డానికి గోడ నిండుగా ఉండే ఈ ఫ్రేమ్‌లెస్ గడియారాలు ఇంటికి కొత్త అందాన్ని ఇస్తున్నాయి. బ్లాక్ బేర్ ఫ్యామిలీ, మ్యూజిక్ బ్యాండ్, హెల్త్ రొటీన్, బార్బర్ షాప్... ఇలా అనేక థీమ్‌లలో దొరుకుతున్నాయి. అక్రిలిక్ క్వార్ట్జ్‌తో తయారుచేసిన వీటిని మనమే తేలిగ్గా గోడకు అంటించేయొచ్చు. చూడ్డానికి స్టైలిష్‌గా అనిపించడమే కాదు, మన సృజనాత్మకతనూ తెలియజేస్తాయి. పైగా మామూలు గోడ గడియారాల్లాగా టిక్.. టిక్.. అంటూ చప్పుడు చేయకుండా, నిశ్శబ్దంగా పనిచేస్తాయి ఇందులోని ముల్లులు. దాంతో రాత్రిపూట నిద్రాభంగం కలగకుండా ఉంటుంది. ఇల్లు, ఆఫీసు, రెస్టరంట్లు, హోటళ్లు... ఇలా ఎక్కడైనా సరే... నచ్చిన థీమ్‌ను ఎంచుకుని సెట్ చేసుకోవచ్చు. ఇవి నీళ్ల, ఆవిరి ... తగిలినా పాడవకుండా ఉంటాయి. అందుకే వీటిని ఎంచక్కా పిల్లల బెడ్‌రూమ్‌లల్లోనూ పెట్టేసుకోవచ్చు. అంతేకాదు, బంధుమిత్రులకు బహుమతిగా ఇవ్వడానికీ ఈ గడియారాలు భలేగా ఉంటాయి.

మన కోసం ఈ 'వారం'

ఉదయం నుంచి రాత్రి వరకు ఇల్లు, ఆఫీసు అంటూ క్షణం తీరిక ఉండటంలేదు. ఈ బిజీలో మన ఆరోగ్య పరిరక్షణను మర్చిపోతున్నాం. నిద్రలేచిన వెంటనే క్యాలెండర్‌లో తేదీ మారుస్తాం కదా. దానికి అనుసంధానంగా వారమంతా రోజువారీగా చేసే కొన్ని అలవాట్లు మన అందాన్నీ, ఆరోగ్యాన్నీ కాపాడతాయి. అవేంటంటే...

మైండ్‌ఫుల్ మండే

వారాన్ని ప్రారంభించే ఈ రోజు ఒత్తిడిని దూరం చేయడానికి ఉపయోగించాలి. మనసంతా ప్రశాంతంగా ఉండేలా కనీసం 20 నిమిషాలపాటు ధ్యానం చేయాలి. ఆరుబయట బాల్కనీలో లేదా గార్డెన్‌లో ఉదయంపూట వీచే గాలుల మధ్య చేసే ఈ ధ్యానం మెదడును సానుకూలతతో నింపుతుంది. ఏ సమస్యనైనా తేలికగా పరిష్కరించేలా మనసును సిద్ధం చేస్తుంది.

టెక్-ఫ్రీ ట్యూస్‌డే

గృహిణులైతే రోజంతా చాటింగ్, రీల్స్ చూడటం, ఫోన్‌లో సినిమాలు వంటి వాటికి దూరంగా ఉండాలి. కంప్యూటర్స్‌పై పనిచేసే ఉద్యోగినులైతే సాంకేతికతను వినియోగించడం తప్పనిసరి అవుతుంది. దాంతో వీళ్లు కనీసం వ్యక్తిగతంగా ఫోన్ వినియోగానికి ఈ ఒక్క రోజైనా దూరంగా ఉండటానికి ప్రయత్నించాలి. ఆ సమయాన్ని పుస్తకపఠనం, ప్రకృతిని ఆస్వాదించడం వంటివాటికి ఉపయోగిస్తే ఒత్తిడి, ఆందోళనకు దూరంగా ఉండొచ్చు.

వెల్‌నెస్ వెన్స్‌డే

శారీరక సామర్థ్యానికి పెద్దపీట వేసే రోజు ఇది. నడక, యోగా, కొత్తగా ఏదైనా వర్కవుట్ వంటి వ్యాయామాలకు ఈ రోజులో అరగంట కేటాయించాలి. దీనివల్ల కండరాలు బలపడతాయి. శక్తిసామర్థ్యాలు మెరుగుపడతాయి. ఉత్సాహం పెరుగుతుంది.

థాంక్‌ఫుల్ థర్స్‌డే

ఎవరికైనా కృతజ్ఞతలు చెప్పాలనిపిస్తే ఈ రోజు చెప్పేయండి. ఎవరెవరు మీ మనసులో ఉన్నారో, మీకు సంతోషాన్నిచ్చారో వారి పేర్లను వరుసగా రాసుకోవాలి. దగ్గరలో ఉంటే వెళ్లి కలిసి కృతజ్ఞతలు చెప్పి చూడండి. దూరంగా ఉంటే ఫోన్ చేసి పలకరించి, వారివల్ల మీరు పొందిన ఆనందాన్ని గుర్తుకు తెచ్చి థ్యాంక్స్ చెప్పండి. మనసెంత తేలికపడుతుందో మీకే అర్థమవుతుంది. దీనివల్ల మీ మానసికారోగ్యం మరింత మెరుగుపడుతుంది.

ఫ్రెష్ ఫ్రైడే

ఓ అరగంట సమయాన్ని కేటాయించి వార్డ్‌రోబ్‌వైపు చూడండి. లేదా మీ పడకగది, కంప్యూటర్ టేబుల్ లేదా భోజనబల్లవైపు చూపు సారించండి. ఆ ప్రాంతాన్ని మీకు నచ్చినట్లుగా సర్దితే చాలు. మనసుకు నచ్చేలా ఉన్న ఆ చోటు మిమ్మల్ని ఒత్తిడి నుంచి దూరం చేసి ఉల్లాసాన్ని తెస్తుంది. వీకెండ్‌కు మిమ్మల్ని మరింత ఉత్సాహంగా సిద్ధం చేస్తుంది.

సోషల్ శాటర్‌డే

స్నేహితులు, మనసుకు నచ్చినవారికి ఈ రోజులో కొంత సమయాన్ని కేటాయించండి. వారితో గడిపిన క్షణాలు మీ బంధాన్ని మరింత పటిష్ఠం చేస్తాయి. మానసిక అనుబంధాలను పెంచుతాయి. మీకోసం వాళ్లంతా ఉన్నారనే ఆలోచన మీకు మరింత శక్తినిస్తుంది.

సెల్ఫీన్ సండే

వారాంతమైన ఈ రోజుని ప్రత్యేకంగా కుటుంబంతో లేదా మీకోసం మీరన్నట్లు ప్రశాంతంగా గడపాలి. ఈత, సంగీతం వినడం వంటివీ చేయొచ్చు. వచ్చే వారానికి మిమ్మల్ని మీరు సిద్ధం చేసుకోవడానికి దీన్ని ఉపయోగించుకోవాలి.

(c) eenadu

చాంపియన్

మూడో రోజూ అంతే

- కాన్పూర్‌లో సాగని ఆట
- బంగ్లాదేశ్‌తో రెండో టెస్టు

కవర్లతో కాన్పూర్ స్టేడియం

కాన్పూర్

భారత్, బంగ్లాదేశ్ మధ్య చివరిదైన రెండో టెస్టును ప్రతికూల పరిస్థితులు వెంటాడుతూనే ఉన్నాయి. వరుసగా రెండో రోజూ ఒక్క బంతి కూడా పడలేదు. వర్షం లేకున్నా.. ఔట్ ఫీల్డ్ చిత్తడిగా ఉన్న కారణంగా ఆదివారం ఆట రద్దయింది. తొలి మూడు రోజుల్లో 35 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైన నేపథ్యంలో ఇక ఈ మ్యాచ్‌లో ఫలితం తేలడం కష్టమే. చివరి రెండు రోజుల్లో ఆట సాగినా ఈ టెస్టు డ్రాగా ముగిసే అవకాశాలే చాలా ఎక్కువ. రాత్రి కురిసిన వాన వల్ల ఔట్ ఫీల్డ్ తడిగా మారడంతో ఆట ఆరంభం కాలేదు. రెండు గంటల ప్రాంతంలో అధికారులు ఆటను రద్దు చేయాలని నిర్ణయించారు. ఆ వెంటనే ఎండా బాగా కాచింది. బంగ్లా తొలి రోజు 35 ఓవర్లలో 107/3తో నిలిచిన సంగతి తెలిసిందే. వర్షం వల్ల వరుసగా రెండు రోజులు ఆట తుడిచిపెట్టుకుపోయింది. తొలి రోజు కూడా 35 ఓవర్ల ఆటే సాధ్యపడింది. తొలి టెస్టులో 280 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించిన టీమ్‌ఇండియా సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉంది.

శనివారంలా కాకుండా ఆదివారం ఒక్క చినుకు కూడా పడలేదు. అయినా ఒక్క బంతి కూడా సాధ్యం కాక పోవడంతో గ్రీన్‌పార్క్ స్టేడియంలో డ్రైనేజీ వ్యవస్థపై ప్రశ్నలు తలెత్తుతాయనడంలో సందేహం లేదు. ఔట్‌ఫీల్డ్ నుంచి కవర్లు తొలగించడంతో మూడో రోజు మొదలైంది. ఆ తర్వాత క్రీజుపై నుంచి కూడా కవర్లను తీసేశారు. కానీ 10 గంటల సమయంలో పరిశీలనకు వచ్చిన అంపైర్లు ఔట్‌ఫీల్డ్‌లో కొన్ని ప్రాంతాలు తడిగా ఉన్నందున ఆట కష్టమని తేల్చారు. మధ్యాహ్నం మరోసారి మైదానాన్ని తనిఖీ చేయాలని భావించారు. కానీ స్టేడియానికి వచ్చిన అభిమానులకు అసహనాన్ని కలిగిస్తూ పరిస్థితులు ఏమాత్రం మెరుగుపడ లేదు. మైదానం ఇంకా తడిగానే ఉండడంతో ఆటగాళ్ల భద్రతను దృష్టిలో ఉంచుకుని చివరికి రెండు గంటల సమయంలో అంపైర్లు ఆటను రద్దు చేశారు. చివరి రెండు రోజులు వాతావరణం ఆటకు అనుకూలంగా ఉంటుంది. వర్షం ముప్పు లేకపోవడంతో పూర్తి ఆట సాగే అవకాశముంది.

500 మ్యాచ్‌లంటే చిన్న విషయమా?

ఫిట్‌నెస్ విమర్శలపై రోహిత్ శర్మ

రోహిత్

ముంబయి: తన ఫిట్‌నెస్ గురించి వచ్చే విమర్శలపై టీమ్‌ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ ఘాటుగా స్పందించాడు. తాను 500 అంతర్జాతీయ మ్యాచ్‌ల మైలురాయికి చేరువ కాబోతున్నానని.. ఫిట్‌నెస్ లేకుండానే ఇన్ని మ్యాచ్‌లు ఆడగలిగానా అని అతను ప్రశ్నించాడు. ఓ యూట్యూబ్ షోలో టీమ్‌ఇండియా కెప్టెన్ మాట్లాడుతూ.. "17 ఏళ్ల పాటు ఆడటం, 500 అంతర్జాతీయ మ్యాచ్‌లకు చేరువ కావడం చిన్న విషయం కాదు. ప్రపంచవ్యాప్తంగా చాలా తక్కువ మంది క్రికెటర్లు మాత్రమే ఈ ఘనత అందుకున్నారు. ఇంత సుదీర్ఘ కాలం కొనసాగాలంటే జీవన శైలిపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిందే. ఫిట్‌నెస్ చూసుకోవడం, మెదడును నియంత్రణలో ఉంచుకోవడం, స్వీయ సాధన.. ఇలా చాలా విషయాలుంటాయి. అలాగే మ్యాచ్‌కు ఎలా సిద్ధమయ్యామనేది అతి ముఖ్యమైంది. ఏదేమైనా మ్యాచ్ కోసం 100 శాతం సిద్ధంగా ఉండి, విజయం సాధించేలా ప్రదర్శన చేయాల్సిందే. దీని వెనకాల ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడం కీలక పాత్ర పోషిస్తుంది" అని రోహిత్ పేర్కొన్నాడు. ప్రపంచ క్రికెట్లో అన్ని ఫార్మాట్లలో కలిపి ఇప్పటివరకూ కేవలం 10 మంది మాత్రమే 500 అంతర్జాతీయ మ్యాచ్‌లాడారు. ఇందులో నలుగురు భారత క్రికెటర్లున్నారు. ప్రస్తుతం 485 మ్యాచ్‌లతో రోహిత్ ఆ మైలురాయికి చేరువగా ఉన్నాడు. ఈ ఏడాది టీమ్‌ఇండియా టీ20 ప్రపంచకప్ గెలవగానే పొట్టి ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించడం వెనకున్న కారణాన్ని రోహిత్ బయటపెట్టాడు. "అంతర్జాతీయ టీ20ల నుంచి రిటైరవడానికి ప్రధాన కారణం ఇందులో నా సమయాన్ని పూర్తిగా గడపడమే. ఆ ఫార్మాట్ ఆడటాన్ని ఎంతగానో ఆస్వాదించా. 17 ఏళ్ల పాటు ఆడి ఉత్తమ ప్రదర్శన చేశా. ప్రపంచకప్ గెలవడంతో ఇతర వాటిపై దృష్టి పెట్టడానికి అదే సరైన సమయమనిపించింది. భారత్ తరపున రాణించేందుకు ఎంతో మంది మంచి ఆటగాళ్లున్నారు. దీంతో వీడ్కోలు పలికేందుకు అదే మంచి సమయం అనుకున్నా" అని చెప్పాడు.

నేటి క్రికెట్‌కు.. మేటి వసతులతో

బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ప్రారంభం

బెంగళూరు

బీసీఈలో లక్ష్మణ్

ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, వెస్టిండీస్ దేశాల్లోని బౌన్సీ, స్వింగ్, పేస్ పిచ్‌లకు అలవాటు పడేలా.. అంతర్జాతీయ క్రికెట్లో భారత ఆధిపత్యాన్ని కొనసాగించడానికి తోడ్పడేలా.. యువ క్రికెటర్లకు ప్రపంచ స్థాయి నైపుణ్యాలు అందించేలా.. సరికొత్త సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. 2000 నుంచి చిన్నస్వామి స్టేడియం ప్రాంగణంలో కొనసాగిన జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) ఇప్పుడు కొత్త రూపు సంతరించుకుంది. అత్యాధునిక వసతులతో, నేటి క్రికెట్ అవసరాలకు సరిపడేలా బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (బీసీఈ)గా మారి అందుబాటులోకి వచ్చింది. స్థానిక అంతర్జాతీయ విమానాశ్రయానికి దగ్గర్లో 40 ఎకరాల విస్తీర్ణంలో బీసీఈను ఏర్పాటు చేశారు. శనివారం బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, కార్యదర్శి జై షా ఆరంభించిన ఈ బీసీఈలో మూడు స్టేడియాలున్నాయి. స్పదేశీ, విదేశీ పిచ్‌లు విసిరే సవాళ్లకు క్రికెటర్లను సిద్ధం చేసేలా వీటిని ఎర్రమట్టి, నల్లమట్టి పిచ్‌లతో రూపొందించారు. ఐసీసీ ప్రమాణాలకు అనుగుణంగా, దేశవాళీ మ్యాచ్‌ల నిర్వహణకు వీలుగా వీటిని సిద్ధం చేశారు. ఫ్లడ్‌లైట్లతో కూడిన ఇక్కడి ప్రధాన స్టేడియంలోని 13 పిచ్‌లను ముంబయి నుంచి తెప్పించిన ఎర్రమట్టితో తయారు చేశారు. వర్షం పడ్డా నీరు త్వరగా ఆవిరయ్యేలా ఇందులో ప్రత్యేక డ్రైనేజీ విధానాన్ని ఏర్పాటు చేశారు. మరో రెండు మైదానాలను ప్రాక్టీస్ కోసం ఉపయోగించనున్నారు. ఇందులో 11 పిచ్‌లను స్థానిక మాండ్యా మట్టితో, 9 పిచ్‌లను ఒడిషాలోని కలహండి నుంచి తెప్పించిన నల్ల మట్టితో సిద్ధం చేశారు. ఇవే కాకుండా ప్రాక్టీస్ కోసం 45 ఔట్‌డోర్ నెట్ పిచ్‌లూ ఉన్నాయి. ఫీల్డింగ్ ప్రాక్టీస్ కోసం ప్రత్యేకమైన ప్రదేశాన్ని ఏర్పాటు చేశారు. ఆరు ఔట్‌డోర్ రన్నింగ్ సింథటిక్ ట్రాక్‌లున్నాయి. ఇండోర్ ప్రాక్టీస్ కోసం ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా నుంచి టర్ఫ్‌లు తెప్పించారు. ఇంకా స్పోర్ట్స్ సైన్స్, మెడిసిన్ ల్యాబ్, జిమ్ తదితర అత్యాధునిక సౌకర్యాలున్నాయి. భవిష్యత్‌లో భారత ఒలింపిక్ అథ్లెట్లు కూడా బీసీఈను వాడుకునే ఏర్పాటు చేయనున్నారు.

ఆ భావన తప్పు..

భారత ఆటగాళ్ల నైపుణ్యాలు మరింత మెరుగయ్యేలా ఈ ప్రపంచ స్థాయి సౌకర్యాలు తోడ్పడతాయని బీసీఈ అధిపతి వీవీఎస్ లక్ష్మణ్ చెప్పాడు. 2021లో ఎన్‌సీఏ చీఫ్‌గా అతను బాధ్యతలు తీసుకున్న సంగతి తెలిసిందే. ఎన్‌సీఏ ఇప్పుడు బీసీఏగా మారింది. "బీసీఈ వల్ల భవిష్యత్ తరం ఆటగాళ్లే కాదు ప్రస్తుత క్రికెటర్లూ లబ్ధి పొందుతారు. వాళ్లు ఇక్కడికి వచ్చి నైపుణ్యాలను మెరుగుపర్చుకోవచ్చు. రాబోయే వేర్వేరు సిరీస్‌ల్లో ఎదురయ్యే సవాళ్లకు ఇక్కడ సన్నద్ధం కావొచ్చు. కేవలం కోలుకోవడానికే క్రికెటర్లు ఇక్కడికి వస్తారనేది తప్పుడు భావన. ఇక్కడికి వచ్చే ఆటగాళ్లందరూ అత్యుత్తమ ప్రదర్శన అందుకోవడానికే చూస్తారు. ఈ ప్రక్రియ ద్వారా ప్రపంచ క్రికెట్లోనే మూడు ఫార్మాట్లలోనూ భారత్ ఉత్తమంగా కొనసాగే అవకాశముంది. బీసీసీఐ, బీసీఈ ఉద్దేశం అదే. ఆటగాళ్లందరి కల నిజమైన సందర్భం ఇది. ఇక్కడ మూడు రకాల మట్టితో కూడిన పిచ్‌లున్నాయి. ప్రాక్టీస్ కోసమూ వేర్వేరు పిచ్‌లున్నాయి. విభిన్న పరిస్థితులకు ఆటగాళ్లు అలవాటు పడాలని కోరుకుంటున్నాం. అలాగే అత్యున్నత ఫిట్‌నెస్ ప్రమాణాలనూ కొనసాగించాలి" అని లక్ష్మణ్ పేర్కొన్నాడు.

ముకేశ్ త్రయానికి స్వర్ణం

జూనియర్ షూటింగ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్స్

ఉమేశ్, ప్రమోద్‌లతో ముకేశ్

దిల్లీ: ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ షూటింగ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో ఆంధ్రప్రదేశ్ కుర్రాడు ముకేశ్ నేలవల్లి సత్తాచాటాడు. పెరూలో జరుగుతున్న ఈ పోటీల్లో ఉమేశ్ చౌదరి, ప్రమోద్, ముకేశ్‌తో కూడిన భారత త్రయం.. పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ స్వర్ణాన్ని సొంతం చేసుకుంది. ఈ జట్టు 1726 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. క్వాలిఫికేషన్లో ఉమేశ్ (580 పాయింట్లు), ముకేశ్ (574), ప్రమోద్ (572) రాణించారు. రొమేనియా (1716), ఇటలీ (1707) వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. అయితే వ్యక్తిగత విభాగం ఫైనల్ చేరడంలో ముకేశ్ విఫలమయ్యాడు. క్వాలిఫికేషన్లో అతను 9వ స్థానంలో నిలిచాడు. టాప్-8 షూటర్లు మాత్రమే తుదిపోరులో తలపడతారు. వరుసగా మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన ఉమేశ్, ప్రద్యుమ్న్ (578) ఫైనల్ చేరారు. కానీ పతకం గెలవలేకపోయారు. మరోవైపు 10మీ.ఎయిర్ పిస్టల్‌లో జూనియర్ మహిళల జట్టు కూడా స్వర్ణం సొంతం చేసుకుంది. కనిష్క (573), లక్షిత (571), అంజలి (564) మెరవడంతో మొత్తం 1708 స్కోరుతో భారత్ అగ్రస్థానాన్ని దక్కించుకుంది. అజర్‌బైజాన్ (1707) రెండో, ఉక్రెయిన్ (1704) మూడో స్థానాల్లో నిలిచాయి. ఇదే విభాగంలో కనక్ వ్యక్తిగత కాంస్యం నెగ్గింది. ఫైనల్లో ఆమె 217.6 స్కోరుతో మూడో స్థానంలో నిలిచింది.

అలస్యానికి పతకం మూల్యం!: జూనియర్ పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో ఉమేశ్ చౌదరి అనూహ్యంగా పతకం గెలిచే అవకాశం కోల్పోయాడు. ఫైనల్‌కు అతను ఆలస్యంగా రావడమే కారణం. దీంతో ఐఎస్ఎస్ఎఫ్‌లోని 6.17.1.3 నిబంధన ప్రకారం అతనికి రెండు పాయింట్ల జరిమానా విధించారు. అతని తొలి షాట్ నుంచే ఈ పాయింట్లు కోత పెట్టారు. తొలి షాట్‌లో అతను 9.4 పాయింట్లు సాధించగా.. వాటిని 7.4గా మార్చారు. ఆ పాయింట్లు తొలగించకపోయి ఉంటే నాలుగో సిరీస్ ముగిసే సమయానికి అతను 137.7 స్కోరుతో రెండో స్థానంలో ఉండేవాడు. అయిదో సిరీస్ ముగిసే సరికి 157 స్కోరుతో మూడో స్థానంలో కొనసాగి పతక రేసులో ఉండేవాడు. కానీ రెండు పాయింట్ల కోత కారణంగా చివరకు 155 స్కోరుతో ఆరో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఫైనల్లో మరో భారత షూటర్ ప్రద్యుమ్న్ (115.3) చివరి స్థానంలో నిలిచాడు. ఫైనల్ వేదికకు ఉమేశ్ ఎందుకు ఆలస్యంగా వచ్చాడనేది ఇంకా తెలియలేదు. ఫైనల్‌ను ప్రధాన రేంజ్ ప్రతినిధి ప్రారంభిస్తారు. షూటర్లు కనీసం 30 నిమిషాల ముందు కచ్చితంగా రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. ఈ ఘటనపై తనకు ఎలాంటి సమాచారం లేదని, ఇప్పుడే స్పందించలేనని భారత జాతీయ రైఫిల్ సంఘం కార్యదర్శి రాజీవ్ భాటియా పేర్కొన్నాడు. చివరగా 2021లో ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్ పోటీల సందర్భంగా ఎలవెనిల్‌కు ఇలాగే రెండు పాయింట్ల జరిమానా పడింది.

దులీప్ ట్రోఫీ.. మళ్లీ పాత పద్ధతిలోనే!

బెంగళూరు: టీమ్‌ఇండియా స్టార్ క్రికెటర్లతో ఈ ఏడాది కొత్తగా కళకళలాడిన దులీప్ ట్రోఫీ.. వచ్చే ఏడాది నుంచి పాత పద్ధతిలోనే జరిగే అవకాశముంది. ఈ సారి టోర్నీని కొత్తగా భారత్- ఎ, బి, సి, డి అంటూ నాలుగు జట్ల మధ్య నిర్వహించారు. కానీ ఈ విధానాన్ని రాష్ట్ర క్రికెట్ సంఘాలు వ్యతిరేకించాయి. తమ ఆటగాళ్లకు ఆడే అవకాశాలు ఎక్కువగా రాలేదని ఆదివారం బీసీసీఐ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో ఆయా క్రికెట్ సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో వచ్చే ఏడాది నుంచి తిరిగి సెంట్రల్, ఈస్ట్, వెస్ట్, నార్త్, సౌత్, నార్త్‌ఈస్ట్ జోన్ల జట్లతోనే దులీప్ ట్రోఫీ జరిగే ఆస్కారముంది. "ఈ సీజన్‌లో దులీప్ ట్రోఫీ ఫార్మాట్ కారణంగా తమ జోన్లలోని ఆటగాళ్లకు అవకాశాలు రాలేదని రాష్ట్ర సంఘాలు అభిప్రాయపడ్డాయి. సంప్రదాయ జోన్ ఫార్మాట్‌తోనే ఆటగాళ్లకు ఎక్కువ అవకాశాలు వస్తాయని ఏజీఎంలో ప్రస్తావించారు" అని ఓ రాష్ట్ర క్రికెట్ సంఘం ప్రతినిధి తెలిపాడు. కొంతమంది టీమ్‌ఇండియా క్రికెటర్లనూ ఈ సారి దులీప్ ట్రోఫీలో ఆడించడంతో ఈ టోర్నీకి కళ వచ్చింది. యశస్వి జైస్వాల్, సర్ఫరాజ్ ఖాన్, ఆకాశ్ దీప్, కుల్‌దీప్ యాదవ్, కేఎల్ రాహుల్, ధ్రువ్ జురెల్, శుభ్‌మన్ గిల్ తదితర క్రికెటర్లు ఈ టోర్నీలో ఆడారు.

కార్యదర్శి ఎంపిక వేగవంతం చేయండి: బీసీసీఐ కొత్త కార్యదర్శి నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని ఆ పదవి నుంచి దిగిపోనున్న జై షాను ఆదివారం జరిగిన వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో సభ్యులు కోరారు. ఇటీవల ఐసీసీ ఛైర్మన్‌గా ఎన్నికైన షా.. నవంబరు ఆఖరి వారంలో బీసీసీఐ కార్యదర్శి పదవి నుంచి దిగిపోతాడని భావిస్తున్నారు. అతడు డిసెంబరు 1న ఐసీసీలో బాధ్యతలు స్వీకరిస్తాడు. కొత్త కార్యదర్శిని ఎంపిక చేయడం ఏజీఎం ఎజెండాలో లేకపోయినా.. సమావేశంలో దాని గురించి చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుతానికి దిల్లీ అండ్ డిస్ట్రిక్ట్స్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు రోహన్ జైట్లీ, బీసీసీఐ కోశాధికారి ఆశీష్ షెలార్, సంయుక్త కార్యదర్శి దేవజిత్ సైకియా, గుజరాత్ క్రికెట్ సంఘం కార్యదర్శి అనిల్ పటేల్ బోర్డు కార్యదర్శి పదవికి రేసులో ఉన్నారు.

అధికారం.. ఆదాయంపైనే వారి దృష్టి

పి.టి.ఉష

దిల్లీ: భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ)లో అంతర్గత కుమ్ములాటలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. శనివారం 12 మంది ఎగ్జిక్యూటివ్ కమిటీ (ఈసీ) సభ్యులు తనకు వ్యతిరేకంగా లేఖ రాయగా.. ఆదివారం ఐఓఏ అధ్యక్షురాలు పి.టి. ఉష దీటుగా బదులిచ్చింది. ఈసీ సభ్యులు అధికారం.. ఆదాయమే పరమావధిగా వ్యవహరిస్తున్నారని ఓ ప్రకటనలో పేర్కొంది. ఉష నియంతృత్వ ధోరణిలో వ్యవహరిస్తోందని.. ఏకపక్ష విధానం అవలంబిస్తోందని ఆరోపిస్తూ 12 మంది ఈసీ సభ్యులు లేఖ రాశారు. ఐఓఏ సీనియర్ ఉపాధ్యక్షుడు అజయ్ పటేల్, ఉపాధ్యక్షులు రాజ్‌లక్ష్మి దేవ్, గగన్ నారంగ్, కోశాధికారి సహదేవ్ యాదవ్, సంయుక్త కార్యదర్శులు అలకనంద అశోక్, కల్యాణ్ చౌబే, ఈసీ సభ్యులు అమితాబ్‌శర్మ, భూపేందర్‌సింగ్ బజ్వా, రోహిత్ రాజ్‌పాల్, డోలా బెనర్జీ, హర్‌పాల్ సింగ్, యోగేశ్వర్ దత్.. ఉష వ్యవహార శైలిని తప్పుబడుతూ లేఖాస్త్రం సంధించారు. బదులుగా ఉష స్పందిస్తూ.. "భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారిణిగా నా 45 ఏళ్ల కెరీర్‌లో.. మన అథ్లెట్లు, దేశ క్రీడా భవిష్యత్తు పట్ల ఇంత ఉదాసీనంగా ఉండే వ్యక్తులను ఎప్పుడూ చూడలేదు. అధికారం.. ఆదాయంపై వీరు ఎక్కువ దృష్టిసారించారు. అంతే కాకుండా కొందరు ఈసీ సభ్యుల వ్యక్తిత్వంపై ప్రశ్నలు ఉన్నాయి. లింగ వివక్ష, లైంగిక వేధింపుల కేసులు వారిపై ఉన్నాయి" అని ఉష ఆరోపించింది.

నిశాన్ 6/170

కివీస్‌పై లంక క్లీన్‌స్వీప్

రెండో టెస్టులో ఘనవిజయం

- రాణించిన నిశాన్, ప్రబాత్

గాలె: శ్రీలంక అదరగొట్టింది. సొంతగడ్డపై ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ రెండు టెస్టుల సిరీస్‌లో న్యూజిలాండ్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. రెండో టెస్టులో ఇన్నింగ్స్ 154 పరుగుల భారీ తేడాతో కివీస్‌ను చిత్తు చేసింది. ఫాలోఆన్ ఆడుతూ ఓవర్‌నైట్ స్కోరు 199/5తో నాలుగో రోజురెండో ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్.. లంక స్పిన్నర్లు నిశాన్ పెయిరిస్ (6/170), ప్రబాత్ జయసూర్య (3/139) ధాటికి నిలువలేక పోయింది. అర్ధసెంచరీలు చేసి క్రీజులో నిలదొక్కుకున్న టామ్ బ్లుండెల్ (60; 64 బంతుల్లో 6×4, 2×6), గ్లెన్ ఫిలిప్స్ (78; 99 బంతుల్లో 6×4, 3×6)లను అరంగేట్ర బౌలర్ నిశాన్ పెవిలియన్ చేర్చి కివీస్‌ను దెబ్బ కొట్టాడు. లంచ్‌కు ముందే ఆ జట్టు మూడు వికెట్లు కోల్పోవడంతో ఓటమికి చేరువైంది. శాంట్నర్ (67; 115 బంతుల్లో 6×4, 3×6) పోరాటం లంక విజయాన్ని కాస్త ఆలస్యం చేసింది. అజాజ్ పటేల్ (22) మాత్రమే శాంట్నర్‌కు కాస్త మద్దతు ఇచ్చాడు. దీంతో న్యూజిలాండ్ 360 పరుగులకు ఆలౌటైంది. రెండు టెస్టుల్లో కలిపి 18 వికెట్లు పడగొట్టిన లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ ప్రబాత్‌కు 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' అవార్డు లభించింది. లంక తొలి ఇన్నింగ్స్‌లో చిరస్మరణీయమైన ఇన్నింగ్స్ ఆడిన కమిందు మెండిస్ (182 నాటౌట్)కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. తొలి ఇన్నింగ్స్‌లో లంక 602/5 వద్ద డిక్లేర్ చేయగా.. కివీస్ 88కే కుప్పకూలింది. గత 15 ఏళ్లలో న్యూజిలాండ్‌పై టెస్టు సిరీస్ గెలవడం లంకకు ఇదే తొలిసారి కావడం విశేషం.

డబ్ల్యూటీసీ ర్యాంకుల్లో మెరుగు: న్యూజిలాండ్‌పై టెస్టు సిరీస్ విజయంతో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ర్యాంకింగ్ పాయింట్ల శాతాన్ని కూడా శ్రీలంక మెరుగుపరుచుకుంది. ఈ సిరీస్‌కు ముందు 49.9 గెలుపు శాతంతో అయిదో స్థానంలో ఉన్న లంక.. కివీస్‌పై క్లీన్‌స్వీప్‌తో 55.56 శాతానికి చేరి మూడో స్థానానికి ఎగబాకింది. ఫైనల్ చేరే అవకాశాలను కూడా మెరుగుపరుచుకుంది. ఈ సీజన్లో ఆ జట్టుకు వరుసగా ఇది మూడో విజయం. మొత్తంగా 9 మ్యాచ్‌ల్లో లంక అయిదింట్లో నెగ్గింది. మరోవైపు లంకతో టెస్టుల ఆరంభం నాటికి 50 గెలుపు శాతంతో మూడో స్థానంలో ఉన్న న్యూజిలాండ్.. సిరీస్ ఓటమితో 37.50తో ఏడో స్థానానికి పడిపోయింది. ఆ జట్టు 8 మ్యాచ్‌లు ఆడి అయిదింట్లో ఓడింది. భారత్ (10 మ్యాచ్‌ల్లో 7 విజయాలు), ఆస్ట్రేలియా (12 మ్యాచ్‌ల్లో 8 విజయాలు) తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నాయి.

సంక్షిప్త స్కోర్లు

శ్రీలంక తొలి ఇన్నింగ్స్: 602/5 డిక్లేర్డ్

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: 88

న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్: 360 (కాన్వే 61, విలియమ్సన్ 46, బ్లుండెల్ 60, ఫిలిప్స్ 78, శాంట్నర్ 67, అజాజ్ పటేల్ 22; నిశాన్ పెయిరిస్ 6/170, ప్రబాత్ జయసూర్య 3/139, ధనంజయ డిసిల్వా 1/28)

ఐపీఎల్ పాలక మండలిలో మళ్లీ చాముండి

చాముండీశ్వరీనాథ్

భారత క్రికెటర్ల సంఘం (ఐసీఏ) ప్రతినిధిగా చాముండీశ్వరీనాథ్ మరోసారి ఐపీఎల్ పాలకవర్గంలో మరోసారి అవకాశం దక్కించుకున్నాడు. ఆయన గత పర్యాయం కూడా పాలకవర్గంలో ఉన్న సంగతి తెలిసిందే. అరుణ్ సింగ్ ధూమల్, అవిషేక్ దాల్మియా పాలకమండలి సభ్యులుగా తిరిగి ఎన్నికయ్యారు.

భారత వుషులో 7 పతకాలు

దిల్లీ: ప్రపంచ జూనియర్ వుషు ఛాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారులు మెరిశారు. ఆదివారం బ్రునైలో ముగిసిన ఈ టోర్నీలో భారత క్రీడాకారులు ఏడు పతకాలు సాధించారు. అందులో రెండు స్వర్ణాలు, ఒక రజతం, నాలుగు కాంస్య పతకాలు ఉన్నాయి. ఆర్యన్, శౌర్య బంగారు పతకాలు నెగ్గగా.. నాంగ్ మింగ్బీ రజతం గెలిచాడు. తనీష్ నాగర్, అభిజీత్, దివ్యాంషి, యువరాజ్ కాంస్యాలు సాధించారు.

వార్మప్‌లో భారత అమ్మాయిల విజయం

దుబాయ్: టీ20 ప్రపంచకప్ ముంగిట వార్మప్ మ్యాచ్‌లో భారత అమ్మాయిలు సత్తా చాటారు. ఆదివారం హర్మన్‌ప్రీత్ సేన 20 పరుగుల తేడాతో వెస్టిండీస్‌ను ఓడించింది. మొదట భారత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 141 పరుగులు చేసింది. హేలీ మాథ్యూస్ (4/17) ధాటికి 23 పరుగలకే 3 వికెట్లు కోల్పోయినా.. యాస్తిక (24)తో కలిసి జెమీమా రోడ్రిగ్స్ (52; 40 బంతుల్లో 5×4) ఇన్నింగ్స్‌ను నిలబెట్టింది. అనంతరం పూజ వస్త్రాకర్ (3/20), దీప్తి శర్మ (2/11) విజృంభించడంతో విండీస్ 8 వికెట్లకు 121 పరుగులే చేసింది. చినెల్లే హెన్రీ (59 నాటౌట్) ఒంటరి పోరాటం చేసింది.

అక్టోబరు 31 లోగా..

ముంబయి: ఐపీఎల్‌లో మెగా వేలానికి ముందు అట్టిపెట్టుకునే ఆటగాళ్ల వివరాలు తెలియజేయడానికి ఫ్రాంఛైజీలకు బీసీసీఐ అక్టోబర్ 31 వరకు గడువు ఇచ్చింది. ఫ్రాంఛైజీలు అయిదుగురు ఆటగాళ్లను అట్టిపెట్టుకోవచ్చు. వేలంలో రైట్ టు మ్యాచ్ (ఆర్‌టీఎం) ద్వారా మరొకరిని అట్టిపెట్టుకునే వీలుంది. వీరిలో గరిష్ఠంగా అయిదుగురు జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆటగాళ్లు ఉండాలి. ఇద్దరు అరంగేట్రం చేయని క్రికెటర్లు ఉండొచ్చు. "రైట్ టు మ్యాచ్, అట్టిపెట్టుకునే ఆటగాళ్ల విషయంలో నిర్ణయం ఫ్రాంఛైజీల విచక్షణ మీద ఆధారపడి ఉంటుంది" అని ఐపీఎల్ వర్గాలు తెలిపాయి. ఫ్రాంఛైజీలు అన్‌క్యాప్డ్ కోటాలో తీసుకున్న ఆటగాడు అక్టోబర్ 31 నాటికి అంతర్జాతీయ అరంగేట్రం చేస్తే అతడు క్యాప్డ్ ఆటగాడే అవుతాడు. ఫ్రాంఛైజీలు అట్టిపెట్టుకునే ఆటగాళ్లకు తమ దగ్గర ఉండే మొత్తం రూ.120 కోట్లలో రూ.75 కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉంటుంది.

ఆసీస్‌దే వన్డే సిరీస్

డకెట్ శతకం వృథా

హెడ్

బ్రిస్టల్: ఇంగ్లాండ్‌తో అయిదు వన్డేల సిరీస్‌ను ఆస్ట్రేలియా 3-2తో కైవసం చేసుకుంది. ఆదివారం వర్షం ఆటంకం కలిగించిన చివరిదైన అయిదో వన్డేలో 49 పరుగుల తేడాతో (డ/లూ) ఇంగ్లాండ్‌ను ఓడించింది. మొదట ఇంగ్లిష్ జట్టు 309 పరుగులు చేసింది. బెన్ డకెట్ (107 బంతుల్లో 91 బంతుల్లో 13×4, 2×6) సెంచరీ బాదాడు. కెప్టెన్ హ్యారీ బ్రూక్ (72), ఫిల్‌సాల్ట్ (45) కూడా రాణించారు. ట్రావిస్ హెడ్ (4/28) బంతితో అదరగొట్టాడు. హార్డీ (2/38), ఆడమ్ జంపా (2/74), మ్యాక్స్‌వెల్ (2/49) కూడా సత్తా చాటారు. ఛేదనలో ఆసీస్ 20.4 ఓవర్లలో 165/2తో ఉన్న దశలో వర్షంతో ఆట ఆగింది. డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం అప్పటికి ఆసీస్ రన్‌రేట్‌లో ముందంజలో నిలిచింది. మాథ్యూ షార్ట్ (58), హెడ్ (31), స్టీవ్ స్మిత్ (36 నాటౌట్), ఇంగ్లిస్ (28 నాటౌట్) రాణించారు.

(c) eenadu

200మంది పోలీసులు, డ్రోన్ కెమెరాతో

రేపిస్ట్ కోసం అడవిలో గాలింపు

పురుగుమందు తాగిన దశలో పట్టివేత

నిందితుడు సునీల్ కొర్కు

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని హర్దా జిల్లాలో వారం రోజులుగా తప్పించుకు తిరుగుతున్న రేపిస్టు కోసం 200 మంది పోలీసులు నైట్‌విజన్ కెమెరా గల ప్రత్యేక డ్రోనుతో దట్టమైన అడవిలో విస్తృత గాలింపు చేపట్టగా.. ఆదివారం పురుగుమందు తాగిన దశలో అతడు పట్టుబడ్డాడు. సెప్టెంబరు 23న సునీల్ కొర్కు (22) అనే యువకుడు అయిదేళ్ల బాలికకు తినుబండారాల ఆశ చూపించి, నిర్మానుష్య ప్రదేశానికి తీసుకువెళ్లి అత్యాచారం జరిపాడు. సిరాలీ ఠాణా పరిధిలోని నది ఒడ్డున స్పృహ తప్పి పడున్న చిన్నారిని పోలీసులు ఆసుపత్రికి తరలించగా, అత్యాచారం జరిగినట్లు వైద్యులు ధ్రువీకరించారు. నిందితుడి ఆచూకీ కోసం రూ.10 వేల రివార్డు ప్రకటించిన పోలీసులు గత వారం రోజులుగా సమీప అడవిలో విస్తృతంగా గాలించారు. చివరకు గ్రామస్థుల సాయంతో ఆదివారం ఉదయం మోహన్‌పుర సమీప పొలంలో సునీల్‌ను అదుపులోకి తీసుకున్నారు. అప్పటికే పురుగుమందు తాగి ఉన్న అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో భోపాల్ ఆసుపత్రికి తరలించినట్లు హర్దా ఎస్పీ అభినవ్ చౌక్సే తెలిపారు. ఈ గాలింపు చర్యల్లో పోలీసులు ఉపయోగించిన డ్రోన్ కెమెరాకు ధర్మల్ సెన్సర్లు అమర్చారు. వాటి సాయంతో దట్టమైన అడవిలోనూ మనుషుల ఉనికిని గుర్తించవచ్చని అధికారులు వివరించారు.

ఆకర్షణలకు లోనైతే మూల్యం చెల్లించుకోక తప్పదు

సాఫ్ట్‌డ్రింకులకు మీరు చెల్లించేది రూ.20 లేదా రూ.30 కాదు.. మీ విలువైన ఆరోగ్యాన్ని. టీవీ కనెక్షన్లు, ఓటీటీ సబ్‌స్క్రిప్షన్ల కోసం మీరు ఖర్చు పెట్టేది డబ్బును కాదు.. తిరిగి రాని మీ సమయాన్ని. సోషల్ మీడియా ఉచితం అనుకుంటాం. కానీ దానివల్ల ఏకాగ్రతను కోల్పోతాం. ప్రతి ఆకర్షణ వెనుక మనం చెల్లించాల్సిన మూల్యం ఉంటుంది. అందుకే వాటికి దూరంగా ఉండండి.

– అభిజిత్ చోక్సీ, పర్సనల్ ఫైనాన్స్ మెంటార్

మధ్య వయస్కులనూ కబళిస్తున్న ప్రొస్టేట్ క్యాన్సర్

మెట్రో నగరాల్లో పురుషులకు ఎక్కువ ముప్పు

దిల్లీ: పురుషులకు ప్రాణాంతకమైన ప్రొస్టేట్ క్యాన్సర్ ముప్పు భారత్‌లో ఎక్కువవుతోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) గణాంకాలు హెచ్చరిస్తున్నాయి. సెప్టెంబరును ప్రొస్టేట్ క్యాన్సర్ అవగాహనా నెలగా పాటిస్తున్నారు. డబ్ల్యూహెచ్‌వో లెక్కల ప్రకారం.. 50 ఏళ్ల లోపు వయసున్నవారు ఈ క్యాన్సర్ బారిన పడటమూ ఎక్కువవుతోంది. పైగా దాని తీవ్రత కూడా సాధారణం కంటే మించి ఉంటోంది. మిగిలినవాటితో పోలిస్తే ప్రొస్టేట్ క్యాన్సర్ నెమ్మదిగా విస్తరిస్తుందని.. సమస్యలను మొదట్లోనే గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా ఈ వ్యాధి వృద్ధులలో మాత్రమే కనిపించేది. కానీ ప్రస్తుతం యువకులను, మధ్య వయస్కులనూ కబళిస్తోందని నిపుణులు చెబుతున్నారు. మరీ ముఖ్యంగా మెట్రోపాలిటన్‌లలో నివసించే 35-44 మధ్య వయసు వారిలో ప్రొస్టేట్ క్యాన్సర్ బాధితులు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోందని వారు తెలిపారు. 2022లో భారత్‌లో 14 లక్షల కొత్త క్యాన్సర్ కేసులు నమోదవగా.. అందులో ప్రొస్టేట్ క్యాన్సర్ కేసులు 37,948. ఇది మొత్తం క్యాన్సర్ కేసుల్లో 3 శాతం కావడం గమనార్హం.

త్వరగా గుర్తించడం అవసరం

సమస్యను వీలైనంత త్వరగా గుర్తించి చికిత్స తీసుకుంటే ప్రొస్టేట్ క్యాన్సర్ నుంచి బయటపడొచ్చని ఆంకాలజిస్ట్ డా.ఆశిష్ గుప్తా తెలిపారు. "క్యాన్సర్ నుంచి బతికి బయటపడటమనేది.. మనం దానిని ఎంత త్వరగా గుర్తించామనే దానిపై ఆధారపడి ఉంటుంది. ప్రొస్టేట్ క్యాన్సర్ శరీరంలో చాలా నెమ్మదిగా విస్తరిస్తుంది. కాబట్టి తొలిదశలోనే చికిత్స తీసుకుంటే సమస్యే ఉండదు. అమెరికాలో 80 శాతం మంది బాధితులు తొలి దశలోనే చికిత్సకు వస్తున్నారు. 20 శాతం మందే ముదిరిపోయిన తర్వాత డాక్టర్‌లను కలుస్తున్నారు. భారత్‌లో

దీనికి పూర్తి వ్యతిరేకంగా జరుగుతోంది" అని పేర్కొన్నారు. మూత్ర విసర్జన సమయంలో అసౌకర్యం కలుగుతుండటం, రాత్రుళ్లు పదేపదే లేవాల్సి రావడం, మూత్రంలో రక్తం పడటం, నడుము లేదా జననాంగం వద్ద తీవ్రంగా నొప్పి పుట్టడం ప్రొస్టేట్ క్యాన్సర్‌కు సూచనలని అన్నారు. వ్యాయామం చేయడంతో పాటు పళ్లు, కూరగాయలను డైట్‌లో భాగం చేసుకోవాలని సూచించారు.

సానుకూల కథనాలకు ప్రజల తహతహ

- వ్యతిరేక వార్తల్నే ఇష్టపడతారనడం తప్పు
- 'మన్ కీ బాత్' అది రుజువు చేసింది: మోదీ

దిల్లీ: మసాలా దట్టించిన సమాచారాన్ని, వ్యతిరేక వార్తల్ని ప్రజలు ఇష్టపడతారనేది వాస్తవం కాదని, సానుకూల కథనాలకు వారు తహతహలాడుతున్నారనేది 'మన్ కీ బాత్' కార్యక్రమం రుజువు చేసిందని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. దేశం నలుమూలల్లో నివసిస్తున్న ప్రజల సానుకూల కథనాలు, ఉత్తేజభరిత ఉదాహరణలను ప్రతినెలా ఈ కార్యక్రమం ద్వారా తాను వివరిస్తుంటే ప్రజలు ఇష్టపడుతున్నారని చెప్పారు. ఆదివారం ఈ కార్యక్రమం ద్వారా దేశ ప్రజలనుద్దేశించి మోదీ ప్రసంగించారు. పదేళ్ల క్రితం అక్టోబరు 3న విజయదశమి రోజు తాను దీనిని మొదలు పెట్టానని, ఈసారి అదేరోజు నవరాత్రులు మొదలవుతుండడం దైవికమైన ఏకీభావమని ఆయన పేర్కొన్నారు. "పదేళ్ల పూర్తిచేసుకోనున్న నేపథ్యంలో ఈ ఎపిసోడ్ నాకు భావోద్వేగమైనది. ఎన్నో జ్ఞాపకాల దొంతర్లు కళ్లముందు కదలాడుతున్నాయి. సామూహిక శక్తిని ప్రదర్శించే ప్రత్యేక వేదికగా ఈ కార్యక్రమం మారింది. దీనిని కోట్లమంది ప్రజల్లోకి తీసుకువెళ్లిన ఆకాశవాణి, ప్రసారభారతి, దూరదర్శన్, ఇతర ప్రైవేటు టీవీ ఛానళ్లకు కృతజ్ఞతలు. నిరంతర మద్దతుతో దేశ నలుమూలల నుంచి వారు నాకు సమాచారం ఇస్తున్నారు. ఈ కార్యక్రమానికి అసలైన యాంకర్లు (ప్రయోక్తలు) వారే" అని మోదీ చెప్పారు.

దైవ దర్శనంలా అనిపిస్తుంది

"ఆలయానికి వెళ్లి దైవాన్ని దర్శించుకోవడం ఎలా ఉంటుందో ఈ కార్యక్రమ ప్రక్రియ నాకు అలా అనిపిస్తుంది. ప్రజలే నా దృష్టిలో దేవుళ్లు. 'జనతా జనార్దన్' దర్శనానికి నేను వెళ్తున్నట్లు ప్రతిసారీ భావిస్తాను. మనదేశం గత పదేళ్లలో తయారీ రంగానికి కేంద్రంగా మారింది. మేకిన్ ఇండియా విజయవంతం కావడంలో కుటీర పరిశ్రమల నుంచి భారీ పరిశ్రమల వరకు అన్నింటి పాత్ర ఉంది. అనేక పేద, మధ్యతరగతి వర్గాలు తమ ప్రతిభను రుజువు చేసుకుని ప్రయోజనం పొందుతున్నాయి. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, ఎగుమతులు పెరుగుతున్నాయి. నాణ్యతకు పెద్దపీట వేయాలి. స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలి. ప్రస్తుత పండుగల కాలంలోనూ ప్రజలు దీనికి ఊతమివ్వాలి. మట్టి ప్రమిదలే కాకుండా బహుమతులనూ స్థానిక తయారీవే కొనాలి" అని ప్రధాని చెప్పారు.

పాత పని విధానాన్ని మార్చేశా

పుణె: పాత తరహా పనివిధానాన్ని తాను మార్చేశానని ప్రధాని మోదీ చెప్పారు. అలా చేయనట్లయితే పుణెలో మెట్రో ప్రాజెక్టు ముందడుగు వేసేది కాదన్నారు. మహారాష్ట్రలోని పుణెలో రూ.11,200 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు ఆదివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేశారు. పుణె మెట్రో భూగర్భ మార్గాన్ని ప్రారంభించారు. మునుపటి ప్రభుత్వాలకు ముందుచూపు లేక పుణెవంటి నగరాల్లోనూ పనులు ఆలస్యమయ్యాయని చెప్పారు. ముంబయి-అహ్మదాబాద్ బుల్లెట్ రైలుకూ ఇప్పుడు అడ్డంకులు తొలగిపోయాయన్నారు.

నస్రల్లాపై విరుచుకుపడ్డ హామర్స్

- సెకనుకు రెండు బాంబులతో దాడి
- అవీ అమెరికా ఇచ్చినవే..
- ఇరాన్ గూఢచారి సహకారం..

ఇంటర్నెట్ డెస్క్: హెజ్‌బొల్లా అధినేత నస్రల్లాను అంతమొందించేందుకు ఇజ్రాయెల్ భారీ వ్యూహాన్నే అమలు చేసింది. ఒకప్పుడు నెతన్యాహును వ్యతిరేకిస్తూ ఆందోళనకు దిగిన వాయుసేనను, ఇరాన్ గూఢచారిని, అమెరికా బాంబులను వినియోగించుకుంది. సెకనుకు రెండు చొప్పున 100 బాంబులతో దాడి చేసి నస్రల్లాను చంపేసింది. ఒకప్పుడు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమన్ నెతన్యాహు న్యాయ సంస్కరణలను వ్యతిరేకిస్తూ వాయుసేనలోని ఓ స్క్వాడ్రన్ ఆందోళనకు దిగింది. కానీ గత ఏడాది అక్టోబరు 7న హమాస్ దాడితో తిరిగి విధుల్లో చేరింది. ఇప్పుడు అదే స్క్వాడ్రన్ ఏకంగా హెజ్‌బొల్లా అధినేత నస్రల్లాను లెబనాన్‌లో మట్టుబెట్టింది. అదే ఇజ్రాయెల్ వాయుసేనకు చెందిన 69వ స్క్వాడ్రన్. ముద్దుగా 'హామర్స్' అని పిలుస్తారు. హట్‌జెరిమ్ ఎయిర్‌బేస్ కేంద్రంగా ఇది పని చేస్తుంది.

అత్యంత కఠిన ఆపరేషన్..

'ఆపరేషన్ న్యూఆర్డర్' పేరిట హెజ్‌బొల్లా ప్రధాన కార్యాలయంపై దాడి కోసం హట్‌జెరిమ్ ఎయిర్‌బేస్‌కు కొత్త కమాండింగ్ అధికారిగా బ్రిగేడియర్ జనరల్ అమిచయ్ లెవినెను నియమించారు. హామర్స్ స్క్వాడ్రన్ ఎఫ్-15ఐ ర్యామ్ ఫైటర్ జెట్‌లను వాడుతుంది. గతంలో సిరియా, లెబనాన్‌లో కఠినమైన ఆపరేషన్లు

బీరుట్ శివారులో నస్రల్లాను మట్టుబెట్టిన ప్రాంతానికి సమీపంలో ధ్వంసమైన భవనాలు

జరిపిన అనుభవం ఈ సిబ్బందికి ఉంది. లెబనాన్‌లో దాడికి దాదాపు 100 బాంబులను ప్రతి రెండు సెకన్లకు ఒకటి చొప్పున లక్ష్యంపై జారవిడిచినట్లు లెవినె వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న వారిలో సగం మంది రిజర్విస్టులే అని పేర్కొన్నారు. 25 ఏళ్ల నుంచి 50 ఏళ్ల వయసు వారున్నట్లు తెలిపారు. గతేడాది ఇజ్రాయెల్‌లో న్యాయ సంస్కరణలను వ్యతిరేకిస్తూ ఈ స్క్వాడ్రన్‌లోని సిబ్బంది ఆందోళనకు దిగడం విశేషం.

సమాచారమిచ్చింది ఇరాన్ గూఢచారే..

హెజ్‌బొల్లా చీఫ్ నస్రల్లా ఎక్కడున్నాడో కచ్చితమైన లొకేషన్‌ను ఇరాన్‌కు చెందిన ఓ గూఢచారే ఇజ్రాయెల్‌కు అందించాడని తెలిసింది. బీరుట్ శివార్లలోని దహియాలో హెజ్‌బొల్లా అండర్‌గ్రౌండ్ హెడ్ క్వార్టర్స్‌లో నస్రల్లా ఉన్నాడని.. టాప్ కమాండర్లతో భేటీ అవుతున్నట్లు అతడు ఇజ్రాయెల్‌కు ఉప్పందించాడు. దీంతో ఇజ్రాయెల్ నేరుగా ప్రధాన స్థావరంపై దాడి చేసి మొత్తం భవనాలను నేలమట్టం చేసింది.

మోదీని గద్దె దించేవరకూ చనిపోను

- కశ్మీర్‌కు రాష్ట్ర హోదా కోసం పోరాడుతూనే ఉంటాం: ఖర్గే

జస్‌రోటా ర్యాలీలో మాట్లాడుతున్న ఖర్గే

జస్‌రోటా: జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించే వరకూ పోరాడుతూనే ఉంటామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. ప్రస్తుతం తన వయసు 83 సంవత్సరాలై నప్పటికీ అప్పుడే చనిపోనని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని గద్దె దించే వరకూ రాజకీయాల్లో క్రియాశీలంగానే ఉంటానని తెలిపారు. జమ్మూ కశ్మీర్‌లోని జస్‌రోటాలో ఆదివారం ఏర్పాటు చేసిన ఎన్నికల ర్యాలీలో ఖర్గే ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. వైద్య సాయం పొందిన తర్వాత ప్రసంగాన్ని కొనసాగిస్తూ పైమేరకు పేర్కొన్నారు. ఇంకా ఖర్గే మాట్లాడుతూ 'తలతిరగడంవల్ల కూర్చున్నా. వాళ్లు (భాజపా) మనల్ని భయపెట్టాలని చూస్తున్నారు. పాకిస్థాన్ గురించి మాట్లాడుతున్నారు. మనం భయపడేదే లేదు. బంగ్లాదేశ్‌కు విముక్తి కల్పించిందెవరు.. ఇందిరా గాంధీ ఆ పని చేశారు. జై జవాన్.. జై కిసాన్ నినాదం ఇచ్చాం. పాకిస్థాన్‌ను ఓడించాం. లాల్ బహదూర్ శాస్త్రి పాక్‌ను మట్టి కరిపించారు. కాంగ్రెస్ అంటే అది' అని ఖర్గే భావోద్వేగపూరితంగా ప్రసంగించారు. అస్వస్థతకు గురైన ఖర్గేకు ప్రధాని మోదీ ఫోన్ చేసి క్షేమసమాచారం అడిగి తెలుసుకున్నారు.

కట్ చేస్తే.. చిత్రమైన పత్రం!

శరన్నవరాత్రి వేడుకలను పురస్కరించుకొని త్రిపురలోని అగర్తలలో ఆదివారం భారీ చేమ ఆకుపై తాను తీర్చిదిద్దిన చిత్రాన్ని చూపుతున్న శుభం సాహా

నేపాల్ వరదలకు 170 మంది బలి

కాఠ్‌మాండూ: నేపాల్‌లో వరదలు, కొండచరియలు విరిగిపడి 170 మంది బలయ్యారు. శుక్రవారం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు తూర్పు, మధ్య నేపాల్‌లో ఆకస్మిక వరదలు ముంచెత్తాయి. దీంతో 42 మంది గల్లంతవ్వగా, 111 మంది తీవ్రంగా గాయపడ్డారు. 322 ఇళ్లు, 16 వంతెనలు దెబ్బతిన్నట్లుగా ఆదివారం అధికారులు ప్రకటించారు. వేల మందితో సహాయక చర్యలను చేపట్టారు. భాగమతి నది ప్రమాదస్థాయిని మించి ప్రవహిస్తోంది.

కాఠ్‌మాండూలో వరదనీటి ఉద్ధృతి

హెజ్‌బొల్లా కింకర్తవ్యం?

- ఆయుధాలున్నా కీలక నేతల హతంతో అయోమయం
- ఇరాన్ బహిరంగ సహకారం అనుమానమే..

ఇంటర్నెట్ డెస్క్: హెజ్‌బొల్లా అధినేత హసన్ నస్రల్లాను వైమానిక దాడుల్లో ఇజ్రాయెల్ హతమార్చడంతో తదుపరి ఆ సంస్థ భవిష్యత్తుపై కొంత అయోమయం నెలకొంది. ఇప్పటికే చాలా మంది కీలక కమాండర్లను కోల్పోయిన హెజ్‌బొల్లాకు ఇది అత్యంత భారీ నష్టం. ఇప్పుడు దాని దగ్గర భారీగా ఆయుధాలున్నా నడిపించేవారు కరవయ్యారు. లెబనాన్ ప్రభుత్వ సైన్యంకన్నా ఎక్కువ ఆయుధాలు హెజ్‌బొల్లా వద్ద ఉన్నాయి. క్షిపణులు, రాకెట్లతోపాటు వేల మంది శిక్షణ పొందిన ఫైటర్లున్నారు. అయినా ఇజ్రాయెల్‌పై ప్రతీకార దాడులకు పెద్దగా పాల్పడటం లేదు. నస్రల్లా మరణం అనంతరం స్వల్ప స్థాయిలో రాకెట్లను ఇజ్రాయెల్‌పైకి హెజ్‌బొల్లా ప్రయోగిస్తోంది.

ఇజ్రాయెల్‌కు సంపూర్ణ విజయం కష్టమే..

హెజ్‌బొల్లాను పూర్తిగా నిర్మూలించడం ఇజ్రాయెల్‌కు కష్టమే. 1978 నుంచి పలుమార్లు లెబనాన్‌పై దాడులు చేసినా, దిగ్బంధించినా పెద్దగా ఫలితాలు రాలేదు. ఏడాదిగా హమాస్‌పై పోరు చేస్తున్నా పూర్తిగా తుడిచిపెట్టలేకపోయింది. ఎదురుగా వచ్చే సైన్యంతో పోరాడవచ్చుగానీ గెరిల్లా పోరులో విజయం దాదాపు అసాధ్యం.

ఇరాన్ అండతో..

హెజ్‌బొల్లా, హమాస్, హూతీ... తదితర గ్రూపులకు ఇరాన్ అండగా ఉంది. కానీ ఇజ్రాయెల్‌పై బహిరంగంగా యుద్ధం చేసేందుకు ఆ దేశం సంసిద్ధంగా లేదు. ఈ రెండు దేశాలకు ఎలాంటి భౌగోళిక సరిహద్దుల్లేవు. గతంలోనూ ఇరాన్ ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్ల దాడిని అమెరికా సాయంతో ఇజ్రాయెల్ కూల్చివేయగలిగింది. ఒక వేళ ఇరాన్‌తో పోరు తీవ్రమైతే ఇజ్రాయెల్ అణ్వాయుధాలను బయటకు తీసే ప్రమాదముంది. ఇటు ఇరాన్ అణ్వాయుధాల తయారీకి దగ్గర్లోనే ఉందన్న సమాచారం ఉంది. దీంతో రెండు దేశాలు సంయమనం పాటించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

భూతల దాడులపై సందిగ్ధం..

వైమానిక దాడులతో మంచి ఫలితాలు రాబట్టిన ఇజ్రాయెల్ హెజ్‌బొల్లా స్థావరాలపై భూతల దాడులు చేపట్టే అవకాశముందని కొందరు అంచనా వేస్తున్నారు. అయితే 2006లో ఇలాంటి ప్రయత్నం ఇజ్రాయెల్‌కు ఇబ్బందికర వాతావరణం సృష్టించింది. అందుకే సరిహద్దులవద్ద మోహరించడం వరకే పరిమితం కావడం, వైమానిక దాడులు కొనసాగించడంపై దృష్టి కేంద్రీకరించవచ్చు.

ఐరాస తీర్మానం 1701

2006లో ఐరాస తీర్మానం 1701 ప్రకారం.. ఇజ్రాయెల్ లెబనాన్ నుంచి దళాలను వెనక్కి తీసుకుంది. హెజ్‌బొల్లా దళాలు లిటానీ నది ఉత్తర భాగానికి వెళ్లిపోయాయి. తీర్మానాన్ని అనుసరించి ఐరాస ప్రత్యేక శాంతి దళాలు అక్కడ ఉన్నా రెండు వర్గాలు ఉల్లంఘనలకు పాల్పడుతున్నాయి. ఒకవేళ మళ్లీ చర్చలు జరిగితే హెజ్‌బొల్లా లిటానీకి ఉత్తరంగా ఉండాలని, దక్షిణ ప్రాంతాన్ని బఫర్ జోన్‌గా ఉంచాలని ఇజ్రాయెల్ డిమాండు చేయవచ్చు.

ఏకకాల ఎన్నికల అమలుకు 3 బిల్లులు

దిల్లీ: దేశంలో ఏకకాల ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం చేసేలా మూడు బిల్లులను తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. వీటిలో రాజ్యాంగ సవరణకు ఉద్దేశించినవి రెండు ఉంటాయి. లోక్‌సభ-శాసనసభ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి కనీసం సగం రాష్ట్రాల నుంచి ఆమోదం అవసరమవుతుంది. 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక' ప్రణాళిక కింద ఉన్నతస్థాయి కమిటీ సిఫార్సుల్ని ప్రభుత్వం ఇటీవలే ఆమోదించిన విషయం తెలిసిందే. దేశవ్యాప్త ఏకాభిప్రాయ సేకరణ తర్వాత దశలవారీగా దీనిని అమలు చేయనున్నారు. లోక్‌సభ, శాసనసభ ఎన్నికలను కలిపి నిర్వహించడానికి రాజ్యాంగంలోని 82-ఏ అధికరణంలో మార్పు చేసేలా మొదటి బిల్లును ప్రతిపాదిస్తున్నారు. లోక్‌సభ పదవీకాలం, దాని రద్దుపై 83(2)లో కొత్తగా అనుబంధ నిబంధనలు చేర్చనున్నారు. అసెంబ్లీల రద్దుకు రాజ్యాంగంలోని 327 అధికరణాన్ని సవరించి 'ఏకకాల ఎన్నికలు' అనే పదాలను చేర్చనున్నారు. ఈ బిల్లుకు 50% రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు. ఓటర్ల జాబితా తయారీకి సంబంధించిన రెండో సవరణకు మాత్రం రాష్ట్రాల శాసనసభల ఆమోదం ఉండాలి. రాజ్యాంగం ప్రకారం కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలు వేర్వేరు సంస్థలు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, లోక్‌సభ, రాజ్యసభ, రాష్ట్ర శాసనసభలు, శాసనమండళ్ల ఎన్నికలను ఈసీ నిర్వహిస్తుంది. పురపాలక సంఘాలు, పంచాయతీలకు రాష్ట్ర సంఘం ఎన్నికలు నిర్వహిస్తుంది. లోక్‌సభ-శాసనసభ ఎన్నికలతో పాటు పురపాలక సంఘాలు, పంచాయతీలకూ ఎన్నికలు నిర్వహించేలా 324-ఏ అధికరణాన్ని సవరించడం రెండో బిల్లు ఉద్దేశం. శాసనసభలున్న మూడు కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించి మూడో బిల్లు ప్రవేశపెడతారు. దీనికి కూడా రాష్ట్రాల సమ్మతి అవసరం లేదు.

దివ్యాంగ పిల్లల సంరక్షణలో సంస్కరణలు అవసరం

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగరత్న

దిల్లీ: దివ్యాంగ చిన్నారుల సంరక్షణ విధానంలో సంస్కరణల అవసరం ఎంతైనా ఉందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి, జువైనల్ జస్టిస్ కమిటీ చైర్‌పర్సన్ జస్టిస్ నాగరత్న తెలిపారు. వీరికి సంబంధించి కచ్చితమైన వివరాల సేకరణ, ఆర్థికంగా జీవితకాల మద్దతుతోపాటు విద్యపరంగా సహకారంపై దృష్టి సారించాలన్నారు. 'దివ్యాంగ చిన్నారుల హక్కుల పరిరక్షణ' భాగస్వామ్య పక్షాల 9వ వార్షిక సదస్సులో ఆమె మాట్లాడారు. ఇటువంటి పిల్లలను ఆదుకోవడంలో లోపాలు ఉన్నాయని, ఈ సమస్యల పరిష్కారానికి అందరూ కృషి చేయాలని చెప్పారు.

తల్లిని కట్టేసి.. సజీవదహనం

త్రిపురలో ఇద్దరు అన్నదమ్ముల ఘాతుకం

అగర్తల: త్రిపురలో ఇద్దరు అన్నదమ్ములు తీవ్ర ఘాతుకానికి పాల్పడ్డారు. తమ కన్నతల్లిని చెట్టుకు కట్టేసి సజీవ దహనం చేశారు. పశ్చిమ త్రిపురలో చంపక్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఖమర్చరీలో శనివారం రాత్రి ఈ ఘోరం జరిగింది. కుటుంబ తగాదాల వల్లే వారు తల్లిని చంపినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. దాదాపు ఏడాదిన్నర కిందట భర్త చనిపోయినప్పటి నుంచి ఆ ఇద్దరు కుమారుల వద్దే తల్లి ఉంటోందని పేర్కొన్నారు. ఆమె మరో కుమారుడు అగర్తలాలో నివసిస్తున్నట్లు చెప్పారు.

సీపీఎం కేంద్ర కమిటీ తాత్కాలిక సమన్వయకర్తగా ప్రకాశ్ కారాట్

దిల్లీ: సీపీఎం పొలిట్ బ్యూరో, కేంద్ర కమిటీ తాత్కాలిక సమన్వయకర్తగా పార్టీ సీనియర్ నేత ప్రకాశ్ కారాట్ నియమితులయ్యారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో జరగనున్న పార్టీ కాంగ్రెస్ సమావేశం వరకు కారాట్ సమన్వయకర్తగా ఉంటారని ఆదివారం సీపీఎం ఒక ప్రకటనలో వెల్లడించింది. ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆకస్మిక మృతితో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.

ఐటీ కార్యాలయంలో గుండెపోటుతో ఉద్యోగి మృతి

నాగ్‌పుర్‌లో ఘటన

నాగ్‌పుర్: మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌లో ప్రముఖ ఐటీ కంపెనీలో పని చేస్తున్న ఉద్యోగి వాష్‌రూంలో విగతజీవిగా కనిపించాడు. అప్పస్మారక స్థితిలో పడి ఉన్న నితిన్ ఎడ్విన్ మైఖేల్(40)ను సహోద్యోగులు వెంటనే క్యాంపస్ క్లినిక్‌కు తీసుకువెళ్లారు. అటు నుంచి ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. అప్పటికే మైఖేల్ మృతిచెందినట్లుగా వైద్యులు ధ్రువీకరించారు. గుండెపోటుతో అతడు మరణించినట్లు పోస్టుమార్టం నివేదికలో తేలిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. అతడి మరణానికి దారి తీసిన పరిస్థితులపై దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

భూమికి చిన్ని చంద్రుడొచ్చాడు!

దిల్లీ: భూమికి సహజ ఉపగ్రహం జాబిల్లి ఒక్కటే! అయితే ఆదివారం రాత్రి నుంచి దానికి మరొకటి తోడయ్యింది!! కానీ పూర్తిస్థాయిలో ఏమీ కాదులెండి. తాత్కాలికంగానే. కేవలం 10 మీటర్ల వ్యాసంతో ఉండే '2024 పీబీ5' అనే ఒక గ్రహశకలం ఆదివారం రాత్రి భూ కక్ష్యలోకి ప్రవేశించింది. దాదాపు 53 రోజులపాటు ఇదే కక్ష్యలో ఉండి.. ఆ తర్వాత సువిశాల సౌర వ్యవస్థలోకి తిరిగి వెళ్లిపోనుంది. ఆలోగా అది భూమి చుట్టూ ఒక్క పరిభ్రమణాన్ని కూడా పూర్తిచేయదు. చంద్రుడితో పోలిస్తే '2024 పీబీ5' సుమారు 3.5 లక్షల రెట్లు చిన్నది. ప్రత్యేక టెలిస్కోపులతో మాత్రమే దాన్ని చూడగలం. ఈ బుల్లి గ్రహశకలం భూమిని ఢీకొట్టే అవకాశాలు లేవని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు.

కోల్‌కతాలో ట్రామ్ రవాణా సేవలను కొనసాగించాలంటూ ఆదివారం ఎస్‌ప్లనేడ్ ట్రామ్ డిపోలో ఆందోళన చేస్తున్న ప్రజలు. 150 ఏళ్లుగా కొనసాగిస్తున్న ఈ సేవలకు త్వరలో ముగింపు పలకాలని నిర్ణయించినట్లు పశ్చిమబెంగాల్ రవాణా శాఖ మంత్రి స్నేహాశీష్ చక్రవర్తి ఇటీవల ప్రకటించారు. దీంతో ఈ సేవలను కొనసాగించాలంటూ ట్రామ్ ప్రేమికులు ఆందోళనలు మొదలుపెట్టారు. ప్రస్తుతం మన దేశంలో ట్రామ్ సేవలు అందుబాటులో ఉన్నది కోల్‌కతాలో మాత్రమే.

అన్ని పంటలకు మద్దతు ధర

జేజేపీ మ్యానిఫెస్టో విడుదల

చండీగఢ్: హరియాణా ఎన్నికల్లో ఏఎస్‌పీతో కలిసి పోటీ చేస్తున్న జన్‌నాయక్ జనతా పార్టీ (జేజేపీ) ఎన్నికల మ్యానిఫెస్టోను విడుదల చేసింది. అన్ని పంటలను కనీస మద్దతు ధరలకు కొంటామని, నిరుద్యోగులకు రూ.11,000 భృతి ఇస్తామని, వృద్ధాప్య పింఛనును 5,100 చేస్తామని హామీలిచ్చింది. ఆదివారం సిర్సాలో జేజేపీ నేత దుష్యంత్ చౌటాలా మ్యానిఫెస్టోను విడుదల చేశారు. పంట నష్టపోతే ఎకరానికి రూ.25,000 ఇస్తామని అందులో తెలిపారు. విద్య, ఉద్యోగాల్లో గ్రామీణ విద్యార్థులకు వెయిటేజీ ఇస్తామని చెప్పారు. ఉద్యోగ దరఖాస్తుదారులకు లైఫ్‌టైమ్ ఫీజుగా రూ.100ను నిర్ణయిస్తామని, బాలికలకు స్కూటీలను ఇస్తామని హామీ ఇచ్చారు.

జమ్మూ కశ్మీర్‌లో ముగిసిన ప్రచారం

జమ్మూ, శ్రీనగర్: జమ్మూ కశ్మీర్‌లో చివరి విడత పోలింగ్‌కు ప్రచారం ఆదివారం సాయంత్రం ముగిసింది. మూడో విడతలో భాగంగా మంగళవారం 40 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ జరగనుంది. జమ్మూ, ఉధంపుర్, సాంబా, కథువా, బారాముల్లా, బండీపోరా, కుప్వారా జిల్లాల్లో పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది.

బోగస్ బ్యాంకులో పోలీసుల ఆరా

ఛత్తీస్‌గఢ్‌లో ఉత్తుత్తి బ్యాంక్

జాంజ్‌గీర్ – చాంపా: ఛత్తీస్‌గఢ్‌లోని సక్తి జిల్లాలో కొంతమంది మోసగాళ్లు ఏర్పాటుచేసిన బోగస్ బ్యాంకు గుట్టు రట్టుకావడంతో మేనేజర్ సహా ముగ్గురు ఆపరేటర్లపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. మ

18 ప్రాజెక్టులు... రూ.5,765 కోట్లు

- వీటిని పూర్తిచేస్తే వచ్చే ఖరీఫ్ నాటికి సాగులోకి 4.78 లక్షల ఎకరాలు
- నిధులిచ్చేందుకు సీఎం అంగీకారం

ఈనాడు హైదరాబాద్: ప్రధానమైన పనులన్నీ పూర్తి చేసుకుని.. ఆయకట్టుకు నీరందడంలో జాప్యం జరుగుతున్న సాగునీటి ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. 75 శాతం, అంతకన్నా ఎక్కువ నిర్మాణం పూర్తయిన వాటికి.. అవసరమైన నిధులిచ్చి.. పనులు పూర్తి చేస్తే.. 4.78 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందించడానికి వీలవుతుందని నీటిపారుదలశాఖ తేల్చింది. రూ.5,765 కోట్లు ఖర్చు చేస్తే వచ్చే ఖరీఫ్‌లో 18 ప్రాజెక్టులు ఉపయోగంలోకి వస్తాయని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నివేదించింది. నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇంజినీర్లతో చర్చించి.. ఈ విషయాన్ని ముఖ్యమంత్రికి నివేదించారు. ప్రతి నెలా ఎంత మొత్తం అవసరమో అంచనాకు రావడంతో పాటు, ఈ నిధులను క్రమం తప్పకుండా ఇవ్వాలని.. అప్పుడే లక్ష్యం మేరకు పనులు పూర్తి చేయగలుగుతామని పేర్కొనగా, దీనికి సీఎం అంగీకరించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆ ప్రకారం భూసేకరణతో కలిపి.. కేవలం రూ.240 కోట్లతో ఆరు ప్రాజెక్టుల్లో మిగిలిన పనులను పూర్తి చేస్తే.. 48 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించవచ్చు. ఇందులో నీల్వాయి, పాలెంవాగు, మత్తడివాగు అదనపు పనులు, ఎస్సారెస్పీ రెండోదశ, సదర్‌మట్ బ్యారేజీ, పిప్రి ఎత్తిపోతల ఉన్నాయి. ఇందులో మూడు ప్రాజెక్టుల కింద ఎక్కువ భాగం ఆయకట్టుకు సాగునీరు అందజేయగా.. మూడింటిలో ఇంకా ఏమీ ఇవ్వలేదు.



కల్వకుర్తి ఎత్తిపోతల

రెండో కేటగిరీ కింద 12 ప్రాజెక్టులు

మొత్తం 18 ప్రాజెక్టుల్లో రెండో కేటగిరీలో 12 ప్రాజెక్టులున్నాయి. ఇవన్నీ 2025 మార్చి నాటికి పూర్తి చేయడానికి అవకాశం ఉందని, వచ్చే మార్చిలోగా రూ.5,525 కోట్లు ఖర్చు చేస్తే 4.3 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించడానికి అవకాశం ఉంటుందని నీటిపారుదలశాఖ అంచనా. ఇందులో గోదావరి బేసిన్‌లో ఆరు, కృష్ణా బేసిన్‌లో ఆరు ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పెండింగ్ బిల్లులు చెల్లించడంతో పాటు నెలవారీగా అవసరమైన నిధులిస్తే వచ్చే ఖరీఫ్ నాటికి లక్ష్యం మేరకు ఆయకట్టుకు నీరందించడం వీలవుతుందని నీటిపారుదలశాఖ నివేదించగా, దీనికి సీఎం రేవంత్‌రెడ్డి అంగీకరించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

వచ్చే ఖరీఫ్ నాటికి ఎక్కువ ఆయకట్టు సాగులోకి వచ్చే అవకాశం ఉన్న 12 ప్రాజెక్టుల వివరాలు ఆయకట్టు (ఎకరాల్లో) నిధులు (రూ.కోట్లలో)

ప్రాజెక్టు	మొత్తం ఆయకట్టు	నీటిపారుదల కల్పన	మిగిలినది	ఖరీఫ్‌నాటికి లక్ష్యం	అవసరమైన నిధులు
కోయిల్‌సాగర్	46,250	26,300	19,950	3,078	121.56
బీమా ఎత్తిపోతల	2,03,000	1,58,000	45,000	21,692	127.34
నెట్టెంపాడు	2,00,000	1,42,000	58,000	35,000	67.88
కల్వకుర్తి ఎత్తిపోతల	4,51,450	3,07,300	1,44,450	1,34,994	489.18
డిండి ఎత్తిపోతల	3,61,000	0	3,61,000	8,000	1470
ఎస్.ఎల్.బి.సి	4,12,000	2,85,000	1,27,000	50,000	1257
చిన్న కాళేశ్వరం	45,738	0	45,738	12,267	183.96
మోదికుంటవాగు	13,591	0	13,591	0	163.08
లోయర్ పెన్‌గంగ	50,800	0	50,800	27,794	147.23
ఎల్లంపల్లి (చనాఖా కొరాట కలిపి)	1,64,498	54,342	1,10,156	41,000	545.95
దేవాదుల ఎత్తిపోతల	5,56,722	3,16,633	2,40,089	89,312	512.18
సీతారామ ఎత్తిపోతల	3,28,853	0	3,28,853	7,115	439.28
మొత్తం	28,33,902	12,89,275	15,44,627	4,30,252	5,524.64

ఛాయాచిత్ర ప్రదర్శనను తిలకిస్తున్న బండి సంజయ్. చిత్రంలో రామచంద్రారెడ్డి, కె.లక్ష్మణ్, మనోహర్‌రెడ్డి, ఎన్.గౌతంరావు తదితరులు

ప్రజల ఆస్తులు కాపాడేందుకు ఉద్యమిస్తాం

- పేదల ఇళ్లు కూల్చడమే ఇందిరమ్మ రాజ్యమా?
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

బర్కత్‌పుర, న్యూస్‌టుడే: 'భారాస ప్రభుత్వ హయాంలో కలెక్టరేట్లు, ఫైర్‌స్టేషన్ల నిర్మాణాల పేరిట పేదల స్థలాలను అన్యాయంగా లాక్కున్నారు. కాంగ్రెస్ అధికారం చేపట్టాక పెద్దలు ఆక్రమించిన భవనాలను కూలుస్తారని భావిస్తే.. పేదల ఇళ్ల కూల్చివేతలపై దృష్టిసారించారు. ఇదే ఇందిరమ్మ రాజ్యమా?' అని ప్రభుత్వాన్ని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. సర్కారు వైఖరి కారణంగా హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ దెబ్బతిని రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధోగతి పాలైందని మండిపడ్డారు. ప్రజల ఆస్తులను కాపాడేందుకు భాజపా ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తుందన్నారు. ఇకపై ఇళ్ల పైకి బుల్డోజర్ వెళ్లాలంటే తొలుత భాజపా కార్యకర్తలను దాటాల్సి ఉంటుందని.. ప్రజలకు తమ పార్టీ రక్షణగా నిలుస్తుందని పేర్కొన్నారు. భాజపా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఆదివారం బర్కత్‌పురలోని నగర పార్టీ కార్యాలయంలో ప్రధాని నరేంద్రమోదీ జీవిత చరిత్రపై ఛాయాచిత్ర ప్రదర్శన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సంజయ్ మాట్లాడుతూ.. 'హైడ్రా' కూల్చివేతలపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుంటే అధికారుల ద్వారా హెచ్చరికలు చేయించడం మూర్ఖత్వమన్నారు. మాజీ సర్పంచులకు గత భారాస ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా మోసం చేసిందని, కాంగ్రెస్ సర్కార్ కూడా అదేతరహాలో వ్యవహరిస్తుండడం తగదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భారాస, కాంగ్రెస్ పార్టీలకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. భాజపా ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీని దేవుడు పంపిన దూతగా అభివర్ణించారు.

ఆర్టీసీలో 3 వేల పోస్టులు భర్తీ చేస్తాం

- పర్యావరణహితమే సంస్థ లక్ష్యం
- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ రవాణా విభాగం, న్యూస్‌టుడే: టీజీఎస్ ఆర్టీసీలో త్వరలో 3 వేలకుపైగా పోస్టులు భర్తీ చేస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. వీఆర్ఏ, కారుణ్య నియామకాలపై కూడా దృష్టి సారిస్తామని వివరించారు. ఆదివారం కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో సంస్థ ఎండీ సజ్జనార్‌తో కలిసి ఆయన ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత పదేళ్లలో ఆర్టీసీలో సిబ్బంది 65 వేల నుంచి 43 వేలకు, బస్సులు 15 వేల నుంచి 9 వేలకు తగ్గినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో రింగ్‌రోడ్ లోపల ఒక్క డీజిల్ బస్సు కూడా తిరగకూడదన్నది సీఎం రేవంత్ సంకల్పమని, అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. "మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటివరకు 92 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించి రూ.3,216 కోట్లు ఆదా చేసుకున్నారు. పర్యావరణ హితంలో భాగంగా మరో 2,500 ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలుకు కసరత్తు చేస్తున్నాం. మహిళలకు పెద్ద పీట వేయాలన్న ఉద్దేశంతో స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా వాటి కొనుగోళ్లకు చర్యలు తీసుకుంటున్నాం. నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లోనూ త్వరలో ఎలక్ట్రిక్ బస్సులు రోడ్డెక్కుతాయి. హైబ్రిడ్ వాహనాలు తయారుచేస్తున్న మారుతి సంస్థతో బస్సుల కొనుగోలుకు చర్చలు జరుపుతున్నాం. 2013 బాండ్లకు సంబంధించి రూ.280 కోట్ల నిధులు విడుదల చేశాం. చాలా మంది డ్రైవర్లకు వారి ఖాతాల్లో నిధులు జమ చేశాం. మిగిలిన సిబ్బందికి దసరాలోగా జమ చేస్తాం" అని పొన్నం పేర్కొన్నారు.

ఎలక్ట్రిక్ బస్సును ప్రారంభించి.. ప్రయాణిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్, కలెక్టర్ పమేలా సత్పతి, ఆర్ఎం సుచరిత

ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నామని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, డాక్టర్ సంజయ్, కలెక్టర్ పమేలా సత్పతి, ఆర్టీసీ ఈడీ మునిశేఖర్, ఆర్ఎం సుచరిత తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను రెచ్చగొడుతున్నారు

- ప్రాజెక్టుల్లో తమ ఇళ్లు పోయాయని కేసీఆర్, కేటీఆర్‌లు గతంలో చెప్పారు
- సీఎంకు వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్న వారిపై విచారణ చేయిస్తాం
- మంత్రి శ్రీధర్‌బాబు

ఈనాడు, హైదరాబాద్: మూసీ నదిని పరిరక్షించుకోవాలని ప్రభుత్వం భావిస్తుంటే.. కొంతమంది అవకాశవాదులు ప్రజలను రెచ్చగొట్టే పనిలో ఉన్నారని మంత్రి శ్రీధర్‌బాబు మండిపడ్డారు. కొందరికి రూ.5 వేలు దాకా ఇచ్చి సీఎంపై వ్యతిరేకంగా మాట్లాడిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. అలాంటి వారిపై విచారణ చేయిస్తామని తెలిపారు. ఆదివారం కాంగ్రెస్ శాసన సభా పక్ష కార్యాలయంలో ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. 'కొందరు తెలిసోతెలియకో చెరువుల్లో, మూసీ నదిలో ఇళ్లు కట్టుకున్నారు. పేదలను నిలబెట్టడమే తప్ప పడగొట్టడం మా ప్రభుత్వ విధానం కాదు. మూసీ నిర్వాసితులకు రెండు పడక గదుల ఇల్లు ఇస్తున్నాం. వారిని మా బిడ్డల్లా చూసుకుంటాం. బిల్డర్ల చేతిలో మోసపోయిన వారి విషయంలో మానవీయ దృక్పథంతో ప్రభుత్వం వ్యవహరిస్తుంది. అపార్టుమెంట్లు కొని నష్టపోయిన నిర్వాసితులకు ఏ రకంగా న్యాయం చేయాలన్న దానిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచిస్తున్నారు. సీఎం సోదరుడి ఇంటికి కూడా నోటీసులు ఇచ్చారు. తన ఇల్లు అక్రమ నిర్మాణమైతే కూల్చమని ఆయన కూడా చెప్పారు. మూసీలోకి గోదావరి నీళ్లు తెస్తాం. అక్రమ నిర్మాణాల కూల్చివేతలను కొందరు నేతలు భూతద్దంలో చూపెట్టే పనిలో ఉన్నారు. నిజాలు దాచిపెట్టి ప్రజలకు చెరువుల్లో స్థలాలు అమ్మిన బిల్డర్లపై, నిర్మాణాలకు అనుమతులిచ్చేలా అధికారులపై ఒత్తిడి తెచ్చింది ఎవరన్నది బయటపెడతాం. దీనిపై కలెక్టరేట్లలో త్వరలో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేస్తాం.

అక్రమ నిర్మాణాలపై బుల్డోజర్ వెళితే తప్పా? ఆ నిర్మాణాలకు భారాస నేతలు మద్దతు ఇస్తున్నారా? మల్లన్నసాగర్ భూ నిర్వాసితులకు మీరు ఏం చేశారు? ప్రాజెక్టులు కడితే మా ఇళ్లు కూడా పోయాయని గతంలో చెప్పిన కేసీఆర్, కేటీఆర్‌లు.. ఇప్పుడేమో ప్రజల్ని ఉసిగొల్పుతున్నారు. గతంలో మేము మల్లన్నసాగర్ వద్దకు వెళితామంటే అరెస్టు చేయించారు. ఇప్పుడు భారాస నేతలను ఎక్కడైనా మేం అడ్డుకున్నామా? మాది ప్రజాపాలన కాబట్టే బాధితుల వద్దకు వారిని వెళ్లనిచ్చాం. కొందరు నేతలు అత్యుత్సాహంతో చేసే ప్రకటనలతో ప్రజలు ఆందోళనకు గురికావద్దు. అక్రమ నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చిన తర్వాతే అధికారులు చర్యలు తీసుకుంటున్నారు' అని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

ఆర్థిక చేయూత.. ఆపదలో భరోసా!

నెల కిందట రాష్ట్రంలో వచ్చిన వరదలకు నదులూ, ఏరులే కాదు.. వాగులు, కాలువలూ పొంగి జనజీవనాన్ని అతలాకుతలం చేశాయి. ఆ జల ప్రళయం గుర్తుకొస్తే ప్రజలు నేటికీ చిగురుటాకుల్లా వణికిపోతున్నారు. వారి భయాన్ని పోగొట్టి.. ఆశలకు జీవం పోసేందుకు ఎంతో మంది దాతలు ముందుకొస్తున్నారు. పెద్ద మనసుతో భరోసా ఇచ్చి బాధితుల కుటుంబాలను నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారు.

డా.ప్రవీణ్‌కుమార్ వేమూరి, అట్లాంటా,అమెరికా
విరాళం: 1,00,000

తెలుగు రాష్ట్రాల్లోని వరద బాధితులకు అండగా నిలిచేందుకు రామోజీ గ్రూపు తరపున రూ.5 కోట్లతో ఏర్పాటు చేసిన 'ఈనాడు సహాయనిధి'కి ఉదారంగా విరాళాలు ఇస్తున్న దాతలకు కృతజ్ఞతలు. ఈనాడు పిలుపు అందుకొని స్పందిస్తున్న సహృదయుల వివరాలు..

ఈనాడు సహాయనిధికి విరాళాలిచ్చిన దాతలు

వ్యక్తులు / సంస్థలు	సొమ్ము (రూ.లలో)
కాకర్ల సుబ్రత్, హైదరాబాద్	2,00,000
గల్లా కోటేశ్వరరావు, గుంటూరు	25,555
కారుణ్య సేవా సమితి, కొత్తపేట, చీరాల	25,000
ద ఆఫీసర్స్ క్లబ్, చీరాల	25,000
బొల్లిపల్లి సుబ్బలక్ష్మమ్మ, నంద్యాల	20,000
పసంతా ఆంజనేయులు, మదనపల్లె, అన్నమయ్య జిల్లా	10,116
సాదు శ్రీరామమూర్తి, హైదరాబాద్	10,116
ఎం.బిందుమాధవి, హైదరాబాద్	10,000
బాచు బుచ్చయ్య, హైదరాబాద్	10,000
పట్టెం వెంకట సుబ్బారెడ్డి, సోమేశ్వరపురం, వైఎస్ఆర్ జిల్లా	10,000
బృంగి గోవిందరాజు, హైదరాబాద్	10,000
కోగంటి రమేశ్, చెన్నై	10,000
డా.వి.ఎన్.ఎన్.వి.ప్రసాద్, పోలవరం, ఏలూరు జిల్లా	10,000
ఎన్.పైడిరాజు, చేబ్రోలు, ఏలూరు జిల్లా	10,000
వేమూరి జై, అట్లాంటా, అమెరికా	8,200
రమణి డి, బెంగళూరు	5,116
పి.లక్ష్మీనారాయణ, మేడ్చల్	5,116
కణితి యోగశ్రీ, కణితి నిత్యశ్రీ, హైదరాబాద్	5,116
మంగి కనకారావు, ఏలూరు	5,116
నౌబత కళ్యాణచక్రవర్తి, కృష్ణారెడ్డిపేట, సంగారెడ్డి జిల్లా	5,116
అమర వెంకట సుబ్బారావు, చీరాల	5,000
పెనుమత్స రవికుమార్, విశాఖపట్నం	5,000
చేకూరి నారాయణ, ఖమ్మం	5,000
పల్లూరి సదాశివరావు, గుంటూరు	5,000
చెన్నూరి రమణి మణి, విశాఖపట్నం	5,000
కామినేని సుధాకర్, తుళ్లూరు, గుంటూరు జిల్లా	5,000
మల్లవరపు శ్రీనివాసరావు, నెల్లూరు	5,000
గడ్డం హేమంత్, శ్రీజిత్, హైదరాబాద్	5,000
బి.మద్దిలేటి, ఎ.గోకులపాడు, కర్నూలు జిల్లా	5,000

సర్వస్వం కోల్పోయారు సాయం చేద్దాం రండి!

RAMOJI GROUP

విరాళాలు పంపవలసిన ఎకౌంట్ వివరాలు
ఈనాడు రిలీఫ్ ఫండ్,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,
సైఫాబాద్ బ్రాంచి,
SB A/C No: 370602010006658
IFSC: UBIN0537063

దాతలకు ముఖ్య సూచన: మీరిచ్చే విరాళాలకు రసీదులు పొందేందుకు ఈ వివరాలు పంపవలసిందిగా మనవి.
1. దాత పేరు 2. పూర్తి చిరునామా 3. పాన్‌కార్డు నంబరు.
• ఈ వివరాలను 9154990933 నంబరుకు లేదా relieffund@eenadu.in ఈ మెయిల్ ఐడీకి పంపగలరు.

సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి. చిత్రంలో ఈటల రాజేందర్, హరీశ్‌బాబు

హామీలు అమలు చేయాలని నేడు రైతు దీక్ష

భాజపా శాసనసభాపక్షనేత మహేశ్వర్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా రాష్ట్ర రైతాంగాన్ని ప్రభుత్వం మోసం చేస్తోందని.. దీనికి నిరసనగా సోమవారం 24 గంటల రైతు దీక్ష చేపడుతున్నట్లు భాజపా శాసనసభాపక్ష నేత ఎ.మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ దీక్షలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నాయకులు, భారీ సంఖ్యలో రైతులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఆదివారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే రైతుదీక్ష లక్ష్యమన్నారు. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేశారన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, సీఎం మాటలు చూస్తే ఇచ్చిన హామీలు అమలు చేసేలా కనబడటంలేదన్నారు. రైతులను అప్పుల ఊబి నుంచి తీసుకువచ్చేందుకే దీక్ష చేస్తున్నామన్నారు. ఈ దీక్షలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పేదల రక్తంతో మూసీని సుందరీకరిస్తారా?

- హిట్లర్‌లా వ్యవహరిస్తున్న రేవంత్‌రెడ్డి
- హరీశ్‌రావు తీవ్ర విమర్శలు

రాజేంద్రనగర్, మెహదీపట్నం, నాగోల్, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమాన్ని, పేదల గోడును పట్టించుకోకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హిట్లర్‌లా వ్యవహరిస్తున్నారని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. మూసీ బాధితుల కష్టాలు చూస్తే ఎంతటి కఠిన గుండైనా కరిగిపోతుందని, సీఎం మాత్రం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ సుందరీకరణ పేరు మీద రిసార్టులు కట్టి ఏం ఉద్ధరిస్తారంటూ మండిపడ్డారు. హైదరాబాద్‌లోని బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధి హైదర్షాకోట, లంగర్‌హౌస్ హాషింనగర్‌లలో మూసీ సుందరీకరణ ప్రాజెక్టులో ఇళ్లు కోల్పోతున్న బాధితులను ఆయన ఆదివారం కలిసి మాట్లాడారు. హరీశ్ వెంట మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, మల్లారెడ్డి, గంగుల కమలాకర్, ఎమ్మెల్యేలు వివేకానందగౌడ్, పాడి కౌశిక్‌రెడ్డి, కె.వెంకటేశ్, మాధవరం కృష్ణారావు, సంజయ్, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, నవీన్‌రెడ్డి ఉన్నారు.

ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. 'బుల్డోజర్ ప్రభుత్వాలంటూ ఇతర రాష్ట్రాల్లో విమర్శలు చేస్తున్న రాహుల్‌గాంధీ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్లను కూలుస్తున్నా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం ఎంత బెదిరించినా నివాసితులు ఎవరూ భయపడొద్దు. బుల్డోజర్లు ముందు భారాస ఎమ్మెల్యేలను దాటుకొని రావాల్సి ఉంటుంది. పేదలకు రూ.4 వేల పింఛను, రైతులకు రూ.7,500 రైతుబంధు, మహిళలకు నెలకు రూ.2,500 చొప్పున ఇస్తామని ఎన్నికల్లో చెప్పిన రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టాక డబ్బులు లేవంటూ బుకాయిస్తున్నారు. మరి మూసీ సుందరీకరణకు రూ.1.5 లక్షల కోట్లు ఎక్కడి నుంచి తెస్తారు? పేదల రక్తం, కన్నీళ్లతో సుందరీకరణ చేస్తారా? ఈ నదిపై ఓ వైపు పెద్ద కంపెనీలు ఆరు ప్రాజెక్టులు నిర్మిస్తున్నా పట్టించుకోకుండా సామాన్యుల జోలికి ఎందుకు వస్తున్నారు? ఇక్కడి ఇళ్ల కూల గొట్టి ఆ స్థలాలను ప్రపంచబ్యాంకుకు కట్టబెట్టే కుట్ర జరుగుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామంలో ఆయన ఇల్లు ఎఫ్‌టీఎల్ పరిధిలోని సర్వే నం.30 రెడ్డికుంటలో ఉంది. సీఎం సోదరుడి నివాసం కూడా ఎఫ్‌టీఎల్‌లోనే ఉంది. ముందు వారిద్దరి ఇళ్లు కూల్చాలి. సీఎం సోదరుడికి నోటీసులిచ్చి కోర్టుకు పంపించారు. పేదలకు మాత్రం ఆ అవకాశం ఇవ్వకుండా ఉన్నట్లుండి కూలుస్తున్నారు. గతంలో ఈ లేఅవుట్‌లకు కాంగ్రెస్, తెదేపా ప్రభుత్వాలే అనుమతులిచ్చాయి. అప్పటి అధికారులు, పాలకులపై చర్యలు తీసుకోవాలి. పేదల తరపున భారాస న్యాయపరంగా, రాజకీయపరంగా అన్నిరకాలుగా పోరాడుతుంది. బాధితులు ఎలాంటి ఆపద వచ్చినా ఫోన్ చేయండి.. వెంటనే మీ ముందుంటా' అని హరీశ్ భరోసా ఇచ్చారు.

హైదర్షాకోటలో స్థానికులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

తలసాని, సబిత మాట్లాడుతూ.. చిన్న వయసులోనే ముఖ్యమంత్రయ్యే అవకాశం రేవంత్‌కు వచ్చిందని, కానీ పేదలకు మంచి పాలన అందించకుండా వారి ఉసురు పోసుకుంటున్నారని దుయ్యబట్టారు. మూసీ అభివృద్ధిపై ప్రభుత్వానికి స్పష్టత లేదని.. ఒక్కోసారి ఒక్కో ప్రకటన చేస్తోందని విమర్శించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ భారాస ఇన్‌ఛార్జి కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఉత్తమ్‌కు పితృ వియోగం

- నివాళి అర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు, నేతలు

ఈనాడు, హైదరాబాద్; శేరిలింగంపల్లి, రాయదుర్గం- న్యూస్‌టుడే: రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తంరెడ్డి (90) ఆదివారం ఉదయం తుది శ్వాస విడిచారు. హైదరాబాద్ కొండాపూర్ మసీదు బండలోని తన కుమార్తె ఇంట్లో ఉంటున్న ఆయన వృద్ధాప్య సమస్యలతో కన్నుమూశారు. పురుషోత్తంరెడ్డికి భార్య ఉషాదేవి, కుమారులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డి, కుమార్తె హితశ్రీరెడ్డి ఉన్నారు. పురుషోత్తంరెడ్డి స్వగ్రామం సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం తాటిపాముల. బీహెచ్ఈఎల్‌లో జనరల్ మేనేజర్‌గా పదవీ విరమణ పొందిన ఆయన.. సిమెంట్, సోలార్ రంగాల్లో నిష్ణాతులుగా పేరొందారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలు పురుషోత్తంరెడ్డి పార్థివ దేహం వద్ద నివాళులు అర్పించారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మహాప్రస్థానంలో పురుషోత్తంరెడ్డి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఉత్తమ్‌కు దూరపు బంధువైన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి పాడె మోశారు.

పురుషోత్తంరెడ్డి

పురుషోత్తంరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో ఉత్తమ్ తదితరులు

శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, సీతక్క, దామోదర్ రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, భాజపా ఎంపీ రఘునందన్‌రావు, భాజపా శాసనసభాపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ తదితరులు సంతాపం ప్రకటించి, నివాళి అర్పించారు.

లీగల్ నోటీసు పంపిస్తే మాట్లాడడం ఆపేస్తానా?

సీఎం రేవంత్‌పై కేటీఆర్ ధ్వజం

ఈనాడు, హైదరాబాద్: బావమరిదితో లీగల్ నోటీసు పంపితే మీ చట్టవిరుద్ధమైన దందాల గురించి మాట్లాడడం బంద్ చేస్తానని అనుకుంటున్నారా? అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ధ్వజమెత్తారు. ఆదివారం 'ఎక్స్' వేదికగా ఆయన పలు వ్యాఖ్యలు చేశారు. 'బావమరిదికి అమృతం పంచి.. పేదలకు విషం ఇస్తుంటే చూస్తూ ఊరుకోం. ముఖ్యమంత్రి పర్యవేక్షిస్తున్న శాఖ ఆయన బావమరిది కంపెనీకి రూ.1,137 కోట్ల టెండర్ కట్టబెట్టింది నిజం. ఆ చిన్న కంపెనీ గత రెండేళ్లుగా రూ.2 కోట్ల లాభం మాత్రమే ఆర్జించింది. ఈ విషయంలో దిల్లీలో ఉన్న మీ భాజపా దోస్తులు కూడా మిమ్మల్ని కాపాడడం కష్టమే. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్లను ముఖ్యమంత్రి ఉల్లంఘించిన మాట నిజం. మీరు ఆదర్శ్ కుంభకోణంలో మాదిరిగా దొరికారు. ఈ దేశంలో న్యాయవ్యవస్థ బలంగా, నిజాయతీగా ఉంది. మీకు రాజీనామా తప్పదు' అని కేటీఆర్ పేర్కొన్నారు.

స్నేహితులను ఎంచుకొనే విషయంలో జాగ్రత్త

మీరు రోజూ మాట్లాడే మీ సన్నిహిత మిత్రులు తరచూ పుస్తకాలు, వ్యాపారం, పెట్టుబడి గురించి మాట్లాడుతుంటే, మీరూ ఆ అ

మెదడు ఆరోగ్యానికి 5 మెట్లు!

- చక్కెర, స్క్రీన్ టైం, హెడ్‌ఫోన్లూ చేటు చేస్తాయంటున్న వైద్యులు
- అవగాహనతో మెలగాలని సూచిస్తున్న నిపుణులు



ఈనాడు డిజిటల్, అమరావతి: మెదడు.. మానవ శరీరంలో సుమారు 1,400 గ్రాముల బరువున్న అతి ముఖ్య అవయవం. ఒంట్లో ఏ భాగం స్పందించాలన్నా.. దాని అనుమతి తప్పనిసరి. అలాంటి భాగాన్ని ఎంతో జాగ్రత్తగా చూసుకోవాలి. దానిగురించి ఎప్పుడైనా ఆలోచించారా..? అది ఆరోగ్యంగా ఉండాలంటే ఏం చేయాలో తెలుసుకున్నారా..? అంటే చాలామందికి అవగాహన ఉండటం లేదనే చెప్పాలి. పైగా మెదడును తన పని తాను చేసుకోనివ్వకుండా.. చెడు అలవాట్లతో నష్టపరుస్తున్నారు. అవి అలాగే కొనసాగిస్తే వయసు మీదపడే కొద్దీ అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. చిన్నవే అనుకునే ఆ పనుల నుంచి బయటపడాలంటే ఏం చేయాలో వివరిస్తున్నారు.. కన్సల్టెంట్ ఎండోస్కోపిక్ న్యూరోసర్జన్, ఇంటర్వెన్షనల్ పెయిన్ స్పెషలిస్ట్ డాక్టర్ రాజ్యలక్ష్మి ఇడుపుగంటి, విజయవాడ జీజీహెచ్‌కు చెందిన న్యూరాలజీ వైద్యనిపుణులు ఇవాంజెలిన్ బ్లెస్సీ.

1) పునరుత్తేజానికి నిద్రే ఔషధం

7-8 గంటల విశ్రాంతి తప్పనిసరి

నిద్రతో మెదడుకు దగ్గరి సంబంధం ఉంది. నిద్రలో మెదడు విశ్రాంతి తీసుకుంటుంది. ఆ సమయంలోనే జ్ఞాపకాలు పదిలంగా నిక్షిప్తమవుతాయి. 7 గంటలు నిద్రపోకపోతే జ్ఞాపకశక్తి ప్రభావితం అవుతుంది. ఏ విషయాన్నీ సరిగా గుర్తుంచుకోలేరు. దేనిపైనా ఏకాగ్రత కుదరదు. రోజంతా చికాకుగా ఉంటుంది. సరైన నిర్ణయాలు తీసుకోలేరు. పెద్ద వయస్కులకు రోజుకు 7-8 గంటల నిద్ర తప్పనిసరి. అదీ రాత్రి సమయంలోనే నిద్రపోవాలి. అంతరాయం లేకుండా కనీసం 7 గంటలు నిద్రిస్తే.. మెదడే కాదు శరీర భాగాలన్నీ పునరుత్తేజం అవుతాయి. నిద్రలేమితో భవిష్యత్తులో హైపర్‌టెన్షన్, గుండెవ్యాధులు, బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే ప్రమాదాలు ఎక్కువ.

2) ఒత్తిడిని దరి చేరనివ్వద్దు

వ్యాయామమే శ్రీరామరక్ష

అనవసరమైన విషయాల్ని ఎక్కువగా ఆలోచిస్తూ ఒత్తిడికి గురికావడం వల్ల మెదడులోని కణాలు చనిపోయే ప్రమాదముంది. ఇది జ్ఞాపకశక్తి, ఆలోచన సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తుంది. చాలామంది అనారోగ్యంగా ఉన్నా పనిలో నిమగ్నమైపోతారు. అనారోగ్యంగా ఉన్నప్పుడు మెదడు దాన్ని తగ్గించే పనిలో తలమునకలై ఉంటుంది. అందుకే నలతగా ఉన్నప్పుడు వైద్యులు విశ్రాంతి తీసుకోవాలని సూచిస్తారు. లేదంటే మెదడు తీవ్ర ఒత్తిడికి లోనవుతుంది. దీర్ఘకాలిక దుష్ప్రభావాలు తలెత్తుతాయి. శారీరక శ్రమ లేకుండా ఎక్కువ సమయం ఒకేచోట కూర్చోవడమూ ఒత్తిడికి కారణమవుతోంది. దీంతో ఊబకాయం, గుండెవ్యాధులే కాదు మెదడూ నిస్సత్తువగా మారుతుంది. నిత్యం వ్యాయామం చేస్తే చురుకుగా స్పందిస్తుంది. తదేకంగా కూర్చొని పనిచేసేవారు అరగంటకోసారి లేచి కొద్దినేపు నడవాలి. వీలుచేసుకొని వారంలో కనీసం 3 రోజులైనా అరగంట చొప్పున నడవడం, జాగింగ్ చేయడం ఆరోగ్యకరం.

3) సెల్‌ఫోన్ స్క్రీనూ శత్రువే..!

రోజులో 2 గంటలకు మించి చూడొద్దు

ప్రస్తుతం కంప్యూటర్ ముందు కూర్చొని పనిచేసే ఉద్యోగాలే ఎక్కువ. స్క్రీన్ టైమ్ ఎక్కువగా ఉండటం వల్ల మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. తప్పనిసరిగా స్క్రీన్ ఎక్కువ చూడాల్సినవారు ఆ తెర నుంచి ఇబ్బంది కలగకుండా కళ్లద్దాలు పెట్టుకోవాలి. చిన్న పిల్లలు, యువకులూ ఎక్కువ సేపు ఫోన్లు వాడటం వల్ల ఆ కిరణాలు కంటిపై పడి తలనొప్పితో బాధపడతున్నారని వైద్యనిపుణులు హెచ్చరించారు. ఫోన్ వాడేటప్పుడు 30 డిగ్రీల కంటే మించి తల కిందకు వంచకూడదు. మొబైల్ తెర ఎంత సేపు ఆన్‌లో ఉందని ఫోన్‌లో 'డిజిటల్ వెల్‌బీయింగ్' అనే ఆప్షన్‌తో తెలుసుకోవచ్చు. ఆ ఆప్షన్ ద్వారా మనం రోజూ ఫోన్ ఎంతసేపు వాడుతున్నాం.. ఏ యాప్ ఎక్కువగా వినియోగిస్తున్నాం.. అనే విషయాలు తెలుసుకొని జాగ్రత్త పడవచ్చు.

4) హెడ్‌ఫోన్లతో మోతే..!

వాల్యూమ్ 60% మించొద్దు

ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఓ)అంచనా ప్రకారం సురక్షిత స్థాయుల్లో శబ్దాలు వినకపోవడం వల్ల ప్రపంచవ్యాప్తంగా సుమారు వంద కోట్ల మంది యువత వినికిడి లోపానికి గురయ్యే ప్రమాదముంది. గంటసేపు పెద్ద శబ్దం పెట్టుకొని హెడ్‌ఫోన్లు, ఎయిర్‌పాడ్స్ వాడటం వల్ల మెదడు తీవ్ర ఒత్తిడికి లోనవుతుంది. హెడ్‌ఫోన్ల శబ్దాలు 60% కంటే ఎక్కువైతే.. మెదడు సాధారణ స్థితికి దూరమవుతుంది. మళ్లీ మామూలు స్థాయికి రావాలంటే ఎక్కువ సమయం పడుతుంది. ఏకాగ్రత లోపిస్తుంది. పెద్దగా సౌండ్ పెట్టుకొని ధ్వనులు వినటం క్రమంగా వినికిడి శక్తి కోల్పోయేలా చేస్తుంది. పెద్ద వయసులో వినికిడి సామర్థ్యం దెబ్బతింటే తిరిగి మామూలు స్థితికి రావడం కష్టం. ఇది కూడా నేరుగా మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

5) తియ్యనైన శత్రువు

రోజుకు 25 గ్రా. కంటే తక్కువ చక్కెర మేలు!

తీపి పదార్థాలను ఎక్కువగా తీసుకోవడం వల్ల మెదడు పనితీరు ప్రభావితం అవుతుంది. ప్రాసెస్ చేసిన ఆహారంతోనూ ప్రతికూలతలు ఉంటాయి. ఫ్రక్టోజ్ స్థాయి ఎక్కువగా ఉండే పానీయాలు తీసుకోవడం వల్ల త్వరగా ఆకలి వేస్తుంది. దీనివల్ల ఊబకాయం, మధుమేహం, చెడు కొలెస్ట్రాల్ పెరిగి దీర్ఘకాలిక వ్యాధుల బారినపడే ప్రమాదముంది. కాలేయ క్యాన్సర్‌కు తియ్యటి పదార్థాలూ కారణమే. ఇలాంటి ఆహారాలు మెదడు ఆలోచనా సామర్థ్యాన్ని తగ్గిస్తాయి. చురుకుదనం కోల్పోయేలా చేస్తాయి. డబ్ల్యూహెచ్‌ఓ ప్రమాణాల ప్రకారం.. చక్కర స్థాయి ఎక్కువగా ఉండే పానీయాలను వారానికి 200-355 మి.లీ. మాత్రమే తీసుకోవాలి.

వరి కోతలకు ముందే స్థలాల రిజర్వ్

ఈ ఫొటోలో.. చీరలను ఎండలో ఆరబెట్టినట్లు కనిపిస్తుంది కదూ.. అలా అనుకుంటే పొరపాటే. అవి ధాన్యం ఆరబెట్టడానికి వేసిన చీరలు, టార్పాలిన్ కవర్లు. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో వరి కోతలు ప్రారంభం కాకముందే కొందరు రైతులు ఇలా స్థలాలను రిజర్వ్ చేసుకుంటున్నారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో అద్దెకు తీసుకున్న స్థలంలో పాత చీరలు, టార్పాలిన్ కవర్లు కప్పి, అందులో మరే వరూ ధాన్యం రాశులు పోయకుండా రిజర్వు చేసుకుంటున్నారు. వరి కోతలు ప్రారంభమయ్యే నాటికి ధాన్యాన్ని ఆరబెట్టేందుకు నానా తంటాలు పడాల్సి వస్తుందని.. అందుకే ఇలా చేస్తున్నట్లు అన్నదాతలు పేర్కొంటున్నారు. దసరా తర్వాత వరి కోతలు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నా.. ఇప్పటి నుంచే స్థలాల కోసం రైతులు జాగ్రత్త పడుతున్నారు.

– న్యూస్‌టుడే, రుద్రంగి

ఆర్టీసీకి రూ.1,263 కోట్లు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం

- నిత్యం బస్సుల్లో 57.71 లక్షల మంది ప్రయాణం
- 'మహాలక్ష్మి' తర్వాత పెరుగుదల... 12.22 లక్షలు

ఈనాడు, హైదరాబాద్: ఆర్టీసీ బస్సుల్లో సగటున నిత్యం అరకోటి మందికిపైగా ప్రయాణిస్తున్నారు. మహాలక్ష్మి పథకానికి ముందు బస్సుల్లో రోజుకు 45.49 లక్షల మంది ప్రయాణాలు సాగించగా... ఉచిత ప్రయాణంతో మరో 12.22 లక్షల మంది పెరిగారు. ప్రస్తుతం నిత్యం 57.71 లక్షల మందిని ఆర్టీసీ గమ్యస్థానాలకు చేరుస్తోంది. మహిళల ఉచిత ప్రయాణానికి జారీ చేస్తున్న జీరో టికెట్ల ఛార్జీలను రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ నుంచి ఆర్టీసీకి చెల్లిస్తూ వస్తోంది. గడిచిన ఐదు నెలల వ్యవధిలో ప్రభుత్వం రూ.1,263.62 కోట్ల నిధులను రోడ్డు రవాణా సంస్థకు విడుదల చేసింది.. ఆగస్టు 31 నాటికి 83.42 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని ఆర్టీసీ వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రయాణాల ఛార్జి రూ.2,840.71 కోట్లు. కాగా, బడ్జెట్ కేటాయింపులు లేకపోవడంతో డిసెంబరు నుంచి మార్చి వరకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి నిధులు విడుదల చేయలేదు. 2024 ఏప్రిల్ నుంచి నిధుల విడుదల ప్రారంభమైంది. జూన్ నుంచి ప్రతి నెలా రూ.320 కోట్లకు పైగా చెల్లిస్తోంది.

2023 నవంబరు నుంచి 2024 జులై నాటికి ఆర్టీసీ బస్సుల్లో సీట్ల భర్తీ నిష్పత్తి ఇలా ఉంది....

బస్సు	ఓఆర్ (శాతాల్లో)
ఎక్స్‌ప్రెస్	72-104
పల్లె వెలుగు	70-103
మెట్రో ఎక్స్‌ప్రెస్	70-103
సిటీ ఆర్డినరీ	60-88

మెట్రో ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణానికి ఆసక్తి

బస్సుల్లో 'మహాలక్ష్మి' ఉచిత ప్రయాణ సదుపాయంతో మహిళల ప్రయాణాలు గణనీయంగా పెరిగాయి. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలు ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారని.. ఆసుపత్రులకు వచ్చే మహిళల సంఖ్య పెరిగిందని ఓ ఎన్జీఓ కొద్దివారాల క్రితం నిర్వహించిన సర్వే వివరాల్లో వెల్లడించింది. మెట్రో ఎక్స్‌ప్రెస్‌లలో ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) ఏకంగా 39 శాతం పెరిగింది. హైదరాబాద్, వరంగల్ నగరాల్లో మహిళలు ఆర్డినరీ కంటే మెట్రో ఎక్స్‌ప్రెస్‌ల్లో ప్రయాణానికి ఎక్కువ మొగ్గుచూపుతున్ననట్లు గణాంకాలను బట్టి తెలుస్తోంది.

అందరూ... శ్రీనివాసులే!

శ్రీనివాస్... తెలుగునాట చాలా కుటుంబాల్లో వినిపించే పేరిది. మరి ఈ పేరున్నవారంతా ఒకే వేదికపై కలిస్తే, ఒకరితో ఒకరు భావాలు కలబోసుకుంటే... భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో ఉండే వైద్యుడు శ్రీనివాస్‌కు సరిగ్గా ఈ ఆలోచనే వచ్చింది. వెంటనే 'మనమంతా శ్రీనివాసులమే' అనే వాట్సప్ గ్రూపును ప్రారంభించారు. అందులో వందల మంది చేరారు. వీరంతా తమ సాధకబాధకాలను, వృత్తి వ్యాపార విషయాలను పంచుకుంటారు. ఆపదలో ఉన్న స్నేహితులను ఆదుకుంటారు. ఇటీవల పిల్లలకు శ్రీనివాస్ అనే పేరు పెట్టుకునేవారు తగ్గుతున్నారని గ్రూపులో చర్చించుకున్నప్పుడు... తమ పేరు విశిష్టతను చాటేలా ఒక కార్యక్రమం నిర్వహించాలని అనుకున్నారు. కరీంనగర్‌కు చెందిన వూట్కూరి శ్రీనివాస్‌రెడ్డి ఈ ఆలోచనకు రూపాన్నిచ్చారు. 'కరీంనగర్ శ్రీనివాసులం' అనే ప్రత్యేక గ్రూప్ ఏర్పాటుచేసి తమ జిల్లాకు చెందిన వారంతా కలిసే ఏర్పాటుచేశారు. అలా కరీంనగర్ విద్యానగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం శ్రీనివాస్ పేరున్న 150 మంది వరకు చేరుకుని, సందడి చేశారు. ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. 'గ్రూపు ఏర్పాటైనప్పటి నుంచి 200 మంది కైపైగా ఆపత్కాలంలో స్పందించి రక్తదానం చేశారు. త్వరలో తలసీమియా బాధితులకు సాయపడాలని నిర్ణయించాం. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా శ్రీనివాస్ అనే పేరున్న వేల మందితో సమావేశం నిర్వహించి, ప్రపంచ రికార్డు నెలకొల్పుతాం' అని వూట్కూరి శ్రీనివాస్‌రెడ్డి వివరించారు.

కరీంనగర్‌లోని వేంకటేశ్వరస్వామి సన్నిధిలో కలిసిన శ్రీనివాసులు

– ఈనాడు, కరీంనగర్

శ్రీవారి ఆలయం ఎదుట కుటుంబసభ్యులతో సీజేఐ జస్టిస్ డీవై.చంద్రచూడ్ ✦ దర్శనానికి క్యూ లైన్‌లో వెళ్తున్న సీజేఐ

శ్రీవారి సేవలో సీజేఐ

తిరుమల, న్యూస్‌టుడే: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వారికి తితిదే ఈఓ జె.శ్యామలరావు, అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్యచౌదరి స్వాగతం పలికారు. ముందుగా ధ్వజస్తంభానికి నమస్కరించి, అనంతరం శ్రీవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం, తితిదే ఈఓ తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకుముందు శ్రీపద్మావతి అతిథిగృహం వద్ద తితిదే ఈఓ, అదనపు ఈఓలు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

సామాన్య భక్తుడిలా...

సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ సామాన్య భక్తుల మాదిరిగా వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1 నుంచి వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రొటోకాల్ ప్రకారం ఆయన మహాద్వారం నుంచి నేరుగా వెళ్లి స్వామి వారిని దర్శించుకోవచ్చు. కానీ, ఆయన సామాన్య భక్తుల మాదిరిగా వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నుంచే వెళ్లారు. జస్టిస్ చంద్రచూడ్‌తో పాటు విచ్చేసిన బృందంలో హిందూయేతర మతానికి చెందిన వ్యక్తి ఒకరు ఉన్నారు. తిరుమల నిబంధనల ప్రకారం ఆయన డిక్లరేషన్ సమర్పించి స్వామి దర్శనం చేసుకున్నారు.

జన్యుమార్పిడి పంటలు వద్దు

దక్షిణ భారతదేశ రైతు సంఘాల ఏకగ్రీవ తీర్మానం

ఈనాడు,హైదరాబాద్: దేశంలో జన్యుమార్పిడి పంటల విధానాన్ని అంగీకరించబోమని దక్షిణభారత రాష్ట్రాలకు చెందిన రైతు సంఘాలు ఏకగ్రీవంగా తీర్మానించాయి. ఆదివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కార్యాలయంలో ఆ సంస్థ ఛైర్మన్ అన్వేశ్‌రెడ్డి అధ్యక్షతన జన్యుమార్పిడి పంటలపై దక్షిణాది రాష్ట్రాలకు చెందిన రైతుసంఘ నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఇందులో తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఆహార పంటల్లో జన్యుమార్పిడి ప్రవేశిస్తే రైతులు విత్తన స్వేచ్ఛను కోల్పోవడంతో పాటు ఆర్థికంగా నష్టపోతారని, విత్తనం కార్పొరేట్ రంగాల చేతుల్లోకి వెళుతుందని అభిప్రాయపడ్డారు. ఆ పంటల మూలంగా ప్రజల ఆరోగ్యంతో పాటు పర్యావరణానికి ప్రమాదం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే బీటీపత్తి వల్ల అనేక దుష్పరిణామాలు సంభవించాయని, ఆహారపంటలకు ఈ దుస్థితి రానీయొద్దని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశానుసారం కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా సంప్రదింపుల ప్రక్రియను చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అన్వేశ్‌రెడ్డి మాట్లాడుతూ జన్యు మార్పిడి సాంకేతికతలను ప్రవేశపెట్టడం దేశ పౌరులందరికీ ఆందోళన కలిగించే అంశమని చెప్పారు. కేంద్రం ఏకపక్ష విధానాలను అంగీకరించబోమని కిసాన్ కాంగ్రెస్ నేతలు కోదండరెడ్డి, నల్లమల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బీటీ పత్తి వల్ల జరిగిన నష్టాలు పునరావృతం కారాదని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో ఆశాకిసాన్ స్వరాజ్ నేషనల్ నెట్‌వర్క్ ప్రతినిధులు కవిత, ఉష, వ్యవసాయ విధాన నిపుణుడు దొంతి నర్సింహారెడ్డి, రైతు స్వరాజ్య వేదిక సంఘం ప్రతినిధులు కె.రవి తదితరులు పాల్గొన్నారు.

కోరుకున్న జీవితాన్ని పొందాలంటే..

మీరు కోరుకున్న జీవితం పొందడానికున్న ప్రధాన అవరోధమేంటో తెలుసా? మీ కలలను సాకారం చేసుకోవడానికి అవసరమైనవాటికి, ప్రస్తుతం మీరు చేస్తున్న పనులకు మధ్య అంతరాన్ని గుర్తించలేకపోవడమే. మీ చర్యలు, అలవాట్లు, ప్రాధాన్యతలను నిజాయతీగా సమీక్షించుకోనంతవరకూ అది సాధ్యం కాదు. మీ లక్ష్యాలకు అనుగుణంగా రోజువారీ చర్యలను సరిదిద్దుకున్నప్పుడే మీ కలల జీవితాన్ని పొందగలరు.

– సాహిల్ బ్లూమ్, రచయిత

వేతన జీవులపై సైబర్ నేరస్థుల పంజా

బోగస్ కంపెనీలకు యూఏఎన్ అనుసంధానం • తొలగించాలంటే డబ్బులివ్వాలంటూ డిమాండ్ • ఈపీఎఫ్‌వోకు వెల్లువెత్తుతున్న ఉద్యోగుల ఫిర్యాదులు

ఈనాడు, హైదరాబాద్: "హైదరాబాద్‌కు చెందిన ఒక సాఫ్ట్‌వేర్ ఇంజినీరుకు ఓ వ్యక్తి ఫోన్ చేసి మీ ఈపీఎఫ్‌వో పోర్టల్‌లో ఎక్కడెక్కడ పనిచేశారన్న 'సర్వీసు హిస్టరీ' చూసుకోవాలని సూచించాడు. ఈ మేరకు చూడగా కొత్తగా ఒక కంపెనీలో చేరినట్లు కనిపించింది. ఇతర రాష్ట్రానికి చెందిన ఆ బోగస్ కంపెనీ నుంచి వివరాలు తొలగించాలంటే డబ్బు ఇవ్వాలని మళ్లీ ఫోన్ రాగా పట్టించుకోలేదు. కొద్దిరోజులకు ఇంకో కంపెనీ సర్వీసు హిస్టరీలో చేరడంతో ఉద్యోగం పోతుందని కంగారుపడ్డారు. చివరకు సైబర్ నేరస్థుడికి రూ.60 వేలు పంపించి వివరాలు తొలగించాలని కోరారు. కానీ అతను రూ.2 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు పీఎఫ్ కార్యాలయాన్ని సంప్రదించి ఫిర్యాదు చేశారు."

సైబర్ నేరస్థులు ఈపీఎఫ్ ఖాతాదారులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. వివిధ వెబ్‌సైట్లలో నమోదు చేసిన వివరాలను ఆసరాగా తీసుకుని బోగస్ కంపెనీలు సృష్టిస్తున్నారు. ఈపీఎఫ్‌వోలో పాన్ నంబరు, మొబైల్ ధ్రువీకరణతో కంపెనీ వివరాలు నమోదు చేసేందుకు అవకాశాలున్నాయి. దీంతో ఇతరుల పాన్ నంబర్లు సంపాదించి వాటికి తమ ఫోన్ నంబరు అనుసంధానం చేసుకుంటున్నారు. తద్వారా బోగస్ కంపెనీలు నమోదు చేస్తూ నేరాలకు పాల్పడుతున్నట్లు ఈపీఎఫ్‌వో అధికారులు గుర్తించారు. ఇతర రాష్ట్రాల్లోని ప్రాంతీయ కార్యాలయాల పరిధిలో తప్పుడు వివరాలతో బోగస్ కంపెనీలు నమోదవుతున్నట్లు వెల్లడైంది. వీటిని తొలగించాలంటే అక్కడి అధికారులే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఉదాహరణకు ఒక తెలంగాణ ఉద్యోగి పీఎఫ్ ఖాతాను యూపీలోని బోగస్ కంపెనీతో అనుసంధానం చేసి డబ్బు డిమాండ్ చేయగా బాధితుడు కొంత పంపించారు. మిగతా నగదు ఇవ్వలేనని చెప్పడంతో ఖాతాలో ఉద్యోగం వదిలిపెట్టడానికి కారణం పద్ద 'చనిపోయారని' రాశారు. ఇది తొలగించాలంటే అక్కడి ప్రాంతీయ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి తేల్చాలి. పీఎఫ్ ప్రాంతీయ కార్యాలయాల పరిధిలో ఈ తరహా ఫిర్యాదుల సంఖ్య పెరుగుతోందని ఈపీఎఫ్‌వో వర్గాలు వెల్లడించాయి.

ఉద్యోగాలు రాని పరిస్థితులు..

నిబంధనల ప్రకారం ఒక ఉద్యోగి ఒక కంపెనీలో మాత్రమే పనిచేయాలి. ఒకేసారి రెండింట్లో పనిచేయడం కుదరదు. కొందరికి ఉద్యోగం మారిన తరువాత పూర్వ కంపెనీ నుంచి సరైన వివరాలు నమోదు కాకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. ఇటీవల ఒక వ్యక్తి ఓ సంస్థలో ఉద్యోగం మానేశారు. మరోచోట పని కోసం అన్వేషిస్తుండగా సైబర్ బెదిరింపులు ఎదుర్కొన్నారు. వారు అడిగిన నగదు ఇవ్వలేదు. కొద్దిరోజులకు మెరుగైన వేతనంతో ఓ కంపెనీలో ఉద్యోగానికి ఎంపిక అయ్యారు. కానీ వారికి బ్యాక్‌గ్రౌండ్ వెరిఫికేషన్‌లో రెండు కంపెనీల్లో(బోగస్) పనిచేస్తున్నట్లు సమాచారం కనిపించడంతో తిరస్కరించారు. సైబర్ మోసాల నియంత్రణకు తీసుకోవాల్సిన కట్టుదిట్టమైన చర్యలపై కేంద్ర పీఎఫ్ కార్యాలయం సమాలోచనలు చేస్తోంది.

ఓటీపీతో అడ్డుకట్టకు అవకాశం

ఉద్యోగుల యూఏఎన్ నంబరు ఇతర కంపెనీల్లో నమోదు చేసేప్పుడు మొబైల్ ఓటీపీ ద్వారా ధ్రువీకరించే సదుపాయం లేకపోవడం మోసాలకు ఆస్కారం కల్పిస్తోంది. ఓటీపీ ధ్రువీకరణ కల్పిస్తే సైబర్ నేరాలకు కొంత అడ్డుకట్ట వేయవచ్చని ఈపీఎఫ్‌వో వర్గాలు వెల్లడిస్తున్నాయి. కార్మిక రాజ్యబీమా సంస్థ(ఈఎస్ఐసీ) ఇదే పద్ధతిలో కొత్త సంస్థల్లో సభ్యత నమోదు చేపడుతోంది.

మంచినీటి సరఫరా సహాయకులుగా

పంచాయతీ సిబ్బంది!

ఈనాడు, హైదరాబాద్: జల్‌జీవన్ మిషన్‌లోని నల్ జల్‌మిత్ర కార్యక్రమం (ఎన్ఐఎంపీ) కింద గ్రామస్థాయిలో మంచినీటి సరఫరా వ్యవస్థ సజావుగా సాగేందుకు వీలుగా పంచాయతీ సిబ్బందికే శిక్షణ ఇచ్చి వారికి మంచినీటి సరఫరా సహాయకులుగా బాధ్యతలు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం 12,790 గ్రామాల్లో 13,102 మందిని ఎంపిక చేసింది. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో మిషన్ భగీరథ సిబ్బంది ఆధ్వర్యంలో మంచినీటి సరఫరా జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం గత జనవరి నుంచి పంచాయతీలకు ఈ బాధ్యతలు అప్పగించింది. మంచినీటి మోటార్లు కాలిపోయినా, పైపులైన్లు దెబ్బతినడం తదితర సమస్యలున్నా ప్రైవేటు మెకానిక్‌లను పిలిచి మరమ్మతులు చేయిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవలే నల్‌జల్ మిత్ర కార్యక్రమం కింద పంచాయతీ సిబ్బందికే శిక్షణ ఇచ్చి మరమ్మతు పనులు చేయించుకోవాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేసింది. దీనికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం తాజా నిర్ణయం తీసుకుంది. ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులై 45 ఏళ్లు మించని వారిని మేజర్ పంచాయతీల్లో ఇద్దరు, చిన్న పంచాయతీల్లో ఒకరిని సహాయకులుగా ఎంపిక చేసింది.

వారికి అప్పగిస్తే భారమే..?

ప్రస్తుతం 500 జనాభా వరకు గల గ్రామ పంచాయతీల్లో ఒకరు, వెయ్యి జనాభా ఉన్న వాటిలో ఇద్దరు, 1500.. అంతకంటే ఎక్కువ జనాభా ఉంటే ముగ్గురు చొప్పున మల్టీపర్పస్ వర్కర్లు పంచాయతీల్లో పనిచేస్తున్నారు. పారిశుద్ధ్య విధులతో పాటు ట్రాక్టర్లు, ట్యాంకర్ల డ్రైవర్లుగా, నర్సరీల నిర్వాహకులుగా పనిచేస్తున్నారు. వీధిలైట్ల నిర్వహణ కూడా చూస్తున్న వీరికి నెలకు రూ.9 వేల వేతనం ఇస్తున్నారు. మంచినీటి సహాయకులుగా బాధ్యతలు అప్పగిస్తే విధులు మరింతగా పెరుగుతాయని వారు ఆందోళన చెందుతున్నారు. పారిశుద్ధ్యం సహా ఇతర విధుల్లో సమస్యలు ఉత్పన్నమవుతాయని కార్యదర్శులు చెబుతున్నారు. మంచినీటి సహాయకులుగా అదనపు సిబ్బందిని నియమించాలని వారు కోరుతున్నారు.

మేనేజ్‌మెంట్ కోటా వైద్య సీట్లకు నేటి నుంచి వెబ్‌ఆప్షన్లు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రైవేటు వైద్య కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటా ఎంబీబీఎస్/బీడీఎస్ ప్రవేశాల కోసం సోమవారం ఉదయం నుంచి అక్టోబరు 2వ తేదీ మధ్యాహ్నం వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పిస్తున్నట్లు కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రకటనలో పేర్కొంది. ప్రైవేటు వైద్య కళాశాలలతో పాటు నీలిమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో అడ్మిషన్ల కోసం వెబ్‌ఆప్షన్లు ఇవ్వొచ్చని సూచించింది.

అస్సాంలో ఇంటర్నెట్ నిలిపివేసి.. గ్రేడ్-3 పోస్టుల భర్తీ పరీక్ష

గువాహటి: అస్సాంలో గ్రేడ్-3 పోస్టుల రాత పరీక్షను ఆదివారం విస్తృతమైన ఏర్పాట్ల మధ్య నిర్వహించారు. ఈ పరీక్ష కోసం రాష్ట్రవ్యాప్తంగా 8గంటలపాటు ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. పరీక్షల్లో అవకతవకలు జరగకుండా నివారించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 8:30 నుంచి సాయంత్రం 4:30 వరకు మొబైల్ ఇంటర్నెట్, వైఫై సేవలను నిలిపివేసినట్లు పేర్కొన్నారు.

లోక్ అదాలత్‌లో 1,38,427 కేసుల పరిష్కారం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 1,38,427 కేసులు పరిష్కరించినట్లు డీజీపీ జితేందర్ వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'మొత్తం 23,251 ఎఫ్ఐఆర్‌లు, విపత్తు నిర్వహణకు సంబంధించిన 4,186 కేసులు, 57,475 పెట్టీ కేసులు, 53,515 మోటారు వాహన చట్టం కేసులు పరిష్కారమయ్యాయి. నిజామాబాద్ 19,053 కేసులతో అగ్రస్థానంలో ఉండగా హైదరాబాద్ 12,247, సూర్యాపేట 11,178, సైబరాబాద్ 10,953, రాచకొండ 9,823 కేసులతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ముఖ్యంగా సైబర్ నేరాల బారినపడి డబ్బు పోగొట్టుకున్న 5,355 మంది బాధితులకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో రూ.27.2 కోట్లు అందజేశాం. దాంతో ఈ ఏడాది ఇప్పటివరకు 11,868 మంది సైబర్ బాధితులకు రూ.114.7 కోట్లు అందజేసినట్లయింది. ఇందులో అత్యధికంగా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 2,860 కేసులకు గాను రూ.13.73 కోట్లు, రాచకొండలో 555 కేసులకుగాను రూ.3.01 కోట్లు, సైబర్ సెక్యూరిటీ బ్యూరో 93 కేసులకు గాను రూ.2.50 కోట్లు, స

ఏరోజుకారోజు కొనుగోలుతో ఆర్థిక భారం

- యూనిట్‌కు రూ.6.53 వరకూ చెల్లించి కరెంటు కొన్నట్లు వెల్లడి
- ఈఆర్‌సీకి ఇచ్చిన నివేదికలో తెలంగాణ డిస్కంలు

ఈనాడు, హైదరాబాద్: తాత్కాలిక అవసరాల పేరిట కరెంటును ఏరోజుకారోజు ప్రాతిపదికన అధిక ధరలకు 'భారత ఇంధన ఎక్స్ఛేంజీ'(ఐఈఎక్స్)లో కొనడం వల్ల 2022-23లో వ్యయం రికార్డుస్థాయిలో 15.49 శాతం పెరిగిందని తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు తెలిపాయి. ఎక్స్ఛేంజీలో యూనిట్‌కు రూ.6.53 వరకూ చెల్లించి కొనడం వల్ల ఆర్థిక భారం పడిందని స్పష్టం చేశాయి. ఈ వివరాలతో 'రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి'(ఈఆర్‌సీ)కి డిస్కంలు తాజాగా నివేదిక సమర్పించాయి. వాస్తవానికి సగటున ఒక్కో యూనిట్ కరెంటు కొనుగోలు వ్యయం రూ.5.05 మించకూడదని గతంలో ఈఆర్‌సీ ఆదేశించింది. కానీ ఎక్స్ఛేంజీలో తాత్కాలిక అవసరాలకు అధిక ధరలకు కొనడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్ కేంద్రాలకు అధిక ఛార్జీలు చెల్లించడం వల్ల 2022-23లో ఒక్కో యూనిట్ కొనుగోలుకు సగటు వ్యయం రూ.5.57కి, గతేడాది(2023-24)లో రూ.5.72కి చేరింది. ఇది 2021-22లో రూ.4.82 ఉంది. విద్యుదుత్పత్తి లేకపోయినా జూరాల, శ్రీశైలం, సాగర్, పులిచింతల జల విద్యుదుత్పత్తి కేంద్రాలకు ఏటా తప్పనిసరిగా చెల్లించాల్సిన స్థిర ఛార్జీ ఏకంగా రూ.8.51కి చేరింది. ఇది అంతకుముందు ఏడాది(2022-23)లో రూ.2.32 మాత్రమే.

సరఫరా, పంపిణీ నష్టాలు..

ప్రస్తుత ఏడాది హైదరాబాద్ కేంద్రంగా ఉన్న దక్షిణ డిస్కంకు 62,036 మిలియన్ యూనిట్లు(మి.యూ.), వరంగల్ కేంద్రంగా ఉన్న ఉత్తర డిస్కంకు 23,248 మి.యూ. కరెంటు అవసరం. ఇంత కరెంటును భారీ వ్యయంతో కొంటున్నా చివరికి సరఫరా, పంపిణీ నష్టాలు దక్షిణ డిస్కంలో 8.55, ఉత్తర డిస్కంలో 11.67 శాతం ఉంటాయని సంస్థలు తెలిపాయి. దక్షిణ డిస్కంలో 58,366 మి.యూ. కరెంటు కొనగా 4,987 మి.యూ. సరఫరా, పంపిణీ(టీడీ)లో నష్టపోయింది. ఒక్కో యూనిట్‌కు సగటున రూ.5.72 చొప్పున వెచ్చించింది. అంటే 4,987 మిలియన్ యూనిట్ల నష్టానికి కోల్పోయిన సొమ్ము రూ.2,852 కోట్లకు పైగా ఉంది. ఉత్తర డిస్కంలో 23,230 మి.యూ.కొనగా 2,167 మి.యూ. నష్టపోయి రూ.1,239 కోట్ల ఆర్థిక భారం పడింది. రెండు డిస్కంలు భారీగా కరెంటు కొంటున్నా వాస్తవానికి మీటర్ రీడింగ్ నమోదై బిల్లులు జారీ చేస్తున్నది చాలా తక్కువ. ఉదాహరణకు ఉత్తర డిస్కంలో గతేడాది 23,230 మి.యూ. కొనగా.. మీటర్లలో రీడింగ్ తీసుకుని బిల్లులు జారీ చేసింది 11,616 మిలియన్ యూనిట్లే. వ్యవసాయ బోర్లకు ఉచితంగా ఇచ్చింది 9,447 మి.యూ. కాగా.. మిగిలింది పంపిణీ, సరఫరాలో నష్టాలతో పోయింది.

'సాయంత్రం' తరగతులేగా... తొందరేముంది!

- వర్కింగ్ ప్రొఫెషనల్స్ బీటెక్ ప్రవేశాలపై నింపాదిగా నిర్ణయాలు
- ఓయూ పరిధిలోని ప్రైవేట్ కాలేజీలకు దక్కని అనుమతులు

ఈనాడు, హైదరాబాద్: ఉద్యోగం చేస్తూనే సాయంత్రం వేళ బీటెక్ చదువుకోవచ్చనే ఆశతో ఉన్న వర్కింగ్ ప్రొఫెషనల్స్ ఉసూరుమంటున్నారు. పాలిటెక్నిక్‌లో డిప్లొమా చేసి ఉద్యోగాల్లో స్థిరపడిన వారు తమకు విద్యార్హత పెంచుకునే అవకాశమివ్వాలని ఎప్పటి నుంచో కోరుతున్నారు. ఫలితంగా 2023-24 విద్యా సంవత్సరం నుంచి ఏఐసీటీఈ అనుమతిచ్చింది. కనీసం ఏడాదిపాటు ఉద్యోగ అనుభవమున్న వారికి వారాంతాల్లో సాయంత్రం వేళ బీటెక్ చదువుకోవడానికి, అదీ నేరుగా రెండో ఏడాదిలో చేరేందుకు అవకాశమిచ్చింది. ఓయూ ఇంజినీరింగ్ కళాశాలలో 2023-24లో సివిల్, మెకానికల్, ఏఐ అండ్ ఎంఎల్ కోర్సులను ప్రారంభించారు. ఈసారి ఎలక్ట్రికల్ బ్రాంచికి అనుమతి వచ్చింది. వాస్తవానికి నిరుడు కొన్ని ఓయూ అనుబంధ ప్రైవేట్ కళాశాలలకు కూడా ఏఐసీటీఈ అనుమతిచ్చినా ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వలేదు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి (2024-25) సీబీఐటీ, స్టాన్లీ, మెథడిస్ట్, ఎంవీఎస్ఆర్, మాతృశ్రీ ఇంజినీరింగ్ కళాశాలలు రెండో ఏడాది కూడా ఏఐసీటీఈకి దరఖాస్తు చేసుకొని అనుమతి తెచ్చుకున్నాయి. ఓయూ ఇంజినీరింగ్ కళాశాలతోపాటు మరో అయిదు ప్రైవేట్ కళాశాలలకు కలిపి ఆగస్టు 4న ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహించి, ఫలితాలు వెల్లడించారు. ప్రవేశాల విధివిధానాలపై ప్రభుత్వం జులై 27న జీవో 129 జారీ చేసింది. తెలంగాణ ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ కమిటీ(టీఏఎఫ్ఆర్సీ) నిర్ణయించిన ఫీజులు వర్తిస్తాయంది. ఆయా కళాశాలలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చినా వర్సిటీలు అనుబంధ గుర్తింపు ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొంది. అయితే, ఇప్పటికీ ప్రైవేట్ కళాశాలలకు అనుమతివ్వలేదు. దాంతో ఇంకా ప్రవేశాలు మొదలవలేదు. మరోవైపు జేఎన్‌టీయూహెచ్ ప్రాంగణంలోనూ సాయంత్రం కోర్సులను ప్రారంభించాలని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ఆ వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీ బుర్రా వెంకటేశం ఆదేశించారు.

మరిన్ని అంశాలపై స్పష్టత వస్తేనే...

రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసినా ఇంకా వివిధ అంశాలపై స్పష్టత రావాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. ఉద్యోగులు ఎన్నేళ్లలో బీటెక్ పూర్తి చేయాలి... స్వయం లాంటి ఆన్‌లైన్ వేదికల నుంచి ఎన్ని క్రెడిట్లు పొందొచ్చు... తదితర అంశాలపై ఆయా వర్సిటీలు ప్రత్యేకంగా నిబంధనావళి రూపొందించుకోవాలి. ఈమేరకు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ అధికారులు ఓయూకు లేఖ రాశారు. జేఎన్‌టీయూహెచ్‌ను కోరనున్నారు. ఆ వర్సిటీ పరిధిలోనూ మూడు ప్రైవేట్ కళాశాలలు ఏఐసీటీఈ నుంచి అనుమతులు పొందినట్లు సమాచారం.

పండ్లతోటల సాగుకు 'ఉపాధి' ఊతం!

- మూడు నెలల్లో 11,659 ఎకరాల్లో సాగు
- ప్రతి మండలంలో 50 ఎకరాల లక్ష్యం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో పండ్లతోటల పెంపకంపై అన్నదాతలు ఆసక్తి చూపుతున్నారు. ఉపాధి హామీ కింద సాగుకోసం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి నిర్వహిస్తున్న పథకానికి ఈ ఏడాది మంచి స్పందన లభిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా చిన్న, సన్నకారు రైతులు ఈ తోటల సాగుకు ముందుకొస్తున్నారు. మూడు నెలల్లోనే 11 వేల ఎకరాలకుపైగా రైతులు తోటలు వేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న విస్తీర్ణంలో దాదాపు ఐదు శాతం తోటల సాగు ఉంది. మరో తొమ్మిది నెలల కాలంలో మరింతగా స్పందన వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీలో ఉద్యానాల పెంపకానికి వెసులుబాటు కల్పించడంతో రాష్ట్ర ప్రభుత్వం గత మూడేళ్లుగా దీనిని నిర్వహిస్తోంది. ప్రతి మండలానికి 50 ఎకరాల చొప్పున సాగు లక్ష్యాన్ని ఆ శాఖ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులకు నిర్దేశించింది.

కూలీలే... రైతులుగా..

ఉపాధి హామీ పథకంలో కూలీలుగా నమోదై జాబ్‌కార్డులతో పనులు చేస్తున్న వారు ఈ పథకానికి అర్హులు. ఐదెకరాలలోపు భూములు గల ఎస్సీ, ఎస్టీ ఇతర వర్గాల రైతులకు ఈ పథకం కింద ప్రభుత్వం సాయం అందిస్తోంది. వారికి మామిడి, జామ, నిమ్మ, దానిమ్మ సీతాఫలం, మునగ, కొబ్బరి (గట్ల వెంబడి మాత్రమే), డ్రాగన్ ఫ్రూట్ (కేవలం అరెకరాకు మాత్రమే), సపోటా, ఆయిల్ పామ్, బత్తాయి, అల్లనేరేడు మొక్కలను అధికారులు పంపిణీ చేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 5,660 మంది రైతులు 11,659.19 ఎకరాల్లో పండ్లతోటలను సాగు చేశారు. దీనికి ప్రభుత్వం రూ.19,53,18,833 ఖర్చుచేసింది. పండ్లతోటల సాగుకు ప్రభుత్వం మూడేళ్లపాటు సాయమందించనుంది. రాష్ట్రంలో 2.60 లక్షల ఎకరాల్లోనే పండ్ల తోటలున్నాయి. ఇటీవలి కాలంలో పెద్దఎత్తున తోటలు సాగు కావడం ఇదే ప్రథమం. వచ్చే మార్చి నాటికి మొత్తం 27 వేల ఎకరాల సాగు లక్ష్యాన్ని సాధిస్తామని పంచాయతీరాజ్ అధికారులు చెబుతున్నారు.

మూడు నెలల్లో ఉపాధి హామీ పండ్లతోటల పెంపకం ప్రగతి

కేటగిరి	రైతులు	భూవిస్తీర్ణం(ఎకరాల్లో)
ఎస్సీ	569	1,065.76
ఎస్టీ	806	1,658.79
బీసీ	3,093	6,221.58
ఇతరులు	1,192	2,713.06
మొత్తం	5660	11,659.19

ప్రేరణ లేకపోయినా పనిని ఆపొద్దు

ప్రేరణ పొందినప్పుడు, ఉత్సాహంగా అనిపించినప్పుడు ఎవ్వరైనా పనిచేస్తారు. కానీ పని ఉత్తేజకరంగా అనిపించనప్పుడు, నిరుత్సాహం ఆవరించినప్పుడు కూడా దాన్ని కొనసాగించగలిగే సామర్థ్యం ఉన్నవారు మాత్రమే దిగ్విజయంగా లక్ష్యాన్ని చేరుకుంటారు. ప్రక్రియను ప్రేమించినప్పుడే నిరంతరాయంగా పనిచేసే శక్తి వస్తుంది. అలా చేయకపోతే ఏదో రోజు పని మీద ఆసక్తి కోల్పోయి దాన్ని వదిలేస్తారు.

– టైలర్ టాడ్, ఫిట్‌నెస్ కోచ్

టీజీజీడీఏ అధ్యక్షుడిగా నరహరి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ డాక్టర్ల అసోసియేషన్ (టీజీజీడీఏ) అధ్యక్షుడిగా డాక్టర్ బి.నరహరి, సెక్రటరీ జనరల్‌గా డాక్టర్ లాలూప్రసాద్ రాథోడ్ ఎన్నికయ్యారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు రిటర్నింగ్ ఆఫీసర్లుగా వ్యవహరించిన అడ్వొకేట్ కమిషనర్లు జి. ఎం. మొహిద్దీన్, న్యాయపతి ప్రశాంత్‌లు ఆదివారం ఈ ఎన్నిక నిర్వహించారు.

నరహరి

రోగుల రద్దీ ప్రాతిపదికగా పోస్టులుండాలి

రాష్ట్రంలో బోధనాసుపత్రుల్లో రోగుల రద్దీ ప్రాతిపదికగా పోస్టులు ఉండాలని తెలంగాణ ప్రభుత్వ బోధన వైద్యుల సంఘం (టీజీజీడీఏ) డిమాండ్ చేసింది. ఆదివారం జరిగిన సమావేశంలో వివిధ అంశాలను చర్చించినట్లు సంఘం ప్రకటనలో పేర్కొంది. మెడికల్ కాలేజీల్లో పనిచేసే వైద్యులకు ప్రత్యేక జాబ్ చార్ట్ రూపొందించాలని కోరింది. క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్లుగా సివిల్ అసిస్టెంట్ సర్జన్లను, సీనియర్ రెసిడెంట్లను నియమించాలని సూచించింది. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, వైద్య సిబ్బంది నియామకాలు చేపట్టాలని విజ్ఞప్తి చేసింది.

హెలిన్‌తో అమెరికాలో 64కు పెరిగిన మృతుల సంఖ్య

పెన్సీ: అమెరికాలో హెలిన్ హరికేన్ బీభత్సం కొనసాగుతోంది. దాని దెబ్బకు ఇప్పటిదాకా వివిధ ఘటనల్లో మృత్యువాతపడ్డవారి సంఖ్య 64కు చేరుకుంది. హెలిన్ తీవ్రత కారణంగా ఆగ్నేయ అమెరికాలో లక్షల ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వర్షం కుండపోతగా కురుస్తుండటంతో చాలామంది ఎక్కడికక్కడ చిక్కుకుపోయారు. సహాయక చర్యల కోసం ఎదురు చూస్తున్నారు. ఉత్తర కరోలినాలో వరదలు పోటెత్తాయి.

తండ్రి స్ఫూర్తి.. హరిత దీప్తి!

- 11వ ఏట నుంచే 'మొక్క'వోని సంకల్పం
- ఇప్పటివరకు 25 వేలకు పైగా మొక్కలు నాటిన రాజశేఖర్
- 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ ప్రశంసలు

జూన్‌లో మోదీ ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా కొత్తగూడెంలో మొక్క నాటుతూ సెల్ఫీ తీసుకుంటున్న రాజశేఖర్

ఈనాడు, దిల్లీ, కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: తండ్రి స్ఫూర్తితో మొక్కలు నాటాలని నిర్ణయించుకున్న ఆయన.. ఆ దిశలో తిరుగులేని సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. వేలాది మొక్కలు నాటి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పుడు ఏకంగా దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ నుంచి ప్రశంసలు అందుకున్నారు. ఆదివారం నిర్వహించిన 114వ మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని రాజశేఖర్ కృషిని ప్రత్యేకంగా ప్రస్తావించారు. అలాగే 'అమ్మ పేరుతో ఒక మొక్క' కార్యక్రమ నిర్వహణలో తెలంగాణ చక్కని పనితీరు కనబరుస్తోందని ప్రధాని మోదీ అభినందించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రానికి చెందిన కొట్టూరు నుర్వి రాజశేఖర్ సింగరేణి సెంట్రల్ వర్క్‌షాప్‌లో ఫిట్టర్‌గా పని చేస్తున్నారు. రాజశేఖర్ తండ్రి పాండు దర్జీ, మేకప్ ఆర్టిస్ట్. చెట్లపై ఇష్టంతో ఆయన మొక్కలు నాటుతుండేవారు. తండ్రి స్ఫూర్తితో పదకొండో ఏట నుంచే మొక్కలు నాటుతూ పచ్చదనం పెంచేందుకు కృషి చేస్తున్నారు రాజశేఖర్. అలా ఇప్పటివరకు స్వయంగా 25 వేలకు పైగా మొక్కల్ని నాటి అందరి మన్ననలు అందుకుంటున్నారు. ప్రత్యేకంగా 2020 జులై 1న 'ప్రకృతి హరిత దీక్ష' చేపట్టారు. అప్పటి నుంచి నుంచి రోజుకో మొక్క నాటుతూ, సెల్ఫీలు దిగుతూ ఇతరుల్లోనూ మైత్రన్యాన్ని పెంపొందిస్తున్నారు. ప్రముఖుల జయంతి, పండుగలు, బంధుమిత్రుల పెళ్లిళ్లు, పుట్టినరోజులు.. ఇలా ప్రత్యేక రోజుల్లో మొక్కలు పంపిణీ చేస్తూ, వాటిని నాటుతూ ఇతరులనూ ప్రోత్సహిస్తున్నారు. 2020 జులై 1 నుంచి ఇప్పటివరకు ఆయన రోజుకో మొక్క చొప్పున 1500కు పైగా మొక్కలు నాటారు. గత జూన్ 18న ఆయన ద్విచక్రవాహనంపై నుంచి పడి గాయాలపాలయ్యారు. ఆ క్లిష్ట సమయంలోనూ పట్టు వదలకుండా మొక్కలు నాటి ఆదర్శంగా నిలిచారు. కోటి విత్తనాలు చల్లడమే తన లక్ష్యమని, ఇప్పటి వరకు 10 లక్షల విత్తనాలు వెదజల్లానని రాజశేఖర్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

రాజశేఖర్ చిత్తశుద్ధి అభినందనీయం: ప్రధాని మోదీ

మన్ కీ బాత్ సందర్భంగా ప్రధాని మోదీ.. కె.ఎన్.రాజశేఖర్‌ను ప్రశంసించారు. 'అమ్మ పేరుతో ఒక మొక్క నాటే కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం సరికొత్త రికార్డులు సృష్టించింది. తెలంగాణకు చెందిన రాజశేఖర్ ఎంతో చిత్తశుద్ధితో మొక్కలు నాటుతున్నారు. ఆయన చూపుతున్న నిబద్ధత ఆశ్చర్యచకితుల్ని చేస్తుంది. నాలుగేళ్ల క్రితం ఆయన.. రోజూ కనీసం ఒక మొక్కనైనా నాటాలని సంకల్పించారు. అలా ఇప్పటివరకు 1500కు పైగా మొక్కలు నాటారు. ప్రమాదం బారినపడినా.. రాజశేఖర్ తన సంకల్పాన్ని వీడలేదు. ఆయన ప్రయత్నాన్ని నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా' అని మోదీ పేర్కొన్నారు.

నెయ్యి సరఫరా టెండర్లపై ఆరా

- తితిదే ఈవో శ్యామలరావుతో సిట్ భేటీ

ఈనాడు, తిరుపతి: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన వైనంపై గుంటూరు రేంజీ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి నేతృత్వంలోని సిట్ దర్యాప్తును వేగవంతం చేసింది. రెండోరోజు ఆదివారం సభ్యులంతా సమావేశమై, ఎవరెవరు ఏయే అంశాలు విచారించాలో బాధ్యతలు పంచుకున్నారు. కల్తీ నెయ్యి సరఫరాకు సూత్రధారులు, పాత్రధారులపై క్రిమినల్ కేసుల నమోదుకు సిద్ధమవుతున్నారు. ఏఆర్ డెయిరీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కల్తీ నెయ్యి సరఫరా చేసి, దేవస్థానాన్ని మోసం చేసిందంటూ తితిదే ప్రొక్యూర్‌మెంట్ జీఎం మురళీకృష్ణ ఇటీవల తిరుపతి తూర్పు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఎఫ్ఐఆర్ నమోదు కాగా, సిట్ దర్యాప్తు చేపట్టింది. 'ఏఆర్ డెయిరీ సంస్థ తక్కువ ధరకు నెయ్యి అందించేందుకు ముందుకు రావడం ద్వారా, తనకే టెండర్ దక్కేలా తితిదేను ప్రేరేపించినట్లయింది. కల్తీ నెయ్యి పంపించి, తితిదేతోపాటు భక్తులనూ మోసగించింది. దీన్ని సరఫరాదారులు, స్వార్థ పరుల మధ్య జరిగిన నేరపూరిత కుట్రగా పరిగణించాలి. పూర్తిస్థాయి విచారణతోనే కుట్రదారుల పేర్లు బహిర్గతమవుతాయి. ఏఆర్ డెయిరీ సంస్థ ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్-2006లోని 51, 59 సెక్షన్లను ఉల్లంఘించింది' అని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రాతికోట.. నిర్లక్ష్యపు బాట

ఓరుగల్లు అంటేనే చారిత్రక కట్టడాలకు ప్రసిద్ధి. కానీ! పర్యాటక ప్రాంతాల్లో నిర్వహణ సరిగా లేక ప్రాచీన కట్టడాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. వరంగల్ జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతం ఖిలావరంగల్ రాతికోట ఉత్తర ద్వారం వద్ద పదిరోజుల క్రితం కురిసిన వర్షానికి నీరు నిలిచింది. దీంతో ఆ నీరు పాకురుబట్టి అక్కడి పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. అయినా కేంద్ర పురావస్తుశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఎక్కువ కాలం నీరు నిల్వ ఉంటే రాతి కట్టడం కుంగిపోయే ప్రమాదం ఉందని పర్యాటకులు, చరిత్రకారులు ఆందోళన చెందుతున్నారు.

– ఈనాడు, హనుమకొండ, న్యూస్‌టుడే, ఖిలావరంగల్

70 ఏళ్లు దాటిన వారి పేర్లను నమోదు చేయించండి

- ఆయుష్మాన్ భారత్‌పై రాష్ట్రాలు, యూటీలకు కేంద్రం లేఖ

దిల్లీ: ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా 70 ఏళ్లు దాటిన వారికి ఇటీవల ప్రకటించిన ఉచిత ఆరోగ్య బీమాలో పేర్లను నమోదు చేయించాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు (యూటీలు) కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఆసక్తి ఉన్న పౌరులందరికీ ఈ అవకాశం కల్పించాలని కోరింది. ఇందుకోసం ఆయుష్మాన్ యాప్‌లో, వెబ్ పోర్టల్‌లో ప్రత్యేక మాడ్యూల్‌లను ఏర్పాటు చేశామని రాష్ట్రాలు, యూటీలకు పంపిన లేఖలో కేంద్ర ఆరోగ్యశాఖ పేర్కొంది. 'ఆయుష్మాన్ భారత్‌లో ఉచిత ఆరోగ్య బీమా తీసుకోవాలనుకునే 70ఏళ్లు దాటిన పౌరులు యాప్‌లోగానీ, పోర్టల్‌లోగానీ దరఖాస్తు చేసుకోవాలి. అర్హులైన అందరికీ ప్రత్యేక కార్డులు అందజేస్తాం. దరఖాస్తులను ఆన్‌లైన్‌లోనే చేయాలి. ఇందులో సామాజిక, ఆర్థిక పరిమితులేమీ లేవు. ఆధార్‌లో నమోదైన వయసు ఆధారంగా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుకు ఆధార్ ఒక్కటే చాలు' అని కేంద్ర ఆరోగ్యశాఖ వివరించింది.



EENADU Vol: 51, Iss: 51 | Printed and Published by D N Prasad on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt. Ltd. Printed at Ushodaya Publications, Eenadu Press, Plot No. 95 & 96, Survey No. 150, Phase-II, CIE, Gandhinagar, Quthubullapur Village & Mandal, Hyderabad, Medchal District - 500 037, Telangana State. Published at Eenadu Corporate Office, Ramoji Film City, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy Dist - 501 512, Telangana State. Editor: D N Prasad. Phone: 040-22232223, RNI No. 27656/75, Regd. No. HSE/1009/2024-26, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

(c) eenadu

చర్మంలోకి తొంగిచూడొచ్చు!

● పారదర్శకంగా మార్చే లేపనం!

చర్మం కారణంగా మన శరీరంలోని అంతర్భాగాలు వెలుపలికి కనిపించవు. సీటీ స్కాన్‌లు, ఎక్స్‌రేలు, ఎమ్మారై, మైక్రోస్కోపీలతో ఇది సాధ్యమవుతున్నప్పటికీ ఈ విధానాలతో వచ్చే చిత్రాలు అంత స్పష్టంగా ఉండవు. పైగా రేడియోధార్మికత వంటి దుష్ప్రభావాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. దీనికి భిన్నంగా మాయిశ్చరైజింగ్ క్రీమ్ తరహాలో ఒక లేపనాన్ని పులుముకోగానే చర్మం పారదర్శకంగా మారిపోతే! ఈ ఊహ.. సైన్స్ కాల్పనిక సాహిత్యంలా ఉంది కదా? కానీ, అమెరికాలోని స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఈ దిశగా ముందడుగు వేశారు. ఒక సజీవ ఎలుక చర్మాన్ని నిర్దిష్ట కాంతి పరిస్థితుల్లో పారదర్శకంగా మార్చారు. జీవశాస్త్ర పరిశోధనలు, వైద్య ఇమేజింగ్‌లో సరికొత్త అవకాశాలకు ఇది తెరలేపింది.



వీక్షణ సామర్థ్యం ఇలా..

కాంతి తరంగాలు.. తాకినప్పుడు చర్మంలోని కణజాలం వాటిని చెల్లాచెదరు చేస్తుంది. దీన్ని వికీర్ణం అంటారు. అందువల్లే అది మన కంటికి అపారదర్శకంగా కనిపిస్తుంది. కణజాలంలో నీరు, లిపిడ్లు వంటివి ఉంటాయి. ఒక్కోదానికి ఒక్కో వక్రీభవన గుణకం (రిఫ్రాక్టివ్ ఇండెక్స్) ఉంటుంది. ఈ వైరుధ్యాల వల్లే వికీర్ణ ప్రభావం తలెత్తుతోంది. లిపిడ్లతో పోలిస్తే నీటికి వక్రీభవన గుణకం తక్కువ. అందువల్ల ఈ రెండింటితో కూడిన కణజాలం గుండా ప్రయాణించే క్రమంలో దృశ్య కాంతి చెల్లాచెదరవుతుంది. ఫలితంగా మనం చర్మం లోపలి భాగాలను వీక్షించలేకపోతున్నాం.

రంగు తెచ్చిన హంగు

చర్మ కణజాలంలోని భిన్న పదార్థాల రిఫ్రాక్టివ్ ఇండెక్స్‌ల మధ్య సారూప్యత సాధించేందుకు స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు టార్ట్రాజైన్ వైపు దృష్టి మళ్లించారు. దీన్ని ఆహార పదార్థాల్లో రంగుగా వాడుతుంటారు. దీన్ని నీటిలో కరిగించి.. మత్తు ఇచ్చిన ఎలుక చర్మానికి పులిమారు. దీనివల్ల దాని చర్మం ఎర్ర రంగులోకి మారింది. దీన్నిబట్టి కాంతిలోని నీల వర్ణాన్ని చాలావరకూ ఆ పదార్థం శోషించుకున్నట్లు తేలింది. ఈ శోషణ పెరగడం వల్ల అరుణ తరంగ దైర్ఘ్యంలో ఎలుక చర్మంలోని నీటికి సంబంధించిన రిఫ్రాక్టివ్ ఇండెక్స్ మారింది. లిపిడ్ల స్థాయితో అది సమానమైంది. దీంతో కాంతి వికీర్ణం తగ్గిపోయింది. అరుణ తరంగ దైర్ఘ్యంలో ఆ ఎలుక చర్మం మరింత పారదర్శకంగా మారింది.

ఎంత స్పష్టత?

◆ తాజా ప్రయోగంలో సాధించిన పారదర్శక సామర్థ్యం వల్ల ప్రత్యేకంగా ఎలాంటి పరికరాల అవసరం లేకుండానే మూషికాల కాలేయం, పెద్ద పేగు, మూత్రాశయం వంటి అంతర్భాగాల పనితీరును శాస్త్రవేత్తలు వీక్షించగలిగారు. మెదడులో రక్తప్రవాహ తీరుతెన్నులపై అంచనాకు రాగలిగారు. ఎలుక కాళ్లలోని కండరాల పైబర్ల నిర్మాణాన్ని చూశారు.

◆ శరీరానికి కోత పెట్టకుండానే సజీవ మూషికంలోని అవయవాలను వీక్షించడం ఇదే తొలిసారని శాస్త్రవేత్తలు తెలిపారు.

◆ ఈ ప్రయోగం వల్ల ఎలుకలకు ఎలాంటి హాని కలగలేదు. రంగును కడిగేసిన తర్వాత వాటి చర్మం పూర్వస్థితికి వచ్చేసింది.

విప్లవాత్మక మార్పులకు మార్గం సుగమం

ఎలుకలతో పోలిస్తే మానవుల చర్మం మరింత దళసరిగా, సంక్లిష్టంగా ఉంటుంది. అందువల్ల మనుషుల విషయంలోనూ 'పారదర్శకత'ను సాధించడానికి విభిన్న విధానం, సాంకేతికత అవసరం. దీన్ని సాధించగలిగితే అనేక విప్లవాత్మక మార్పులకు మార్గం సుగమమవుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు.

◆ శరీరానికి ఎలాంటి కోత పెట్టకుండానే అంతర్గత అవయవాల పనితీరును పర్యవేక్షించొచ్చు. చర్మ క్యాన్సర్ (మెలనోమా) పరీక్షలకు శరీరం నుంచి నమూనాల (బయాప్సీ)ను సేకరించాల్సిన అవసరం ఉండదు. నేరుగా రోగి చర్మాన్ని పరిశీలించడం ద్వారా వైద్యులు ఒక నిర్ధారణకు రావొచ్చు.

◆ కొన్నిరకాల ఎక్స్‌రేలు, సీటీ స్కాన్ల స్థానంలో ఈ 'పారదర్శక విధానాన్ని' అనుసరించొచ్చు.

◆ చర్మం కింద రక్తనాళాలను సులువుగా గుర్తించి, పెద్దగా నొప్పి లేకుండానే రక్త నమూనాలను సేకరించొచ్చు.

◆ లేజర్ టాటూ తొలగింపు సేవలను సులువు చేయవచ్చు. చర్మం కింద నిర్దిష్టంగా పిగ్మెంట్ ఎక్కడ ఉందో గుర్తించి, సరిగ్గా అక్కడికే లేజర్ పుంజాలను ప్రయోగించొచ్చు.

◆ వ్యాధుల వల్ల శరీరంపై పడే ప్రభావాన్ని సూక్ష్మస్థాయిలో అర్థం చేసుకోవచ్చు.

- ఈనాడు ప్రత్యేక విభాగం

దేవీ నవరాత్రుల నేపథ్యంలో కోల్‌కతాలో మొక్కలు, ఆకులతో ఏర్పాటుచేస్తున్న పర్యావరణహిత మండపం

దిల్లీ స్థాయీ సంఘం ఎన్నికపై సుప్రీంకోర్టులో ఆప్ సవాలు

దిల్లీ: మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ దిల్లీ (ఎంసీడీ) స్థాయీ సంఘం సభ్యుడి ఎన్నికను ఆమ్ ఆద్మీ పార్టీ సుప్రీంకోర్టులో సవాలు చేసింది. ఈ స్థానం కోసం సెప్టెంబరు 27న జరిగిన ఎన్నిక చట్టానికి, రాజ్యాంగానికి విరుద్ధమని.. భాజపా ప్రజాస్వామ్యాన్ని హత్య చేసిందని దిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ శనివారం మీడియా ఎదుట పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికను కోర్టులో ఆప్ సవాలు చేసింది. 18 మంది సభ్యులు గల స్థాయీ సంఘంలో ఖాళీ అయిన ఒక స్థానాన్ని భాజపా గెలుచుకుంది. పాలకపక్షమైన ఆప్‌కకు చెందిన కౌన్సిలర్లు ఈ ఎన్నికకు గైర్హాజరయ్యారు. ఆతిశీ వ్యాఖ్యలపై భాజపా దిల్లీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ స్పందిస్తూ.. ఇటువంటి ఎన్నికలకు ప్రత్యేక పరిస్థితుల్లో కౌన్సిల్‌ను సమావేశ పరిచే హక్కు లెఫ్టినెంట్ గవర్నర్‌కు, కమిషనర్‌కు ఉంటుందని తెలిపారు.

రాహుల్ దేశానికీ నాయకత్వం వహించగలరు

● సచిన్ పైలట్ స్పష్టీకరణ

దిల్లీ: రాహుల్ గాంధీ ప్రతిపక్ష నాయకుడిగా రాణించగలరని, దేశానికీ నాయకత్వం వహించగలరని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో దేశాన్ని నడపగలిగే నాయకుడు ఆయనేనని, వచ్చే లోక్‌సభ ఎన్నికల నాటికి ప్రతిపక్షం మొత్తం ఆయన వెనుకే నడవనుందని తెలిపారు. ఆదివారం దిల్లీలో ఓ వార్తాసంస్థకు ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. జమ్మూ కశ్మీర్, హరియాణాల్లో కాంగ్రెస్ విజయం ఖాయమని స్పష్టం చేశారు. మహారాష్ట్ర, ఝార్ఖండ్‌లలోనూ గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ రాష్ట్రాల్లో ఇండియా కూటమి బలంగా ఉందని పేర్కొన్నారు.

అక్టోబరు 2న కొత్త పార్టీ ప్రకటిస్తాం: ప్రశాంత్ కిశోర్

దిల్లీ: అక్టోబరు 2న కొత్త రాజకీయ పార్టీ పేరు, నాయకత్వం సహా ఇతర వివరాలను ప్రకటిస్తామని ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ వెల్లడించారు. పార్టీ నాయకత్వం మాత్రం తన చేతుల్లో ఉండదన్నారు. రెండేళ్ల క్రితం తాను చేపట్టిన 'జన్ సురాజ్' యాత్రనే రాజకీయ పార్టీగా మలచనున్నట్లు ఇటీవల ఆయన పేర్కొన్న సంగతి తెలిసిందే. పట్నాలో ఆదివారం మీడియాతో ప్రశాంత్ కిశోర్ మాట్లాడుతూ.. వచ్చే ఏడాది జరిగే బిహార్ శాసనసభ ఎన్నికల్లో తమ పార్టీ తరపున పోటీ చేస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పదవీ విరమణ పొందిన నలుగురు మాజీ ఉన్నతాధికారులు బిహార్ ప్రభుత్వాన్ని నడుపుతున్నారని, వారు చెప్పినట్టల్లా నీతీశ్ నడుచుకుంటారని ఆరోపించారు.

పాక్‌కు ఐఎంఎఫ్ కంటే పెద్ద ప్యాకేజీ ఇచ్చేవాళ్లం

● కశ్మీర్ ఎన్నికల ర్యాలీలో రాజ్‌నాథ్ సింగ్

శ్రీనగర్: పాకిస్థాన్ భారత్‌తో సత్సంబంధాలు కొనసాగించి ఉంటే అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్) నుంచి ఆ దేశం కోరిన దానికంటే పెద్ద ఆర్థిక ప్యాకేజీ ఇచ్చేవాళ్లమని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బాందీపోరా జిల్లాలోని గురేజ్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఆదివారం ఎన్నికల ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2014-15లో ప్రధాని నరేంద్ర మోదీ జమ్మూకశ్మీర్‌కు అభివృద్ధి ప్యాకేజీని ప్రకటించారని, అది ఇప్పుడు రూ.90 వేల కోట్లకు చేరుకుందని తెలిపారు. ఈ మొత్తం పాకిస్థాన్ నుంచి ఐఎంఎఫ్ కోరుతున్న ప్యాకేజీ కంటే పెద్ద మొత్తమన్నారు. 'మనం స్నేహితులను మార్చుకోగలం కానీ పొరుగువారిని మార్చుకోలేం' అని మాజీ ప్రధాని వాజ్‌పేయీ చేసిన ప్రసిద్ధ ప్రకటనను గుర్తుచేశారు. 'నా పాకిస్థాన్ మిత్రులారా ఎందుకు మన సంబంధాలు దెబ్బతిన్నాయి..? మనం పొరుగువారిగా ఉన్నాం. మాతో మంచి సంబంధాలు కొనసాగించి ఉంటే మేం ఐఎంఎఫ్ కంటే ఎక్కువ సాయం చేసి చేసి ఉండేవాళ్లం. పాకిస్థాన్ చాలాకాలంగా ఆర్థిక సాయాన్ని దుర్వినియోగం చేస్తోంది. తన గడ్డపై ఉగ్రవాద కర్మాగారాన్ని నడపడానికి ఇతర దేశాల నుంచి డబ్బు కోరుతోంది. ఇక్కడి భాజపా అభ్యర్థి ఫకీర్ మహ్మద్ ఖాన్‌ను గెలిపిస్తే గురేజ్ నుంచి ఎక్కువ మందిని భారత సైన్యంలో నియమించుకుంటామని హామీ ఇస్తున్నా' అని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

రాజకీయాల్లో మహిళల సంఖ్య పెరగాలి: రాహుల్

దిల్లీ: నిజమైన సమానత్వం, న్యాయం పొందాలంటే రాజకీయాల్లో మహిళల సంఖ్య పెరగాల్సిన అవసరముందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు. నిజమైన మార్పును కోరుకుంటున్న మహిళలు 'శక్తి అభియాన్'లో చేరాలని పిలుపునిచ్చారు. ఇందులో పాల్గొనడం ద్వారా పటిష్ఠమైన సంస్థల నిర్మాణానికి చేయూత అందించవచ్చని వెల్లడించారు. 'రాజకీయాల్లో మహిళల గొంతు విస్తరించాలన్న లక్ష్యంతో గతేడాది 'ఇందిరా హెలోషిప్'ను ప్రారంభించాం. ఆ చొరవే ఈ రోజు మహిళల నాయకత్వానికి శక్తిమంతమైన ఉద్యమంలా వృద్ధి చెందింది.

మనమంతా కలిసి గ్రామాల నుంచి దేశం మొత్తానికి మార్పును తీసుకురాగలం' అని 'ఎక్స్' వేదికగా రాహుల్ ఆదివారం పేర్కొన్నారు. రాజకీయాల్లో మహిళల ప్రయోజనాల కోసం సమాన అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో 'శక్తి అభియాన్'ను ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఏర్పాటు చేసింది. స్థానిక, శాసనసభ, పార్లమెంటు స్థాయిల్లో మహిళలే మహిళలకు ప్రాతినిధ్యం వహించడం దీని లక్ష్యం.

దిల్లీ రాజ్‌నివాస్‌లో ఆదివారం దిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణం చేసిన జస్టిన్ మన్మోహన్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ముఖ్యమంత్రి ఆతిశీ

నిర్మలా సీతారామన్ రాజీనామా చేయాలి: కాంగ్రెస్

దిల్లీ: ఎన్నికలబాండ్లకు సంబంధించిన కేసులో నిందితురాలిగా ఉన్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తక్షణమే రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ కేసులో నిందితులకు సమన్లు పంపి వాంగ్మూలాలను నమోదు చేసి అరెస్టు చేయాలని పేర్కొంది. "ఈ కేసులో ఎలా ముందుకు వెళ్లాలో దర్యాప్తు సంస్థలకు బాగా తెలుసు. అయితే మేం న్యాయస్థానం పర్యవేక్షణలో దర్యాప్తు జరగాలని కోరుకుంటున్నాం. ఆ తర్వాత దీన్ని సుప్రీంకోర్టు పర్యవేక్షించాలి. ఈ ఎన్నికల బాండ్ల కుంభకోణాన్ని ఆర్థికమంత్రి ఒక్కరే చేశారని మేం అనుకోవడం లేదు. నంబరు 1, నంబరు 2 ఆదేశాల మేరకే జరిగింది. ప్రభుత్వంలో నంబరు 1, నంబరు 2 ఎవరో అందరికీ తెలిసిందే" అని కాంగ్రెస్ అధికారప్రతినిధి అభిషేక్ సింఘ్వీ తెలిపారు. సీతారామన్‌పై కోర్టు ఆదేశాలమేరకే ఎఫ్ఐఆర్ నమోదైందని ఇందులో తమ పార్టీ పాత్ర లేదని మరో కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ అన్నారు. "అన్ని పార్టీలకు ఎన్నికల బాండ్లు లభించాయి. కానీ భాజపా కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేసి భారీస్థాయిలో ఎన్నికల బాండ్లను వసూలు చేసింది" అని జైరాం ఆరోపించారు.

వరదలు ముంచెత్తుతున్నా.. కేంద్రం కరుణించడం లేదు

పశ్చిమబెంగాల్ సీఎం మమత

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని ఉత్తరాది జిల్లాల్లో వరదల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రకృతి విపత్తును ఎదుర్కోవడానికి కేంద్రం నుంచి తమ రాష్ట్రానికి ఎటువంటి సహాయం అందట్లేదని ఆరోపించారు. వరద ప్రాంతాల్లో పర్యటించిన మమత ఆదివారం మీడియాతో మాట్లాడారు. "ఉత్తర బెంగాల్ వరదలతో కొట్టుమిట్టాడుతోంది. కూచ్ బిహార్, జల్పాయిగుడి.. తదితర జిల్లాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కోశి నది పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటం వల్ల ఇతర జిల్లాలు కూడా అతలాకుతలం అవుతున్నాయి" అని మమత వెల్లడించారు. విపత్తు సమయంలో రాష్ట్రానికి కేంద్రం ఎటువంటి సహాయాన్ని అందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

10వేల మందితో ఘెరావ్ చేస్తా

● జూడాలను బెదిరించిన టీఎంసీ ఎమ్మెల్యే

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో హత్యాచార ఘటనకు నిరసనగా విధుల బహిష్కరణ చేపట్టిన జూనియర్ డాక్టర్లు (జూడా)లపై ఓ టీఎంసీ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. వెయ్యి మందితో జూనియర్ వైద్యులు ర్యాలీ నిర్వహిస్తే.. 10వేల మందితో వారిని ఘెరావ్ చేస్తానంటూ జూడాలపై భరత్‌పుర్ ఎమ్మెల్యే హుమాయున్ కబీర్ బెదిరింపులకు పాల్పడ్డారు. ముషిరాబాద్ వైద్య కళాశాల జూనియర్ వైద్యులపై ఆయన శనివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఈ నెల ప్రారంభంలో జూనియర్ వైద్యులు చేపట్టిన విధుల బహిష్కరణను ఉద్దేశించి నేను చేసిన వ్యాఖ్యలపై వారు కేసు పెట్టారన్న విషయం నా దృష్టికి వచ్చింది. నేను భయపడటం లేదు. వారిని వెయ్యిమందితో నిరసనలు తెలపనివ్వండి. నన్ను జైలుకు పంపితే, బయటకొచ్చిన తర్వాత వారిని 10వేల మందితో ఘెరావ్ చేస్తా' అంటూ కబీర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

వైద్యులపై దాడి.. విధుల బహిష్కరణ

మరోవైపు కోల్‌కతా శివారులోని సాగోరే దత్తా ఆసుపత్రి వైద్య కళాశాలలో చికిత్స తీసుకుంటూ ఓ వ్యక్తి మృతి చెందడంతో బాధిత కుటుంబ సభ్యులు వైద్యులపై దాడి చేశారు. దీంతో ఆందోళన చేపట్టిన జూడాలు విధులను బహిష్కరించారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న పశ్చిమబెంగాల్ కాంగ్రెస్ అధ్యక్షుడు శుభాంకర్ సర్కార్‌కు వ్యతిరేకంగా జూడాలు నినాదాలు చేశారు.

సందీప్ ల్యాప్‌టాప్‌లలో కీలక సమాచారం: సీబీఐ

ఆర్‌జీ కర్ వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ అవకతవకలపై విచారణ చేస్తున్న సీబీఐ కీలక ఆధారాలు సేకరించినట్లు తెలుస్తోంది. సందీప్‌కు చెందిన రెండు మొబైల్ ఫోన్లు, రెండు ల్యాప్‌టాప్‌లలో ముఖ్యమైన సమాచారం లభ్యమైనట్లు సమాచారం. ఘోష్‌కు పలువురు రాజకీయ నేతలతో సంబంధాలు ఉన్నట్లు తెలిసింది. ఆ దిశగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీబీఐ అధికారులు పేర్కొన్నట్లు పీటీఐ వార్తా సంస్థ వెల్లడించింది.

స్టార్మర్ పాలనపై అసంతృప్తితో లేబర్ పార్టీ ఎంపీ రాజీనామా

లండన్: బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌కు మొదటి ఎదురుదెబ్బ తగిలింది. ఆయన పరిపాలనపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ లేబర్‌పార్టీ సభ్యత్వానికి ఎంపీ రోసి డఫీల్డ్ రాజీనామా చేశారు. ఖరీదైన ఉచిత బహుమతులను ప్రధాని అందుకోవడంపై మొదలైన వివాదంపై తాను అసంతృప్తిగా ఉన్నట్లు తెలిపారు. 'ఇది క్రూరమైనది, అనవసరమైనది, వేలమంది పేద ప్రజలపై తీవ్ర ప్రభావం చూపేది. ప్రజలు నన్ను ఇందుకోసం ఎన్నుకోలేదు. ఇది తెలివైన రాజకీయం కాదు, అలాగని సేవా రాజకీయం అంతకంటే కాదు' అంటూ తన రాజీనామా లేఖలో రోసి పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కీర్ స్టార్మర్ వాగ్దానమిచ్చిన మార్పుపై తనకు నమ్మకం లేదని అన్నారు.

ఝార్ఖండ్ ఎన్నికల్లో ఎల్‌జేపీ(రామ్ విలాస్) పోటీ

రాంచీ: ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో లోక్ జనశక్తి పార్టీ(రామ్ విలాస్) పోటీచేస్తుందని ఆ పార్టీ అధ్యక్షుడు, కేంద్రమంత్రి చిరాగ్ పాస్వాన్ ఆదివారం వెల్లడించారు. అయితే పొత్తు లేదా ఒంటరిగా పోటీచేసే అంశంపై చర్చలు జరుగుతున్నాయని వివరించారు. ఝార్ఖండ్ ఎన్నికల్లో భాజపా.. ఏజేఎస్‌యూ, జేడీయూలతో కలిసి పోటీచేస్తుందంటూ అస్సాం ముఖ్యమంత్రి, ఝార్ఖండ్ ఎన్నికల కో-ఇన్‌ఛార్జ్ హిమంత బిశ్వ శర్మ శనివారం ప్రకటించారు. ఈ క్రమంలో చిరాగ్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

కథువాలో ఉగ్రవాదిని మట్టుబెట్టిన సైన్యం

జమ్మూ: కశ్మీర్‌లోని కథువా జిల్లాలో ఆదివారం కొనసాగిన ప్రత్యేక ఆపరేషన్‌లో సైనికులు ఓ ఉగ్రవాదిని మట్టుబెట్టారు. శనివారం కోగ్-మండ్లి గ్రామంలో ముష్కరులతో జరిగిన ఎదురుకాల్పుల్లో హెడ్‌కానిస్టేబుల్ అమరుడు కాగా.. మరో ఇద్దరు అధికారులు గాయపడ్డారు. ఈ క్రమంలో ఆ ప్రాంతానికి చేరుకున్న అదనపు బలగాలు ఆదివారం ఓ ఉగ్రవాదిని అంతమొందించాయి. బిల్లావర్ తహసీల్ ఏరియాలో ముగ్గురు నుంచి నలుగురు ఉగ్రవాదులు ఉన్నట్లు సమాచారం అందిన వెంటనే భద్రతా బలగాలు శనివారం గాలింపు మొదలుపెట్టాయని జమ్మూ జోన్ ఏడీజీపీ ఆనంద్ జైన్ తెలిపారు. ముష్కరులు జరిపిన కాల్పుల్లో హెడ్‌కానిస్టేబుల్ బషీర్ అహ్మద్ ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించారు. డీఎస్పీతో పాటు ఏఎస్సై గాయపడినట్లు పేర్కొన్నారు. ఆదివారం గాలింపు ముమ్మరం చేసిన సైనికులు ఓ ముష్కరుడిని కాల్చిచంపినట్లు ఏడీజీపీ తెలిపారు.

స్మగ్లింగ్ రాకెట్‌ను ఛేదించిన పంజాబ్ పోలీసులు

చండీగఢ్: పాకిస్థాన్ సరిహద్దు నుంచి మాదకద్రవ్యాలను సరఫరా చేస్తోన్న స్మగ్లింగ్ రాకెట్‌ను పంజాబ్ పోలీసులు ఆదివారం ఛేదించారు. గురుదాస్‌పుర్ సమీపంలోని జాఫర్‌పుర్ గ్రామంలో 6 కిలోల హెరాయిన్‌తో పాటు 67 తూటాలను, రెండు మ్యాగజైన్‌లు, 6 మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ స్మగ్లింగ్‌లో జాఫర్‌పుర్ గ్రామానికి చెందిన వ్యక్తి ప్రమేయం ఉన్నట్లు సమాచారం అందిందని పోలీసులు పేర్కొన్నారు. అతడిని పట్టుకునేందుకు గాలింపు చేపట్టినట్లు తెలిపారు. అమృత్‌సర్‌కు చెందిన స్టేట్ స్పెషల్ ఆపరేషన్ సెల్ ఈ రాకెట్ గుట్టురట్టు చేసిందని పేర్కొన్నారు.

గంజాయిని చట్టబద్ధం చేయాలన్న ఎంపీపై కేసు

ఘాజీపుర్: గంజాయిని చట్టబద్ధం చేయాలని వ్యాఖ్యానించిన సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ అఫ్జల్ అన్సారీపై ఉత్తర్ ప్రదేశ్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కుంభమేళా సందర్భంగా భారీ ఎత్తున గంజాయిని స్వీకరిస్తారని, అందువల్ల చట్టబద్ధం చేయాలని ఆయన వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆ తర్వాత క్షమాపణలు చెప్పారు. మరోవైపు హిందూ సంస్థల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

పుస్తకంపై వచ్చిన రూ.50 లక్షల ఆదాయం పేద విద్యార్థులకు..

● ట్రస్టుకు ఇవ్వనున్న మాజీమంత్రి గల్లా అరుణకుమారి

ఈనాడు డిజిటల్, తిరుపతి: చిన్నతనంలోనే తల్లి మరణించగా తండ్రి పెంపకంలో సమాజాన్ని చదివారు ఆమె. మాజీ మంత్రిగా, అమరరాజ సంస్థల సహ వ్యవస్థాపకురాలిగా పేరుప్రఖ్యాతులున్నా ఆమె నిత్య సమాజ సేవకురాలు. రాజగోపాలనాయుడు కుమార్తెగా, రామచంద్ర నాయుడు భార్యగా.. జయదేవ్, రమాదేవిల తల్లిగా మాత్రమే కాక ఓ రచయితగా అవతారమెత్తి, తన జీవితాన్ని తానే రాసుకున్నారు. ఆమే చిత్తూరు జిల్లాకు చెందిన గల్లా అరుణకుమారి. ఇటీవల ఆవిష్కరించిన ఆమె స్వీయచరిత్ర పుస్తకం మొదటి ప్రతులు 5,000లకు పైగా అమ్ముడయ్యాయి. వచ్చిన నగదును పేద విద్యార్థుల చదువులకు ఉపయోగపడేలా ట్రస్టుకు విరాళంగా అందించనున్నారు. ఈ సందర్భంగా ఆమె 'ఈనాడు'తో మాట్లాడారు.

అందుకే వెల రూ.1,000 నిర్ణయించాం

"నిజానికి ఈ పుస్తకాన్ని ఉచితంగానే ఇవ్వాలన్న ఆలోచన ఉండేది. కానీ నా స్వీయ చరిత్ర రాయడంలో సహకరించిన రచయితలు నామిని సుబ్రహ్మణ్యం నాయుడు, సాకం నాగరాజాలు ఉచితంగా ఇవ్వడం వల్ల ఎదురయ్యే పరిస్థితులను వివరించారు. వెయ్యి పేజీలు ఉన్న ఈ పుస్తక ప్రతులను అమ్మిన సొమ్మును సేవా కార్యక్రమాలకు వాడాలని అప్పటికప్పుడే అనుకున్నా. పుస్తకం వెల రూ.1,000గా నిర్ణయించింది ఆ సందర్భంలోనే. తొలి ముద్రణలో 5,000 పైగా పుస్తకాలు అమ్ముడుపోయాయి. వచ్చిన డబ్బు రూ.50 లక్షలను అక్టోబరు 2న శ్రీకృష్ణదేవరాయ ఎడ్యుకేషనల్ ట్రస్టుకు విరాళంగా ఇస్తున్నా. నేను చదువుకునే రోజుల్లో మా ఊళ్లో బాగా చదివే ఓ విద్యార్థి ఉండేవారు. పేదరికం వల్ల చదువుకు ఇబ్బంది ఏర్పడటంతో మా నాన్న అతనికి పాకెట్ మనీగా కొంత సొమ్మిచ్చేవారు. అది గమనించిన నేను నా మిత్రుల సహకారంతో నెలకు కొంత సొమ్ము జమచేసి, ఆ అబ్బాయి పుస్తకాల ఖర్చులకు ఇచ్చేవాళ్లం. పెళ్లి తరువాత మా ఆయనకు ఈ విషయం తెలియడంతో, అలాంటి వాళ్లకోసం ఏదైనా చేయాలని ఆలోచించి స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. అప్పటినుంచి చదువుకునే పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్నాం. నా ఈ విరాళం కూడా వాళ్లకు ఈ విధంగానే ఉపయోగపడనుంది.

గల్లా అరుణ స్వీయచరిత్ర పుస్తకం

సీఎంతో సవాల్ చేశా..

ఇటీవల ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడులకు పుస్తకం అందజేశా. వాళ్లిద్దరి దగ్గరా డబ్బులు తీసుకున్నా. రూ.వెయ్యి ఇచ్చిన తరువాత 'ఈ పుస్తకం చదువుతాను. ఒకవేళ కంటెంట్ లేకుంటే నా రూ.వెయ్యి నాకు తిరిగివ్వాలి' అని సీఎం సరదాగా అన్నారు. వెంటనే 'కంటెంట్ నచ్చకపోతే రూ.వెయ్యి కాదు నేనే మీకు రూ.రెండు వేలు ఇస్తా' అని నవ్వుతూ నేనూ సవాల్ విసిరాను.

సెల్‌ఫోన్లు చూపిస్తూ అన్నం పెడుతున్నారు..

నిజానికి ఒకప్పటిలా పుస్తకాలు చదివే వాళ్లు లేరు. చిన్నపిల్లలకు కథలు చెప్పి గోరుముద్దలు తినిపించే రోజుల నుంచి సెల్‌ఫోన్‌లో వీడియోలు చూపించి అన్నం పెట్టే రోజుల్లోకి వచ్చాం. చేతిరాతలు తగ్గిపోయాయి. నేను 3,000 పేజీలు చేతితో రాసే సరికి అదిచూసి, నా మనవడు ఆశ్చర్యపోయాడు. ప్రస్తుత సమాజంలో అనుకున్న స్థాయిలో పుస్తకాలు అమ్ముడుపోక రచయితలు ఇబ్బందులు పడుతున్నారన్నది వాస్తవం. ఎంత సాంకేతికత పెరిగినా నచ్చిన పుస్తకాన్ని చేతుల్లోకి తీసుకొని చదవడంలోనే సంతృప్తి ఉంటుంది" అని గల్లా అరుణకుమారి వివరించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబుకు తన స్వీయచరిత్ర పుస్తకాన్ని అందిస్తున్న గల్లా అరుణకుమారి

పండ్ల వ్యాపారం ముసుగులో డ్రగ్స్ దందా

ఇంటర్నెట్ డెస్క్: దేశంలో భారీ డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టయ్యింది. ఐదేళ్లుగా డ్రగ్స్ రవాణా చేస్తున్న నిందితుడిని శిమ్లా పోలీసులు ఎట్టకేలకు పట్టుకున్నారు. యాపిల్ పండ్ల విక్రయదారుగా ఉంటూ.. అదే ముసుగులో అంతర్రాష్ట్ర డ్రగ్స్ రాకెట్‌ను నడుతుపుతున్న వ్యక్తిని అరెస్టు చేశారు. యాపిల్ వ్యాపారి అయిన శశి నేగి అలియాస్ షామీ మహాత్మ హిమాచల్‌ప్రదేశ్‌లోని ఎగువ శిమ్లా ప్రాంతంలో 5-6 ఏళ్లుగా మత్తుపదార్థాలను విక్రయిస్తున్నాడు. ఎవరికీ అనుమానం రాకుండా వాట్సప్‌లోనే ఆర్డర్లు తీసుకొనేవాడు. అలా గత 15 నెలల్లో రూ.2.5 నుంచి రూ.3 కోట్లు సంపాదించినట్లు పోలీసులు తెలిపారు. వీరికి నైజీరియన్ డ్రగ్స్ ముఠాలతో పాటు హరియాణాలోని ఇతర ముఠాలతో సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు. నిందితుడితో పాటు 9 మంది అనుచరులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని,

అక్టోబరు తొలి వారంలో ఏఐ ఎక్స్‌ప్రెస్-ఏఐఎక్స్ కనెక్ట్ విలీనం

దిల్లీ: ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లో ఏఐఎక్స్ కనెక్ట్ అక్టోబరు తొలి వారంలో విలీనం కాబోతోందని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ఒక ఉన్నతాధికారి వెల్లడించారు. దీంతో ఏఐఎక్స్ కనెక్ట్ డెజిగ్నేటర్ కోడ్ 'ఐఎక్స్' ఇకపై ఉండదని తెలిపారు. విలీనం తర్వాత రెండు సంస్థల విమానాలు ఒకే ఎయిర్‌లైన్ డెజిగ్నేటర్ కోడ్ 'ఐఎక్స్' (ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ కోడ్ ఇది) కింద నడుస్తాయి. ఎయిరేషియా ఇండియా 11 ఏళ్ల కార్యకలాపాలు సాగించిన తర్వాత ఏఐఎక్స్ కనెక్ట్‌గా మారిన సంగతి విదితమే. ఎయిర్ ఆపరేటర్ సర్టిఫికెట్ (ఏఓసీ) కింద నమోదైన ఈ సంస్థ, వచ్చే నెల తొలి వారంలో ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ఏఓసీకి బదిలీ అవుతుందని తెలిపారు. ప్రస్తుతం ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, ఏఐఎక్స్ కనెక్ట్‌లు రోజువారీగా సుమారు 400 విమాన సర్వీసులు నడుపుతున్నాయి. వీటివద్ద 61 బోయింగ్ 737 ఎన్‌జీ - మ్యాక్స్ విమానాలు, 27 ఏ320 సియో - నియో విమానాలు కలిపి 88 విమానాలు ఉన్నాయి. విలీన సంస్థలో సుమారు 6,000 మంది ఉద్యోగులు ఉంటారు. వీరిలో 1,500 కాక్‌పిట్ సిబ్బంది, 4,000కు పైగా క్యాబిన్ సిబ్బంది ఉంటారు. వీరిలో 1,000 మంది ఏఐఎక్స్ కనెక్ట్‌కు చెందిన వారు ఉన్నారు. ఏఐఎక్స్ కనెక్ట్ కార్యకలాపాలను ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ బ్రాండ్ కింద నిర్వహించేందుకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) 2023 జులైలో అనుమతి ఇచ్చింది.

- ఇప్పటివరకు ఇదే అత్యధిక మొత్తం
- 2021లో రూ.1,19,882 కోట్లు

స్టాక్‌మార్కెట్లు దూసుకెళ్తున్నాయి. సూచీలు జీవనకాల తాజా గరిష్ఠాలకు చేరాయి. ఈ నేపథ్యంలో దేశీయంగా కంపెనీల తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)లకూ అమిత గిరాకీ లభిస్తోంది. ఈ ఏడాది తొలి 9 నెలల్లో దేశీయంగా 62 కంపెనీలు రూ.64,513 కోట్లను ఐపీఓల ద్వారా సమీకరించగా, రాబోయే 2 నెలల్లోనే రూ. 60,000 కోట్లకు పైగా సమీకరించేందుకు కంపెనీలు, మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ అనుమతులు పొందాయి. అంటే ఈ క్యాలెండర్ ఏడాదిలోనే రూ.1.25 లక్షల కోట్లను కంపెనీలు సమీకరించనున్నాయి. ఇప్పటి వరకు చూస్తే 2021లో 63 కంపెనీలు రూ.1,19,882 కోట్లు సమీకరించిన మొత్తమే గరిష్ఠంగా ఉండేది. ఈ ఏడాది అంతకుమించి సమీకరించనున్నాయి.

ఇవీ కారణాలు

బ్యాంకుల్లో డిపాజిట్లు ఉపసంహరించి మరీ నేరుగా డీమ్యాట్ ఖాతా ద్వారా షేర్లు కొంటున్న చిన్న మదుపర్లు కొందరైతే, మ్యూచువల్‌ఫండ్ల ద్వారా పెడుతున్న వారు మరెందరో. కంపెనీల తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) లలోనూ వీరు అధిక సంఖ్యలో పెట్టుబడులు పెడుతున్నారు. పెద్ద కంపెనీలతో పాటు చిన్న, మధ్య స్థాయి కంపెనీల (ఎస్‌ఎంఈ)ల పబ్లిక్ ఇష్యూలకూ వీరి నుంచి అమిత ఆదరణ లభిస్తోంది. ఫలితంగా కంపెనీలు ఆఫర్ చేస్తున్న షేర్లకు 100-200 రెట్ల అధికంగా బిడ్లు దాఖలవుతున్నాయి. కొన్నిషేర్లు ఎక్కైంజీల్లో నమోదైన తొలిరోజే 100 శాతానికి మించి ప్రతిఫలం ఇస్తున్నందున, ఐపీఓ లో షేర్లు అలాట్ అయితే చాలు.. పంట పడినట్లే అని మదుపర్లు భావిస్తున్నారు. కొన్ని ఎస్‌ఎంఈ ఇష్యూలకు ఇంతటి ఆదరణ లభించడం వెనుక మర్చంట్ బ్యాంకర్ల హస్తం ఉందని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ మదుపర్లను హెచ్చరిస్తోంది. ఐపీఓకు వచ్చిన కంపెనీ ఆర్థిక మూలాలు, కార్యాకలాపాలు, నష్టభయం అవకాశాలను గమనించే షేర్లకు దరఖాస్తు చేసుకుంటే మంచిదని సూచిస్తోంది.

అక్టోబరు-నవంబరుల్లో రాబోతున్న ఐపీఓలు

హ్యుందాయ్ మోటార్ ఇండియా	రూ.25,000 కోట్లు
స్విగ్గీ	రూ.10,414 కోట్లు
ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ	రూ.10,000 కోట్లు
అఫ్కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్	రూ.7,000 కోట్లు
వారీ ఎనర్జీస్	రూ.3,000 కోట్లు
నివా బుపా హెల్త్ ఇన్సూరెన్స్	రూ.3,000 కోట్లు
పన్ మొబిక్విక్ సిస్టమ్స్	రూ.700 కోట్లు

తెలుగు మదుపర్లకే ఎఫ్ & ఓ నష్టాలు అధికం

ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) ట్రేడింగ్‌లో, 2023-24లో తెలుగు రాష్ట్రాల మదుపర్లే సగటున అధిక నష్టాలు మూటగట్టుకున్నారని సెబీ తెలిపింది. ఎఫ్ అండ్ ఓ ట్రేడర్లలో సంఖ్యా పరంగా తెలంగాణ 12వ స్థానంలో, ఆంధ్రప్రదేశ్ 13వ స్థానంలో ఉంది. నష్టాల్లో తెలంగాణ మదుపర్లు సగటున రూ.1.97 లక్షలతో మొదటి స్థానంలో ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ మదుపర్ల సగటు నష్టం రూ.1.45 లక్షలుగా ఉంది. తమిళనాడు రూ.1.37 లక్షలు, కర్ణాటక రూ.1.35 లక్షలు, దిల్లీ రూ.1.24 లక్షలతో తదుపరి స్థానాల్లో ఉన్నాయి.

- ఎఫ్ అండ్ ఓ కాంట్రాక్టుల గడువు నెలలో నియమిత సమయానికి ముగుస్తుంది కనుక, అప్పటికి ఆ కాంట్రాక్టుపై లాభమైనా/నష్టమైనా భరించాల్సిందే. మన మదుపర్లు మాత్రం అనుభవం లేకున్నా, తక్కువ సమయంలో ప్రతిఫలం కోసం షేర్లకు బదులు ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడుతున్నారు. ఇదే నష్టాలకు కారణమవుతోందని నిపుణులు అంటున్నారు.

- ఈనాడు వాణిజ్య విభాగం

రికరింగ్ డిపాజిట్+సిప్

- ఖాతాదార్ల ఆకర్షణకు వినూత్న పథకాలు
- ఎస్‌బీఐ ఛైర్మన్ శ్రీనివాసులు శెట్టి

దిల్లీ: బ్యాంకులోకి డిపాజిట్లను ఆకర్షించేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) వినూత్న పథకాలు సిద్ధం చేస్తోంది. రికరింగ్ డిపాజిట్, క్రమానుగత పెట్టుబడి (సిప్)ని కలిపి ఉండే పథకాల వంటివి ప్రవేశ పెట్టనున్నామని ఎస్‌బీఐ ఛైర్మన్ శ్రీనివాసులు శెట్టి తెలిపారు. ఆర్థిక వ్యవస్థ పురోగతి నేపథ్యంలో, ఆర్థిక పథకాలపై ఖాతాదారులకు అవగాహన అధికమవుతోందని, అధిక ప్రతిఫలం లభించే పెట్టుబడి సాధనాల కోసం చూస్తున్నారని తెలిపారు. ఇదే సమయంలో తమ పెట్టుబడులకు భద్రతను కోరుకుంటున్నారని.. వీటిని దృష్టిలో పెట్టుకునే విభిన్న ఉత్పత్తులను తీసుకొస్తామని వివరించారు. డిపాజిట్ల పెంపు కోసం ప్రస్తుత, కొత్త వినియోగదారులను సంప్రదిస్తామని శ్రీనివాసులు శెట్టి పేర్కొన్నారు. ఖాతాదారులకు సరైన వడ్డీ రేటు ఇవ్వాల్సిన అవసరం ఉందని, వారికి సేవలను మెరుగుపరచడంపై దృష్టి పెట్టామన్నారు. రోజుకు దాదాపు 50,000 - 60,000 కొత్త సేవింగ్స్ బ్యాంక్ ఖాతాలు తెరిపించాలని ఎస్‌బీఐ భావిస్తోందని తెలిపారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లను చూస్తే.. రోజులో దాదాపు 50% డిజిటల్ చానెళ్ల ద్వారానే ప్రారంభమవుతున్నాయని అన్నారు.

పీఎల్ఐ పథకాల కింద రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు

- కేంద్ర వాణిజ్య మంత్రి పీయూశ్ గోయల్

దిల్లీ: ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకం కింద నమోదైన 14 రంగాల్లో ఈ ఏడాది ఆగస్టు వరకు రూ.1.46 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, వచ్చే ఏడాది కల్లా ఇవి రూ.2 లక్షల కోట్లకు చేరతాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూశ్ గోయల్ వెల్లడించారు. ఈ పథకం కింద ఆర్థిక ప్రయోజనాలు పొందుతున్న కంపెనీల నుంచి సమాచారం తీసుకునేందుకు మంత్రి వారితో సుదీర్ఘ చర్చలు జరిపారు. పీఎల్ఐ పథకం కింద 14 రంగాల్లోని 1,300 తయారీ యూనిట్లు ప్రయోజనం పొందుతుండగా, వాటిల్లోని 140 కంపెనీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ పథకం ద్వారా ఇప్పటికే రూ.12.50 లక్షల కోట్ల విలువైన ఉత్పత్తుల తయారీ/విక్రయాలు జరిగాయని, సుమారు 9.5 లక్షల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు లభించాయని పేర్కొన్నారు. త్వరలోనే ఉద్యోగాల సంఖ్య 12 లక్షలకు పెరగొచ్చని మంత్రిత్వశాఖ తెలిపింది. ఎగుమతులు కూడా రూ.4 లక్షల కోట్లను అధిగమించాయని వివరించింది. ఎలక్ట్రానిక్స్, ఔషధాలు, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాలు ఎగుమతులకు ఊతమిచ్చాయని వెల్లడించింది. స్థిరమైన విధానాలతో బ్రాండ్ ఇండియాను ప్రోత్సహించేలా అధిక నాణ్యత కలిగిన వస్తువులను తయారు చేయడంపై దృష్టి సారించాలని పరిశ్రమ వర్గాలకు గోయల్ సమావేశంలో సూచించారు.

సహజవాయువు పైకే!

పసిడి

పసిడి అక్టోబరు కాంట్రాక్టు ఈవారం రూ.74,736 కంటే దిగువన కదలాడితే.. రూ.73,754; రూ.72,859 వరకు దిగిరావచ్చు. రూ.76,122 కంటే పైన షార్ట్ సెల్ పొజిషన్లకు దూరంగా ఉండటం మంచిది. ఒకవేళ రూ.74,736 కంటే కిందకు రాకుంటే.. ఈ స్థాయి వద్ద స్టాప్‌లాస్ పెట్టుకుని, లాంగ్ పొజిషన్లు కొనసాగించొచ్చు.

వెండి

వెండి డిసెంబరు కాంట్రాక్టు రూ.89,870 కంటే దిగువన కదలాడితే కొంత బలహీనతకు అవకాశం ఉంటుంది. రూ.88,448 వద్ద మద్దతు లభించొచ్చు. ఈ స్థాయిని కోల్పోతే రూ.85,496; రూ.82,651కి దిగిరావచ్చు. ఒకవేళ రూ.92,769 ఎగువన చలిస్తే సానుకూల ధోరణికి అవకాశం ఉంటుంది. రూ.94,245 స్థాయిని అధిగమిస్తే.. రూ.97,090; రూ.1,00,042 వరకు పెరుగుతుందని భావించొచ్చు.

ప్రాథమిక లోహాలు



- **రాగి** అక్టోబరు కాంట్రాక్టు సానుకూల ధోరణిలో చలిస్తే రూ.860.95 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.887; రూ.913.05 వరకు పెరిగే అవకాశం ఉంటుంది. రూ.861 ఎగువన షార్ట్ సెల్లింగ్‌కు దూరంగా ఉండటం మంచిది.
- **సీసం** అక్టోబరు కాంట్రాక్టును రూ.186 ఎగువన కొనుగోలు చేయడం మంచిదే. ఈ స్థాయికి దిగువన లాంగ్ పొజిషన్లకు దూరంగా ఉండాలి.
- **జింక్** అక్టోబరు కాంట్రాక్టు రూ.283.20 కంటే ఎగువన చలించకుంటే.. షార్ట్ సెల్లింగ్ వైపు మొగ్గు చూపొచ్చు. ఈ స్థాయికి పైన కదలాడితే లాంగ్ పొజిషన్లు తీసుకోవడం మంచి వ్యూహమే అవుతుంది.

కమొడిటీస్ ఈ వారం

- **అల్యూమినియం** అక్టోబరు కాంట్రాక్టు రూ.233 దిగువన చలిస్తే కొంత దిద్దుబాటు కావచ్చు. రూ.242 ఎగువన మాత్రం షార్ట్ పొజిషన్లకు దూరంగా ఉండాలి.

ఇంధన రంగం

- **ముడి చమురు** అక్టోబరు కాంట్రాక్టు రూ.5,524 కంటే దిగువన కదలాడితే రూ.5,354; రూ.5,082 వరకు చేరొచ్చు. ఒకవేళ రూ.5,966 కంటే పైన చలిస్తే రూ.6,238; రూ.6,408 వరకు రాణించొచ్చు.
- **సహజవాయువు** అక్టోబరు కాంట్రాక్టు రూ.218 కంటే దిగువన కదలాడకుంటే, మరింతగా పెరిగే అవకాశం ఉంటుంది.

వ్యవసాయ ఉత్పత్తులు

- **పసుపు** అక్టోబరు కాంట్రాక్టు రూ.14,840 కంటే ఎగువన కదలాడకుంటే మరింత దిద్దుబాటు కావచ్చు. ఒకవేళ ఈ స్థాయికి పైన చలిస్తే లాంగ్ పొజిషన్ల వైపు మొగ్గు చూపడం మంచిది.
- **పత్తి క్యాండీ** నవంబరు కాంట్రాక్టుకు రూ.57,656 వద్ద మద్దతు కనిపిస్తోంది. ఈ స్థాయిని కోల్పోతే రూ.57,233 వరకు దిగిరావచ్చు. ఒకవేళ సానుకూల ధోరణిలో చలిస్తే రూ.58,746 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.59,413 వరకు పెరిగే అవకాశం ఉంటుంది.

– ఆర్‌ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

గతవారం కదలికలు ఇలా

కమొడిటీ	ప్రారంభం	ముగింపు	వృద్ధి/(క్షీణత)
	(రూ.లలో)		(శాతంలో)
పసిడి (అక్టోబరు)	75,003	75,718	0.95
వెండి (డిసెంబరు)	90,177	91,400	1.36
రాగి (అక్టోబరు)	824.70	856.25	3.83
సీసం (అక్టోబరు)	181.75	184.35	1.43
జింక్ (అక్టోబరు)	265.25	280.90	5.90
అల్యూమినియం (అక్టోబరు)	228.85	239.50	4.65
ముడి చమురు (అక్టోబరు)	5,987	5,694	-4.89
సహజ వాయువు (అక్టోబరు)	206.10	244.50	18.63
పసుపు (అక్టోబరు)	14,548	14,362	-1.28
పత్తి క్యాండీ (సెప్టెంబరు)	58,850	58,080	-1.31

బులిష్ ధోరణి కొనసాగొచ్చు

స్టాక్ మార్కెట్ ఈ వారం

- ఔషధ, వాహన షేర్లు రాణించొచ్చు
- లోహ, చమురు స్క్రిప్‌లకూ సానుకూలతలు
- విశ్లేషకుల అంచనాలు
- 2న గాంధీజయంతి సెలవు.. నాలుగు రోజులే ట్రేడింగ్

ఈ వారం స్టాక్ మార్కెట్ సూచీల ధోరణి బులిష్‌గానే కనిపించొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. సూచీలు జీవనకాల గరిష్ఠాలకు చేరిన నేపథ్యంలో, మదుపర్లు కొంతమేర లాభాలు స్వీకరిస్తారనీ అంటున్నారు. విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐలు) ఆశావహంగా ఉండడం కలిసొచ్చే అంశమని పేర్కొంటున్నారు. స్వల్పకాలానికి నిఫ్టీ-50కి 26,000-25,980 వద్ద మద్దతు, 26,250-26300 వద్ద నిరోధం కనిపించొచ్చన్నది సాంకేతిక నిపుణుల అంచనా. దేశీయంగా కార్పొరేట్ సంస్థల ఫలితాలు, ఆర్‌బీఐ పరపతి విధాన సమీక్ష నిర్ణయాల కోసం ఎదురు చూడొచ్చని చెబుతున్నారు. నెలవారీ వాహన విక్రయ గణాంకాలనూ గమనించాలి. అక్టోబరు 2న గాంధీజయంతి సెలవు కావడంతో, ఈవారం 4 రోజులే ట్రేడింగ్ జరగనుంది. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..

వాహన	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అశోక్ లేలాండ్	239.55	244.60	235.70
బజాజ్ ఆటో	12666.40	12886.40	12441.60
ఐషర్ మోటార్స్	5062.60	5192.00	4888.70
హీరో మోటోకార్ప్	5957.35	6144.50	5846.90
ఎం అండ్ ఎం	3183.65	3255.70	3116.60
మారుతీ	13495.60	13704.40	13170.00
టాటా మోటార్స్	993.00	1005.40	982.90
టీవీఎస్ మోటార్	2949.70	3014.50	2836.80

ఎఫ్ఎమ్‌సీజీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అదానీ విల్మర్	344.05	354.70	337.80
బ్రిటానియా ఇండస్ట్రీస్	6268.80	6413.00	6108.70
కోల్గేట్ పామోలివ్	3764.05	3929.90	3586.20
డాబర్ ఇండియా	633.00	642.70	617.10
ఇమామీ	751.65	768.80	731.40
హిందుస్థాన్ యునిలీవర్	2966.25	3060.30	2905.80
ఐటీసీ	522.70	532.10	515.60
మారికో	692.45	723.50	672.50

యంత్రపరికరాలు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భెల్	287.55	295.20	279.40
సీజీ పవర్	761.75	780.80	747.50
ఎల్ అండ్ టీ	3705.65	3785.20	3611.20
సీమెన్స్	7295.20	7507.10	6929.10
థెర్మాక్స్	5200.70	5427.10	5038.10

ఔషధ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అరబిందో ఫార్మా	1511.35	1538.50	1476.10
బయోకాన్	368.85	382.70	361.00
సిప్లా	1672.50	1709.60	1611.50
డాక్టర్ రెడ్డీస్	6749.90	6835.50	6623.70
గ్లెన్‌మార్క్ ఫార్మా	1685.70	1720.60	1653.60
లుపిన్	2218.50	2266.30	2139.80

టెలికాం	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
టెలికాం			
భారతీ ఎయిర్‌టెల్	1,734.60	1781.10	1699.20
ఎమ్‌టీఎన్ఎల్	52.96	54.90	51.90
టాటా కమ్యూనికేషన్స్	2126.45	2186.10	2090.30
వొడాఫోన్ ఐడియా	10.66	11.20	10.20

లోహ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హిందాల్కో	747.15	764.60	733.40
హిందుస్థాన్ జింక్	523.05	530.50	512.80
ఎన్ఎమ్‌డీసీ	235.18	241.90	230.90
సెయిల్	140.54	146.00	136.90
టాటా స్టీల్	166.55	170.30	164.00
వేదాంతా	513.00	521.50	501.70

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	1752.65	1788.50	1732.10
ఐసీఐసీఐ బ్యాంక్	1306.60	1343.60	1285.30
ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్	74.19	75.40	73.20
ఇండస్‌ఇండ్ బ్యాంక్	1462.70	1492.90	1438.90
కోటక్‌మహీంద్రా బ్యాంక్	1872.45	1926.60	1839.20
పీఎన్‌బీ	109.22	111.00	106.40
ఎస్‌బీఐ	802.65	812.60	793.50

ఐటీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌సీఎల్ టెక్	1808.40	1843.20	1779.20
ఇన్ఫోసిస్	1906.75	1999.50	1856.90
పర్సిస్టెంట్ సిస్టమ్స్	5437.00	5643.20	5322.60
టీసీఎస్	4308.70	4406.90	4251.00
టెక్ మహీంద్రా	1609.25	1686.50	1566.00
విప్రో	541.80	565.30	528.90

చమురు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
రిలయన్స్ ఇండస్ట్రీస్	3052.35	3117.40	2951.50
బీపీసీఎల్	367.30	385.50	337.20
హెచ్‌పీసీఎల్	437.95	451.60	414.40
ఐఓసీఎల్	180.01	186.70	168.20
ఓఎన్‌జీసీ	297.20	303.90	286.40
ఆయిల్ ఇండియా	586.75	616.90	542.90

సిమెంటు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
ఏసీసీ	2483.30	2554.20	2404.50
అంబుజా సిమెంట్స్	634.00	644.50	617.90
ఇండియా సిమెంట్స్	359.20	366.10	354.90
శ్రీ సిమెంట్	26247.90	26854.20	25639.60
అల్ట్రాటెక్ సిమెంట్	11952.30	12218.30	11791.80

- 3 వారాలుగా రాణిస్తున్న **ఎఫ్ఎమ్‌సీజీ** షేర్లు ఈ వారం స్థిరీకరణకు గురికావొచ్చు. స్వల్పకాలానికి దిద్దుబాటు కావొచ్చు. సెప్టెంబరు త్రైమాసిక ఫలితాల వెల్లడి అనంతరం మళ్లీ రాణించొచ్చు.
- సూచీల్లో బలహీనతలకు అవకాశం ఉన్నందున, రక్షణాత్మకమైన **ఔషధ** షేర్లు మరింత రాణించొచ్చు. సన్‌ఫార్మాకు రూ.2,450 లక్ష్యంతో యూబీఎస్ 'కొనుగోలు' రేటింగ్ ఇచ్చినందున షేర్లు వెలుగులోకి రావొచ్చు.
- **టెలికాం** షేర్లలో భారతీ ఎయిర్‌టెల్, టాటా కమ్యూనికేషన్స్ లాభాలు కొనసాగించొచ్చు. వొడాఫోన్ ఐడియా షేర్లు ఒత్తిడి ఎదుర్కోవచ్చు. తదుపరి 12-18 నెలల్లో మరో దఫా టారిఫ్‌ల పెంపు ఉండొచ్చని అంచనా.
- **చమురు** రిఫైనింగ్ కంపెనీల షేర్లు ఇంకా పెరిగే అవకాశం ఉంది. 2024, 2025 ఏడాదులకు గిరాకీ అంచనాలను ఒపెక్ తగ్గించడం వల్ల, ముడి చమురు ధరల్లో బలహీనతలు ఏర్పడటం నేపథ్యం. బ్యారెల్ ముడిచమురు ధరను 100 డాలర్లుగా ఉంచాలన్న తన అనధికార లక్ష్యాన్ని పక్కన పెట్టడానికి ఒపెక్ సిద్ధపడుతోంది.
- **ఐటీ** కంపెనీల షేర్లు కొన్ని వారాల పాటు పరిమిత శ్రేణిలో కదలాడొచ్చు. జులై-సెప్టెంబరు ఆర్థిక ఫలితాల వెల్లడి అనంతరమే, వీటి దిశ స్పష్టమవుతుంది.
- **బ్యాంకు** షేర్లు వెలుగులోకి రావొచ్చు. బ్యాంక్ నిఫ్టీకి 54,000-54,500 వద్ద తక్షణ నిరోధం ఎదురుకావొచ్చు. స్వల్పకాలంలో కొంత లాభాల స్వీకరణ జరగొచ్చు. కానీ 53,350-53,400 సమీపాన్ని, తాజా కొనుగోళ్లకు అవకాశంగా భావించాలి.
- ఎంపిక చేసిన **యంత్రపరికరాల** షేర్లు రాణించే అవకాశం ఉంది. మంచి ఆర్డర్ల వల్ల మార్జిన్లు రాణిస్తాయన్న అంచనాలు ఉన్నాయి. సెప్టెంబరు త్రైమాసిక ఫలితాలు బలంగా నమోదవుతున్నాయన్న భావనల మధ్య 'బులిష్'గా కనిపించొచ్చు.
- **సిమెంటు** కంపెనీల ఫలితాలు స్తబ్దుగా ఉండొచ్చన్న అంచనాల మధ్య చాలా వరకు ఈ రంగ షేర్లు బలహీనంగా చలించొచ్చు.
- **వాహన** కంపెనీల షేర్లు సానుకూలంగా కదలాడొచ్చు. ప్రస్తుత పండుగల సీజనులో విక్రయాలు బాగుంటాయనే మదుపర్లు భావిస్తున్నారు. ఆర్‌బీఐ రేట్ల కోత అంచనాలూ కలిసిరావొచ్చు. నిఫ్టీ ఆటోకు 27,800 వద్ద నిరోధం, 27,000 వద్ద మద్దతు కనిపించొచ్చు.
- **లోహ** కంపెనీల షేర్లు లాభాలను కొనసాగించొచ్చు. చైనా తన ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడానికి కొన్ని చర్యలు ప్రకటించాక, అంతర్జాతీయ గిరాకీ పుంజుకోవచ్చన్న ఆశలు ఏర్పడ్డాయి.

నకిలీలను కంపెనీలతో ముడిపెట్టొద్దు: ఐపీఏ

దిల్లీ: ప్రఖ్యాత ఔషధ కంపెనీల ఉత్పత్తుల పేరిట నకిలీలు విక్రయమవుతున్న నేపథ్యంలో.. పూర్తి కల్తీ (స్పూరియస్), తక్కువ నాణ్యత కలిగిన ఔషధాల మధ్య స్పష్టమైన విభజన ఉండాలని ఔషధ పరిశ్రమ సంఘం ఇండియన్ ఫార్మాస్యూటికల్ అలయన్స్ (ఐపీఏ) విజ్ఞప్తి చేసింది. ప్రఖ్యాత కంపెనీల ఉత్పత్తుల పేరిట నకిలీ ఔషధాలను తయారు చేసి విక్రయిస్తున్నారని, ఈ క్రమంలో సంస్థల ప్రతిష్ఠ దెబ్బతింటోందని.. దీని వల్ల ఆర్థికపరమైన ప్రతికూల ప్రభావం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. 50కు పైగా ఔషధాలు 'సరైన నాణ్యత'లో లేవని పేర్కొంటూ సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీఓ) నివేదిక వెలువరించడంతో ఐపీఏ ఈ వ్యాఖ్యలు చేసింది. నకిలీ ఔషధాలుగా సీడీఎస్‌సీఓ చెబుతున్న ఔషధాలను తాము తయారుచేయలేదని సన్‌ఫార్మా, టొరెంట్ ఫార్మా, ఆల్కెమ్, గ్లెన్‌మార్క్ సహా పలు ఔషధ సంస్థలు స్పష్టం చేశాయి. తమ ఔషధాలు ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయని పేర్కొన్నాయి. 'నకిలీ ఔషధాలను తయారుచేయడం చట్టరీత్యా నేరం. అయితే ఇటువంటి ఉత్పత్తులను చట్టబద్ధ తయారీ సంస్థలకు అంటకట్టడం మంచిది కాదు. అంతర్జాతీయంగా ఔషధాలకు నమ్మకమైన సరఫరాదారుగా ఉన్న భారత గుర్తింపుపై ప్రతికూల ప్రభావం చూపుతుంది' అని ఐపీఏ సెక్రటరీ జనరల్ సుదర్శన్ జైన్ తెలిపారు. నకిలీ ఔషధాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, వ్యవస్థల బలోపేతానికి ప్రభుత్వంతో కలిసి పనిచేయడం ఐపీఏ కొనసాగిస్తుందని వెల్లడించారు.

ఏఐ ప్రతిభలో మనం ముందున్నాం!

నాస్కామ్ ఛైర్‌పర్సన్ సింధు గంగాధరన్

దిల్లీ: కృత్రిమమేధ (ఏఐ) ప్రతిభతో పాటు విభిన్న రంగాలకు అవసరమైన డొమైన్ నైపుణ్యాలలో మన దేశం అగ్రగామిగా ఉందని నాస్కామ్ కొత్త ఛైర్‌పర్సన్, ఎస్ఏపీ ల్యాబ్స్ ఇండియా ఎండీ సింధు గంగాధరన్ వెల్లడించారు. ఏఐతో ఉద్యోగాలు పోతాయనే ఆందోళనలు అవసరం లేదని, కొత్త తరం సాంకేతికతలు వచ్చినప్పుడల్లా ఉద్యోగావకాశాలు పెరుగుతూనే ఉన్నాయని తెలిపారు. కంపెనీలు తమ ఉద్యోగుల మానసిక, శారీరక శ్రేయస్సుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె సూచించారు. కంపెనీలు ఇందుకు తగిన విధానాలు రూపొందించుకుని, అవి అమలయ్యేలా చూడాలని సూచించారు.

భారత్.. జీసీసీ రాజధాని

మన దేశాన్ని గ్లోబల్ క్యాపబులిటీ సెంటర్ల (జీసీసీ)కు రాజధానిగా ఆమె అభివర్ణించారు. 254 బిలియన్ డాలర్ల (సుమారు రూ.21 లక్షల కోట్ల) విలువైన మన ఐటీ రంగంపై బులిష్ ధోరణితో ఉన్నానని తెలిపారు. ప్రస్తుతం మన దేశంలో సుమారు 1,200 జీసీసీలు ఉన్నాయని, ఇవి 2,200కు పైగా పెరిగే అవకాశం ఉండటంతో ప్రతిభావంతులకు ఉద్యోగాలకు కొదవ ఉండదని పేర్కొన్నారు. ప్రపంచంలోని ఏఐ ప్రతిభావంతుల్లో మన దేశం నుంచే సుమారు

ఈనాడు సినిమా

సింగపూర్ మ్యూజియంలో
రామ్‌చరణ్ మైనపు విగ్రహం

రామ్ చరణ్

ప్రఖ్యాత మేడమ్ టుస్సాడ్స్ సంస్థ సింగపూర్ మ్యూజియంలో రామ్‌చరణ్ మైనపు విగ్రహాన్ని ఏర్పాటు చేయనుంది. టుస్సాడ్స్ బృందం ఐఫా వేడుకల్లో ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ ఓ వీడియోని విడుదల చేసింది. రామ్‌చరణ్, ఆయన పెంపుడు కుక్క రైమ్ కలిసున్న విగ్రహాన్ని మ్యూజియంలో ఏర్పాటు చేయనున్నారు. అందుకోసం ఇప్పటికే కొలతల్ని తీసుకోవడంతోపాటు, ఫొటో షూట్‌ని పూర్తి చేశారు. టుస్సాడ్స్ కుటుంబంలో భాగం కావడం గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు రామ్‌చరణ్. టుస్సాడ్స్ మ్యూజియంలో ఇప్పటికే తెలుగు తారలు ప్రభాస్, మహేశ్‌బాబు, అల్లు అర్జున్‌ల మైనపు విగ్రహాల్ని ఏర్పాటు చేశారు. ఆ జాబితాలో త్వరలోనే రామ్ చరణ్ చేరనున్నారు. 'ఆర్.ఆర్.ఆర్'తో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఆయన.. త్వరలోనే 'గేమ్ ఛేంజర్' సినిమాతో సందడి చేయనున్నారు.

డిసెంబరు నుంచి బరిలోకి

మోక్షజ్ఞ

నందమూరి బాలకృష్ణ నట వారసుడు మోక్షజ్ఞ మొదటి చిత్రం ఇప్పటికే ఖరారైంది. ప్రశాంత్ వర్మ తెరకెక్కించనున్న ఈ సినిమాని బాలయ్య చిన్న కుమార్తె తేజస్విని, సుధాకర్ చెరుకూరి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇది దసరా సందర్భంగా లాంఛనంగా మొదలు కానున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలోనే దీని చిత్రీకరణ విషయమై ఐఫా అవార్డ్స్ వేడుకలో బాలకృష్ణ స్పందించారు. తన తనయుడు మోక్షు తొలి చిత్రాన్ని డిసెంబరులో ప్రారంభిస్తున్నట్లు స్పష్టత ఇచ్చారు. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా రూపొందుతోన్న చిత్రమిది. ఆధ్యాత్మిక అంశాలతో ముడిపడి ఉన్న సోషియో ఫాంటసీ అడ్వెంచరస్ థ్రిల్లర్‌గా దీన్ని ముస్తాబు చేయనున్నారు. దాదాపు రూ.100కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనులు చకచకా సాగుతున్నాయి. త్వరలోనే ఇతర నటీనటులతో పాటు మరిన్ని వివరాలు వెల్లడించనున్నారు.

మణి రత్నం, ఏఆర్ రెహమాన్, షారుక్ ఖాన్

రాణీ ముఖర్జీ

ఉత్తమ నటీనటులు షారుక్, రాణీ ముఖర్జీ

అబుధాబి వేదికగా 'ఐఫా' అవార్డుల వేడుకలు అట్టహాసంగా జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా మొదటి రోజు దక్షిణాది పరిశ్రమకు చెందిన నటీనటులకు పురస్కారాల్ని అందించారు. రెండో రోజు బాలీవుడ్ సినీతారలు పాల్గొని ప్రత్యేక డ్యాన్సులతో సందడి చేశారు. ఈ వేడుకలో గతేడాది విడుదలైన 'జవాన్' చిత్రంలో తన నటనతో ప్రేక్షకుల్ని మెప్పించిన అగ్రకథానాయకుడు షారుక్ ఖాన్ ఉత్తమ నటుడిగా అవార్డును సొంతం చేసుకున్నారు. 'మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే'లో తన బిడ్డల కోసం నార్వే ప్రభుత్వంతో పోరాటం చేసే తల్లిగా కనిపించి సినీప్రియుల్ని కంటతడి పెట్టించింది బాలీవుడ్ కథానాయిక రాణీ ముఖర్జీ. ఇందులో తన నటనకు గానూ ఉత్తమ నటిగా పురస్కారాన్ని అందుకుందామె. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని 'ట్వెల్త్ ఫెయిల్'తో నిరూపించిన దర్శకుడు విధు వినోద్ చోప్రా.. ఉత్తమ దర్శకుడిగా, సందీప్ రెడ్డి వంగా రూపొందించిన 'యానిమల్' ఉత్తమ చిత్రంగా నిలిచింది. మణిరత్నం, ఏఆర్ రెహమాన్, విక్కీ కౌశల్, కరణ్ జోహర్, కృతి సనన్, అనిల్ కపూర్ తదితర సినీప్రముఖులు ఈ వేడుకలో పాల్గొన్నారు.

మంజు వారియర్

దళపతి 69లో మంజు వారియర్..?

వేట్టయన్‌లోని ఇటీవలే విడుదలైన 'మనసిలాయో' అనే పాటతో అగ్రకథానాయకుడు రజనీకాంత్‌తో కలిసి స్టెప్పులేస్తూ.. కుర్రకారుని ఉర్రూతలూగిస్తోంది నాయిక మంజు వారియర్. ఇప్పుడామె మరో కొత్త ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపినట్లు తెలుస్తోంది. ఇటీవల తమిళ అగ్ర కథానాయకుడు విజయ్ తన ఆఖరి చిత్రాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. 'దళపతి 69'గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని హెచ్. వినోద్ తెరకెక్కిస్తున్నారు. ఇప్పుడీ చిత్రంలో మంజు వారియర్ ఓ కీలక పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది. త్వరలో దీనిపై అధికారిక ప్రకటన రానున్నట్లు సమాచారం. కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని రాజకీయాల నేపథ్యంలో తీర్చిదిద్దుతున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి.

'రహస్యం ఇదం జగత్'

రహస్యాల జగత్

రాకేశ్ గలేబి, స్రవంతి పత్తిపాటి, మానస వీణ, భార్గవ్ గోపీనాథం ప్రధాన పాత్రల్లో ఆర్.భరద్వాజ్ తెరకెక్కించిన చిత్రం 'రహస్యం ఇదం జగత్'. పద్మ రావినూతుల, హిరణ్య రావినూతుల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా నవంబరు 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్ర టీజర్‌ను అమెరికాలోని డల్లాస్‌లో ఇటీవల విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు భరద్వాజ్ మాట్లాడుతూ.. "మన పురాణాలు, ఇతిహాసాల్లోని ఓ ఆసక్తికర అంశాన్ని తీసుకుని.. దానికి సైన్స్ ఫిక్షన్ అంశాల్ని జోడించి ఈ చిత్రం రూపొందించాం. తప్పకుండా ఇది ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరుస్తుంది. ఓ సరికొత్త అనుభూతిని అందిస్తుంది" అన్నారు. ఈ సినిమాకి సంగీతం: గ్యాని, ఛాయాగ్రహణం: టేలర్ బ్లూమెల్.

యుద్ధ విద్యలో విజయ్!

విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ ప్రస్తుతం గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఓ స్పై థ్రిల్లర్ చేస్తున్నారు. ఇదిప్పుడు ముగింపు దశలో ఉంది. ఈ సినిమా పూర్తయిన వెంటనే దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించనున్నారు విజయ్. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించనున్న ఈ పీరియాడిక్ యాక్షన్ సినిమా నవంబరు నుంచి చిత్రీకరణ ప్రారంభించుకోనుంది. ఈ నేపథ్యంలోనే ఇప్పుడీ సినిమా చిత్రీకరణ కోసం ప్రత్యేకంగా సన్నద్ధమవుతున్నారు విజయ్. కథ రీత్యా ఇందులో ఆయన యోధుడిగా కనిపించనున్న సంగతి తెలిసిందే. దీంట్లో యుద్ధ నేపథ్య సన్నివేశాలకు ప్రాధాన్యమున్నట్లు తెలిసింది. అందుకే ఈ పాత్ర కోసం విజయ్ గుర్రపు స్వారీలో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారని సమాచారం. అంతేకాదు త్వరలో ఓ యుద్ధ విద్యలోనూ శిక్షణ తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఇది 18వ శతాబ్దంతో పాటు వర్తమాన కాలంతో ముడిపడి ఉన్న కథగా సాగనుందని.. దీనికి తగ్గట్లుగా విజయ్ ఇందులో రెండు కోణాల్లో సాగే పాత్రలో కనువిందు చేయనున్నట్లు ప్రచారం సాగుతోంది. అంతేకాదు ఆయన ఈ సినిమా కోసం తొలిసారి రాయలసీమ యాసలో సంభాషణలు పలకనున్నారు. ప్రస్తుతం ఈ చిత్ర పూర్వ నిర్మాణ పనులు చకచకా సాగుతున్నాయి.

జిగ్రా.. యాక్షన్ చిత్రమే కాదు!

అలియా భట్

"జిగ్రా' కేవలం యాక్షన్ చిత్రమే కాదు.. కుటుంబంలోని అనుబంధాల్ని తెలియజేసే సినిమా. మనం ఎంతగానో ప్రేమించే వ్యక్తుల్ని మనమెలా కాపాడుకోవాలో తెలియజెప్పే చిత్రమిది" అన్నారు నటుడు రానా దగ్గుబాటి. అలియా భట్, వేదాంగ్ రైనా ప్రధాన పాత్రల్లో వాసన్ బాలా తెరకెక్కించిన చిత్రమే 'జిగ్రా'. ధర్మ ప్రొడక్షన్స్, వయాకామ్ 18 స్టూడియోస్, ఎటర్నల్ సైన్ ప్రొడక్షన్స్ సంస్థలు నిర్మించాయి. ఇది అక్టోబరు 11న థియేటర్లలోకి రానుంది. కాగా ఈ సినిమాని తెలుగులో ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రానా దగ్గుబాటి విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలోనే హీరో రామ్‌చరణ్ ఆదివారం ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా రానా మాట్లాడుతూ.. "ఈ కథలో మంచి సోల్ ఉంది. భాషతో సంబంధం లేకుండా ఎవరికైనా ఇట్టే కనెక్ట్ అయిపోతుంది. అందుకే ఇలాంటి వైవిధ్యభరిత మైన చిత్రాన్ని మా సంస్థ ద్వారా తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం. యాక్షన్, ఫ్యామిలీ ఎమోషన్స్ మేళవింపుతో రూపొందిన చిత్రమిది. కచ్చితంగా ప్రేక్షకులకు అద్భుతమైన అనుభవాన్ని అందిస్తుంది" అన్నారు. ఇక ట్రైలర్ విషయానికొస్తే.. విదేశంలో అన్యాయంగా ఓ కేసులో అరెస్టై మరణశిక్ష పడిన తన సోదరుణ్ని కాపాడుకోవడం కోసం ఓ అక్క ఏం చేసిందన్నది ఆసక్తికరంగా చూపించారు. యాక్షన్ కోణంలో సాగే ఆ అక్క పాత్రను సినిమాలో అలియా పోషించింది. "నేను గొప్ప వ్యక్తినని ఎప్పుడూ అనలేదు. నేను కేవలం అంకుర్‌కు అక్కను' ' అంటూ ట్రైలర్ ఆఖర్లో అలియా చెప్పిన డైలాగ్ ఆకర్షణగా నిలిచింది.

ఆలోచన రేకెత్తించేలా..

గరిమా సింగ్, నోయెల్, రిషిత

నోయెల్, రిషిత నెల్లూరు జంటగా నటించిన చిత్రం 'బహిర్భూమి'. గరిమా సింగ్ మరో కథానాయిక. రాంప్రసాద్ కొండూరు దర్శకత్వం వహిస్తున్నారు. మచ్చ వేణుమాధవ్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం అక్టోబరు 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం హైదరాబాద్‌లో విడుదలకు ముందస్తు వేడుకని నిర్వహించింది. దర్శకుడు బాబ్జీతోపాటు, పలువురు సినీ ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దర్శకుడు మాట్లాడుతూ 'రాజుల కాలం నుంచి బహిర్భూమి కోసం ఊర్లలోనూ, ఊళ్ల మధ్య గొడవలు జరిగేవి. ఈ సినిమాకి ఈ పేరు ఎందుకు పెట్టామన్నది తెరపైనే చూడాలి. ఆలోచన రేకెత్తిస్తూనే, వినోదాన్ని పంచే చిత్రమిద"న్నారు. ఈ కార్యక్రమంలో నటులు చిత్రం శ్రీను, జబర్దస్త్ ఫణి, ఛాయాగ్రాహకుడు ప్రవీణ్, సంగీత దర్శకుడు అజయ్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ చేరువయ్యే
మిస్టర్ ఇడియట్

మాధవ్, సిమ్రాన్ శర్మ

రవితేజ తమ్ముడు రఘు తనయుడు మాధవ్ హీరోగా గౌరీ రోణంకి తెరకెక్కించిన చిత్రం 'మిస్టర్ ఇడియట్'. యలమంచి రాజి సమర్పణలో జె.జె.ఆర్.రవిచంద్ నిర్మించారు. సిమ్రాన్ శర్మ కథానాయిక. ఈ సినిమా త్వరలో థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం హైదరాబాద్‌లో ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. దర్శకుడు ప్రశాంత్ వర్మ, నిర్మాత బెక్కెం వేణుగోపాల్ తదితరులు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ.. "ఈ చిత్ర టైటిల్ వినగానే నాకు 'ఇడియట్' రోజులు గుర్తొచ్చాయి. ఆ సినిమాలో హీరోయిజం కొత్త ట్రెండ్ క్రియేట్ చేసింది. మాధవ్ సినిమాకి 'మిస్టర్ ఇడియట్' అని పేరు పెట్టడం బాగుంది. అతను సినిమాలో చాలా ఎనర్జిటిక్‌గా నటించాడు. తను రవితేజ స్థాయికి చేరుకోవాలని కోరుకుంటున్నా. నవంబరులో విడుదలవుతున్న ఈ చిత్రాన్ని అందరూ చూడండి" అన్నారు. "ప్రేక్షకులకు బాగా చేరువయ్యే అంశాలతో ఈ చిత్రాన్ని రూపొందించాం. అభిమానులు మా ప్రయత్నాన్ని ఆశీర్వదిస్తారని కోరుకుంటున్నా" అన్నారు దర్శకురాలు గౌరీ రోణంకి. హీరో మాధవ్ మాట్లాడుతూ.. "ట్రైలర్ అందరికీ నచ్చిందనుకుంటున్నా. మా డైరెక్టర్ నాకు మంచి సినిమా ఇచ్చారు. అందరూ ఆదరిస్తారని నమ్ముతున్నా" అన్నారు. ఈ కార్యక్రమంలో సిమ్రాన్, రవిచంద్, అనూప్ రూబెన్స్ తదితరులు పాల్గొన్నారు.

నటుల ఆరోగ్య సంరక్షణే 'మా' ప్రాధాన్యం

శివ బాలాజీ, మంచు విష్ణు, డా.శాస్త్రి, మాదాల రవి

మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (మా)లో ఉన్న ప్రతి ఒక్కరి ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ.. మేం ప్రతి ఆరు నెలలకోసారి హెల్త్ క్యాంప్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు. ఆదివారం హైదరాబాద్‌లోని జీవీకే హెల్త్ హబ్‌లో 'మా' సభ్యుల కోసం ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో 400 మందికి పైగా నటీనటులకు ఆరోగ్య పరీక్షల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మంచు విష్ణు మాట్లాడారు. "మా' నుంచి ఆరోగ్య కార్డులు పొందిన ప్రతి ఒక్కరికీ రూ.3 లక్షలు విలువ చేసే ఉచిత వైద్యం అందుతోంది. కొన్ని ఆస్పత్రులు యాభై శాతం రాయితీతో చికిత్సని అందించేలా ఏర్పాటు చేశాం. ఎప్పటికప్పుడు ఉచిత ఆరోగ్య శిబిరాల్ని ఏర్పాటు చేస్తున్నాం. రూ.వేల ఖర్చుతో కూడిన పరీక్షల్ని ఉచితంగా చేయడానికి ముందుకొచ్చిన జీవీకే హెల్త్ హబ్‌కు కృతజ్ఞతలు" అన్నారు. ఈ కార్యక్రమంలో 'మా' ప్రతినిధులు మాదాల రవి, శివ బాలాజీ, కరాటే కల్యాణి, జీవీకే హెల్త్ హబ్ డైరెక్టర్ డా.శాస్త్రి, హెల్త్ హబ్ సీఈఓ సుమన్ రాజు, కో ఆర్డినేటర్ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి మహత్మ్యం దేశమంతా తెలియాలనే..

'కన్నప్ప' సినిమాకి సంబంధించి ఓ భారీ వేడుకని శ్రీకాళహస్తిలో నిర్వహిస్తున్నామని, ఆ వేడుకకి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని ఆహ్వానించినట్టు తెలిపారు మంచు విష్ణు. విలేకర్లతో ఆయన మాట్లాడుతూ "భారీ బడ్జెట్ పెట్టి ఈశ్వరుడిపై 'కన్నప్ప' సినిమా తీస్తున్నాం. భారతదేశమంతా మన కాళహస్తి మహత్మ్యం గురించి తెలియాలనే ఉద్దేశంతో చేస్తున్న సినిమా ఇది. తెలుగువాళ్ల ఘనకీర్తిని చాటాలనే ఉద్దేశం దీని వెనక ఉంది" అన్నారు. మంచు విష్ణు ప్రధాన పాత్ర ధారిగా 'కన్నప్ప' రూపొందుతున్న సంగతి తెలిసిందే.

'ట్వెల్త్ ఫెయిల్'కు ప్రీక్వెల్

'ట్వెల్త్ ఫెయిల్'.. ఎన్నో అవమానాలను ఎదుర్కొంటూ పట్టుదలతో చదివి ఐపీఎస్‌గా ఎదగాలనే తన లక్ష్యాన్ని నెరవేర్చుకున్న మనోజ్ శర్మ జీవితం ఆధారంగా రూపొందిన చిత్రమిది. విధు వినోద్ చోప్రా తెరకెక్కించిన ఈ సినిమా ఇప్పటికే పలు చిత్రోత్సవాల్లో ప్రదర్శితమై సత్తా చాటింది. బాలీవుడ్ కథానాయకుడు విక్రాంత్ మాస్సే. ఇందులో తన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకున్నాడు. ఎంతో మంది ప్రేక్షకుల హృదయాలను హత్తుకున్న ఈ సినిమాకు ఇప్పుడు ప్రీక్వెల్‌ను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు దర్శకుడు విధు వినోద్ చోప్రా. తాజాగా 'ఐఫా' వేడుకల్లో పాల్గొన్న ఆయన.. ఈ ప్రీక్వెల్‌కు 'జీరో నేషురువాత్' అనే పేరును ఖరారు చేసినట్లు ప్రకటించారు. తొలిభాగంలోని నటీనటులే ఇందులోనూ ఉంటారని, డిసెంబరు 12న దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు తెలిపారు. త్వరలో పూర్తి వివరాల్ని అధికారికంగా ప్రకటించనున్నట్లు వెల్లడించారు.

అనన్య పాండే

మరి కొద్ది రోజుల్లో 'కంట్రోల్' అనే సినిమాతో తెరపై సందడి చేయడానికి ముస్తాబవుతోంది బాలీవుడ్ నాయిక అనన్యపాండే. విక్రమాదిత్య మోత్వానే తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో ఏఐ మాయలో పడ్డ అవస్థి అనే పాత్రలో కనిపించనుంది. అవకాశం వచ్చినప్పుడు అతిథి పాత్రల్లో తళుక్కున మెరుస్తూ ప్రేక్షకుల్ని అలరిస్తున్న అనన్య.. ప్రత్యేక పాటల్లో ఆడిపాడడం గురించి తన అభిప్రాయం పంచుకుంది.

ప్రత్యేక గీతాలకు నియమాలున్నాయ్!

"నా ఐదేళ్ల నటనా జీవితంలో.. ఇప్పటి వరకు నాకు ఈ ప్రత్యేక పాటల్లో నటించే అవకాశం రాలేదు. కానీ ఒక వేళ వస్తే.. ఆ పాట ప్రత్యేకతను, అందులోని డ్యాన్స్‌ను బట్టి నేను నిర్ణయం తీసుకుంటాను. ప్రత్యేక గీతాల్లో నా వరకూ కొన్ని చేయవలసినవి.. మరి కొన్ని చేయకూడనివి ఉన్నాయి. ఆ పాటలో ఆ అమ్మాయికి ప్రాధాన్యం ఉండి.. ఆ పాత్రను అందరూ గౌరవిస్తేనే ఈ గీతంలో ఆడిపాడటానికి అంగీకరిస్తాను. ఇలా నా నియమాలకు అనుగుణంగా ప్రత్యేక గీతాలు వస్తే కచ్చితంగా వాటిలో ఆడిపాడటానికి నేను సిద్ధమే" అని చెప్పుకొచ్చింది.

(c) eenadu

మీరూ చేరొచ్చు ఐఎస్‌బీలో!



ప్రపంచంలో అత్యుత్తమ మేనేజ్‌మెంట్ విద్యను అందిస్తోన్న సంస్థల జాబితాలో భారత్ నుంచి తప్పనిసరిగా కనిపించే పేరు ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ). ఫైనాన్షియల్ టైమ్స్, క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్, లింక్డ్‌ఇన్.. మొదలైనవి ఇటీవల ప్రకటించిన ప్రపంచ అత్యుత్తమ ఎంబీఏ సంస్థల జాబితాలో ఐఎస్‌బీ నిలిచింది. మేనేజ్‌మెంట్ విద్యలో ఆసక్తి ఉండి, కృషితో ప్రయత్నిస్తే మీరూ ఇందులో విద్యార్థి కావచ్చు. ర్యాంకుల్లో ముందు వరుసలో దూసుకుపోతోన్న ఐఎస్‌బీ ప్రత్యేకతలు, కోర్సులు, ప్రవేశ వివరాలు తెలుసుకుందామా!

మన దేశంలో మేటి మేనేజ్‌మెంట్ విద్యకు చిరునామా.. హైదరాబాద్‌లోని ఐఎస్‌బీ. తాజాగా లింక్డ్ ఇన్ ప్రకటించిన ప్రపంచ టాప్ ఎంబీఏ సంస్థల్లో ఆరో స్థానంలో నిలిచింది. క్యూఎస్ గ్లోబల్ ఎంబీఏ ర్యాంకుల్లో 86వ స్థానం పొందింది. ఫైనాన్షియల్ టైమ్స్ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ర్యాంకుల్లోనూ ప్రపంచంలో 26వ స్థానం పొందింది.

ఐఎస్‌బీ బోధన సిబ్బంది ప్రపంచంలో పేరున్న సంస్థల్లో కోర్సులు, పరిశోధనలు పూర్తిచేసుకుని, వివిధ రంగాలు, విభాగాల్లో సేవలు అందించిన వారే. పూర్వ విద్యార్థుల ప్రతిభాపాటవాలూ ఈ సంస్థ ర్యాంకుల్లో ముందు వరుసలో ఉండేలా చేస్తోంది. గవర్నింగ్ బోర్డు, ఎగ్జిక్యూటివ్ బోర్డుల్లో అపార అనుభవం ఉన్న వ్యాపార దిగ్గజ సంస్థల చైర్మన్/సీఈవోలు ఉన్నారు. వీరి దిశానిర్దేశంలో ఐఎస్‌బీ ప్రగతిపథంలో దూసుకుపోతోంది.

ఎన్నో కోర్సులు

భిన్న రంగాలు/విభాగాల అవసరాలకు సంబంధించి కోర్సులు అందించడం ఐఎస్‌బీ ప్రత్యేకత. స్వల్ప కాల వ్యవధితో ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాంలను మిడిల్, సీనియర్ మేనేజ్‌మెంట్ నిపుణుల కోసం ఈ సంస్థ అందిస్తోంది. సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లకు పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాంలు, వృత్తి నిపుణులకు పార్ట్ టైం పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాంలు, కుటుంబ వ్యాపారాలు నిర్వహిస్తోన్నవారి కోసం అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్, మేనేజ్‌మెంట్ ప్రోగ్రాంలు, పరిశోధనలో కొనసాగాలనుకునేవారికి ఫెలో ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్ (ఎఫ్‌పీఎం), పోస్ట్ డాక్టోరల్ రిసెర్చ్ ఫెలోషిప్ ప్రోగ్రాంలు, వృత్తి నిపుణులకు అడ్వాన్స్‌డ్ కోర్సులు, పలు స్వల్ప వ్యవధి తరగతులను ఈ సంస్థ అందిస్తోంది.

పీజీపీఎం

ఐఎస్‌బీ హైదరాబాద్, మొహాలీ క్యాంపస్‌ల్లో అందిస్తోన్న పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్ (పీజీపీఎం) విశ్వవ్యాప్త గుర్తింపు పొందింది. ఈ కోర్సు వ్యవధి ఏడాదే కావడం విశేషం. రెండు చోట్లా ఏటా సుమారు 800-1000 మందికి ఇందులో చేరే అవకాశం కల్పిస్తున్నారు. ఇక్కడి పీజీపీఎం కోర్సుకు ఏఏసీఎస్‌బీ, ఈక్యూయూఐఎస్ గుర్తింపు లభించింది. ప్రపంచవ్యాప్తంగా సుమారు వంద సంస్థలకు మాత్రమే ఈ తరహా గుర్తింపు ఉంది.

ప్రవేశం ఎలా?

పీజీపీ కోర్సులో మూడు విడతల్లో ప్రవేశాలుంటాయి. జీమ్యాట్ 700+ లేదా జీఆర్ఈ 320+ స్కోరు ఉంటే సీటు ఆశించవచ్చు. కోర్సులో ప్రవేశానికి ఈ స్కోర్లు మాత్రమే ప్రామాణికం కాదు. ఎన్నో ఇతర అంశాలనూ పరిశీలిస్తారు. అందువల్ల ఇంత కంటే కొంచెం తక్కువ స్కోరు ఉన్నా సీటు దక్కొచ్చు. ఈ కోర్సులో అవకాశం వస్తే సుమారు రూ.42 లక్షలు చెల్లించాలి. దీనికి జీఎస్‌టీ అదనం. మెరిట్ విద్యార్థులు, ఆర్థికంగా వెనుకబడినవారికి స్కాలర్‌షిప్పు అందుతుంది. మిగిలినవారికి రుణ సౌకర్యం కల్పిస్తారు. ప్రపంచ వ్యాప్తంగా పలు కార్పొరేట్ సంస్థలు ఆర్థిక అవసరాలు ఉన్న ఐఎస్‌బీ విద్యార్థులకు తోడ్పాటు అందిస్తున్నాయి. ఇక్కడి పీజీపీ కోర్సు పూర్తిచేసుకున్నవారు భారత్‌లో పనిచేసినట్లయితే సుమారుగా రూ.34 లక్షల వార్షిక వేతనం పొందుతున్నారు. విదేశాల్లో అవకాశం వచ్చినవారికి ఇంతకంటే పెద్ద మొత్తమే దక్కుతోంది. కొంత మంది రూ.కోటికి పైగా వేతనంతో ఉన్నతోద్యోగాలు సొంతం చేసుకుంటున్నారు. వీరిలో పలువురు అంకుర సంస్థల దిశగానూ అడుగులేస్తున్నారు.

అర్హత: డిగ్రీ పూర్తిచేసుకుని ఉండాలి. కనీసం రెండేళ్ల ఫుల్‌టైమ్ పని అనుభవం తప్పనిసరి. జీమ్యాట్ లేదా జీఆర్ఈ స్కోరు అవసరం. డిగ్రీని ఆంగ్ల మాధ్యమంలో చదవనివారైతే టోఫెల్/ ఐఈఎల్‌టీఎస్/ పీటీఈ స్కోరు కావాలి.

ఎంపిక: అకడమిక్ సామర్థ్యం పరిశీలిస్తారు. అంటే ప్లస్ 2, యూజీ, పీజీ (చదివినట్లయితే) సర్టిఫికెట్ కోర్సులు (ఏవైనా చేసుంటే) వీటిలో ప్రతిభను గమనిస్తారు. జీమ్యాట్ / జీఆర్ఈ స్కోరు చూస్తారు. పనిలో ప్రతిభ, సామర్థ్యాలకు కొన్ని క్రెడిట్స్ ఉంటాయి. కెరియర్ ప్రగతి, నాయకత్వ లక్షణాలకు కొన్ని పాయింట్లు కేటాయిస్తారు. ఆల్ రౌండ్ నైపుణ్యాలు, ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీ, సామాజిక సేవ, ప్రత్యేకతలు, డైవర్సిటీ, పని అనుభవం ... వీటన్నింటికీ కొన్ని క్రెడిట్లు ఇస్తారు.

దరఖాస్తులు: మూడు విడతల్లో.. సెప్టెంబరు, డిసెంబరు, జనవరిలో దరఖాస్తులు స్వీకరిస్తారు. వీలును బట్టి ఎప్పుడైనా వివరాలు నమోదు చేసుకోవచ్చు. ఆసక్తి ఉన్నవారు రౌండ్-2 డిసెంబరు 8లోగా లోగా దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి ట్యూషన్ ఫీజు మినహాయింపు ఆశించేవారు రౌండ్ 1 ప్రవేశాలకు దరఖాస్తు చేసుకుంటే మంచిది.

> **మేనేజ్‌మెంట్ విద్యలో మెరికల్లాంటి విద్యార్థులను సానబెట్టి ప్రపంచ సంస్థలకు అందించడం ఐఎస్‌బీ ప్రత్యేకత. ఇక్కడ కోర్సులు పూర్తిచేసుకున్నవారు ఆకర్షణీయ వేతనంతో, వ్యాపార ప్రపంచానికి దిశానిర్దేశం చేస్తూ.. విశ్వవ్యాప్తంగా ఉన్నత స్థాయిలో రాణిస్తున్నారు.**

యంగ్ లీడర్స్ (పీజీపీ వైఎల్)

తాజా గ్రాడ్యుయేట్లు, రెండేళ్ల లోపు పని అనుభవం ఉన్నవారికి యంగ్ లీడర్ ప్రోగ్రాం (పీజీపీ వైఎల్) అందుబాటులో ఉంది. తర్వాతి తరం నాయకులను తయారు చేసే లక్ష్యంతో దీన్ని 20 నెలల వ్యవధితో హైదరాబాద్ క్యాంపస్‌లో అందిస్తున్నారు. వీరి ఎంపిక 2 దశల్లో ఉంటుంది. మొదటి దశలో భాగంగా అకడమిక్ సమర్థత, అవార్డులు, అచీవ్‌మెంట్లు, ఎస్సే, టెస్టు (జీమ్యాట్/ జీఆర్ఈ/క్యాట్) స్కోరుతో అభ్యర్థులను వడపోస్తారు. స్టేజ్-2లో ఇంటర్వ్యూలు నిర్వహించి కోర్సులో తీసుకుంటారు. ఈ కోర్సుకు త్వరలో దరఖాస్తులు స్వీకరిస్తారు. వివరాల నమోదుకు డిసెంబరు వరకు అవకాశం ఉంది. డిగ్రీ ఇంగ్లిష్ మీడియంలో చదవనివారికి టోఫెల్/ఐఈఎల్‌టీఎస్ స్కోరు తప్పనిసరి. ఈ కోర్సు ఫీజు అన్నీ కలిపి సుమారు రూ.30 లక్షలు. స్కాలర్‌షిప్పు, రుణ సౌకర్యం ఉన్నాయి.

ఇతర కోర్సులు

పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్ ఫర్ వర్కింగ్ ప్రొఫెషనల్స్ (పీజీపీ ప్రో)
ఎవరికి: ఫ్యూచర్ లీడర్స్ కోసం. ఇది ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ సమాన స్థాయి కోర్సు. వారాంతాల్లో తరగతులు నిర్వహిస్తారు.
అర్హత: బ్యాచిలర్ డిగ్రీతోపాటు కనీసం ఐదేళ్ల పని అనుభవం
వ్యవధి: 18 నెలలు
శిక్షణ ప్రాంతాలు: హైదరాబాద్, దిల్లీ, ముంబయి, బెంగళూరు.

పీజీ ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్ ఫర్ సీనియర్ ఎగ్జిక్యూటివ్స్ (పీజీపీ మ్యాక్స్)
ఎవరి కోసం: పదేళ్ల కంటే ఎక్కువ వృత్తి నైపుణ్యం ఉన్నవారికి
కోర్సు వ్యవధి: 15 నెలలు
కేంద్రాలు: హైదరాబాద్, మొహాలీ

పీజీ ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్ ఫర్ ఫ్యామిలీ బిజినెస్ (పీజీపీ ఎంఫ్యాబ్)
ఎవరి కోసం: తర్వాత తరం ఫ్యామిలీ బిజినెస్ యజమానులకు.
అర్హత: కుటుంబ వ్యాపారంలో ఉండాలి. ఏదైనా డిగ్రీ పూర్తిచేయాలి. పని అనుభవం ఉంటే మంచిది. అయితే తప్పనిసరి కాదు.
వ్యవధి: 15 నెలలు
కేంద్రాలు: హైదరాబాద్, మొహాలీ.

అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్

బిజినెస్ అనలిటిక్స్, హెల్త్‌కేర్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఆపరేషన్స్ అండ్ సప్లై చెయిన్, పబ్లిక్ పాలసీ విభాగాల్లో ఈ సంస్థ అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాంలను అందిస్తోంది. వీటిని ఏడాది నుంచి 15 నెలల వ్యవధితో నడుపుతున్నారు. సంబంధిత విభాగాల్లో 2-5 ఏళ్ల అనుభవం ఉన్నవారు అర్హులు. వీటిని హైదరాబాద్, మొహాలీలో చదువుకోవచ్చు.

ఫెలో ప్రోగ్రాంలు

ఐదేళ్ల వ్యవధిలో ఫెలో ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్, పది నుంచి పదిహేనేళ్ల అనుభవం ఉన్నవారికి మూడేళ్ల ఎగ్జిక్యూటివ్ ఫెలో ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్ కోర్సులు ఉన్నాయి. అలాగే ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్‌లో భాగంగా ఈ సంస్థ పలు కోర్సులు అందిస్తోంది. వీటిలో వ్యాపార సంస్థల్లోనివారు, ప్రభుత్వ రంగ సంస్థలకు చెందినవారు చేరవచ్చు. ప్రత్యేక విభాగాల్లో ఆ వ్యాపారాలకు అనుగుణంగా స్వల్ప వ్యవధితో ముగిసే కోర్సులనూ ఐఎస్‌బీ అందిస్తోంది.

ఆంత్రప్రెన్యూర్ల కోసం ఐ-వెంచర్ ఇమర్సివ్ ప్రోగ్రాంను ఈ సంస్థ 6 నెలల వ్యవధితో హైదరాబాద్ క్యాంపస్‌లో అందిస్తోంది. దీనికి గ్రాడ్యుయేట్లు, వర్కింగ్ ప్రొఫెషన్లు, కుటుంబ వ్యాపారంలో ఉన్నవారు ఇలా ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపిక కోసం నిర్దేశిత వీడియోలు అప్‌లోడ్ చేయాలి. ఫీజు సుమారు రూ.6 లక్షలు. మీ ఆలోచనలు మెచ్చితే రూ.40 లక్షల వరకు ఫండింగ్, ఇతర సహకారం లభిస్తుంది.

వెబ్‌సైట్: https://www.isb.edu/en.html

ఐఐటీ మద్రాస్ ఆన్‌లైన్ కోర్సులు

ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థుల కోసం ఐఐటీ మద్రాస్ రెండు నూతన ఆన్‌లైన్ కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది. 4 నుంచి 8 వారాల వ్యవధి గల ఈ కోర్సులకు చెల్లించాల్సిన ఫీజు రూ.500 మాత్రమే.

ఈ కోర్సుల్లో చేరితే డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎలక్ట్రానిక్ సిస్టమ్స్ వంటి వాటి గురించి తెలుసుకోవచ్చు. టెక్ ఆధారితంగా నడవబోతున్న భవిష్యత్తు నైపుణ్య విపణిలో విజయవంతంగా అడుగు పెట్టేందుకు వీలుగా..

విద్యార్థులకు వీటిని పరిచయం చేయడం ఈ కోర్సుల ఉద్దేశం.

ఇందులో విద్యార్థులు చదువుతున్న సంస్థలు ముందుగా ఎన్‌రోల్ చేసుకుని ఉండాలి. అప్పుడే విద్యార్థులు నేరుగా ఇన్‌రోల్ చేసుకునే వీలుంటుంది. ఇరువురికీ ఇలా దరఖాస్తు చేసుకునేందుకు నిర్ణీత గడువు ఇచ్చారు.

విద్యార్థులు తాము చదువుతున్న సంస్థ ఐఐటీ మద్రాస్‌తో అనుబంధమై ఉందో నేరుగా ఆన్‌లైన్‌లో చూసుకునే వీలుంది.

- ఇందుకు మొదట అధికారిక వెబ్ సైట్‌కు వెళ్లాలి.
- హోమ్ పేజ్ వద్ద 'అవర్ పార్ట్‌నర్ స్కూల్స్' అనే చోట క్లిక్ చేయాలి.
- కంట్రోల్ ప్లస్ ఎఫ్.. ఉపయోగించి సంస్థ పేరు జాబితాలో ఉందో లేదో తెలుసుకోవచ్చు.

ఏ అర్హతలు?

- డేటా సైన్స్ అండ్ ఏఐ: ఇంటర్ మొదటి సంవత్సరంలో ఏ గ్రూప్ చదువుతున్న విద్యార్థులైనా దరఖాస్తు చేయవచ్చు.
- ఎలక్ట్రానిక్ సిస్టమ్స్: మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ చదువుతున్నవారు అర్హులు.

ఐఐటీ మద్రాస్ విద్యార్థులకు అనుకూలమైన షెడ్యూల్‌లో ఈ కోర్సులు నేర్చుకునేలా రూపొందించింది. ప్రతి వారం ఒక గంట పాటు రికార్డెడ్ వీడియోల తరగతులు 30 నిమిషాల సెగ్మెంట్లుగా ఉంటాయి. ప్రతి సోమవారం అప్‌లోడ్ చేస్తారు. నెలకోసారి వారాంతాల్లో ఇంటరాక్టివ్ క్లాసులు ఉంటాయి. ప్రతి రెండు వారాలకోసారి ఆన్‌లైన్ అసైన్‌మెంట్లు ఇస్తారు. వాటిని వచ్చే రెండు వారాల్లోపు పూర్తిచేయాలి.



ముఖ్యమైన తేదీలు

- **స్టూడెంట్ రిజిస్ట్రేషన్:** సెప్టెంబర్ 16, 2024 నుంచి అక్టోబరు 4, 2024.
- **పార్టనర్ స్కూల్ రిజిస్ట్రేషన్ గడువు:** సెప్టెంబర్ 30, 2024.
- **కోర్సుల ప్రారంభ తేదీ:** అక్టోబరు 21, 2024.

ఐటీ సంబంధిత అంశాల్లో ప్రాథమికంగా.. ఎక్కడ మొదలుపెట్టాలో తెలుసుకోవాలనుకునే విద్యార్థులకు ఇది సదవకాశం. అంతేకాక ఐఐటీ మద్రాస్ వంటి ప్రతిష్ఠాత్మకమైన సంస్థ నుంచి సర్టిఫికేషన్ తీసుకునే వీలుంటుంది. ఘనమైన అవకాశాలకు తలుపు తెరుచుకునే అవకాశం ఇది!

వెబ్‌సైట్: https://school-connect.study.iitm.ac.in/

ఇంగ్లిష్‌ను మీరెంత బాగా రాస్తున్నారు?

ఇంగ్లిష్‌లో అర్థవంతంగా రాయడాన్ని నేర్చుకోవడం చాలా కీలకం. ఒక చిన్న కామా తప్పిపోతే మాటల అర్థం పూర్తిగా మారిపోవచ్చు. ఈ విషయాన్ని సరదాగా, సులువుగా వివరించే పుస్తకం 'హేవ్ యు ఈటెన్ గ్రాండ్ మా?'. ఈ పుస్తకం విరామచిహ్నాల గురించి చెబుతూ ఇంగ్లిష్ గ్రామర్‌లోని ముఖ్యమైన విషయాలను గురించి పాఠకుడికి నేర్పిస్తుంది. ఈ పుస్తకాన్ని బ్రిటిష్ రచయిత, ప్రసారకర్త, రాజకీయవేత్త జైల్స్ బ్రాండ్రెత్ రాశారు.



ఆంగ్ల భాషలో మౌలికమైన గ్రామర్, పంక్చువేషన్ (విరామచిహ్నాలు) ప్రతి వాక్యానికీ సరైన అర్థం తీసుకొస్తాయి. ఉదాహరణకు 'హేవ్ యు ఈటెన్, గ్రాండ్ మా?' అంటూ కామాతో రాస్తే.. '(ఆహారం) తిన్నావా?' అంటూ బామ్మను అడిగినట్టు. దీన్నే కామా లేకుండా 'హేవ్ యు ఈటెన్ గ్రాండ్ మా?' అని రాశామనుకోండి.. 'నువ్వు బామ్మను తిన్నావా?' అనే విపరీతార్థం వచ్చేస్తుంది. ఇలాంటి సరదా ఉదాహరణల ద్వారా ఈ పుస్తకంలో గ్రామర్, పంక్చువేషన్ల ప్రాముఖ్యాన్ని తెలుపుతారు.

> **విరామచిహ్నాల్లో ఒకటైన కోలన్ ఎలా ఉంటుందో, దాని ప్రయోజనమేమిటో రచయిత సరదాగా ఇలా చెప్తారు-** "Look at the colon and think of it as a pair of binoculars placed vertically on the table. It is there to help you look ahead." **అలాగే** "may" .. "might" **లమధ్య తేడాలూ, అసాధారణ బహువచనాలు** ("lord lieutenants", "attorneys general") **రూపొందటం గురించి సులభంగా వివరిస్తారు.**

వ్యాకరణానికున్న శక్తి

పంక్చువేషన్ మాత్రమే కాదు, సరైన వాక్యనిర్మాణం కూడా ముఖ్యం. సరిగ్గా వ్యాకరణాన్ని ఉపయోగిస్తే వాక్యాలు స్పష్టంగా, అర్థవంతంగా ఉంటాయి. ఈ పుస్తకం వ్యాకరణాన్ని అర్థం చేసుకోవడాన్ని నేర్పి సరైన వాక్యాలు రాయడానికి మార్గదర్శకంగా ఉపయోగపడుతుంది.

స్పష్టత, కచ్చితత్వం

మంచి రాతపూర్వక సంభాషణ అంటే పదాలను మాత్రమే కాదు, వాటి అర్థాన్నీ, క్రమాన్నీ కూడా చూసుకోవాలి. ఈ పుస్తకంలో చెప్పిన విధంగా.. అర్థవంతంగా రాయడం అనేది దోష రహిత వ్యాకరణంపై, సరైన పదాల వాడుకపై ఆధారపడి ఉంటుంది. నేటి విద్యార్థులకు కావాల్సిన అత్యంత ముఖ్యమైన నైపుణ్యం వ్యాసరచన. కానీ ఇంగ్లిష్‌లో వాక్యంలో పదాలు క్రమం తప్పుతుంటే, రాసిన పదాల అర్థం పూర్తిగా మారిపోవచ్చు. అందుకే రాసే విధానంపై స్పష్టతను తెచ్చుకోవాలి.

సరదా, సరళత

ఈ పుస్తకానికి ఉన్న ప్రత్యేకత ఏమిటంటే- ఇంగ్లిష్ గ్రామర్ వంటి క్లిష్టమైన అంశాలను సరదాగా, సరళంగా వివరిస్తుంది. వ్యాకరణం చాలామంది విద్యార్థులకు కఠినంగా అనిపిస్తుంటుంది. కానీ ఈ పుస్తకంలోని సరదా ఉదాహరణలూ, కథలూ, అనుభవాలూ వెరసి ఇంగ్లిష్ గ్రామర్‌పై అభిరుచిని పెంచుతాయి. అర్థవంతంగా రాయడానికి విద్యార్థులకు మార్గనిర్దేశం చేసే పుస్తకమిది.

ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్, వ్యాసరచన, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను మెరుగుపరుచుకోవడానికి ఈ పుస్తకం అద్భుతమైన సహాయాన్ని అందిస్తుంది. ఇంగ్లిష్‌ను కేవలం పరీక్షల్లోనే కాదు, ఇతర సందర్భాల్లోనూ అర్థవంతంగా రాయాలని సూచిస్తుంది. విద్యార్థులు ఈ పుస్తకం ద్వారా ఇంగ్లిష్ వ్యాకరణంపై మంచి పట్టు సాధించవచ్చు.

– రహ్మాన్ & సంపత్

కొలువుకు అవరోధమేనా?

శ్రీవెంకటేశ్వరా యూనివర్సిటీ నుంచి దూరవిద్యలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ (2017) పూర్తిచేశాను. తెలంగాణ ప్రాంతానికి చెందినవాడిని. ఈ సర్టిఫికెట్‌తో తెలంగాణలో ప్రభుత్వోద్యోగం పొందడానికి అర్హత ఉంటుందా? – సీహెచ్.శంకర్

■ మీరు ఏ సబ్జెక్టులో పీజీ చేశారో చెప్పలేదు. శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ నుంచి నేరుగా చేశారా? ఒకవేళ స్టడీ సెంటర్ నుంచి చేస్తే అది ఏ రాష్ట్రంలో ఉందా? మీరు చదివిన పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో ల్యాబ్స్ ఉన్నాయా? ఉంటే ప్రాక్టికల్స్ ఆంధ్రప్రదేశ్‌లో చేశారా? తెలంగాణలో చేశారా? ఇలాంటి వివరాలుంటే మీ ప్రశ్నకు సమాధానం చెప్పడం సులువు అయ్యేది. యూజీసీ నిబంధనల ప్రకారం- ఒక రాష్ట్రానికి చెందిన యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రాలు, ఆ రాష్ట్ర భౌగోళిక సరిహద్దులోపలే ఉండాలి. ఉదాహరణకు శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ స్టడీ సెంటర్లు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉండాలి. తెలంగాణలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యూనివర్సిటీల స్టడీ సెంటర్ల నుంచి చదివిన డిగ్రీల చెల్లుబాటు విషయంలో సమస్య ఉంది. మీరు తెలంగాణ రాష్ట్రానికి సంబంధించినవారైనా పైన చెప్పిన నిబంధనలకు లోబడి శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ నుంచి డిగ్రీ పొందితే ఎలాంటి ఇబ్బందీ ఉండదు. అలా పొందిన సర్టిఫికెట్‌తో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగం పొందడానికి పూర్తి అర్హత ఉంటుంది. ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ సెంట్రల్ యూనివర్సిటీ కాబట్టి ఆ విశ్వవిద్యాలయ స్టడీ సెంటర్ల విషయంలో మాత్రం రాష్ట్రాల భౌగోళిక పరిధి నియమం వర్తించదు.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

తాజా ఇంటర్న్‌షిప్‌లు

వర్క్‌ఫ్రమ్‌హోమ్

ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్

సంస్థ: కోడింగ్ జూనియర్
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, ప్రొడక్ట్ లైఫ్‌సైకిల్ మేనేజ్‌మెంట్, ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.2,000
internshala.com/i/ce9e26

ఎర్న్‌వెల్‌లో

1. మార్కెటింగ్

నైపుణ్యాలు: డిజిటల్, ఈమెయిల్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్
స్టైపెండ్: రూ.5,000
internshala.com/i/11af43

2. ఫైనాన్స్

నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఫైనాన్షియల్ మోడలింగ్, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్
స్టైపెండ్: రూ.5,000
internshala.com/i/d3a229

3. రిసెర్చ్ అనలిస్ట్

నైపుణ్యాలు: డేటా అనాలిసిస్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, నెగోషియేషన్ అండ్ ప్రాబ్లమ్-సాల్వింగ్, రిపోర్ట్ రైటింగ్
స్టైపెండ్: రూ.5,000
internshala.com/i/0a15bb

టెక్ మెంటర్

సంస్థ: ట్యూట్‌మ్యాడ్
నైపుణ్యాలు: డేటా సైన్స్, జాంగో, జావా, మీన్/మెర్న్ స్టాక్, పైథాన్, రియాక్ట్‌జేఎస్
స్టైపెండ్: రూ.5,000
internshala.com/i/ef0d09

కార్పొరేట్ సేల్స్

సంస్థ: జస్ట్ మై సలాడ్
నైపుణ్యాలు: డిజిటల్, ఈమెయిల్, ఇంగ్లిష్ మాట్లాడటం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్
స్టైపెండ్: రూ.7,000-10,000
internshala.com/i/cb017b

కంటెంట్ రైటింగ్

సంస్థ: క్యానిబల్స్ మీడియా
నైపుణ్యాలు: క్రియేటివ్ రైటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం
స్టైపెండ్: రూ.3,000
internshala.com/i/e4104d

రిక్రూట్‌మెంట్

సంస్థ: బ్లూజీన్స్ రిసెర్చ్
నైపుణ్యాలు: బిజినెస్ రిసెర్చ్, ఎంఎస్-ఎక్సెల్, రిక్రూట్‌మెంట్
స్టైపెండ్: రూ.6,000
internshala.com/i/ef24e0

సేల్స్

సంస్థ: ఫ్రెజున్ ఇన్‌కార్పొరేషన్
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, మార్కెటింగ్, సేల్స్
స్టైపెండ్: రూ.12,000
internshala.com/i/bf8ad6

ఫిజిక్స్ మేటర్ ఎక్స్‌పర్ట్

సంస్థ: కుందుజ్ టెక్నాలజీస్
నైపుణ్యాలు: ఆన్‌లైన్ టీచింగ్, ఫిజిక్స్ టీచింగ్
స్టైపెండ్: రూ.5,000-6,000
internshala.com/i/9941f4

వీటికి దరఖాస్తు గడువు: అక్టోబరు 26

నోటీస్ బోర్డు

ఉద్యోగాలు

వాక్-ఇన్స్

హెవీ వెహికల్ ఫ్యాక్టరీలో టెక్నీషియన్లు

ఆర్మర్డ్ వెహికల్స్ నిగమ్ లిమిటెడ్‌కు చెందిన చెన్నై, ఆవడిలోని హెవీ వెహికిల్ ఫ్యాక్టరీ .. ఫిక్స్‌డ్ టర్మ్ ఒప్పంద ప్రాతిపదికన 6 డిజైన్ ఇంజినీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.
● సీనియర్ డిజైన్ ఇంజినీర్: 02 ● డిజైన్ ఇంజినీర్: 04
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంజినీరింగ్ డిగ్రీ (ఎలక్ట్రికల్/ మెకానికల్)తో పాటు పని అనుభవం.
వేతనం: నెలకు సీనియర్ డిజైన్ ఇంజినీర్ పోస్టులకు రూ.60,000; డిజైన్ ఇంజినీర్ పోస్టులకు రూ.50,000.
వయసు: 45 ఏళ్లు మించకూడదు.
దరఖాస్తు ఫీజు: రూ.300; ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూబీడీ / మహిళా అభ్యర్థులకు ఫీజు మినహాయింపు ఉంటుంది.
ఎంపిక: విద్యార్హతలు, పని అనుభవం, ఇంటర్వ్యూల ఆధారంగా.
దరఖాస్తు: ఆఫ్‌లైన్ దరఖాస్తులను 'ది చీఫ్ జనరల్ మేనేజర్, హెవీ వెహికల్స్ ఫ్యాక్టరీ, అవడి, చెన్నై' చిరునామాకు పంపాలి.
దరఖాస్తు గడువు: ప్రకటన వెలువడిన తేదీ (21-09-2024) నుంచి 21 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.
వెబ్‌సైట్: https://avnl.co.in/

ఔరంగాబాద్ కాటన్ కార్పొరేషన్‌లో ఫీల్డ్/ ఆఫీస్ స్టాఫ్

మహారాష్ట్ర, ఔరంగాబాద్‌లోని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్.. తాత్కాలిక ప్రాతిపదికన సిబ్బంది నియామకానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
1. ఫీల్డ్ స్టాఫ్ 2. ఆఫీస్ స్టాఫ్ (అకౌంట్స్)
3. ఆఫీస్ స్టాఫ్ (జనరల్)
అర్హత: పోస్టును అనుసరించి కనీసం 50 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ, బీకాం, బీఎస్సీ (అగ్రికల్చర్).
వయసు: 01.10.2024 నాటికి 35 సంవత్సరాలు మించకూడదు.
వేతనం: ఆఫీస్ స్టాఫ్‌కు నెలకు రూ.25,500. ఫీల్డ్ స్టాఫ్‌కు రూ.37,000.
ఇంటర్వ్యూ తేదీ: అక్టోబరు 12, 13.
వేదిక: ది కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, చంద్రమౌళి బిల్డింగ్, ప్లాట్ నెం.27, వీర్ సావర్కర్ చౌక్, సామ్రాట్‌నగర్, షాసూర్‌వాడి రోడ్, ఔరంగాబాద్.
వెబ్‌సైట్: https://cotcorp.org.in/

వరంగల్ కాటన్ కార్పొరేషన్‌లో

వరంగల్‌లోని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్.. తాత్కాలిక ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
1. ఫీల్డ్ అసిస్టెంట్
2. ఆఫీస్ అసిస్టెంట్ (జనరల్)
3. ఆఫీస్ అసిస్టెంట్ (అకౌంట్స్)
4. ఆఫీస్ స్టాఫ్ క్లర్క్ వర్క్ (గోడౌన్)
అర్హత: పోస్టును అనుసరించి కనీసం 50 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ, బీకాం, బీఎస్సీ (అగ్రికల్చర్)తో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం.
వయసు: 01.10.2024

ఈనాడు ప్రతిభ
e-mail: pratibhadesk@eenadu.net
19
సోమవారం సెప్టెంబరు 30, 2024 హైదరాబాద్



పూర్ణ సంఖ్యల సమితి ఏయే ధర్మాలను పాటిస్తుంది?

సంఖ్యల ధర్మాలు

$N = \{1, 2, 3, 4, 5, 6, ...\}$ = సహజ సంఖ్యల సమితి

$W = \{0, 1, 2, 3, 4, 5, 6, ...\}$ = పూర్ణాంకాల సమితి

$Z = \{.....-2, -1, 0, 1, 2, ...\}$ = పూర్ణ సంఖ్యల సమితి

$Q = \left\{\frac{p}{q}, q \neq 0, p, q \in Z\right\}$ = అకరణీయ సంఖ్యా సమితి

సంకలనం ప్రకారం సంఖ్యల ధర్మాలు

సంవృత ధర్మం: ఒక సమితి G లో a, b అనేవి రెండు సంఖ్యలై వాటి సంకలనం కూడా అదే సమితిలోని సంఖ్య అయితే ఆ సమితి సంకలనం ప్రకారం సంవృత ధర్మాన్ని పాటించింది అంటారు.

$\forall a, b \in G \Rightarrow a + b \in G$

ఉదా: $3, 4 \in N \Rightarrow 3 + 4 = 7 \in N$

నోట్: సహజ సంఖ్యా సమితి సంకలనం ప్రకారం సంవృత ధర్మాన్ని పాటిస్తుందని చెప్పవచ్చు.

సహచర ధర్మం: ఒక సమితి G లో a, b, c అనేవి మూడు సంఖ్యలు అయితే $a + (b + c) = (a + b) + c$ అయ్యేటట్లుగా ఉంటే ఆ సమితి సంకలనం ప్రకారం సహచర ధర్మాన్ని పాటిస్తుంది.

$\therefore a, b, c \in G \Rightarrow a + (b + c) = (a + b) + c$

ఉదా: $2, 3, 4 \in N \Rightarrow 2 + (3 + 4) = (2 + 3) + 4$

$2 + 7 = 5 + 4$

$9 = 9 \in N$

నోట్: సహజ సంఖ్యా సమితి సంకలనం ప్రకారం సహచర ధర్మాన్ని పాటిస్తుందని చెప్పవచ్చు.

తత్సమ ధర్మం: ఒక సమితి G లో a అనేది ఒక సంఖ్య అయి $a + 0 = 0 + a = a$ అయ్యే విధంగా '0' సమితి G లో ఉంటే ఆ సమితి సంకలనం ప్రకారం తత్సమ ధర్మాన్ని పాటిస్తుంది.

$\therefore a \in G, \ a + 0 = 0 + a = a$

ఇక్కడ '0' ను సంకలన తత్సమం అంటారు.

ఉదా: $2 \in W, 0 \in W$

$\Rightarrow 2 + 0 = 0 + 2 = 2$

విలోమ ధర్మం: ఒక సమితి G లో a అనేది ఒక సంఖ్య అయి $a + (-a) = (-a) + a = 0$ అయ్యే విధంగా $-a$ ఉంటే ఆ సమితి G సంకలనం ప్రకారం విలోమ ధర్మాన్ని పాటిస్తుంది.

$\therefore a \in G \Rightarrow a + (-a) = (-a) + a = 0$

ఇక్కడ $-a$ అనేది a సంకలన విలోమం అవుతుంది.

ఉదా: $2 \in Z \Rightarrow 2 + (-2) = (-2) + 2 = 0$

2 సంకలన విలోమం -2

నోట్: పూర్ణ సంఖ్యల సమితి సంకలనం ప్రకారం విలోమ ధర్మాన్ని పాటిస్తుందని చెప్పవచ్చు.

వినిమయ ధర్మం/ స్థిత్యంతర ధర్మం: ఒక సమితి G లో a, b అనేవి రెండు సంఖ్యలై $a + b = b + a$ అయ్యే విధంగా ఉంటే సంకలనం ప్రకారం ఆ సమితి వినిమయ ధర్మాన్ని పాటిస్తుంది.

$\forall a, b \in G \Rightarrow a + b = b + a$

ఉదా: $2, 3 \in N \Rightarrow 2 + 3 = 3 + 2 \Rightarrow 5 = 5$

గుణకారం ప్రకారం సంఖ్యల ధర్మాలు

సంవృత ధర్మం: ఒక సమితి G లో a, b అనేవి రెండు సంఖ్యలై $a \times b$ కూడా అదే సమితిలోని సంఖ్య అయితే G అనే సమితి గుణకారం ప్రకారం సంవృత ధర్మాన్ని పాటిస్తుంది.

$\forall a, b \in G \Rightarrow a \times b \in G$

ఉదా: $2, 3 \in N \Rightarrow 2 \times 3 = 6 \in N$

నోట్: సహజ సంఖ్యా సమితి గుణకారం ప్రకారం సంవృత ధర్మాన్ని పాటిస్తుంది అంటాం.

సహచర ధర్మం: ఒక సమితి G లో a, b, c అనేవి మూడు సంఖ్యలై $a \times (b \times c) = (a \times b) \times c$ అయితే ఆ సమితి గుణకారం ప్రకారం సంవృత ధర్మాన్ని పాటిస్తుంది.

$\forall a, b, c \in G \Rightarrow a \times (b \times c) = (a \times b) \times c$

ఉదా: $2, 3, 4 \in N \Rightarrow 2 \times (3 \times 4) = (2 \times 3) \times 4$

$2 \times 12 = 6 \times 4$

$24 = 24 \in N$

నోట్: సహజ సంఖ్యా సమితి గుణకారం ప్రకారం సహచర ధర్మాన్ని పాటిస్తుంది.

తత్సమ ధర్మం: ఒక సమితి G లో a అనేది ఒక సంఖ్య అయి $a \times 1 = 1 \times a = a$ అయ్యేటట్లుగా 1 ఉంటే ఆ సమితి G తత్సమ ధర్మాన్ని పాటిస్తుంది.

$\forall a \in G \Rightarrow a \times 1 = 1 \times a = a$

ఇక్కడ 1 అనేది గుణకార తత్సమ మూలకం.

ఉదా: $2 \in N \Rightarrow 2 \times 1 = 1 \times 2 = 2$

నోట్: సహజ సంఖ్యా సమితి (N) గుణకారం ప్రకారం తత్సమ ధర్మాన్ని పాటిస్తుందని చెప్పవచ్చు.

విలోమ ధర్మం: ఒక సమితి G లో a ఒక సంఖ్య అయి $a \times \frac{1}{a} = \frac{1}{a} \times a = 1$ అయ్యేటట్లుగా ఉంటే ఆ సమితి విలోమ ధర్మాన్ని పాటిస్తుంది.

$\forall a \in G \Rightarrow a \times \frac{1}{a} = \frac{1}{a} \times a = 1$

ఇక్కడ $\frac{1}{a}$ అనేది a కి గుణకార విలోమం అవుతుంది.

ఉదా: $2 \in Q \Rightarrow 2 \times \frac{1}{2} = \frac{1}{2} \times 2 = 1$

నోట్: అకరణీయ సంఖ్యా సమితి గుణకారం ప్రకారం విలోమ ధర్మాన్ని పాటిస్తుందని చెప్పవచ్చు

వినిమయ ధర్మం

ఒక సమితి G లో a, b అనేవి రెండు సంఖ్యలు అయి $a \times b = b \times a$ అయ్యేటట్లుగా ఉండే ఆ సమితి G గుణకారం ప్రకారం వినిమయ ధర్మాన్ని పాటిస్తుంది.

$\forall a, b \in G$

$a \times b = b \times a$

ఉదా: $2, 3 \in N \Rightarrow 2 \times 3 = 3 \times 2 \Rightarrow 6 = 6$

నోట్: సహజ సంఖ్య సమితి(N) గుణకారం ప్రకారం వినిమయ/ స్థిత్యంతర ధర్మాన్ని పాటిస్తుందని అంటారు.

విభాగ ధర్మాలు

ఒక సమితి G లో a, b, c లు మూడు సంఖ్యలై...

i) $a \times (b + c) = a \times b + a \times c$ (ఎడమ విభాగ ధర్మం)

ii) $(b + c) \times a = b \times a + c \times a$ (కుడి విభాగ ధర్మం)

అనే ధర్మాలను పాటిస్తే ఆ సమితి G గుణకార సంకలనం ప్రకారం విభాగ ధర్మాలను పాటిస్తుందని అంటారు.

ఉదా: $2, 3, 4 \in N$

$2 \times (3 + 4) = 2 \times 3 + 2 \times 4$

$(3 + 4) \times 2 = 3 \times 2 + 4 \times 2$

నోట్: సహజ సంఖ్య సమితి రెండు పరిక్రియల $(+, \times)$ ప్రకారం విభాగ ధర్మాలను పాటిస్తుందని చెప్పవచ్చు.

మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో సంకలన తత్సమాంశం ఎంత?

1) 0 2) 1 3) -1 4) ఏదీకాదు

సాధన: ఇచ్చిన ఐచ్ఛికాల్లో 0 అనేది సంకలన తత్సమాంశం అవుతుంది.

సమాధానం 1

2. కింది వాటిలో గుణకార తత్సమాంశం ఎంత?

1) 0 2) 1 3) 2 4) -1

సాధన: ఇచ్చిన ఐచ్ఛికాల్లో 1 అనేది గుణకార తత్సమాంశం అవుతుంది.

సమాధానం 2

3. కింది వాటిలో సహజ సంఖ్యా సమితి (N) సంకలనం ప్రకారం ఎన్ని ధర్మాలను (న్యాయాలు) పాటిస్తుంది?

1) సంవృత ధర్మం 2) వినిమయ ధర్మం

3) సహచర ధర్మం 4) పైవన్నీ

సాధన: సహజ సంఖ్యా సమితి సంకలనం ప్రకారం సంవృత, వినిమయ, సహచర ధర్మాలను పాటిస్తుంది.

సమాధానం 4

4. కింది వాటిలో సహజ సంఖ్యా సమితి గుణకారం ప్రకారం ఎన్ని న్యాయాలు పాటిస్తుంది.

1) సంవృత ధర్మం 2) తత్సమ, వినిమయ

3) సహచర ధర్మం 4) పైవన్నీ

సాధన: సహజ సంఖ్యా సమితి గుణకారం ప్రకారం సంవృత, తత్సమ, వినిమయ, సహచర ధర్మాలను పాటిస్తుంది.

సమాధానం 4

5. పూర్ణ సంఖ్యల సమితి (Z) సంకలనం ప్రకారం కింది వాటిలో ఏ ధర్మాలను పాటిస్తుంది?

ఎ) సంవృత బి) సహచర సి) తత్సమ డి) విలోమ

ఇ) వినిమయ ఎఫ్) విభాగ

1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, సి, డి, ఇ

3) ఎ, బి, సి, డి, ఇ, ఎఫ్ 4) ఎ, బి

సాధన: పూర్ణ సంఖ్యల సమితి సంకలనం ప్రకారం ఐచ్ఛికాల్లో ఇచ్చిన అన్ని ధర్మాలను పాటిస్తుంది.

సమాధానం 3

6. అకరణీయ సంఖ్యా సమితి (Q) సంకలనం ప్రకారం కిందివాటిలో ఎన్ని ధర్మాలను పాటిస్తుంది?

1) సంవృతం, సహచరం 2) తత్సమం, విలోమం

3) సంవృతం, సహచరం, తత్సమం, విలోమం, వినిమయం, విభాగ ధర్మాలు 4) ఏదీకాదు

సాధన: అకరణీయ సంఖ్యల సమితి సంకలనం ప్రకారం ఐచ్ఛికం మూడులో ఇచ్చిన అన్ని ధర్మాలను పాటిస్తుంది.

సమాధానం 3

7. $\frac{19}{-6}$ సంకలన విలోమం ఎంత?

1) 0 2) 1 3) $\frac{6}{19}$ 4) $\frac{19}{6}$

సాధన: ఇచ్చిన ప్రశ్న సంకలన విలోమం 19/6 అవుతుంది.

సమాధానం 4

8. $\frac{-13}{17} \times \frac{-2}{7} = \frac{-2}{7} \times \frac{-13}{17}$ అనేది గుణకారం దృష్ట్యా కింది వాటిలో ఏ ధర్మాన్ని పాటిస్తుంది?

1) సహచర ధర్మం 2) సంవృత ధర్మం

3) వినిమయ ధర్మం 4) విలోమ ధర్మం

సాధన: వినిమయ ధర్మాన్ని పాటిస్తుంది.

సమాధానం 3

9. $-1\frac{1}{8}$ గుణకార విలోమం ఎంత?

1) $-\frac{9}{8}$ 2) 1 3) $-\frac{8}{9}$ 4) 0

సాధన: ఐచ్ఛికం మూడు గుణకార విలోమం అవుతుంది.

సమాధానం 3



రచయిత
యర్రమాద నర్సిరెడ్డి
విషయ నిపుణులు

టీజీపీఎస్సీ, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
అరిథ్‌మెటిక్

Word of the Day

426

Versatility

Telugu meaning: వైవిధ్యత, పాండిత్యం

English meaning: The word versatility is a noun that describes the ability to adapt or be adapted to many different functions or activities.

Synonyms: Adaptability, Flexibility

Antonyms: Rigidity, Inflexibility

Usage: **1.** Her versatility as an artist allowed her to excel in painting, sculpture, and digital art.

2. The versatility of the new tool made it indispensable for both amateur and professional craftsmen

Latest Updates

B.Sc. (Hons.) Agriculture Course

Mahatma Jyothiba Phule Telanagna Backward Classes Welfare Residential Educational Institutions Society invites applications from Girl candidates for admissions into first year of B.Sc (Hons) Agriculture the academic year 2024-25 through PJTSAU AGRICET 2024. The application fee is Rs.1000. Eligible candidates can apply online before 10 October 2024.

Management Trainee Posts

Export-Import Bank of India invites applications for recruitment of Management Trainees (Banking Operations) on direct recruitment basis. The total no. of posts is 50. The application fee is Rs.600. The last date for online application is 7 October 2024.

Software Developer Posts

EdCIL invites on-line applications from eligible candidates on behalf of KVS (Kendriya Vidyalaya Sangathan) for the following positions in PM-SHRI PMU purely on Contractual basis. The total no. of posts is 20. Eligible candidates can apply online before 14 October 2024.

Did You Apply..?

Today (September 30) is the last date for the following Posts/ Admissions

- 90 Non-Executive posts tn the Jute Corporation of India Ltd, Kolkata.
- *1130 Constable/ Fire posts in the Central Industrial Security Force (CISF).*
- *345 Group A, B, C Posts In BIS, Delhi*
- *UG, PG Programme in MANUU DDE, Hyderabad. Eligibility: 10th Class, Intermediate(10+2), Degree in subject.*
- *MPHW(F) Training Course in AP CH and FW. Eligibility: Intermediate pass with any group.*

For more information and other notifications - scan QR code



ఈ-బుక్ (రసాయనశాస్త్రం)

- వివిధ పోటీపరీక్షల్లో జనరల్ స్టడీస్ విభాగం నుంచి మంచి స్కోర్ సాధించే అవకాశం ఉంటుంది. ఇందులో రసాయన శాస్త్రం ముఖ్య భాగం.
- అణువులో రెండు పరమాణువులు లేదా రెండు అయాన్ల మధ్య ఉండే ఆకర్షణ బలాన్ని రసాయన బంధం అంటారు. దీని ద్వారా అణువులోని రెండు పరమాణువులు బంధితమై ఉంటాయి.
- ఈ-బుక్‌లో రసాయన బంధం రకాలు, వాటి ధర్మాలు, వివిధ నియమాలు, మాదిరి ప్రశ్నలు ఉన్నాయి.

చదవడం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..

కరెంట్ అఫైర్స్

జపాన్ ప్రధానమంత్రిగా మాజీ రక్షణమంత్రి షిగెరు ఇషిబా ఎన్నికయ్యారు. 2024, సెప్టెంబరు 27న జరిగిన అధికార లిబరల్ డెమోక్రటిక్ పార్టీ (ఎల్‌డీపీ) అధ్యక్ష ఎన్నికల్లో ఆయన విజయం సాధించారు. 2024, అక్టోబరు 1న ఇషిబా దేశ 102వ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు.

- ప్రస్తుత ప్రధాని ఫుమియో కిషిద స్థానంలో ఇషిబా ఎన్నిక జరిగింది.

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐకార్) శాస్త్రవేత్త జూకంటి అరవింద్‌కుమార్ ప్రపంచ మొక్కల జీవ, వృక్ష శాస్త్ర పరిశోధకుల్లో స్థానం సంపాదించారు. ప్రపంచ జాబితాలో దేశంలోని ఐకార్ నుంచి 22 మందికి అవకాశం దక్కగా అందులో అరవింద్‌కుమార్ ఒకరు.

- అమెరికాలోని స్టాన్‌ఫర్డ్ వర్సిటీ వ్యవసాయ విభాగాధిపతి జాన్ పీఏ అయోడినిస్ నేతృత్వంలో ఈ పరిశోధనలు సాగాయి. 2023-24లో చేసిన పలు అధ్యయనాల ఆధారంగా ఈ జాబితాను రూపొందించారు.

2023-24లో దేశంలో ప్రధాన పంటల దిగుబడుల తుది అంచనాలను కేంద్ర వ్యవసాయ శాఖ 2024, సెప్టెంబరు 25న విడుదల చేసింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా ఈ అంచనాలను రూపొందించింది.

- 2023-24లో వరి దిగుబడిలో తెలంగాణ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే పత్తిలో 3, పొద్దుతిరుగుడులో 4, మొక్కజొన్న, చిరుధాన్యాల్లో 5వ స్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్ పొగాకులో 2, మినుము, ఆముదంలో 3, జొన్న, వేరుశెనగ దిగుబడుల్లో 5వ స్థానంలో నిలిచింది. - దేశవ్యాప్తంగా 2023-24లో 3,322.98 లక్షల టన్నుల పంట దిగుబడి వచ్చింది. 2022-23 నాటి తుది అంచనాలతో పోలిస్తే ఇది 26.11 లక్షల టన్నులు అధికం. పంటల వారీగా వరి 20.70 లక్షలు, గోధుమ 27.38 లక్షలు, చిరుధాన్యాలు 2.51 లక్షల టన్నుల మేర ఉత్పత్తులు పెరిగాయి.

కరెంట్ అఫైర్స్ ఈబుక్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Fill in the Blanks

Directions (Qs. 1 - 17): *Select the most appropriate option to fill in the blank(s).*

1. The company's decision to ..... employees without notice caused widespread dissatisfaction.
A) promote B) terminate
C) train D) encourage

2. With the current economic situation, many families are struggling to ..... their basic needs.
A) meet B) ignore
C) overestimate D) reduce

3. The artist's latest exhibition ..... a new perspective on contemporary urban life.
A) erases B) diminishes
C) showcases D) contradicts

4. The politician's speech was intended to ..... voters of his commitment to improving the economy.
A) discourage B) confuse
C) alienate D) convince

5. The lawyer was able to ..... the witness's credibility during crossexamination.
A) undermine B) emphasize
C) boost D) strengthen

6. The athlete's ..... in the final minutes of the game, coupled with her ..... of strategy, led to a surprising victory.
A) hesitation, choice
B) confidence, execution
C) uncertainty, ignorance
D) fatigue, disregard

7. The government's plan to ..... taxes and ..... infrastructure spending has met with mixed reactions from the public.
A) freeze, abandon
B) raise, cut C) reduce, increase
D) eliminate, delay

8. The teacher ..... her students to think critically and ..... them to participate in discussions.
A) prevented, forced
B) allowed, discouraged
C) instructed, avoided
D) encouraged, motivated

9. The new software aims to ..... the user experience and ..... the overall performance of the system.
A) complicate, decrease
B) streamline, enhance
C) limit, confuse D) distort, improve

10. Many organizations are ..... with the challenge of reducing costs while ..... employee satisfaction.
A) struggling, improving
B) succeeding, ignoring
C) dealing, rejecting
D) flourishing, damaging

11. The scientist was tasked with ..... a new theory, ... it through experiments, and ..... the results in an academic journal.
A) creating, disproving, hiding
B) debating, rejecting, eliminating
C) ignoring, testing, canceling
D) developing, validating, publishing

12. The government's initiative aims to ..... education, ... opportunities for disadvantaged communities, and ..... future economic growth.
A) delay, limit, obstruct
B) expand, reduce, hurt
C) improve, create, boost
D) decrease, harm, destroy

13. The manager's ability to ..... team morale, ... conflicts, and ..... productivity was crucial to the company's success.
A) damage, avoid, reduce
B) enhance, resolve, increase
C) overlook, escalate, limit
D) delay, perpetuate, maintain

14. The startup's mission is to ..... technological innovation, ... sustainable practices, and ..... industry standards.
A) stifle, eliminate, destroy
B) ignore, reduce, neglect
C) halt, avoid, maintain
D) promote, implement, redefine

15. The novel's plot was able to ..... readers' attention, ... their emotions, and ..... deep reflection on societal issues.
A) lose, discourage, promote
B) confuse, distort, prevent
C) capture, evoke, inspire
D) suppress, hinder, avoid

16. The engineer was asked to ..... the design, ... the project, and ..... the team to meet tight deadlines.
A) improve, oversee, lead
B) sabotage, ruin, hinder
C) damage, delay, reject
D) complicate, mismanage, ignore

17. The charity seeks to ..... poverty, ... education, and ..... opportunities for underprivileged children.
A) reduce, promote, increase
B) ignore, decrease, limit
C) support, avoid, destroy
D) mislead, harm, distort

SSC Exams
English

Scan the QR code for Key

Writer:
P. Manoj Kumar, Subject Expert

(c) eenadu

ఈనాడు
ప్రతిభ
హైదరాబాద్, సోమవారం, సెప్టెంబరు 30, 2024

కరెంట్ అఫైర్స్

- ఏ ఇద్దరు క్రీడాకారిణులను ప్లే స్ట్రార్ట్స్ సంస్థ ఇటీవల బ్రాండ్ అంబాసిడర్లుగా ప్రకటించింది? (దేశంలో క్రీడలను ప్రోత్సహించి అభివృద్ధి చేయడంతోపాటు పాఠశాలలతో కలిసి పనిచేయడం, క్రీడా మౌలిక సదుపాయాలను నిర్వహించడం, అట్టడుగు స్థాయి నుంచి ప్రతిభను గుర్తించడమే లక్ష్యంగా ప్లే స్ట్రార్ట్స్ సంస్థ పనిచేస్తోంది.)
  జ: ఎమ్‌సీ మేరీకోమ్, సానియా మీర్జా
- 2024లో ప్రపంచంలో అత్యధికంగా పర్యాటకులు సందర్శించిన తొలి పది దేశాల జాబితాలో ఏ దేశం అగ్రస్థానంలో నిలిచింది? **జ:** ఫ్రాన్స్ (తరువాతి స్థానాల్లో స్పెయిన్, అమెరికా, చైనా, ఇటలీ, తుర్కియే, మెక్సికో, థాయ్‌లాండ్, జర్మనీ, యూకేలు నిలిచాయి.)
- డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ (డీఏఈ)కు చెందిన 'అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఆఫ్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ రిసెర్చ్' ఇటీవల ఏ రాష్ట్రంలోని మర్లగల్ల ప్రాంతంలో 1600 టన్నుల (జీ3 స్టేజ్) లిథియాన్నికనుక్కున్నారు? **జ:** కర్ణాటక
- ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా రూపొందించిన 'ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ రిపోర్ట్ (ఐఎస్ఎఫ్ఆర్)' ప్రకారం దేశంలో అటవీ విస్తీర్ణం ఎంత మొత్తంగా ఉంది? (ఇది దేశ భౌగోళిక ప్రాంతంలో 21.71 శాతం ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా డెహ్రాడూన్‌లో ఉంది.)
  జ: 7,13,789 చదరపు మీటర్లు
- 2024-25 కేంద్ర బడ్జెట్‌లో రక్షణ శాఖకు ఎంత మొత్తం కేటాయించారు? (2024-25లో అన్ని మంత్రిత్వ శాఖల్లో రక్షణ శాఖకే అత్యధికంగా కేటాయించారు. తాజా కేటాయింపు 2023-24 కేటాయింపుల కంటే 4.79 శాతం అధికం.)
  జ: రూ. 6,21,940. 85 కోట్లు

మాదిరి ప్రశ్నలు

మరింత సమాచారం

ప్రిపరేషన్ టెక్నిక్

పాత, నమూనా ప్రశ్నపత్రాలను పరిశీలించడం ద్వారా పరీక్షల తీరును అర్థం చేసుకోవచ్చు. వాటిని ప్రాక్టీస్ చేయడం వల్ల స్పష్టతను, వేగాన్ని కచ్చితత్వాన్ని పెంచుకోవచ్చు.

డీఎస్సీ - 2024
విద్యా దృక్పథాలు

జూనియర్ ఇంటర్ వృక్ష శాస్త్రం

జీవ ప్రపంచంలో వైవిధ్యం

జీవ ప్రపంచం

1) ICBN దేనికి సూచిక? **(2 మా.)**
జ: అంతర్జాతీయ వృక్ష నామీకరణ నియమావళి.

2) ప్రపంచంలోని అతిపెద్ద ఉద్యానవనం ఏది? భారతదేశంలోని కొన్ని ప్రసిద్ధ ఉద్యానవనాలను పేర్కొనండి. **(2 మా.)**
జ: రాయల్ బొటానికల్ గార్డెన్స్ ఇంగ్లండ్‌లోని క్యూలో ఉంది. భారతదేశంలో - ఇండియన్ బొటానికల్ గార్డెన్ - హౌరా, ఎన్‌బీఆర్‌ఐ - లక్నోలో ఉన్నాయి.

3) ద్వినామ నామీకరణను వివరించండి. **(4 మా.)**
జ: ప్రతి మొక్క పేరులో రెండు పదాలుంటాయి. ఒకటి ప్రజాతి నామం, రెండోది జాతి నామం. ఈ విధంగా రెండు పదాలతో కూడిన పేరు పెట్టే పద్ధతిని ద్వినామ నామీకరణ అంటారు. దీన్ని మొదట కరోలస్ లిన్నేయస్ ప్రవేశపెట్టారు.
ఉదా: మామిడి - మాంజిఫెరా ఇండికా

ప్రశ్నలు జవాబులు

సాంకేతిక నామీకరణలోని నియమాలు:
1) జీవశాస్త్ర నామాలు సాధారణంగా లాటిన్ భాషలో ఉంటాయి. ఇటాలిక్‌లలో రాస్తారు. 2) జీవశాస్త్ర నామంలోని మొదటి పదం ప్రజాతిని, రెండోది జాతి నామాన్ని సూచిస్తుంది. 3) జీవశాస్త్ర నామంలోని రెండు పదాలను చేతిరాతతో రాసినప్పుడు వేర్వేరుగా గీత గీయాలి, ముద్రించేటప్పుడు ఇటాలిక్‌లలో సూచించాలి. 4) ప్రజాతిని సూచించే మొదటి పదం పెద్ద అక్షరం (capital letter) తో, జాతి నామాన్ని సూచించే రెండో పదం చిన్న అక్షరం (small letter) తోనూ ప్రారంభమవుతుంది. 5) శాస్త్రీయ నామం చివర కర్త పేరు క్లుప్తంగా రాయవచ్చు. **ఉదా:** మామిడి-మాంజిఫెరా ఇండికా లిన్.

– డి.రాకేష్, కామారెడ్డి

వృక్షాల పేర్లకూ నియమాలు!

రాయల్ బొటానికల్ గార్డెన్స్

మరికొన్ని ముఖ్యమైనవి..

(2 మార్కుల ప్రశ్నలు)

జవాబుల కోసం

1) ఫ్లోరా అంటే ఏమిటి?
2) వర్గీకరణ శాస్త్ర 'కీ'లో వాడే 'క్లైట్', 'లీడ్' పదాలను నిర్వచించండి.
3) సిస్టమాటిక్స్ అంటే ఏమిటి?
4) మాన్యువల్స్, మోనోగ్రాఫ్స్ అంటే ఏమిటి?
5) వర్గీకరణలో మౌలిక ప్రమాణం ఏది? దాన్ని నిర్వచించండి.

అన్యాయాన్ని ప్రశ్నిస్తూ.. అభివృద్ధిని కాంక్షిస్తూ!

రాయప్రోలు సుబ్బారావు

కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

జాతీయోద్యమ కాలంలో తెలంగాణలో ప్రజలను చైతన్యపరిచే బాధ్యతను పత్రికలు చేపట్టాయి. తెలుగు, ఉర్దూ భాషల్లో వెలువడిన పలు పత్రికలు జనం గొంతుకలుగా నిలిచాయి. నిజాం నిరంకుశత్వాన్ని, రజాకారుల దౌర్జన్యాలను ప్రశ్నించాయి. నిష్పక్షపాత వార్తలు, సమాచారాన్ని అందిస్తూ అభ్యుదయ భావాలను వృద్ధి చేశాయి. ఇదే కాలంలో ప్రభుత్వ అనుకూల ప్రచారం, సాహిత్యం, మత విస్తృతి కోసం మరికొన్ని పత్రికలు పనిచేశాయి. స్వాతంత్ర్య పోరాట దశలో ఈ విధంగా భిన్న లక్ష్యాలతో సాగిన పత్రికలు, వాటి నిర్వాహకుల గురించి పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. విప్లవ పంథాలో సాగి జనామోదం పొందిన పయాం, రయ్యత్, తేజ్, ఇమ్రోజ్ వంటి పత్రికల విశిష్టతతో పాటు జర్నలిజం, పత్రికా సంపాదకత్వంలో ధీరులుగా నిలిచిన మందుముల నరసింగరావు, షోయబుల్లాఖాన్ తదితరుల సేవలనూ గుర్తుంచుకోవాలి.

మందుముల నరసింగరావు

షోయబుల్లాఖాన్

తెలంగాణలో పత్రికాభివృద్ధి (భిన్న లక్ష్యాలు)

తెలంగాణలో వివిధ భాషాపత్రికలు వెలువడి ప్రజాభిప్రాయానికి ప్రతీకగా నిలిచాయి. జనాన్ని అభ్యుదయభావాల వైపు నడిపిస్తూ వారిలో చైతన్యం నింపాయి. ప్రజలకు జరుగుతున్న అన్యాయాలపై నిరంతరం ప్రశ్నిస్తూ వచ్చాయి. 1940-41లో 'హైదరాబాద్ సమాచారం' అనే సచిత్ర మాసపత్రికను స్థాపించారు. ఇది హైదరాబాద్ కేంద్రంగా వెలువడేది. నిజాం ప్రభుత్వం చేపట్టే ప్రజాహిత కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో దీన్ని స్థాపించారు. అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రణాళికలు, వాటి అమలుతీరు, పరిశ్రమలకు సంబంధించిన అంశాలపై విశ్లేషణాత్మక వ్యాసాలు ఉండేవి. కొంతకాలం కవి పండితులు కప్పగంతుల లక్ష్మణశాస్త్రి సంపాదకులుగా పనిచేశారు. ఈ పత్రిక నిజాం ప్రభుత్వ ప్రకటనల శాఖ తరపున వెలువడేది. హైదరాబాద్ ప్రభుత్వ సెంట్రల్ ప్రెస్‌లో ప్రచురించేవారు.

- 1940-41లో తర్క్-ఎ.ముసాకిరాత్ అనే ఉర్దూ పేరు ఉన్న తెలుగు మాసపత్రిక హైదరాబాద్‌లోని ముస్తఫా బజార్ నుంచి వెలువడేది. పదిహేనేళ్లు కొనసాగిన ఈ పత్రిక నిర్వహణలో సరిపల్లె విశ్వనాథశాస్త్రి, రాయప్రోలు సుబ్బారావు, కురుగంటి సీతారామ భట్టాచార్యులు లాంటి వారు పాల్గొన్నారు. తర్వాతి కాలంలో నిజాం కళాశాల తెలుగు విభాగం 'విద్యార్థి' పేరుతో వార్షిక పత్రికను ప్రచురించేది. 1940లో అడుసుమల్లి వెంకట దత్తాత్రేయశర్మ 'ఆంధ్ర శ్రీ' అనే సాహిత్య వార్షిక పత్రికను స్థాపించి సంపాదకులుగా పనిచేశారు. ఇందులో సాహిత్యాంశాలకు ప్రాధాన్యం ఇచ్చేవారు.
- 'విద్యార్థి' పత్రికలో నాటి విద్యార్థులైన నూకల నరోత్తమరెడ్డి, దేవులపల్లి రామానుజరావు, ఖండవల్లి లక్ష్మీరంజనంలు తమ రచనలు ప్రచురించేవారు. ఇది కూడా పూర్తి సాహితీ పత్రికగానే కొనసాగింది.

క్రైస్తవ మత ప్రచారం కోసం 1940లో మహబూబ్‌నగర్ మిషన్ ప్రెస్ నుంచి 'మెన్నోనేట్ వర్తమాని' మాసపత్రిక వెలువడేది. ఇదే సమయంలో ముస్లిం జాతీయవాది అయిన ఖాజీ అబ్దుల్ గఫార్ సంపాదకత్వంలో 'పయాం' ఉర్దూ దినపత్రిక వెలువడింది. ఈయన ఉత్తర భారతదేశం నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన ఆధునిక భావాలున్న పాత్రికేయుడు. 'పయాం' సమగ్ర వార్తలతో కూడిన దార్శనిక జాతీయవాద పత్రికగా పేరు పొందింది. గఫార్ ఆంధ్ర మహాసభ కార్యక్రమాల పట్ల సానుభూతిని ప్రదర్శించేవారు. హైదరాబాద్‌లోని ప్రత్యామ్నాయ రాజకీయాలకు సంపూర్ణ మద్దతు ఇచ్చేవారు. ఫలితంగా నిజాం ఆగ్రహాన్ని చవిచూశారు.

తెలంగాణ చరిత్ర

- దక్కన్ క్రానికల్ 1937లో వారపత్రికగా వెలువడి కొంతకాలానికి మూతపడి తర్వాత దినపత్రికగా వచ్చింది. ఇది సామాజిక, రాజకీయ అంశాలపై ప్రజాభిప్రాయాలను వెలువరించేది. ఈ పత్రికను బి.ఆర్.చారి, కె.రాజగోపాల్, ఎం.ఎస్. జయసూర్య ప్రారంభించారు. ఇదే సమయంలో క్లేరియన్, ఇండియన్ స్వేట్స్ అండ్ జమీందార్స్, రెయిన్‌బో, న్యూ ఎరా, దక్కన్ స్టార్ తదితర ఆంగ్లపత్రికలు వెలువడి జాతీయవాద, మత సామరస్య భావాలను ప్రచారం చేశాయి. ఇదే సమయంలో 'ఆర్యభాను, స్వతంత్ర' అనే హిందీ పత్రికలు ప్రారంభమయ్యాయి. వార, పక్ష పత్రికలే కాకుండా బులెటిన్, డైలీ న్యూస్ పత్రికలు హైదరాబాద్ నుంచి వెలువడ్డాయి.

మార్పు కోరిన 'రయ్యత్'
1927లో 'సందేశం' పేరుతో తెలుగు దినపత్రిక వెలువడింది. దీని తర్వాత ఉర్దూలో వచ్చిన విప్లవాత్మక పత్రికగా 'రయ్యత్' నిలిచింది. మందుముల నరసింగరావు సంపాదకత్వంలో 1941లో వెలువడిన ఈ పత్రిక నిజాం రాజ్యంలో రాజకీయ మార్పు రావాలని, జవాబుదారీ ప్రభుత్వం ఏర్పడాలని ఆకాంక్షించేది. నిజాం ప్రభుత్వంతోపాటు నిజాంను పొగిడే పత్రికలనూ రయ్యత్ విమర్శించేది.

విప్లవ పాత్రికేయుడు

జాతీయవాద పాత్రికేయుడు షోయబుల్లాఖాన్ తన రచనలతో రజాకార్ల అకృత్యాలను ప్రశ్నించాడు. ఈయన 1920, అక్టోబరు 2న ఖమ్మం జిల్లా సుబ్బిలేడు (శుభ్రవీడు)లో జన్మించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పట్టభద్రుడయ్యాడు. నిజాం ప్రభుత్వం ఉన్నత ఉద్యోగం ఇవ్వబోయినప్పటికీ, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో జీవించాలనే ఉద్దేశంతో నిరాకరించాడు. జర్నలిజంపై ఆసక్తితో 'తేజ్' అనే ఉర్దూ వారపత్రికతో పాత్రికేయ జీవితాన్ని ప్రారంభించాడు. అందులో నాటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈయన రాసిన వ్యాసాలు మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ సంస్థ అధ్యక్షుడైన ఖాసిం రజ్వీకి ఆగ్రహం తెప్పించాయి. మజ్లిస్‌కు నిజాం ప్రభుత్వం అండ ఉండటాన్ని తేజ్ పత్రిక విమర్శించింది. దీంతో ప్రభుత్వం ఆ పత్రికను నిషేధించింది. ఆ తర్వాత ఈయన 'రయ్యత్' అనే ఉర్దూ పత్రికలో కొంతకాలం పనిచేశారు. దాన్నీ ప్రభుత్వం నిషేధించింది. తాను పనిచేస్తున్న పత్రికలు నిషేధానికి గురికావడంతో షోయబుల్లాఖాన్ స్వయంగా 'ఇమ్రోజ్' అనే ఉర్దూ పత్రికను ప్రారంభించాడు. దీని తొలి ప్రతి 1947, నవంబరు 15న మార్కెట్‌లోకి వచ్చింది. ఈ పత్రికకు బూర్గుల రామకృష్ణారావు, బూర్గుల నరసింగరావు (ఆల్ హైదరాబాద్ స్టూడెంట్స్ యూనియన్), మందుముల నరసింగరావు, జ్ఞానకుమారి హెగ్డా మొదలైనవారు సహాయ సహకారాలు అందించారు. ఈ పత్రికకు పలుకుబడితో పాటుగా పాఠకుల సంఖ్య బాగా పెరిగింది. పక్షపాతరహిత వార్తలతో ఈ పత్రిక వెలువడేది. హైదరాబాద్ రాజ్యం భారతదేశంలో విలీనం కావాలంటూ సంపాదకీయాలు రాసేవారు. రజాకార్ల హెచ్చరికలను కూడా ఖాతరు చేయకుండా అత్యంత ధైర్యసాహసాలతో వాటిని ప్రచురించేవారు. 1948, ఆగస్టు 20న హైదరాబాదులోని జమ్రుద్ మహల్‌లో జరిగిన రజాకార్ల బహిరంగ సభలో షోయబుల్లాఖాన్‌ను విమర్శిస్తూ ఖాసిం రజ్వీ రెచ్చగొట్టేలా ప్రసంగించాడు. అదేరోజు రాత్రి షోయబుల్లాఖాన్ తన పత్రిక పనులు ముగించుకుని బర్కత్‌పుర నుంచి కాచిగూడలోని ఇంటికి వస్తుండగా రజ్వీ ప్రసంగాలతో ప్రభావితులైన కొందరు తల్వార్లతో దాడిచేసి చంపేశారు. ఉన్నతమైన ప్రజాస్వామిక విలువలు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం షోయబుల్లాఖాన్ చేసిన త్యాగాన్ని తెలంగాణ నిరంతరం స్మరించుకుంటుంది.

రచయిత: డాక్టర్ ఎం.జితేందర్ రెడ్డి

అండమాన్‌లో సెంటినెలీలు.. సిక్కింలో లెప్చాలు!

జనాభా

1. కిందివాటిని జతపరచండి.
   ఎ) అధిక జనాభా ఉన్న 2వ రాష్ట్రం — 1) ఉత్తర్‌ప్రదేశ్
   బి) అతి తక్కువ జనాభా ఉన్న 2వ రాష్ట్రం — 2) లక్షద్వీప్
   సి) అత్యల్ప జనాభా ఉన్న కేంద్రపాలిత ప్రాంతం — 3) మిజోరం
   డి) అధిక జనాభా ఉన్న రాష్ట్రం — 4) మహారాష్ట్ర
   1) ఎ-1, బి-2, సి-3, డి-4
   2) ఎ-3, బి-4, సి-1, డి-2
   3) ఎ-4, బి-3, సి-2, డి-1
   4) ఎ-1, బి-4, సి-2, డి-3
2. కింది వాక్యాలు సరిచూడండి.
   ఎ) భారతదేశంలో అధిక జనాభా వృద్ధి రేటు ఉన్న రాష్ట్రం మేఘాలయ.
   బి) అధిక జనాభా వృద్ధి రేటు ఉన్న కేంద్రపాలిత ప్రాంతం దాద్రానగర్ హవేలీ, డామన్ డయ్యూ.
   సి) అత్యల్ప జనాభా వృద్ధి రేటు ఉన్న జిల్లా నాగాలాండ్‌లోని లాంగ్‌లెంగ్.
   డి) అత్యల్ప జనాభా వృద్ధి రేటు ఉన్న రాష్ట్రం నాగాలాండ్
   1) ఎ, బి, సి, డి లు సరికావు.
   2) ఎ, బి, సి, డి లు సరైనవి.
   3) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
   4) ఎ, బి లు సరికావు; సి, డి లు సరైనవి.
3. కింది వాక్యాలను సరిచూడండి.
   ప్రతిపాదన (ఎ): 1872లో మొదటిసారిగా జనాభాను లెక్కించారు.
   కారణం (ఆర్): అప్పటి భారత వైస్రాయ్ లార్డ్ మేయో. ఇతడిని 'భారతదేశపు జనాభా లెక్కల పితామహుడు' అని అంటారు.
   1) ఎ, ఆర్ లు సరైనవి; ఎకు ఆర్ సరైన వివరణ.
   2) ఎ, ఆర్ లు సరైనవి; ఎకు ఆర్ సరైన వివరణ కాదు.
   3) ఎ సరైంది, ఆర్ సరికాదు.
   4) ఎ సరికాదు, ఆర్ సరైంది.
4. కిందివాటిలో జాతీయ జనాభా విధానం 2020కి సంబంధించి సరైన వాక్యాలు గుర్తించండి.
   ఎ) శిశు మరణాల రేటుని లక్ష సజీవ జననాలకు 30 కంటే తగ్గించడం లక్ష్యం.
   బి) 2045 నాటికల్లా జనాభా పెరుగుదల రేటును సున్నాకు తీసుకురావడం.
   సి) 14 ఏళ్ల వరకు పాఠశాల విద్యను ఉచితంగా, నిర్బంధంగా అందించడం.
   డి) 100 శాతం గర్భాలు, జననాలు, మరణాలు నమోదు చేయడం.
   1) బి, సి — 2) ఎ, బి
   3) ఎ, బి, సి, డి — 4) సి, డి
5. కింది వాక్యాలు సరిచూడండి.
   ప్రతిపాదన (ఎ): భారతదేశ జనసాంద్రత 382 (2011 నాటికి).
   కారణం (ఆర్): ఆంధ్రప్రదేశ్ జనసాంద్రత 308.
   1) ఎ, ఆర్ లు సరైనవి, ఎ కు ఆర్ సరైన వివరణ.
   2) ఎ, ఆర్ లు సరైనవి, ఎ కు ఆర్ సరైన వివరణ కాదు.
   3) ఎ సరైంది, ఆర్ సరికాదు.
   4) ఎ సరికాదు, ఆర్ సరైంది.
6. కిందివాటిని జతపరచండి.
   (జనసాంద్రతకు సంబంధించి)
   ఎ) అధిక జనసాంద్రత ఉన్న రాష్ట్రం — 1) పశ్చిమ బెంగాల్
   బి) అల్ప జనసాంద్రత ఉన్న రాష్ట్రం — 2) అండమాన్ నికోబార్ దీవులు
   సి) అల్ప జనసాంద్రత ఉన్న కేంద్రపాలిత ప్రాంతం — 3) బిహార్
   డి) అధిక జనసాంద్రత ఉన్న 2వ రాష్ట్రం — 4) అరుణాచల్ ప్రదేశ్
   1) ఎ-3, బి-4, సి-2, డి-1
   2) ఎ-4, బి-1, సి-3, డి-2
   3) ఎ-4, బి-3, సి-2, డి-1
   4) ఎ-1, బి-4, సి- 2, డి-3
7. కిందివాటిని జతపరచండి.
   (లింగ నిష్పత్తికి సంబంధించింది)
   ఎ) కేరళ — 1) 1176
   బి) హరియాణా — 2) 1037
   సి) పుదుచ్చేరి — 3) 879
   డి) మాహే (పుదుచ్చేరి) — 4) 1084
   1) ఎ-4, బి-1, సి-2, డి-3
   2) ఎ-1, బి-3, సి-2, డి-4
   3) ఎ-4, బి-3, సి-2, డి-1
   4) ఎ-1, బి-2, సి-3, డి-4
8. కిందివాటిని జతపరచండి.
   ఎ) హిందువులు — 1) 1.72%
   బి) క్రైస్తవులు — 2) 14.23%
   సి) ముస్లింలు — 3) 79.80%
   డి) సిక్కులు — 4) 2.3%
   1) ఎ-1, బి-2, సి-3, డి-4
   2) ఎ-4, బి-1, సి-2, డి-3
   3) ఎ-3, బి-4, సి-2, డి-1
   4) ఎ-1, బి-4, సి-3, డి-2
9. కిందివాక్యాలు సరిచూడండి.
   ఎ) హిందూ జనాభా అధికంగా ఉన్న రాష్ట్రం ఉత్తర్‌ప్రదేశ్.
   బి) బౌద్ధులు అధికంగా ఉన్న రాష్ట్రం మహారాష్ట్ర.
   సి) ముస్లింలు అధికంగా ఉన్న రాష్ట్రం ఉత్తర్‌ప్రదేశ్.
   డి) క్రైస్తవులు అధికంగా కేరళలో ఉన్నారు.
   1) ఎ, బి, సి, డి లు సరికానివి
   2) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు
   3) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికాదు
   4) ఎ, బి, సి, డి లు సరైనవి.
10. కిందివాటిని సరిచూడండి.
    ప్రతిపాదన (ఎ): 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ జనాభా 20.14 కోట్లు.
    కారణం (ఆర్): ఎస్సీ జనాభా అధికంగా ఉన్న రాష్ట్రం ఉత్తర్‌ప్రదేశ్.
    1) ఎ, ఆర్ లు సరైనవి, ఎ కు ఆర్ సరైన వివరణ.
    2) ఎ, ఆర్ లు సరైనవి, ఎ కు ఆర్ సరైనవివరణ కాదు
    3) ఎ సరైంది, ఆర్ సరికానిది.
    4) ఎ సరికానిది, ఆర్ సరైంది.
11. కింది వాక్యాలను సరిచూడండి.
    ఎ) 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్టీ జనాభా అధికంగా ఉన్న రాష్ట్రం మధ్యప్రదేశ్.
    బి) ఎస్టీ జనాభా లేని రాష్ట్రాలు పంజాబ్, హరియాణా
    సి) ఎస్టీ జనాభా తక్కువగా ఉన్న రాష్ట్రం గోవా.
    డి) ఎస్టీ జనాభా శాతం పరంగా తక్కువగా ఉన్న రాష్ట్రం ఉత్తర్‌ప్రదేశ్.
    1) ఎ, బి, సి, డి లు సరైనవి
    2) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికాదు.
    3) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
    4) ఎ, బి, సి, డి లు సరికావు.
12. కింది తెగలను అవి ఉన్న రాష్ట్రాలతో జతపరచండి.
    ఎ) సిక్కిం — 1) బకర్వాల్
    బి) అండమాన్, నికోబార్ దీవులు — 2) రెంగ్మా
    సి) మణిపుర్ — 3) సెంటినెలీ
    డి) జమ్ము-కశ్మీర్ — 4) లెప్చాలు
    1) ఎ-1, బి-4, సి-2, డి-3
    2) ఎ-1, బి-2, సి-3, డి-4
    3) ఎ-4, బి-1, సి-3, డి-2
    4) ఎ-4, బి-3, సి-2, డి-1
13. కిందివాటిని జతపరచండి.
    ఎ) మొదటి తరగతి నగరం — 1) 10,000 నుంచి 20,000 జనాభా
    బి) 2వ తరగతి నగరం — 2) 20,000 నుంచి 50,000 జనాభా
    సి) 3వ తరగతి నగరం — 3) 50,000 నుంచి లక్ష జనాభా
    డి) 4వ తరగతి నగరం — 4) లక్ష జనాభా కంటే ఎక్కువ
    1) ఎ-4, బి-3, సి-2, డి-1
    2) ఎ-1, బి-4, సి-3, డి-2
    3) ఎ-1, బి-2, సి-3, డి-4
    4) ఎ-4, బి-1, సి-2, డి-3
14. కిందివాటిని సరిచూడండి.
    ప్రతిపాదన (ఎ): 2011 పట్టణ జనాభా 37.71 కోట్లు.
    కారణం (ఆర్): పట్టణ జనాభా అధికంగా ఉన్న రాష్ట్రం మహారాష్ట్ర.
    1) ఎ, ఆర్ లు సరైనవి, ఎ కు ఆర్ సరైన వివరణ కాదు.
    2) ఎ, ఆర్ లు సరైనవి, ఎ కు ఆర్ సరైన వివరణ
    3) ఎ సరైంది, ఆర్ సరికానిది.
    4) ఎ సరికానిది, ఆర్ సరైంది.
15. కిందివాటిని సరిచూడండి.
    ప్రతిపాదన (ఎ): 2011 లెక్కల ప్రకారం గ్రామీణ జనాభా 83.35 కోట్లు.
    కారణం (ఆర్): గ్రామీణ జనాభా అధికంగా ఉన్న రాష్ట్రం ఉత్తర్‌ప్రదేశ్.
    1) ఎ, ఆర్ లు సరైనవి; ఎ కు ఆర్ సరైన వివరణ
    2) ఎ, ఆర్ లు సరైనవి; ఎ కు ఆర్ సరైన వివరణ కాదు.
    3) ఎ సరైంది, ఆర్ సరికానిది.
    4) ఎ సరికానిది, ఆర్ సరైంది.
16. కిందివాటిని సరిచూడండి.
    ప్రతిపాదన (ఎ): వరల్డ్ మైగ్రేషన్ రిపోర్ట్ 2020 ప్రకారం జూన్ 2019 నాటికి అంతర్జాతీయ వలసదారులు దాదాపుగా 272 మిలియన్లు.
    కారణం (ఆర్): వీరిలో మూడింట రెండొంతులు కార్మిక వలసదారులు.
    1) ఎ, ఆర్ లు సరైనవి; ఎ కు ఆర్ సరైన వివరణ
    2) ఎ, ఆర్ లు సరైనవి; ఎ కు ఆర్ సరైన వివరణ కాదు.
    3) ఎ సరైంది, ఆర్ సరికానిది.
    4) ఎ సరికానిది, ఆర్ సరైంది.
17. కిందివాక్యాల్లో సరైనవి గుర్తించండి.
    ఎ) 1872లో మొదటిసారిగా భారతదేశంలో వలసలకు సంబంధించిన గణాంకాలు సేకరించారు.
    బి) 2011 లెక్కల ప్రకారం భారతదేశంలో అంతర్గత వలసదారుల సంఖ్య 45.36 కోట్లు.
    సి) వీరు దేశ జనాభాలో 37% ఉన్నారు.
    డి) 2020-21 వలసల నివేదిక ప్రకారం మన దేశంలో వలసల రేటు 28.9%.
    1) ఎ, బి, సి — 2) ఎ, బి
    3) ఎ, బి, సి, డి — 4) ఏదీకాదు
18. కిందివాటిని సరిచూడండి.
    ప్రతిపాదన (ఎ): UNHCR ప్రకారం 2019 నాటికి ప్రపంచవ్యాప్తంగా బలవంతంగా స్థానభ్రంశం చెందిన వారు 79.5 మిలియన్లు.
    కారణం (ఆర్): వీరిలో శరణార్థులు దాదాపు 26 మిలియన్లు
    1) ఎ, ఆర్ లు సరికానివి.
    2) ఎ, ఆర్ లు సరైనవి.
    3) ఎ కు ఆర్ సరైన వివరణ.
    4) ఎ, ఆర్ లు సరైనవి; ఎ కు ఆర్ సరైన వివరణ కాదు.



రచయిత: బండ్ల శ్రీధర్

సమాధానాలు
1-3; 2-3; 3-1; 4-3; 5-1; 6-1; 7-3; 8-3; 9-4; 10-1; 11-1; 12-4; 13-1; 14-2; 15-1; 16-1; 17-3; 18-3.

ప్రపంచంలోనే అత్యధిక జనాభా భారత్‌లోనే ఉంది. దేశ ప్రగతిని, భవిష్యత్తును జనాభానే నిర్దేశిస్తుంది. ప్రభుత్వ విధానాలు, పురోగతి ప్రణాళికలు, పథకాల రూపకల్పన తదితరాలన్నింటికీ జనాభా లెక్కలే ఆధారం. బ్రిటిష్ హయాంలో మొదలైన జనాభా లెక్కల సేకరణ, స్వాతంత్ర్యానంతరం నిర్లీత కాలవ్యవధుల్లో జరుగుతోంది. చివరిసారిగా జనగణన నిర్వహించి దశాబ్దం దాటి పోయింది. దేశవ్యాప్తంగా జనాభా వ్యాప్తి, అక్షరాస్యత, సామాజిక స్థితిగతులను వెల్లడించే ఆ గణాంకాలు పరీక్షార్థులకు తెలిసి ఉండాలి. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల వారీగా ఉన్న జనాభా, జనసాంద్రత, వృద్ధి రేటు, మతాల వారీ జనాభా శాతాలు, ఎస్సీ, ఎస్టీ జనాభా, ప్రాంతాల వారీగా స్వదేశీ తెగలు, పట్టణ- గ్రామీణ జనాభాలో కనిపించే వ్యత్యాసాలు, వలస ధోరణులతో పాటుగా జాతీయ జనాభా విధానంలోని ముఖ్యాంశాలు, అనధికారికంగా తెలుస్తున్న ప్రస్తుత జనాభా లెక్కలపైనా అవగాహన పెంచుకోవాలి.

డీఎస్సీ/టెట్ - 2024: జాగ్రఫీ

(c) eenadu